www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 8-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 311

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: త్రయోదశి ఉ. 11.18 తదుపరి చతుర్దశి; నక్షత్రం: ఉత్తరాషాఢ రా. 2.15 తదుపరి శ్రవణం; వర్జ్యం: ఉ. 11.50-1.16, తె. 5.47 మొదలు; దుర్ముహూర్తం: ఉ. 10.36-11.22, మ. 3.09-3.54; అమృతఘడియలు: రా. 8.29-9.55; రాహుకాలం: మ. 1.30-3.00, సూర్యోదయం: 6.49; సూర్యాస్తమయం: 6.10 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

భవిష్యత్తుకు మోదీ గ్యారెంటీ



370 రద్దు, ట్రిపుల్ తలాఖ్‌పై నిషేధం, మందిర నిర్మాణంతో హామీలు నెరవేర్చాం

అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజల్లో విశ్వసనీయత పెంచుకున్నాం

జనాదరణలో మోదీకి సాటిలేరు.. పత్రికాస్వేచ్ఛపై ఆంక్షలు అబద్ధం

విదేశీ మీడియాది తప్పుడు ప్రచారం.. రాహుల్ ది భారత్ తోడో అన్యాయ యాత్ర

అవినీతిని ఉపేక్షించేది లేదు.. జగన్, కవితలపైనా దర్యాప్తు కొనసాగుతుంది

'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్

2

2019లోనే దెబ్బతిన్న మేడిగడ్డ

ఐదేళ్ల కిందటే బ్యారేజీ వద్ద బయటపడ్డ లోపాలు.. మరమ్మతులకు చర్యలు తీసుకోని అధికారులు

పనుల కోసం డిజైన్లు ఇవ్వాలని కోరినా ఇవ్వలేదు.. నిర్మాణాన్ని 2020 జూన్‌లోనే పూర్తి చేశాం

అధికారులు సర్టిఫికెట్ కూడా ఇచ్చారు.. 2022 జూన్‌తోనే పూర్తయిన డిఫెక్ట్ లయబిలిటీ కాలం

రాష్ట్ర సాగునీటి శాఖకు రాసిన లేఖలో ఎల్అండ్‌టీ వెల్లడి.. మరోసారి 2023లో లేఖ



మేడిగడ్డ ప్రాజెక్టు వద్ద కుంగిపోయిన భాగం (ఫైల్)

మేడిపండు చందమే!

మేడిగడ్డ నిర్మాణంలో ఎన్నో ఉల్లంఘనలు.. కుంగిన బ్లాకులు ఎల్ అండ్ టీ కట్టలేదు!

ఉల్లంఘనలన్నింటికీ గుడ్డిగా ఆమోదం

బ్యారేజీ ప్రారంభించాక నిర్వహణే లేదు

నిర్మాణ ఖర్చు అంచనాలు 133% పెంపు

రూ.1863 కోట్ల నుంచి 4613 కోట్లకి!

కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చాకా చెల్లింపులు

ఆ సర్టిఫికెట్ ఇవ్వకముందే నిర్మాణసంస్థకు

బ్యాంకు గ్యారెంటీలు ఇచ్చేయాలని సిఫారసు

అది తప్పుడు నిర్ణయమన్న విజిలెన్స్ నివేదిక

అలా సిఫారసు చేసిన ఇంజనీర్ ఇన్ చీఫ్‌పై

క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సూచన

కాఫర్‌డ్యామ్, షీట్‌ఫైల్స్‌ను తొలగించలేదు

విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సంచలన నివేదిక

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించి విస్తుపోయే విషయాలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం వెలుగులోకి తెచ్చింది. ఈ బ్యారేజీ నిర్మాణంలో అనేక ఉల్లంఘనలు చోటుచేసుకున్నాయని.. అయినా అధికారులు అన్నింటికీ అడ్డగోలుగా ఆమోదాలు ఇచ్చేశారని పేర్కొంది. నిర్మాణ అంచనాలను భారీగా పెంచేశారని ఆక్షేపించింది. ఒకక్రమపద్ధతిలో చేయాల్సిన పనులను దానికి విరుద్ధంగా చేశారని తేల్చింది. అసలు బ్యారేజీలో కుంగిన ఏడో బ్లాకుతో పాటు ప్రభావితమైన 6, 8 బ్లాకులను.. నిర్మాణ సంస్థ అయిన ఎల్ అండ్ టీ కట్టలేదని, ఆ పనులను సబ్ కాంట్రాక్టర్ చేపట్టారనే తీవ్ర ఆరోపణలున్నాయని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తన నివేదికలో

మిగతా 13వ పేజీలో...

మేడిగడ్డ కూలిపోతుంది!

ఇది విజిలెన్స్ విచారణలో తేలింది.. ప్రమాదంలో 'అన్నారం'

కృష్ణా జలాలపై కేసీఆర్, హరీశ్‌వి పచ్చి అబద్ధాలు 13

ఉమ్మడి రాష్ట్రంలో కన్నా బీఆర్ఎస్ హయాంలోనే తీవ్ర నష్టం

ఏపీకి నీటిని తరలిస్తున్నా ఎందుకు మాట్లాడలేదు?: ఉత్తమ్



మురళీధర్



నల్లా వెంకటేశ్వర్లు

13

మురళీధర్‌పై వేటు

రాజీనామా చేయాలని ఈఎన్‌సీ(జనరల్)కి సర్కారు ఆదేశం

కాళేశ్వరం అవినీతి వ్యవహారంలో రామగుండం ఈఎన్‌సీ

నల్లా వెంకటేశ్వర్లును తొలగిస్తూ ఉత్తర్వులు విడుదల

మేడిగడ్డ పూర్తిపై స్పష్టత లేమి, డిజైన్ల మార్పునకు కారణమనే..

శివ బాలకృష్ణ ఆస్తులు..

1,000 కోట్లకు పైనే!

తెలంగాణ, ఏపీలో 214 ఎకరాల సాగు భూములు

29 ప్లాట్లు.. 7 ఫ్లాట్లు.. ఓ ఖరీదైన విల్లా

బంధుమిత్రుల పేర్లతో కొనుగోలు

మరో ముగ్గురు బినామీల అరెస్టుకు రంగం

ముగిసిన శివబాలకృష్ణ కస్టడీ.. సోదరుడి రిమాండ్



హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ కేసులో.. బినామీలు, ఆస్తుల డొంక కదులుతోంది. ఆయన తన బంధుమిత్రులను బినామీలుగా పెట్టి.. తెలుగు రాష్ట్రాల్లో 214 ఎకరాల వ్యవసాయ భూములను కూడబెట్టినట్లు ఏసీబీ నిగ్గుతేల్చింది. శివబాలకృష్ణ కీలక బినామీ అయిన అతని సోదరుడిని అరెస్టు చేసిన ఏసీబీ.. మరికొందరు బినామీల ఆస్తులపై ఆరా తీస్తోంది.

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసులో అరెస్టయిన హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ ఆస్తులు కట్టలు కట్టలుగా బయటపడుతున్నాయి. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ అతని ఆస్తులున్నట్లు అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) వర్గాలు చెబుతున్నాయి. శివబాలకృష్ణ అక్రమార్జనతో ఇరు రాష్ట్రాల్లో 214 ఎకరాల వ్యవసాయ భూములు, 29 ఓపెన్ ప్లాట్లు, ఏడు ఫ్లాట్లు, ఓ ఖరీదైన విల్లాను సంపాదించినట్లు తెలిపాయి. వీటి విలువ రూ.500 కోట్లుగా ఉంటుందని నిగ్గుతేల్చాయి. బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం ఈ ఆస్తుల విలువ రూ.వెయ్యి కోట్లకు పైనే ఉంటుందని అంచనా. శివబాలకృష్ణ ఈ ఆస్తులను తన కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల పేరిట కొనుగోలు చేసినట్లు అధికారులు గుర్తించారు. మంగళవారం అతని సోదరుడు, కీలక బినామీ అయిన శివ నవీన్‌కుమార్ ఏసీబీ అరెస్టు చేయగా.. మరో ముగ్గురు బినామీల పట్టివేతకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. శివబాలకృష్ణ సన్నిహితులు, బంధుమిత్రుల ఆస్తులపైనా ఏసీబీ ఆరా తీస్తోంది. శివ నవీన్‌కుమార్‌ను బుధవారం ఉదయం రిమాండ్‌కు తరలించారు. అతని కస్టడీ కోసం వచ్చేవారం కోర్టులో పిటిషన్ వేయనున్నారు. కాగా.. ఏసీబీ బృందాలు బుధవారం హెచ్ఎండీఏ కార్యాలయంలో మూడోరోజు సోదాలను కొనసాగించాయి. రెరా కార్యాలయంలోనూ తనిఖీలు చేశాయి.

జనగామ జిల్లాలో 102 ఎకరాలు

శివబాలకృష్ణకు తెలుగు రాష్ట్రాల్లో 214 ఎకరాల వ్యవసాయ భూములున్నట్లు తేలగా.. వాటిల్లో సింహభాగం–102 ఎకరాలు జనగామ జిల్లాలో ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. ఈ జిల్లాలోని

మిగతా 14వ పేజీలో...

సహకరించండి!

ఎన్డీయేను బలపరచండి!.. దేశం బలోపేతం కావడమే మా లక్ష్యం

ఏపీలో జగన్‌కు వ్యతిరేక పవనాలు

చంద్రబాబుతో అమిత్‌షా 'పొత్తు చర్చలు'

ఢిల్లీలో సుమారు గంటపాటు భేటీ

కలిసి పనిచేయడంపై అవగాహన?



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): దేశ, రాష్ట్ర ప్రయోజనాల రీత్యా కలిసి పని చేయడంపై టీడీపీ, బీజేపీ మధ్య ఒక అవగాహన ఏర్పడినట్లు తెలిసింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా పిలుపు మేరకు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు బుధవారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్నారు. రాత్రి 11.30 గంటల ప్రాంతంలో ఇరువురు నేతలు సమావేశమయ్యారు. సుమారు గంటపాటు చర్చించుకున్నారు. దేశవ్యాప్తంగా ఎన్డీయేను బలోపేతం చేస్తున్నామని, దేశాన్ని బలోపేతం చేయాలంటే అన్ని ప్రాంతాల్లో తమ కూటమి అవసరమని అమిత్ షా పేర్కొన్నట్లు సమాచారం. ఇతర రాష్ట్రాల్లో కూడా పలు పార్టీలు బీజేపీ వైపు చూస్తున్నాయని, ఈసారి 400 సీట్లకు పైగా విజయం సాధించాలనే లక్ష్యం పెట్టుకున్నామని ఆయన చెప్పినట్లు సమాచారం. రాష్ట్రంలో బీజేపీ - తెలుగుదేశం పొత్తు కుదిరితే బీజేపీ గెలిచే అవకాశాలున్న సీట్ల గురించి కూడా అమిత్ షా ఆరా తీసినట్లు తెలిసింది. రాష్ట్రంలో జగన్ వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని తమకు సమాచారం అందిందని కూడా చెప్పినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో గతంలో ఎన్డీయేను బలోపేతం చేసినట్లుగానే... ఇప్పుడూ సహకరించాలని చంద్రబాబును అమిత్‌షా కోరినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం: బాబు

అమిత్‌షాతో భేటీకి ముందు చంద్రబాబు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. బీజేపీకి దేశప్రయోజనాలు ముఖ్యమైతే... తెలుగుదేశానికి రాష్ట్ర ప్రయోజనాలు

మిగతా 14వ పేజీలో...

నేటి నుంచి 17 దాకా శాసనసభ బడ్జెట్ సమావేశాలు

10న రాష్ట్ర బడ్జెట్?

ప్రవేశపెట్టనున్న డిప్యూటీ సీఎం భట్టి.. మండలిలో శ్రీధర్‌బాబు!

ఈ సెషన్స్‌లో సాగునీటిపై శ్వేతపత్రం, కుల గణనపై బిల్లు!

లోటుపాట్లు లేకుండా నిర్వహించాలి: స్పీకర్



హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసన సభ, శాసన మండలి సమావేశాలు గురువారం(8న) నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 11.30 గంటలకు ఉభయ సభలనూ ఉద్దేశించి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రసంగించనున్నారు. అనంతరం ఉభయ సభలూ శుక్రవారానికి వాయిదా పడతాయి. ఆ రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెట్టి, చర్చ చేపడతారు. అదే రోజు (9న) ప్రభుత్వం ధన్యవాదాల తీర్మానానికి సమాధానమిస్తుంది. కాగా.. 10వ తేదీన (శనివారం) ప్రభుత్వం శాసన సభలో ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్‌ను

మిగతా 12వ పేజీలో...

బడ్జెట్ రూ2.70లక్షల కోట్లు?

వాస్తవ రాబడులు, వ్యయాల ఆధారంగా రూపకల్పన

గతానుభవాలు, ప్రభుత్వ ప్రాధమ్యాలు పరిగణనలోకి..

12

బడ్జెట్ 100% వ్యయమయ్యేలా జాగ్రత్తలు

ప్రస్తుత బడ్జెట్ కంటే 10% తక్కువగా ఉండే అవకాశం

సర్కారు గ్యారెంటీలకు నిధుల కేటాయింపు

ఉచిత బస్సు ప్రయాణానికి రూ.3000 కోట్లు అవసరం

200 యూనిట్ల ఉచిత విద్యుత్తుకు 4000 కోట్లకు పైగానే!

వైద్యశాఖలో డిప్యుటేషన్ల రద్దు

నేటి సాయంత్రంలోపు రిపోర్టు చేయాలి

ఇక ప్రభుత్వ ఆదేశాల మేరకే డిప్యుటేషన్

పిల్లలకు పరీక్షల టైంలో ఈ రద్దేమిటి?

ఉద్యోగుల్లో ఆందోళన

విద్యాసంవత్సరం ముగిసేవరకైనా

కొనసాగించాలని విజ్ఞప్తి 3

సాధారణ బదిలీలు చేపట్టేవరకు

అవకాశమివ్వాలంటున్న సంఘాలు

ఉమ్మడి పౌర స్మృతికి ఉత్తరాఖండ్ ఆమోదం

దేశంలోనే తొలి రాష్ట్రం

రాజ్యాంగం ప్రకారమే అన్న సీఎం పుష్కర్

వివాహం, విడాకులకు అన్ని వర్గాలకు

ఒకే విధమైన నిబంధనలు 2

సహజీవనానికి రిజిస్ట్రేషన్ తప్పనిసరి



బీసీల్లో 'వారు' రిజర్వేషన్ వదులుకోలేరా?

ఉన్నత ఉపకులాల వారు జనరల్ కేటగిరీతో పోటీ పడలేరా? 2

సుప్రీం జడ్జి జస్టిస్ నాథ్ ప్రశ్నలు

డ్రోన్ పైలటింగ్‌లో ఇస్రో శిక్షణ

రాష్ట్ర ఏవియేషన్ అకాడమీతో ఒప్పందం

రేవంత్‌తో ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ భేటీ.. 20 ఎకరాల్లో డ్రోన్ పోర్టుకు సీఎం ఓకే

ఫార్మాసిటీకి దగ్గర్లో ఏర్పాటు?.. వరంగల్ ఎయిర్‌పోర్టు పునరుద్ధరణపై దృష్టి

హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): డ్రోన్ పైలటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి శిక్షణ అందించేందుకు ఇస్రో ముందుకు వచ్చింది. ఈ మేరకు ఇస్రోకు చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్సీ)తో తెలంగాణ స్టేట్ ఏవియేషన్ అకాడమీ అవగాహన ఒప్పందం చేసుకుంది. బుధవారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ సమక్షంలో తెలంగాణ ఏవియేషన్ అకాడమీ సీఈవో ఎస్.ఎన్.రెడ్డి.. ఎన్.ఆర్.ఎస్సీ డైరెక్టర్ ప్రకాశ్ చౌహాన్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఇందులో భాగంగా డ్రోన్ పైలటింగ్, డ్రోన్ డేటా మేనేజ్‌మెంట్, డేటా అనాలసిస్‌పై శిక్షణ అందిస్తారు. ఎన్.ఆర్.ఎస్సీ శాస్త్రవేత్తలకు, అకాడమీలో శిక్షణ పొందుతున్న డ్రోన్ పైలట్లకు డేటా అనాలసిస్, డేటా ప్రాసెసింగ్, మ్యాపింగ్‌పై 15 రోజుల శిక్షణ కోర్సులు నిర్వహిస్తారు. అన్ని రంగాల్లో డ్రోన్ల వినియోగం పెరిగిపోయిందని, పొలాల్లో

మిగతా 12వ పేజీలో...

441 మందికి ఉద్యోగ నియామక పత్రాలు

సింగరేణి సమస్యల పరిష్కారానికి కృషి

15 రోజుల్లో 15వేల పోలీసు ఉద్యోగాల భర్తీ


త్వరలో గ్రూప్-1 నోటిఫికేషన్: రేవంత్



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శాటిలైట్ నమూనాను అందిస్తున్న ఇస్రో ఛైర్మన్ సోమనాథ్



కాంగ్రెస్‌కు 40 సీట్లైనా



రావాలని కోరుకుంటున్నా: మోదీ

పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన సవాల్‌ను స్వీకరించి లక్ష్యాన్ని సాధించాలి

యువరాజు స్టార్టప్ కాదు.. స్టార్ట్ కూడా కాదు

'ఉత్తరం-దక్షిణం'తో దేశానికి నష్టం

మా పన్నులు-మా డబ్బులు.. ఇదా వాదన?

మానవ శరీరం లాంటిదే దేశం కూడా

ఎక్కడ బాధైనా అది అందరి సమస్యే

రిజర్వేషన్లను నెహ్రూ వ్యతిరేకించారు

నాటి సీఎంలకు రాసిన లేఖే సాక్ష్యం

దేశమంతటా పైప్‌లైన్‌తో వంటగ్యాస్

సౌరశక్తి ద్వారా ఉచితంగా కరెంటు

'వికసిత భారత్'ను నిర్మిస్తాం

రాజ్యసభలో ప్రధానమంత్రి మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 40 సీట్లు రావాలని కోరుకుంటున్నానని ప్రధాని నరేంద్రమోదీ ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష ఇండియా కూటమి సభ్యురాలైన తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఇటీవల.. కాంగ్రెస్ 40 సీట్లనైనా గెలుచుకోగలదా? అని సవాల్ విసిరారు. మమత వ్యాఖ్యలను ప్రధాని మోదీ పరోక్షంగా ప్రస్తావిస్తూ.. '40 సీట్లను కూడా కాంగ్రెస్ దాటలేదని పశ్చిమ బెంగాల్ నుంచి ఆ పార్టీకి ఓ సవాల్ వచ్చింది. మీరు 40 సీట్లను గెలుచుకోవాలని నేను ప్రార్థిస్తున్నా' అని మోదీ పేర్కొన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు ప్రధాని బుధవారం

మిగతా 2వ పేజీలో...

కేంద్రం వివక్షపై.. ఢిల్లీలో కర్ణాటక కాంగ్రెస్ ధర్నా

సీఎం సిద్దూ, డీకే, మంత్రుల హాజరు 2

నేడు హస్తినలో కేరళ ప్రభుత్వ ప్రదర్శన



టీఎస్‌పీఎస్సీకి రూ.40 కోట్లు విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు రాష్ట్రప్రభుత్వం నిధులు విడుదల చేసింది. కమిషన్ కార్యాలయ నిర్వహణ, పరీక్షల ఏర్పాటుకు కావాల్సిన రూ. 40 కోట్లను విడుదల చేస్తూ ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది ఆఖరులోపు 2 లక్షల ప్రభుత్వ ఖాళీలను భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవలే ప్రకటించిన నేపథ్యంలో.. కమిషన్‌కు నిధుల కొరత లేకుండా ప్రభుత్వం నిధులు విడుదల చేసింది.

కొలువుల పేరుతో క్రెడిట్ కార్డుల స్కాం!

దుబాయిలో తెలంగాణకు చెందిన 12 మంది యువకుల కష్టాలు 2

యూసీసీకి ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఆమోదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ఉత్తరాఖండ్ రాష్ట్ర అసెంబ్లీ బుధవారం ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ) బిల్లును ఆమోదించింది. దేశంలో ఇటువంటి బిల్లును ఆమోదించిన తొలి రాష్ట్రంగా నిలిచింది. గవర్నర్ ఆమోదం పొందితే ఈ బిల్లు చట్టంగా మారనుంది. అసెంబ్లీలో ఈ బిల్లుపై చర్చ సందర్భంగా ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి మాట్లాడుతూ రాజ్యాంగ నిబంధనలను పాటించే తమ ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశ పెట్టిందని చెప్పారు. కొందరికి దీనిపై సందేహాలు ఉన్నాయని... అయితే రాజ్యాంగంలోని ఆర్టికల్ 44 ద్వారా తగిన సమయంలో రాష్ట్రాలు ఉమ్మడి పౌరస్మృతిని ప్రవేశ పెట్టే హక్కును రాజ్యాంగ రూపకర్తలు కల్పించారని చెప్పారు. వివాహం, విడాకులు, వారసత్వం వంటి అంశాలకు సంబంధించి అన్ని మతాల వారికీ ఒకేవిధమైన నిబంధనలను ఇది ప్రతిపాదిస్తుంది. అలాగే సహజీవనం చేసేవారు నెలలోగా తప్పనిసరిగా దాన్ని రిజిస్టర్ చేసుకోవాలి. బాల్య వివాహాల్ని ఈ బిల్లు పూర్తిగా నిషేధించింది. వారసత్వంగా వచ్చే ఆస్తిపై అన్ని మతాల మహిళలకు సమాన హక్కును కల్పించింది. ఎవరి మత విశ్వాసాలు, ఆచార సంప్రదాయాల ప్రకారం వారు వివాహం చేసుకొనేందుకు ఈ బిల్లు అనుమతిస్తుంది. అయితే రాజ్యాంగంలోని ఆర్టికల్ 366.. 25వ నిబంధన, ఆర్టికల్ 342 ప్రకారం షెడ్యూల్ తెగలకు ఈ బిల్లు వర్తించదు.

బీసీల్లో ఉన్నత ఉపకులాల వారు..
రిజర్వేషన్ను వదులుకోలేరా: సుప్రీం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: వెనకబడిన తరగతు(బీసీ)ల్లో ఉన్నత స్థానాలకు చేరిన ఉపకులాల వారు రిజర్వేషన్లను వదులుకోలేరా? అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్ నాథ్ ప్రశ్నించారు. 'ద పంజాబ్ షెడ్యూల్డ్ క్యాస్ట్స్ అండ్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ (రిజర్వేషన్ ఇన్ సర్వీసెస్) యాక్ట్-2006'లో.. ఎస్సీ రిజర్వేషన్లలో వాల్మీకి, మజ్హబీ సిక్కులకు 50% కోటా ఇవ్వాలంటున్న సెక్షన్ 4(5)ను సవాలు చేస్తూ పలు పిటిషన్లు దాఖలైన విషయం తెలిసిందే. వీటిపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం నుంచి విచారణ ప్రారంభించింది. విచారణ సందర్భంగా జస్టిస్ నాథ్ మాట్లాడుతూ.. ఉన్నతస్థాయికి చేరిన వారు రిజర్వేషన్లను వదులుకుని, జనరల్ కేటగిరీతో పోటీపడలేరా? అని ప్రశ్నించారు. ఒకసారి ఉన్నత వర్గానికి చేరుకున్న వారు రిజర్వేషన్లను త్యజిస్తే.. సమాజంలో ఇంకా వెనుకబాటులో ఉన్న ఉప కులాల వారికి ఉపయుక్తంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. మరో న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి కూడా ఐపీఎస్, ఐఏఎస్ పిల్లలు.. ఉన్నతస్థాయికి చేరినా రిజర్వేషన్లను ఉపయోగించుకుంటున్నారని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ ఈ విషయంపై ఓ నిర్ణయం తీసుకోవాలని అభిప్రాయపడ్డారు.

పవార్ పార్టీ పేరు.. ఎన్సీపీ శరద్‌చంద్ర పవార్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: మహారాష్ట్రలో శరద్ పవార్ వర్గానికి పార్టీ పేరును కేంద్రం ఎన్నికల సంఘం (ఈసీ) కేటాయించింది. ఆయన వర్గానికి 'నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ-శరద్‌చంద్ర పవార్' పేరును బుధవారం ఖరారు చేసింది. ఇటీవల అజిత్ పవార్ వర్గానిదే అసలైన ఎన్సీపీగా గుర్తించిన ఈసీ.. పార్టీ గడియారం గుర్తునూ వారికే కేటాయించిన సంగతి తెలిసిందే. ఈనెలాఖరులోనే మహారాష్ట్రలోని 6 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలున్న నేపథ్యంలో పార్టీ కొత్త పేరు, కొత్త గుర్తు ఎంచుకోవాల్సిందిగా శరద్ వర్గానికి ఈసీ మంగళవారం సూచించింది. ఈ నేపథ్యంలోనే ఎన్సీపీ-శరద్‌చంద్ర పవార్, ఎన్సీపీ-శరద్ పవార్, ఎన్సీపీ-శరద్‌రావు పవార్ పేర్లతో ఉదయించే సూర్యుడు, టీ కప్పు, పొద్దు తిరుగుడు పువ్వు గుర్తులను శరద్ వర్గం ఈసీ ఆమోదం కోసం పంపింది. వీటిలో ఎన్సీపీ-శరద్‌చంద్ర పవార్‌కు ఆమోదం తెలిపిన ఈసీ.. పార్టీ గుర్తును ఇంకా నిర్ణయించలేదు.

17న విచారణకు రండి.. కేజ్రీకి ఢిల్లీ కోర్టు సమన్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఈడీ ఫిర్యాదుకు సంబంధించి ఈ నెల 17న విచారణకు హాజరుకావాలని ఆప్ కన్వీనర్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ఢిల్లీ కోర్టు ఆదేశించింది. కుంభకోణంపై దర్యాప్తులో భాగంగా తాము పంపిన సమన్లకు కేజ్రీవాల్ స్పందించడం లేదని ఈడీ ఈ నెల 3న కేజ్రీవాల్‌పై కోర్టులో ఫిర్యాదు చేసింది. ఇప్పటివరకు కేజ్రీవాల్‌కు ఐదుసార్లు సమన్లు పంపినట్లు, ఆయన ఒక్కసారి కూడా అధికారుల ముందు హాజరుకానట్లు అందులో పేర్కొంది. ఈడీ సమన్లు రాజకీయ ప్రేరేపితమని కేజ్రీవాల్ గతంలో ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఈడీకి లేఖ కూడా రాశారు. కాగా, ఢిల్లీ కోర్టు ఆదేశాలను అధ్యయనం చేస్తున్నామని, దీనిపై న్యాయపరంగా వెళ్తామని ఆప్ పేర్కొంది. ఇదిలా ఉండగా, ఈడీ అదుపులో ఉన్న ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ రిమాండ్‌ను పీఎంఎల్‌ఏ ప్రత్యేక కోర్టు మరో ఐదు రోజులు పొడిగించింది.

అమెరికాలో మరో భారతీయ విద్యార్థి మృతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: అమెరికాలో భారతీయ విద్యార్థులు వరుసగా మరణిస్తుండటం ఆందోళన రేపుతోంది. తాజాగా ఇండియానా రాష్ట్రంలోని పుర్డ్యు యూనివర్సిటీలో డాక్టరేట్ చేస్తున్న సమీర్ కామత్(23) సోమవారం సాయంత్రం ఒక పార్కులో అనుమానాస్పద స్థితిలో మరణించారని వారెన్ కౌంటీ కరోనర్ కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది. కామత్ మెకానికల్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందారు. గతేడాది ఆగస్టులో ఆయనకు అమెరికా పౌరసత్వం కూడా లభించింది. 2025 సంవత్సరంలో ఆయన డాక్టరేట్ పూర్తికావాల్సి ఉంది. ఇంతలోనే ఆయన అనుమానాస్పద స్థితిలో మరణించారు. పోస్టుమార్టం నిర్వహించి త్వరలో నివేదికను విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

బుల్డోజర్లతో ఆ కూల్చివేతలు ఆపండి: ఆమ్నెస్టీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 : భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో ముస్లింల ఇళ్లు, దుకాణాలు, ప్రార్థన మందిరాలను చట్టవ్యతిరేకంగా కూల్చివేస్తున్నారంటూ మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆందోళన వ్యక్తం చేసింది. బుల్డోజర్లతో జరుగుతున్న ఆ కూల్చివేతలను తక్షణమే నిలిపివేయాలని పిలుపునిచ్చింది. ఈ కూల్చివేతలకు జేసీబీ కంపెనీకి చెందిన యంత్రాలను అధికంగా వినియోగిస్తున్నారని, దీంతో జేసీబీ అనేది ముస్లింలపై విద్వేషాన్ని రెచ్చగొట్టే పదంగా మారిపోయిందని పేర్కొంది. ఈ మేరకు రెండు నివేదికలను ఆమ్నెస్టీ బుధవారం విడుదల చేసింది. మానవ హక్కులు, చట్టాలను గౌరవించి కూల్చివేతలను ఆపాలని, కూల్చివేతల వల్ల రోడ్డున పడ్డ కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆమ్నెస్టీ కోరింది.

ఎన్నికల ముందురోజు పాక్‌లో జంట పేలుళ్లు

» 30 మంది మృతి.. 42 మందికి గాయాలు

కరాచీ, ఫిబ్రవరి 7: దేశ సార్వత్రిక ఎన్నికలకు ఒక్కరోజు ముందు పాకిస్థాన్ జంట బాంబు పేలుళ్లతో దద్దరిల్లింది. గంట వ్యవధిలోనే సంభవించిన ఈ పేలుళ్లలో 30 మంది మృతి చెందగా, దాదాపు 42 మంది గాయపడ్డారు. ఈ దుర్ఘటన బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో బుధవారం సంభవించింది. పాకిస్థాన్ సార్వత్రిక ఎన్నికలు గురువారం జరగనున్నాయి. ఈ క్రమంలో బుధవారం పిషిన్ జిల్లాలో ఓ స్వతంత్ర అభ్యర్థి కార్యాలయం బయట మొదటి పేలుడు, ఖిల్లా అబ్దుల్లా ప్రాంతంలో జమియత్-ఉలేమా- ఎ- ఇస్లామ్ పాకిస్థాన్ పార్టీ కార్యాలయం బయట రెండో పేలుడు సంభవించింది. ఈ నేపథ్యంలో బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో భద్రతను పటిష్ఠం చేస్తున్నట్లు పాక్ ఎన్నికల సంఘం తెలిపింది. ఈ ఉగ్రదాడుల వెనుక ఉన్న వారిని పట్టుకొని కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం అధికార ప్రతినిధి తెలిపారు. ఈ దాడులను బలూచిస్థాన్ హోం మంత్రి ఖండించారు. అయితే, షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరుగుతాయని ప్రకటించారు.


కాంగ్రెస్‌కు 40 సీట్లైనా!

(మొదటి పేజీ తరువాయి)

రాజ్యసభలో సమాధానం ఇచ్చారు. గంటన్నర పాటు సాగిన ఆయన ప్రసంగంలో ప్రతిపక్షాలపై ముఖ్యంగా కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగారు. దళితులు, బీసీలు, గిరిజనులకు ఆ పార్టీ వ్యతిరేకమని..అంబేద్కరే లేకుంటే ఆయా వర్గాలకు రిజర్వేషన్ లభించి ఉండేది కాదని చెప్పారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ ఆనాటి సీఎంలకు రాసిన ఒక లేఖను ఉదహరిస్తూ, అన్ని రకాల రిజర్వేషన్లకు ముఖ్యంగా ఉద్యోగాల్లో కోటాకు నెహ్రూ వ్యతిరేకమని ఈ లేఖ స్పష్టం చేస్తోందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల వల్ల ప్రభుత్వ పనితీరు దెబ్బతింటోందని ఆ లేఖలో పేర్కొన్నారని చెప్పారు. ఓబీసీలకు కాంగ్రెస్ ఎన్నడూ పూర్తి రిజర్వేషన్ కల్పించలేదని, జనరల్ క్యాటగిరీలో పేదలకు ఆ పార్టీ ఎన్నడూ రిజర్వేషన్ ఇవ్వలేదని, భారత రత్నకు అంబేద్కర్‌ను అర్హుడిగా కాంగ్రెస్ భావించలేదని, తన కుటుంబానికి మాత్రం ఆ అత్యున్నత పురస్కారం ఇస్తూ వెళ్లిందని ప్రధాని విమర్శించారు. అటువంటి పార్టీ నేడు తమకు పాఠాలు చెబుతోందని ఎద్దేవా చేశారు. కులగణనకు మోదీ ప్రభుత్వం అంగీకరించటం లేదన్న కాంగ్రెస్ విమర్శల నేపథ్యంలో మోదీ ఈ విధంగా ఎదురుదాడి చేశారు. అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని బహిరంగంగా గొంతుపిసికి చంపిందని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన డజనుకుపైగా ప్రభుత్వాలను రాత్రికిరాత్రి ఆ పార్టీ రద్దు చేసిందని దుయ్యబట్టారు.

కాంగ్రెస్‌కు నా సానుభూతి..

కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీపై ప్రధాని పరోక్షంగా విమర్శలు గుప్పించారు. 'యువరాజును ఓ స్టార్టప్‌గా మలచాలన్నది కాంగ్రెస్ ప్రయత్నం. కానీ, ఆయన అసలు స్టార్టే కారు. ఆయనను ఎత్తుకోలేము.. ఓ లక్ష్యం వైపు ప్రయోగించనూ లేము. కాంగ్రెస్ ఆలోచనాధారకు కాలం చెల్లింది. అందుకనే ఆ పార్టీ తన పనిని ఔట్‌సోర్స్ చేస్తోంది (ఇతరులకు అప్పగిస్తోంది). ఆ పార్టీ పతనం పట్ల మేమేమీ సంతోషంగా లేము. సానుభూతి తెలుపుతున్నాం. కాంగ్రెస్‌కు తన విధానంపైన, తన నాయకుడి పైనే గ్యారెంటీ లేదు కానీ, మోదీ గ్యారెంటీలను ప్రశ్నిస్తోంది' అని మోదీ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ, కర్ణాటకలో అధికారంలో ఉన్న ఆ పార్టీ ప్రభుత్వం.. ఉత్తరం, దక్షిణం అంటూ ప్రచారం చేయటం సరికాదని, ఇది దేశభవిష్యత్తుకు నష్టం చేస్తుందన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కొత్త కొత్త వాదనలను తీసుకొస్తూ దేశాన్ని విభజించేలా మాటలు మాట్లాడటం చూస్తుంటే తనకు తీవ్రమైన బాధ కలుగుతోందన్నారు. 'హమారా ట్యాక్స్-హమారా మనీ (మా పన్ను-మా డబ్బు)... ఒక రాష్ట్రమే ఈ విధంగా మాట్లాడమేమిటి? దేశానికి ఇంతకన్నా ఘోరమైనది ఏం ఉంటుంది? ఒక జాతీయ రాజకీయ పార్టీ నుంచి ఈ విధమైన మాటలు వెలువడటం బాధాకరం. మాకు దేశమంటే ఓ భూభాగం కాదు. అది మనిషి శరీరం వంటిది. ఏ అవయవం పని చేయకపోయినా మొత్తం శరీరానికే ఇబ్బంది తలెత్తుతుంది. అలాగే, దేశంలో ఏ ఒక్క ప్రాంతాన్ని అభివృద్ధి చేయకుండా వదిలేసినా.. దేశమే అభివృద్ధి కాకుండా ఉండిపోతుంది' అని మోదీ అన్నారు.



నాడు బలహీన ఆర్థికవ్యవస్థ

కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ పదేళ్లపాలనలో దేశంలో విధానపరమైన పక్షవాతం నెలకొన్నదని, నాడు మన ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే అత్యంత బలహీనమైన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉన్నదని మోదీ చెప్పారు. కాంగ్రెస్ సుదీర్ఘపాలన కారణంగా దేశాన్ని కమ్ముకున్న సమస్యలను నిర్మూలించటానికే తన రెండు దఫాల పదవీకాలం సరిపోయిందని, ఇక మీదట వికసిత్ భారత్ మీద పూర్తి దృష్టి పెడతామని చెప్పారు.

మోదీ 3.0లో పైప్‌లైన్ ద్వారా వంటగ్యాస్

వరుసగా మూడోసారి అధికారంలోకి వస్తామన్న ధీమాను మోదీ పునరుద్ఘాటించారు. 'మా మూడోదఫా ప్రభుత్వం మరెంతో దూరంలో లేదు. కొందరు దీనిని మోదీ 3.0గా అభివర్ణిస్తున్నారు. వికసిత భారత్ పునాదిని పటిష్ఠపర్చటానికి మోదీ 3.0 తన శక్తినంతటినీ ఉపయోగిస్తుంది' అని తెలిపారు. 'యావత్ దేశానికి పైప్‌లైన్ ద్వారా వంటగ్యాస్‌ను సరఫరా చేసే వ్యవస్థను నిర్మిస్తాం. సౌరశక్తి ద్వారా ఉచితంగా కరెంటును అందజేస్తాం. భారత్ మరిన్ని స్టార్టప్‌లను చూస్తుంది. బుల్లెట్ ట్రెయిన్లు వస్తాయి. సెమీకండక్టర్ రంగంలో భారత్ గొప్ప ప్రగతి సాధిస్తుంది' అని చెప్పారు.

పదేళ్లలో చేసిందేమిటో చెప్పకుండా..
మాపై శాపనార్థాలేమిటి?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: పదేళ్ల అధికారంలో ఉన్న ప్రధాని మోదీ తాను చేసిందేమిటో చెప్పకుండా తమపై శాపనార్థాలు పెట్టడమేమిటని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే నిలదీశారు. పార్లమెంటు ఉభయసభల్లోనూ మోదీ కాంగ్రెస్‌పై తిట్ల వర్షమే కురిపించారని, పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, ఆర్థిక అసమానతల గురించి మాత్రం మాట్లాడ లేదన్నారు. 'బీజేపీ వాళ్లకు రాజ్యాంగంపై విశ్వాసం లేదు. దేశానికి 1947లో కాకుండా 2014లో స్వాతంత్ర్యం వచ్చిందని వాళ్లు భావిస్తారు. స్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్ పోరాడిందన్న వాస్తవాన్ని గుర్తించరు. దండి సత్యాగ్రహంలో, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనని వారు కాంగ్రెస్‌కు దేశభక్తి గురించి బోధిస్తారు. ప్రధానికి అబద్ధాలు చెప్పటం అలవాటుగా మారిపోయింది' అని ఖర్గే విమర్శించారు.



కొలువుల పేరుతో
క్రెడిట్ కార్డుల స్కాం!

» దుబాయిలో తెలంగాణకు చెందిన 12 మంది యువకుల కష్టాలు
» సంతకాలు తీసుకొని ఇరికించిన నకిలీ కంపెనీల యజమానులు

(గల్ఫ్ నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

దుబాయిలో ఆకర్షణీయమైన వేతనం, గౌరవంతో కూడిన ఉద్యోగం ఇప్పిస్తామని ఎవరైనా చెబితే ఒకటికి రెండుసార్లు ఆలోచించండి! లేదంటే.. మీరు దుబాయిలోనే ఇరుక్కుపోయి తీవ్ర ఇబ్బందుల్లో పడే ప్రమాదం ఉంది. ఎందుకంటే దుబాయిలో కొలువు ఇప్పిస్తామని యువకులకు ఏజెంట్ల ద్వారా ఎరవేసి.. వారిని ఇక్కడికి రప్పించుకొని.. బ్యాంకు రుణాలు, క్రెడిట్ కార్డుల కుంభకోణంలో ఇరికిస్తున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి. తెలంగాణ నుంచి ఎన్నో ఆశలతో వెళ్లిన యువకులను నకిలీ కంపెనీ యజమానులు పిలిపించుకొని.. వర్క్‌ఫ్రం హోం, రెసిడెన్సీ వీసా, బ్యాంకు ఖాతాలు తెరవడం పేరుతో సంతకాలు తీసుకొని.. ఉద్యోగుల పేరుతోనే సిమ్ కార్డును తీసుకున్నారు. ఆ తర్వాత కొంతకాలం ఉద్యోగుల ఖాతాల్లో జీతాలు వేసి.. ఆ నకిలీ యజమానులే విత్‌డ్రా చేసుకున్నారు. కొన్నాళ్లకు ఉద్యోగుల పేరుతోనే క్రెడిట్ కార్డులు పొంది లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఇలా హైదరాబాద్‌కు చెందిన ఓ ఏజెంటు ఏకంగా 12 మందిని తీసుకెళ్లి ఇబ్బందులు పెడుతుండటంతో వారు ఇక్కడి లేబర్ కోర్టులో కేసు దాఖలు చేశారు. అయితే ఆ 12మంది పేరిటా వేతనాలు జమైనట్లు, ఆ డబ్బును ఉద్యోగులే విత్ డ్రా చేసుకున్నట్లు తేలింది. ఇక సిమ్ కార్డులు స్వాప్ చేసి ఉండటంతో బ్యాంకర్లు భారత్‌లోని తమ రికవరీ ఏజెంట్లను వసూళ్లకు పురమాయించడంతో అసలు సంగతి బయటపడింది.

ఢిల్లీలో కర్ణాటక కాంగ్రెస్ ధర్నా




నేడు కేరళ ప్రభుత్వ నిరసన

బెంగళూరు-ఆంధ్రజ్యోతి/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: కర్ణాటకకు నిధుల విషయంలో మోదీ సర్కారు వివక్ష చూపుతోందంటూ సీఎం సిద్దరామయ్య సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టింది. దానికి పోటీగా బీజేపీ కూడా బెంగళూరులో భారీ ప్రదర్శన చేపట్టింది. పన్నుల ఆదాయం పంపిణీ, గ్రాంట్ల కేటాయింపులో రాష్ట్రానికి అన్యాయం చేస్తోందని కేంద్రంపై సిద్దూ మండిపడ్డారు. ఈ ధర్నాలో ఆయనతోపాటు ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు, రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొన్నారు. 15వ ఆర్థిక సంఘం సిఫారసుల కారణంగా కర్ణాటకకు ఐదేళ్లలో రూ.1.87 లక్షల కోట్ల మేర కేంద్రం నష్టం చేసిందని వారు ఆరోపించారు. తమ ధర్నా బీజేపీకి వ్యతిరేకంగా కాదని.. కర్ణాటకపై వివక్షకు వ్యతిరేకంగా చేస్తున్నామని చెప్పారు. ఈ ధర్నా ద్వారా కాంగ్రెస్ ఉత్తరం-దక్షిణం అన్న విభేదాలు సృష్టిస్తోందన్న బీజేపీ నేతల ఆరోపణను తోసిపుచ్చారు. దేశం ఐక్యంగా ఉండాలని కాంగ్రెస్ కోరుకుంటోందని.. అయితే దక్షిణ రాష్ట్రాలపై వివక్ష ఉండకూడదని స్పష్టం చేశారు. కేంద్ర నుంచి తమ హక్కులు, వాటా కోరుతున్నామని డీకే చెప్పారు. సహకార సమాఖ్య గురించి ప్రధాని మోదీ పెద్దపెద్ద మాటలు చెబుతారని.. కర్ణాటకకు చేస్తున్న అన్యాయంతో ఆయన ప్రజావ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరి బట్టబయలైందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో ధ్వజమెత్తారు. కాగా.. కేరళలో సీపీఎం సారథ్యంలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం కూడా గురువారం ఢిల్లీలో నిరసన చేపట్టనుంది. ఆ రాష్ట్ర సీఎం పినరయి విజయన్ నాయకత్వంలో ఆయన మంత్రివర్గ సహచరులు, ఎంపీలు పాల్గొంటారు.

మంచి చేసేవారికి
గౌరవం దక్కదు

» కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్యలు



ముంబై, ఫిబ్రవరి 7: రాజకీయాల్లో సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే నేతల సంఖ్య తగ్గిపోతోందని కేంద్ర మంత్రి గడ్కరీ ఆందోళన వ్యక్తం చేశారు. అవకాశవాద నాయకులు అధికారంలో ఉన్న పార్టీతో అంటకాగాలని కోరుకుంటున్నారని, ఈ విధంగా రాజకీయాల్లో భావజాలం క్షీణించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని పేర్కొన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా కూడా మంచి పనులు చేసేవారికి గౌరవం దక్కదని, చెడ్డ పనులు చేసేవారికి శిక్ష పడదని గడ్కరీ అభిప్రాయపడ్డారు. లోకమత్ మీడియా గ్రూపు ఆధ్వర్యంలో పార్లమెంటేరియన్లకు అవార్డులు ప్రదానం చేసేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి ప్రసంగించారు. "రాజకీయ నాయకులు వస్తుంటారు... పోతుంటారు.. పబ్లిసిటీ, పాపులరిటీ అవసరమే కానీ పార్లమెంట్‌లో ఏం మాట్లాడతారు అనే దానికంటే నియోజకవర్గాల్లో ప్రజల కోసం చేసిన పనులే వారికి గౌరవాన్ని తీసుకొస్తాయి" అని మంత్రి వివరించారు. ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ వాక్చాతుర్యాన్ని ప్రశంసించిన గడ్కరీ... మాజీ రక్షణమంత్రి జార్జి ఫెర్నాండెజ్ ప్రవర్తన, నిరాడంబరత, వ్యక్తిత్వం నుంచి తాను చాలా నేర్చుకున్నట్లు చెప్పారు. వాజపేయి తర్వాత తనను ఎక్కువగా ప్రభావితం చేసిన వ్యక్తి ఫెర్నాండెజ్ అని తెలిపారు. ఇటీవల భారతరత్న పురస్కారానికి ఎంపికైన బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్... దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి కృషి చేశారని కొనియాడారు. ప్రస్తుత రాజకీయ నేతలంతా ఆయనలాంటి గొప్ప నాయకుల నుంచి స్ఫూర్తి పొందాలని సూచించారు.

దేశ భవిష్యత్తుకు మోదీ గ్యారంటీ

దక్షిణాదిలో స్థానాలను పెంచుకుంటాం.. జనాదరణలో మోదీతో పోల్చదగ్గ నేత ఎవరూ లేరు

» 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఉత్తరాదికే పరిమితమైన పార్టీ కాదని, దక్షిణాదిలో కూడా లోక్‌సభ ఎన్నికల్లో సీట్లు గతంలో కంటే పెరుగుతాయని ఆ పార్టీ నేత, కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ చెప్పారు. దక్షిణాదిన కూడా మోదీ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడమే ఇందుకు తోడ్పడుతుందన్నారు. ఈసారి బీజేపీ మొత్తంగా 400కుపైగా స్థానాలను సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో అనురాగ్ పలు అంశాలపై స్పందించారు. దేశంలో మీడియా స్వేచ్ఛ క్షీణిస్తున్నదనేది పూర్తి అబద్ధమని పేర్కొన్నారు. మీడియాపై ప్రభుత్వం ఆంక్షలు విధిస్తున్నదని ఆరోపిస్తున్న విదేశీ మీడియా.. ఒక ఎజెండాతో ప్రధానికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కథనాలు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. నిజంగానే ప్రభుత్వ ఆంక్షలు ఉంటే.. ఈ తప్పుడు ప్రచారం చేస్తున్న వారు తమకు ఇష్టం వచ్చినట్లు ఏదైనా ప్రచారం చేసే స్వేచ్ఛ ఉండేది కాదని చెప్పారు. అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ చేయడం ద్వారా ప్రజల కలలను మోదీ నెరవేర్చారన్నారు. ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్‌పై నిషేధం, రామమందిర నిర్మాణం ద్వారా ప్రజలకు తాను చేసిన వాగ్దానాలను బీజేపీ నెరవేర్చిందని గుర్తు చేశారు. ఈ నిర్ణయాల వల్ల మోదీ ప్రభుత్వ జనాదరణతో పాటు విశ్వసనీయత పెరిగిందని చెప్పారు. వీటితోపాటు అభివృద్ధి, సంక్షేమ పథకాల విషయంలో మోదీ గ్యారంటీల ద్వారా తమ భవిష్యత్తు సురక్షిత హస్తాల్లో ఉన్నట్లు ప్రజలు భావిస్తున్నారని అనురాగ్ చెప్పారు.

అత్యంత క్షీణ దశలో కాంగ్రెస్

దేశ విదేశాల్లో మోదీ ప్రతిష్ఠ గతంలో ఎన్నడూ లేనంతగా ఉన్నతంగా ఉన్నదని, ఇప్పటి వరకూ మోదీ జనాదరణతో తులతూగగలిగిన నేత లేరని మంత్రి పేర్కొన్నారు. బీజేపీ.. వారసత్వ ప్రయోజనాల కోసం, కుటుంబాల కోసం పనిచేసే పార్టీ కాదని చెప్పారు. ఆర్జేడీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత బిహార్‌లో ఆటవిక రాజ్యం కొనసాగుతోందని గ్రహించినందువల్లే జేడీయూ నేత నితీశ్ కుమార్ మళ్లీ బీజేపీవైపు వచ్చారని, ఈసారి ఆ రాష్ట్రంలో మొత్తం 40 సీట్లు ఎన్డీఏకే వస్తాయని మంత్రి అంచనా వేశారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయయాత్ర ఒక ప్రహసనమని, ప్రజలకు న్యాయం కోసం మాట్లాడుతున్నామని చెప్పుకొనే కాంగ్రెస్ పార్టీ నుంచి ఎందరో నేతలు.. తమకు న్యాయం జరగడం లేదని వెళ్లిపోతున్నారని ఎద్దేవా చేశారు. ముందు వారికి న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీకి సూచించారు. నెహ్రూ కుటుంబ వారసత్వాన్ని కొనసాగించే ప్రయత్నంలోనే రాహుల్‌గాంధీని భుజానికెత్తుకుంటున్నారని విమర్శించారు. రాహుల్‌ది భారత్ తోడో అన్యాయ యాత్ర అని, దీనివల్ల బీజేపీపై ఎలాంటి ప్రభావం ఉండదని, ఇండియా కూటమే మరింత నష్టపోతుందని అనురాగ్ ఠాకూర్ విశ్లేషించారు. పలు రాష్ట్రాల్లో అధికారం కోల్పోయిన కాంగ్రెస్ ఇప్పుడు అత్యంత క్షీణదశలో ఉన్నదన్నారు.

ఎన్నో విజయాలు సాధించాం

మన్మోహన్ సింగ్ ప్రభుత్వ పదేళ్ల పనితీరుతో పోలిస్తే మోదీ ప్రభుత్వం ఎన్నో విజయాలు సాధించిందని, ప్రపంచంలో 11వ ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడమే ఇందుకు నిదర్శనమని అనురాగ్ చెప్పారు. 2027-28 నాటికి మన దేశం 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడం ఖాయమన్నారు. భారతదేశం ఇప్పుడు ఒక ప్రాంతీయ శక్తి మాత్రమే కాదని, అంతర్జాతీయంగా శక్తివంతమైన దేశాల్లో ఒకటన్నారు. సరిహద్దుల్ని పటిష్ఠంగా మార్చి, సవాళ్లను అత్యంత సమర్థవంతంగా ఎదుర్కొందన్నారు. గత తొమ్మిదేళ్లలో 24.82 కోట్ల మంది భారతీయులు బహుముఖ పేదరికం నుంచి బయటపడ్డారని యూఎన్‌డీపీ, నీతీఆయోగ్ సంయుక్త నివేదిక తెలిపిందని గుర్తు చేశారు.

క్రీడల్లో మంచి ఫలితాలు


తన మంత్రిత్వ శాఖల గురించి అనురాగ్‌ఠాకూర్ మాట్లాడుతూ.. దేశంలో కమ్యూనికేషన్, మీడియా రంగాల్లో మౌలిక సదుపాయాలను పెంచేందుకు ఎన్నో చర్యలు తీసుకున్నామని చెప్పారు. కేంద్ర యువజన క్రీడా వ్యవహారాల శాఖ ఇచ్చిన ప్రోత్సాహం వల్లనే భారత క్రీడాకారులు ఒలింపిక్స్, పారా ఒలిపింక్స్, డెఫ్ ఒలింపిక్స్, కామన్‌వెల్త్, ఆసియన్ క్రీడల్లో మంచి ఫలితాలు సాధించారన్నారు.

జగన్, కవితలపై దర్యాప్తు కొనసాగుతుంది!

ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డిపై సీబీఐ కేసులు నత్తనడకన సాగడానికి, కవితపై మద్యం కేసులో ముందడుగు పడకపోవటానికి కారణమేమిటన్న ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానవిస్తూ.. అవినీతి కేసుల్లో ఉన్నవారిపై దర్యాప్తులు తప్పకుండా కొనసాగుతాయని, జాతి సంపదను కొల్లగొట్టిన వారు వాటిని తిరిగి ప్రజలకు ఇవ్వాల్సిందేనన్నారు. ఈ విషయంలో మోదీ ప్రభుత్వ వైఖరి ఎప్పటికీ మారదని చెప్పారు.

మట్టి పెళ్లల కింద ఏడుగురు సజీవ సమాధి

» ఊటీలో భవన నిర్మాణ పనుల్లో విషాదం
» 13 మంది కార్మికులకు తీవ్రగాయాలు


భవన శిథిలాల కింద మృతదేహం

చెన్నై, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం నీలగిరి జిల్లా ఊటీ సమీపంలోని రాయల్ కేస్ట్ ప్రాంతంలో ప్రైవేట్ భవన నిర్మాణ పనుల సందర్భంగా మట్టిపెళ్లలు విరిగిపడి ఏడుగురు కార్మికులు దుర్మరణం చెందారు. వీరిలో ఆరుగురు మహిళలున్నారు. మరో 13 మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో పలువురి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. రాయల్ కేస్ట్ ప్రాంతంలో గత నెల రోజులుగా భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఉత్తరాది కార్మికులు సహా 30 మంది రోజూ ఈ పనుల్లో పాల్గొంటున్నారు. ఆ మేరకు బుధవారం ఉదయం ప్రొక్లయిన్లతో తవ్వకాలు జరుపుతుండగా అకస్మాత్తుగా పెద్దపెద్ద మట్టి పెళ్లలు, బండ రాళ్లు కార్మికులపై పడ్డాయి. ఈ ఘటనలో రాయల్ కేస్ట్ ప్రాంతానికి చెందిన రాధ (38), భాగ్యం (36), ముత్తులక్ష్మి (36), ఉమ (35), సంగీత (30), షకీలా (30) అనే ఆరుగురు మహిళలు, మాసిలా అనే కార్మికుడు మృతి చెందారు. ఈ ప్రమాదం గురించి తెలియగానే జిల్లా కలెక్టర్ అరుణ, ఊటీ పోలీసులు, అగ్నిమాపక దళ సభ్యులు హుటాహుటిన అక్కడికి చేరుకుని శిథిలాలను తొలగించి ఏడుగురి మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మట్టిపెళ్లల మధ్య చిక్కుకుని తీవ్రగాయాలతో, ఊపిరాడక కొట్టుమిట్టాడుతున్న జయంతి (56), శాంతి (45), థామస్ (24), మహేష్ (23) సహా 13 మంది కార్మికులను అంబులెన్స్‌లలో ఊటీలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నవారిలో కొంతమంది పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ప్రమాదం పట్ల తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబీకులకు రూ.2లక్షలు చొప్పున, గాయపడినవారికి రూ.50 వేలు చొప్పున ఆర్థికసాయం ప్రకటించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న కార్మికులకు మెరుగైన చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ అరుణను ఆయన ఆదేశించారు.

బీజేపీకి వరంగా మహారాష్ట్ర!

» ఎన్సీపీ, శివసేనల ఇంటి పోరుతో బీజేపీకి సీట్లు పెరిగే చాన్స్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: మహారాష్ట్ర రాజకీయ పరిణామాల్లో ఆసక్తిర ఘట్టాలు చోటు చేసుకుంటున్నాయి. వచ్చే ఎన్నికల్లో తమ ఎన్డీయే కూటమి 400 స్థానాల్లో ఘన విజయం దక్కించుకుంటుందని ప్రధాని మోదీ పార్లమెంటు వేదికగా చెప్పిన విషయం తెలిసిందే. ఈ 400 స్థానాల్లో 48 స్థానాలున్న మహారాష్ట్ర అత్యంత కీలకంగా మారనుంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలోని 48 స్థానాల్లో బీజేపీ 23 స్థానాలను కైవసం చేసుకోగా, శివసేన 18 చోట్ల విజయం సాధించింది. కాంగ్రెస్ కేవలం ఒక స్థానానికే పరిమితమైంది. అయితే, చిత్రంగా ఇప్పుడు రెండు కీలక పార్టీలైన ఎన్సీపీ, శివసేనల్లో వేర్వేరు గ్రూపులు ఏర్పడి రాజకీయంగా విడిపోవడం పార్లమెంటు ఎన్నికలకు ముందు ఆసక్తిగా మారింది. రాష్ట్రంలో గట్టిపట్టున్న రాజకీయ ఉద్ధండులు ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్‌ల పార్టీలు రెండుగా విడిపోయాయి. దీంతో వీరు ఇప్పుడు ఒంటరి పక్షులుగా మారిపోయారు. శివసేన పార్టీ శిందే చేతికి, ఎన్సీపీ అజిత్ పవార్ చేతికి వెళ్లిపోయాయి. దీంతో, ఉద్ధవ్, శరద్ పవార్ కొత్త గుర్తులతో పోటీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది లోక్‌సభ ఎన్నికల్లో గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇది బీజేపీకే మేలు చేస్తుందని, మహారాష్ట్రలో బీజేపీ సీట్లు బాగా పెరుగుతాయని అంచనా.

కాంగ్రెస్‌కు బయటి నాయకత్వం కావాలి

» రాహుల్‌గాంధీపై ప్రణబ్ కుమార్తె శర్మిష్ఠ విసుర్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: గాంధీ-నెహ్రూ కుటుంబాన్ని దాటి ఆలోచించాలని.. కాంగ్రెస్ నాయకత్వ బాధ్యతలను బయటి వారికి ఇవ్వాలని మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కుమార్తె, ఆ పార్టీ మాజీ నాయకురాలు శర్మిష్ఠ ముఖర్జీ సూచించారు. పార్టీ ప్రస్తుత సిద్ధాంతాన్ని గట్టిగా ప్రశ్నించారు. ఎన్నికల ముందు శివభక్తుల అవతారమెత్తడమే పార్టీ సిద్ధాంతమా అని అగ్రనేత రాహుల్‌గాంధీ తీరును విమర్శిస్తూ మంగళవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. కాంగ్రెస్ వివిధ పదవులను తన తండ్రికి దానంగా ఇవ్వలేదని.. ఆయన తన కష్టంతో వాటిని సంపాదించుకున్నారని.. వాటిని పొందడానికి అన్ని విధాలా అర్హుడేనని స్పష్టం చేశారు. విపక్షాల 'ఇండియా' కూటమిపైనా శర్మిష్ఠ స్పందించారు. 'దానిని ఇండీ కూటమి అనే పిలవాలి. దేశం పేరును ఏ పార్టీ/కూటమి పెట్టుకోకూడదని అప్పట్లోనే పోస్టు చేశాను' అని తెలిపారు.

ప్రేమ జంటలే లక్ష్యంగా దాడులు

- వారి నుంచి డబ్బు, నగలు, ఫోన్లు దోపిడీ
- ఏడుగురు సభ్యుల ముఠా అరెస్టు.. పరారీలో బాలుడు



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ చందనా దీప్తి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 7: చదువు మానేసి వ్యసనాలకు బానిసైన ఆ యువకులు సులభంగా డబ్బు సంపాదించేందుకు ప్రేమ జంటలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. జాతీయ రహదారి వెంట నిర్మానుష్య ప్రాంతాలకు వచ్చే యువతీయువకులను రహస్యంగా వీడియోలు తీస్తున్నారు. వారిపై దాడికి పాల్పడి.. డబ్బు, నగలు ఏవి ఉంటే అవి దోచుకుంటున్నారు. ఎవరికైనా చెబితే అప్పటికే తీసిన వీడియోలు బయటపెడతామని హెచ్చరిస్తున్నారు. కొన్నాళ్లుగా వీరి ఆగడాలకు ఎన్నో ప్రేమజంటలు బాధితులుగా మారారు. నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో కేసు వివరాలను ఎస్పీ చందనా దీప్తి వెల్లడించారు. నల్లగొండలోని నంద్యాల నర్సింహారెడ్డి కాలనీకి చెందిన కుంచం చందు, కుంచం ప్రశాంత్, కుంచం రాజు ముగ్గురు అన్నదమ్ములు. చదువు మధ్యలో ఆపేసి చిన్న చిన్న పనులు చేసుకునేవారు. కాలనీకి పక్కనే గల కొత్తగూడెంకు చెందిన చింతా నాగరాజు, రాంనగర్‌కు చెందిన అన్నెపూరి లక్ష్మణ్, శివరాత్రి ముఖేష్, మరో మైనర్ బాలుడు వీరికి తోడయ్యారు. వీరంతా వ్యసనాలకు అలవాటుపడి సులభంగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. నార్కెట్‌పల్లి- అద్దంకి బైపాస్ వద్దకు వచ్చే ప్రేమికులు, యువతీయువకులను లక్ష్యంగా ఎంచుకున్నారు. ఏకాంతంగా ఉన్న సమయంలో వారిపై దాడి చేసి వారి వద్ద ఉన్న నగదు, బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లు లాక్కునేవారు. ఫిర్యాదు చేసేందుకు పెద్దగా ముందుకు రాకపోవడంతో రెండు కేసులే నమోదయ్యాయి. నిరుడు డిసెంబరులో పట్టణంలోని నంద్యాల నర్సింహారెడ్డి కాలనీ సమీపంలో యువతి, యువకుడిని బెదిరించి రూ.500 నగదు, అర తులం బంగారు ఉంగరం దోచుకుని సదరు యువకుడిపై దాడి చేశారు. ఈ నెల 1వ తేదీన పానగల్ హైవే పక్కన కారులో వచ్చిన యువతీయువకులని బెదిరించి, దాడి చేసి రూ.700 నగదు, రెండు సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారు. పట్టణంలోని గొల్లగూడ శివారులోని ఓ వెంచర్‌లో గెస్ట్‌హౌస్ తాళం పగలగొట్టి అందులో ఉన్న రెండు టీవీలు, డ్రిల్లింగ్ మిషన్, మూడు ఫ్యాన్లు, ఇన్వర్టర్, హోం థియేటర్‌ను దొంగిలించారు. ఈ ముఠా చేతికి చిక్కి మోసపోయిన ఓ బాధితుడు ఇటీవల ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక టూటౌన్ పోలీసులు నంద్యాల నర్సింహారెడ్డి కాలనీలోని కుంచం చందు ఇంటిపై దాడి చేసి చందుతో పాటు మిగతా ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో మైనర్ బాలుడు పరారీలో ఉన్నాడు. వారి నుంచి నగదు, బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

ఆన్‌లైన్‌లో 'బంగారం' సమర్పణ

- మేడారం జాతర మొక్కుల చెల్లింపునకు ప్రత్యేక సేవ
- ప్రారంభించిన మంత్రి సురేఖ



హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతరకు స్వయంగా రాలేని భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు దేవాదాయ శాఖ ఏర్పాట్లు చేసింది. అమ్మవార్లకు ఆన్‌లైన్‌లో బంగారం(బెల్లం) సమర్పించేందుకు అవకాశం కల్పించింది. ఈ సేవలను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సచివాలయంలో బుధవారం ప్రారంభించారు. మీ సేవ, టీయాప్ పోలియో, పోస్టల్ శాఖల ద్వారా భక్తులు ఈ సేవలను వినియోగించుకోవచ్చు. బుధవారం నుంచి అందుబాటులోకి వచ్చిన ఈ సేవలు మేడారం జాతర వరకు మాత్రమే కాకుండా నిరంతరాయంగా కొనసాగుతాయి. అలాగే అదనపు మొత్తం చెల్లిస్తే కొరియర్‌లో ఇంటికి ప్రసాదం అందుతుంది. మంత్రి సురేఖ.. తన మనవడు కొండా మురళీకృష్ణ పేరు మీద అమ్మవార్లకు బంగారం సమర్పించారు. బాసర జ్ఞాన సరస్వతి ఆలయంలో ఈ నెల 12-14 తేదీల్లో జరగనున్న వసంత పంచమి వేడుకలకు మంత్రి కొండా సురేఖను ఆలయ అధికారులు బుధవారం ఆహ్వానించారు.

హరిత నిధి ద్వారా రూ.69.21 కోట్లు

హరిత నిధి ద్వారా రూ.69.21 కోట్ల విరాళాలు వచ్చాయని అటవీ పర్యావరణం, దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. సచివాలయంలో హరిత నిధి ద్వారా వచ్చిన విరాళాలు, వ్యయంపై మంత్రి ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. హరిత నిధి విరాళాలు, ఖర్చుల వివరాలను అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ఆర్.ఎం. డోబ్రియల్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

త్వరలో వైద్య శాఖలో 10 వేల పోస్టుల భర్తీ

- ఆరోగ్య శ్రీ బీమా పెంపుతో ఏటా 487 కోట్ల భారం: వైద్య శాఖ మంత్రి రాజనర్సింహ

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 7: తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖలో త్వరలోనే 10 వేల పోస్టులు భర్తీ చేస్తామని ఆ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. 2,500 పోస్టుల భర్తీకి ఇప్పటికే ఆర్థికశాఖ నుంచి అనుమతి లభించిందని తెలిపారు. బుధవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో 100 పడకల ఆస్పత్రిని పరిశీలించిన అనంతరం మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు.. రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాజనర్సింహ మాట్లాడారు. వైద్య, ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న ఏడు వేల పోస్టులను గత నెలలో భర్తీ చేశామని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా గతంలో 1,372 రకాల వ్యాధులకు చికిత్స అందించగా.. తమ సర్కారు 1,800 రకాల రోగాలను జాబితాలో చేర్చిందని పేర్కొన్నారు. గతంలో రూ.5 లక్షలుగా ఉన్న రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా పరిమితిని రూ.10లక్షలకు పెంచామని.. దీంతో ఏటా ప్రభుత్వంపై రూ.487కోట్ల అదనపు భారం పడుతుందని చెప్పారు. సూర్యాపేటలో పీజీ కళాశాల పనులను త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. మెడికల్ కళాశాలల్లోని పోస్టులను భర్తీ చేస్తామని చెప్పారు. హుజూర్‌నగర్ ఆస్పత్రికి నిధులు మంజూరు చేస్తామని, అక్కడ ఖాళీగా ఉన్న 35 డాక్టర్ పోస్టులను భర్తీ చేస్తామని వెల్లడించారు. ఏ పనికి ఎన్ని నిధులు కావాలో, ఏ భవనాలు కట్టించాలో నిర్ణయించి, అంచనాలు వేసి ప్రభుత్వానికి వెంటనే నివేదిక పంపించాలని కలెక్టర్ వెంకటరావును ఆదేశించారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పించేందుకు వెంటనే నివేదిక సమర్పించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అధికారులతో అన్నారు. ఆస్పత్రిలో అన్నిరకాల వ్యాధులకు ఉచితంగా మందులను పంపిణీ చేయాలని ఆదేశించారు.

వైద్యశాఖలో డిప్యూటేషన్ల రద్దు

నేటి సాయంత్రంలోపు పోస్టుల్లో రిపోర్టు చేయాలి.. ఇక నుంచి ప్రభుత్వ ఆదేశాల మేరకే డిప్యూటేషన్

- హెల్త్ సెక్రటరీ మెమో..

డీహెచ్ఎం పరిధిలోనే 416 మంది



హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వైద్యశాఖలో అన్ని విభాగాధిపతుల పరిధిలోని వర్క్ ఆర్డర్లు, డిప్యూటేషన్లను రద్దు చేసింది. ఈమేరకు ఆరోగ్య కార్యదర్శి క్రిస్టినా బుధవారం మెమో జారీ చేశారు. ప్రస్తుతం డిప్యూటేషన్స్‌పై ఉన్న వారంతా గురువారం సాయంత్రం ఐదుగంటలలోపు తమ అసలు స్థానంలో రిపోర్టు చేయాలని స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్యశాఖలో విభాగాధిపతులంతా తమ పరిధిలో డిప్యూటేషన్లపై ఉన్నవారి ఆర్డర్లను రద్దు చేయాలని సర్కారు సూచించింది. ఈ నెల 8 తర్వాత వైద్యశాఖలో ఏ ఒక్కరూ కూడా డిప్యూటేషన్లపై పనిజేయకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇక నుంచి ఏ ఉద్యోగినైనా డిప్యూటేషన్‌పై పంపాలంటే సంబంధిత జిల్లా కలెక్టర్ సిఫారసు చేయల్సి ఉంటుందని, అప్పుడే హెచ్‌వోడీలు డిప్యూటేషన్స్ ఇవ్వాల్సివుంటుందని వెల్లడించింది. కాగా డిప్యూటేషన్ రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగానే ఆయా విభాగాధిపతులు డిప్యూటేషన్లపై పనిజేస్తున్నవారి జాబితాను విడుదల చేశారు. ఆ జాబితాలో డిప్యూటేషన్లపై పనిజేస్తున్న కొందరి పేర్లు మిస్ అయ్యాయి. ఉదాహరణకు డీహెచ్ పరిధిలో కొందరు డీఎంహెచ్‌వోలకు జిల్లా స్థాయిలో డిప్యూటేషన్లు ఇచ్చారు. అవి జాబితాలో కనిపించడం లేదు. డీహెచ్ నుంచి ఇచ్చిన వర్క్ ఆర్డర్లలో కూడా కొందరి పేర్లు కనిపించడం లేదు. కాగా ప్రజారోగ్య సంచాలకుల విభాగంలోనే 416 మంది డిప్యూటేషన్లు, వర్క్ ఆర్డర్లపై పనిజేస్తున్నారు. ఇవన్నీ కూడా గత ప్రభుత్వ హయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు తమ వారికి దగ్గరుండి ఇప్పించుకున్నవే. అలాగే 317 జీవో వల్ల కొందరిని సంబంధం లేని జోన్లకు పంపారు. వారంతా గత ప్రభుత్వ హయాంలో ఆందోళన చేయడంతో వారిని డిప్యూటేషన్లపై సొంత జిల్లాల్లో పనిజేసేందుకు అవకాశం కల్పించారు.

సర్కారు తీరుపై ఉద్యోగుల ఆందోళన

హఠాత్తుగా డిప్యూటేషన్ రద్దు చేయడంపై వైద్య ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పిల్లల విద్యా సంవత్సరం మరో రెండు నెలల్లో ముగుస్తుందని, పైగా పరీక్షలు ప్రారంభం కాబోతున్నాయని అంటున్నారు. ఈ తరుణంలో అకస్మాత్తుగా ఉన్నచోటు నుంచి వెళ్లిపోవడం ఇబ్బందికరమని చెబుతున్నారు. అకడమిక్ ఇయర్ ప్రారంభమయ్యే వరకైనా టైమ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పైగా 317 కింద అన్యాయం జరిగిన వారికి డిప్యూటేషన్స్ ఇచ్చి...వారి సొంతజోన్‌లో పనిజేసేందుకు గత సర్కారు అవకాశం కల్పించిందని చెబుతున్నారు. అన్ని రకాల డిప్యూటేషన్స్, వర్క్ ఆర్డర్స్ రద్దు చేయడంపై వైద్య సంఘాలు, అన్ని ట్రేడ్ యూనియన్లు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈమేరకు మంత్రి దామోదర రాజనర్సింహా, ఆరోగ్య కార్యదర్శి క్రిస్టినాకు లేఖలు రాయాలని నిర్ణయించాయి. సర్కారు ఏకపక్ష నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు టీఎన్‌జీవో మెడికల్ అండ్ హెల్త్ సెంట్రల్ ఫోరమ్ అధ్యక్షుడు కిరణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ ప్రభుత్వ మెమోను నిలపాలని కోరారు.

దీర్ఘకాలంగా ఒకే పోస్టుల్లో ఉన్నవారి వివరాలు సేకరణ

వైద్య ఆరోగ్యశాఖలో అయా పోస్టుల్లో కొందరు విభాగాధిపతులు పాతుకుపోయారు. వారి వివరాలను కూడా వెంటనే పంపాలని వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. అటువంటి వారందరికీ స్థానచలనం కల్పించేందుకు సర్కారు సిద్ధమైంది. ఉదాహరణకు నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ విద్యావతి తెలంగాణ ఏర్పాటు నుంచి అదే పోస్టులో కొనసాగుతున్నారు. నర్సింగ్ కౌన్సిల్‌లో అక్రమాలకు పాల్పడ్డారని, నిధుల దుర్వినియోగం చేశారని ఇప్పటికే కొందరు ప్రభుత్వానికి ఫిర్యాదు కూడా చేశారు. ఖమ్మం డీఎంహెచ్‌వో మాలతి, హైదరాబాద్ డీఎంహెచ్‌వో వెంకట్ సుదీర్ఘకాలంగా ఒకేచోట కొనసాగుతున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 10 మంది డీఎంహెచ్‌వో ఏళ్లుగా ఒకేచోట తిష్టవేశారు.



మెరిసిన ఎర్ర బంగారం

- ఖమ్మం మార్కెట్లో మిర్చి క్వింటాలు రూ.22,300
- మార్కెట్‌కు సుమారు 75వేల బస్తాల రాక

ఖమ్మం మార్కెట్, ఫిబ్రవరి 7: ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో వానాకాలం (ఖరీఫ్) సీజన్ తేజా మిర్చికి డిమాండ్ పెరుగుతోంది. మార్కెట్‌లో బుధవారం క్వింటాలు తేజా రకం మిర్చికి రూ.22,300 జెండా పాట ధర నిర్ణయించగా నాణ్యతను బట్టి కనిష్ఠంగా క్వింటాలుకు రూ.14,000, నమూనా రకాలను గరిష్ఠంగా క్వింటాలుకు రూ.21,000 వెచ్చించి వ్యాపారులు కొనుగోలు చేశారు.మిర్చిని కొంత కాలంగా క్వింటాలు రూ.20,000 నుంచి రూ.21,500 వెచ్చించి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు రెండు, మూడు రోజుల వ్యవధిలోనే క్వింటాలుకు రూ.800 నుంచి రూ.1,000 అదనంగా ధర పెట్టి కొనుగోలు చేయడం విశేషం. కొత్త మిర్చికి ఈ మార్కెట్‌లో అత్యధిక ధరలు పలకడం ఈ సీజన్‌లో ఇదే తొలి సారి. ఈ సంవత్సరం తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గడంతో క్వింటాలుకు రూ.25,000లకు తగ్గకుండా ధర ఉంటేనే గిట్టుబాటవుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గత పదేళ్లలో పూలే విగ్రహాన్ని పెట్టలేదెందుకు?

- ఎమ్మెల్సీ కవితను ప్రశ్నించిన మల్లు రవి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బీసీ జనగణనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే విధి విధానాలను నిర్ణయిస్తుందని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి అన్నారు. కులగణన నిర్వహణ కోసం కర్ణాటక, బిహార్‌కు అధికారులను పంపిస్తామన్నారు. కేబినెట్, సీఎం వేలో కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయం పాటించిందన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను తగ్గించి బీసీలను అణగదొక్కిందని ఆరోపించారు. ఎమ్మెల్సీ కవిత ఇప్పుడు అసెంబ్లీలో పూలే విగ్రహం పెట్టాలని అంటున్నారని... గత పదేళ్ల పాటు అధికారంలో ఉన్న వారు పూలే విగ్రహాన్ని పెట్టలేదెందుకని ప్రశ్నించారు. రాజకీయాల కోసమే తప్ప బీసీలపై కవితకు ప్రేమ లేదని అన్నారు. కాంగ్రెస్‌ను బద్నాం చేయాలనే ఏకైక ఉద్దేశ్యంతోనే కవిత పనిచేస్తోందని మల్లు రవి విమర్శించారు. పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టేవరకూ తమ ఉద్యమం ఆగదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్. కృష్ణయ్య అన్నారు. దేశవ్యాప్తంగా కులగణన జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు.

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి

అంబేడ్కర్‌పై, ఆయన రాసిన రాజ్యాంగంపై ఏమాత్రం గౌరవం ఉన్నా కరెన్సీ నోట్లపై ఆయన ఫొటో ముద్రించాలని కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరుశురామ్.. కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జంతర్ మంతర్ వద్ద సమితి ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పరుశురామ్ మాట్లాడారు. ఇందుకు సంబంధించి పార్లమెంటులో బిల్లు పెట్టాలని లేదంటే పార్లమెంటును ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాకు ఆర్ కృష్ణయ్య, మల్లు రవి, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, ఆళ్ల రామకృష్ణ తదితరులు హాజరై సంఘీభావం తెలిపారు.

శ్రీశైలం వెళ్లొచ్చిన బిహార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

11వ తేదీ దాకా 'సిరి నేచర్ వ్యాలీ'లోనే క్యాంపు

మంచాల, దోమలపెంట, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): బిహార్ రాజకీయ సంక్షోభం నేపథ్యంలో ఆ రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేల క్యాంపు హైదరాబాద్‌లో కొనసాగుతోంది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని కాగజ్‌గట్‌లోని 'సిరి నేచర్ వ్యాలీ' రిసార్ట్‌లో వీరంతా ఉంటున్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత మల్‌రెడ్డి రంగారెడ్డి క్యాంపును పర్యవేక్షిస్తున్నారు. క్యాంపులో ఉన్న బిహార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా మంగళవారం శ్రీశైలం వెళ్లి బుధవారం తిరిగి రిసార్టుకు చేరుకున్నారు. ఈ క్రమంలో నాగర్‌కర్నూలు జిల్లాలో ఉన్న శ్రీశైలం ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో వచ్చిన 17 మంది బిహార్ ఎమ్మెల్యేల బృందానికి జెన్‌కో సీఈ సూర్యనారాయణ జలవిద్యుత్ కేంద్రం పనితీరును వివరించారు. కాగా, సీఎం నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీయూ-బీజేపీ సంకీర్ణ ప్రభుత్వ బల నిరూపణ పరీక్ష ఈ నెల 12న జరగనుంది. దీంతో 11 దాకా ఎమ్మెల్యేలంతా ఇక్కడే ఉండనున్నారు. బిహార్ ఎమ్మెల్యేల క్యాంపును తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 9 లేదా 10వ తేదీల్లో సందర్శిస్తారని విశ్వసనీయ సమాచారం. నాగార్జునసాగర్ రహదారి నుంచి రిసార్టు వరకు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న రహదారి విస్తరణ పనులు ప్రస్తుతం నిరంతరాయంగా జరుగుతుండడం ఈ ప్రచారానికి బలం చేకూరుస్తుంది.

దాడులను ఉపేక్షించేది లేదు!

- గాయపడిన ఆర్టీసీ ఉద్యోగులను పరామర్శించిన సజ్జనార్

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై దాడులకు పాల్పడితే సహించేది లేదని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ హెచ్చరించారు. దాడులకు పాల్పడేవారు ఎంతటి వారైనా కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 4న ట్యాంక్‌బండ్‌పై ఆకతాయిల దాడిలో తీవ్రంగా గాయపడి తార్నాక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డ్రైవర్ షేక్ అబ్దుల్, కండక్టర్ రమేష్‌లను సజ్జనార్ బుధవారం పరామర్శించారు. దాడికి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. తమ సిబ్బంది ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసి, మనోవేదనకు గురి చేసే ఇలాంటి దాడులను ఇక నుంచి సహించేది లేదని హెచ్చరించారు. దాడి చేసిన వారిని పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు.

ముదిమాణిక్యం.. ఓ చారిత్రక వైభవం

కృష్ణాతీరంలో క్రీ.శ. 1635 నాటి దీపస్తంభ శాసనం.. వెలుగులోకి తెచ్చిన పురావస్తు శాఖ

- నల్లగొండ జిల్లాలో గుర్తింపు





పురావస్తు శాఖ గుర్తించిన దీపస్తంభ శాసనంపై తమిళ, తెలుగు పదాలతో కూడిన వివరాలు

నల్లగొండ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): చారిత్రక గోల్కొండ కోట నుంచి 210 కి.మీ. దూరంలో ఉన్న కృష్ణాతీరంలోని ముదిమాణిక్యం ప్రాంతం క్రీ.శ 1635లో నదీతీర పట్టణంగా విలసిల్లింది. పురావస్తు శాఖ తాజాగా కృష్ణానది తీరం వెంట జరిపిన పరిశోధనల్లో దీపస్తంభ శాసనాన్ని గుర్తించారు. ఆ వివరాలను ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా(ఏఎస్ఐ ఎపిగ్రఫీ) డైరెక్టర్ మునిరత్నంరెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలంలో కృష్ణాతీర గ్రామమైన ముదిమాణిక్యంలో నది వెంట ఉన్న పురాతన శివాలయం పక్కన 20 అడుగుల దీపస్తంభాన్ని పురావస్తు శాఖ అధికారులు గుర్తించారు. ఈ స్తంభం ఉత్తరాభిముఖంగా ఉండడంతోపాటు, దాని పైన దీపాలు వెలిగించే నిర్మాణాన్ని గుర్తించారు. శకనామ సంవత్సరం 1557 యువ, ఆషాడ శుద్ధ శుక్రవారం 11వ రోజు ఈ శాసనాన్ని ఆవిష్కరించినట్లు దానిపై పేర్కొన్నారు. దీనికి సరైన సంవత్సరం, తేదీ క్రీ.శ 1635 జూన్ 1వ తేదీగా పురావస్తు శాఖ పేర్కొంది. తెలుగు, తమిళ పదాలు కలిపి శాసనంపై రాశారు. శాసనంలో కాశీవిశ్వనాథుడిని ప్రార్థిస్తున్న 23 పదాల పద్యాన్ని కనుగొన్నారు. ఈ శాసనాన్ని అప్పట్లో నదీతీర పట్టణంగా విలసిల్లిన ముదిమాణిక్యాన్ని పాలించిన వాలి మునులయ్య కుమారుడు పోలినేడు వేయించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం చిన్న కుగ్రామంగా ఉన్న ఈ కృష్ణాతీర గ్రామం ఒకప్పుడు పట్టణంగా విలసిల్లిందని, దీపస్తంభం ఇక్కడి నుంచి పడవల ద్వారా సరకు రవాణా జరిగిందనేందుకు రుజువని వివరించారు. వ్యాపారులు, పడవల నిర్వాహకులకు ఈ దీపస్తంభంపై దీపం దిక్సూచిగా ఉండేదని పేర్కొన్నారు. డాక్టర్ ఎంఏ శ్రీనివాసన్ మాట్లాడుతూ పొడవైన దీపస్తంభం సాధారణంగా నది ఒడ్డున కనిపించదని, కృష్ణానది తీరంలో అరుదైన దీన్ని గుర్తించామన్నారు. ఇదే స్థలంలో మధ్యయుగం నాటి ఆధారాలను గుర్తించామని, వాటి వివరాలను బయటకు తెస్తామన్నారు. అన్వేషణలో పాల్గొన్న అశోక్‌కుమార్ మాట్లాడుతూ బాదామి చాళుక్యులకు సంబంధించిన ఇతర శాసనాలను కనుగొన్నామని, అనుముల మండలం పేరూరు సమీపంలో 19 శాసనాలను గుర్తించామన్నారు.

వాస్తవాలు దాచి 'స్టేటస్ కో' పొందినందుకు రూ.లక్ష జరిమానా!

- టీఎస్ఎస్‌పీడీసీఎల్ భూవ్యవహారంలో పిటిషనర్లకు విధించిన హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని అంబర్‌పేట్‌లో టీఎస్ఎస్‌పీడీసీఎల్‌కు కేటాయించిన స్థలం తమదేనంటూ తప్పుడు వివరాలతో స్టేటస్ కో పొందినందుకు నలుగురు పిటిషనర్లకు హైకోర్టు తాజాగా భారీ జరిమానా విధించింది. తప్పుడు స్టేట్‌మెంట్లు, వాస్తవాలు దాచి గతంలో స్టేటస్ కో ఆదేశాలు పొందడమే కాకుండా.. తదుపరి కోర్టు ప్రొసీడింగ్స్‌లో స్పందించనందుకు రూ.లక్ష జరిమానా విధిస్తూ వారి పిటిషన్‌ను కొట్టేసింది. అంబర్‌పేట్ రెవెన్యూ సర్వే నంబర్ 57లోని 2,432 చదరపు గజాల స్థలంపై తమకు పట్టా ఉందని.. ఆ భూముల్లో టీఎస్ఎస్‌పీడీసీఎల్ జోక్యాన్ని అడ్డుకోవాలని ఆర్.మల్లేశం, జగన్, వెంకటేశ్, చంద్రశేఖర్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా టీఎస్ఎస్‌పీడీసీఎల్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 2013లోనే హైదరాబాద్ కలెక్టర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం 300గజాల స్థలం తమకు కేటాయించారని చెప్పారు. అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన ధర్మాసనం.. వివాదంలో ఉన్న స్థలంపై టైటిల్ క్లెయిం చేస్తూ పిటిషనర్లు 2007లో హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో సూట్ దాఖలు చేశారని.. 11 ఏళ్లపాటు వివాదాన్ని కొనసాగించి.. దానిని ఉపసంహరించుకున్నారని తెలిపింది. వాస్తవాలు దాచిపెట్టి.. కోర్టును తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నించారని పేర్కొంది.

అటవీ భూముల్లో బీఆర్ఎస్ కౌన్సిలర్ అక్రమ కట్టడాల కూల్చివేత

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో ఘటన

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 7: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు అటవీ భూముల్లో.. ఇల్లెందు మున్సిపాలిటీ 21వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ కొండపల్లి సరిత, ఆమె భర్తకు చెందిన అక్రమ కట్టడాలను ఫారెస్ట్ అధికారులు ధ్వంసం చేశారు. మున్సిపాలిటీ చైర్మన్ వెంకటేశ్వరరావుపై బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం పెట్టిన రోజుల వ్యవధిలోనే అక్రమ నిర్మాణాల కూల్చివేత వ్యవహారం రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఇల్లెందు మండలం రాజీవ్‌నగర్‌తండాలో సరిత, ఆమె భర్తకు చెందిన కోళ్ల ఫారాలను, ఇతర షెడ్లను కూల్చేందుకు పోలీసు, ఫారెస్ట్ సిబ్బంది మంగళవారమే ప్రయత్నించారు. స్థానిక రైతులు, సరిత కుటుంబ సభ్యులు అడ్డుకోవడంతో వెనుదిరిగి వెళ్లారు. బుధవారం తెల్లవారుజామున ఫారెస్ట్ డివిజన్ అధికారి(ఎఫ్‌డీఓ) కర్నావత్ వెంకన్న, తహసీల్దార్ రవికుమార్, సీఐ కరుణాకర్, రేంజర్ నాగేశ్వరావు ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. విషయం తెలుసుకున్న ఇతర బీఆర్ఎస్ కౌన్సిలర్లు, మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అక్కడకు చేరుకొని అధికారులతో వాగ్వాదానికి దిగారు. అయితే, అటవీ భూముల్లో అక్రమ కట్టడాలు ఉన్నాయని, వాటిని ఖాళీ చేయాలని గతంలో నోటీసులు అందించామని ఎఫ్‌డీవో కర్నావత్ వెంకన్న తెలిపారు. నోటీసులకు స్పందించకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్రమ కట్టడాలను తొలగిస్తున్నట్లు వివరించారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. మావోయిస్టు మృతి

దుమ్ముగూడెం ఫిబ్రవరి 7: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లాలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ మావోయిస్టు మృతిచెందాడు. సుక్మా-దంతెవాడ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో పెద్దసంఖ్యలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో డీఆర్జీ, బస్తర్ ఫైటర్స్, సీఆర్‌పీఎఫ్ బలగాలు కూంబింగ్ ప్రారంభించాయి. ఈక్రమంలో గొందపల్లి, పర్లగట్టు, బడెపల్లి అటవీ ప్రాంతంలో పోలీసు, మావోయిస్టు బలగాల నడుమ ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో దక్షిణ బస్తర్ డివిజన్ జేగురుగొండ ఏరియా కమిటీ సభ్యుడు చంద్రన్న అలియాస్ సత్యం మృతిచెందాడు. అతడిపై రూ.8 లక్షల రివార్డు ఉంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చిన్న ఎన్నిక–పెద్ద కుట్ర

ప్రజాస్వామ్యాన్ని హత్యచేశారు, అపహాస్యం చేశారు అంటూ సుప్రీంకోర్టు చండీగఢ్ మేయర్ ఎన్నికల వ్యవహారంలో తీవ్రంగా విరుచుకుపడినందుకు చాలామందికి సంతోషం కలిగింది. దేశంలో ఈ తరహా హత్యలు, ఇంకా పెద్దపెద్దవే అనేకం జరుగుతున్నకాలంలో, ఒక చిన్న ఎన్నికను కూడా సుప్రీంకోర్టు ఇంత తీవ్రంగా తీసుకొని, కఠినంగా మాట్లాడినందుకు, ప్రజాస్వామ్య పరిరక్షణకు నడుంకట్టినందుకు మెచ్చుకోవాల్సిందే. పాలకపక్షం తన అధికారాలను దుర్వినియోగం చేస్తున్నప్పుడూ, పార్టీలను చీల్చి రాష్ట్రాల్లో అధికారంలోకి వస్తున్నప్పుడూ విపక్షాలు వాడే పదజాలం ఇప్పుడు సుప్రీంకోర్టు నోటినుంచి రావడం కూడా ఓ విశేషం.

ఈ దేశంలో ప్రజాస్వామ్యం ఏ స్థితిలో ఉన్నదో చండీగఢ్ ఉదంతం చెబుతోందని చాలామంది వాపోతున్నారు. ఎన్నికల ప్రక్రియ ఎలా జరిగిందో తెలియచెప్పే వీడియోలు న్యాయమూర్తుల కళ్ళముందే ఉన్నందున వారికి కూడా అలాగే అనిపించి ఉంటుంది. ఆ వీడియోల్లో పోలింగ్ పెద్దగా వ్యవహరించిన బీజేపీ మైనారిటీ విభాగానికి చెందిన నామినేటెడ్ కౌన్సిలర్ అనిల్ మాసి బ్యాలెట్ పత్రాల మీద తన రాతకోతలతో కొన్ని ఓట్లను చెల్లకుండా చేసి, ఫలితాన్ని తన పార్టీకి అనుగుణంగా మార్చుకోవడం కనిపించింది. ఓటును పనికిరాకుండా చేయడానికి ఉన్న మూడుమార్గాలను వినియోగించుకొని, కాంగ్రెస్ కౌన్సిలర్ల ఎనిమిది ఓట్లను రద్దుచేసి, చెల్లిన ఓట్లలో ఆమ్ ఆద్మీ పార్టీ మేయర్ అభ్యర్థికంటే బీజేపీ అభ్యర్థికి నాలుగు ఓట్లు ఎక్కువ వచ్చాయని నిర్ధారించాడాయన. ఒక విధంగా ఇది పట్టపగలు, నడిబొడ్డున, అందరూ చూస్తుండగా జరిగిన హత్యలాంటిది. అమాయకత్వమో, భయమో తెలియదు కానీ, ఆయన ఈ తప్పుచేస్తూ కెమెరావైపు చూస్తుండటం కూడా పాపాన్ని సులువుగా పట్టిచ్చింది.

ఇదేమీ అప్పటికప్పుడు జరిగిన కుట్ర కాదు. తిమ్మినిబమ్మిని చేసి అయినా సరే మేయర్ స్థానాన్ని కైవసం చేసుకోవాలన్న ప్రయత్నాలు ముందే ఆరంభమైనాయి. జనవరి 18న జరగాల్సిన ఈ ప్రక్రియను ఆఖరునిముషంలో, అనిల్ మాసి అనారోగ్యం పేరిట ఫిబ్రవరి 6కు వాయిదావేయడంతో, ఆప్ అభ్యర్థి పంజాబ్–హర్యానా హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు జోక్యంతో అది ముందుకు జరిగి జనవరి 30న పూర్తయింది. ఆప్–కాంగ్రెస్ ఉమ్మడి బలం ఇరవై కనుక, మేయర్ స్థానం అతి సులభంగా ఆ పక్షానికే దక్కాలి. కానీ, ఈ బ్యాలెట్ల రద్దు తరువాత, కేవలం 16 ఓట్లు వచ్చిన బీజేపీ అభ్యర్థి విజేత కాగలిగాడు. ఇది ఆఖరినిముషంలో జరిగిన మరో కుట్ర అని అనుమానం వచ్చిన ఆప్–కాంగ్రెస్ కౌన్సిలర్లు రద్దయిన ఓట్లను తమకు చూపించాలని ప్రిసైడింగ్ అధికారిని డిమాండ్ చేసినా ఆయన అంగీకరించలేదు. దీనితో, బీజేపీ అభ్యర్థికి ఆ పార్టీ కౌన్సిలర్ల ఓట్లన్నీ పూర్తిగా పడి, ఆప్ అభ్యర్థికి పడాల్సినవన్నీ ఎందుకు పడలేదో ఎవరికీ తెలియకుండా పోయింది. ముప్పైఐదుమంది కౌన్సిలర్లు, ఒక పార్లమెంటు సభ్యుడు చేతులు ఎత్తి ఈ ప్రక్రియను సులువుగా పూర్తిచేయవచ్చు. కానీ, రహస్యబ్యాలెట్ ప్రవేశపెట్టడం ద్వారా క్రాస్ ఓటింగ్‌కు అవకాశం ఇవ్వాలన్న ఆలోచన కూడా ఉండివుంటుంది. అది సాగకపోవడంతో బ్యాలెట్లనే భ్రష్టుపట్టించాలన్న కుట్ర జరిగివుంటుంది. ఎన్నిక వాయిదాను నిలువరించి, దానిని ముందుకు జరిపిన హైకోర్టు, ఈ కీలక పరిణామం తరువాత, అన్యాయం జరిగిన ఆప్ అభ్యర్థికి తలుపులు మూసివేయడం విచిత్రం. ఈ కారణంగానే, తగిన సమయంలో సరైన ఉత్తర్వులు జారీచేయాల్సిన హైకోర్టు అందులో విఫలమైందని సుప్రీంకోర్టు ఓ మాట అనక తప్పలేదు.

సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహాలు, ఆదేశాలు అటుంచితే, ఆప్–కాంగ్రెస్ ఒక్కటిగా తెరమీదకు వచ్చిన ఈ తొలి ఎన్నికను చావుదెబ్బతీయడం బీజేపీ అంతిమలక్ష్యం కావచ్చు. అధికారం కంటే, ఆ రెండుపార్టీల కలయికతో సాధించిన విజయం, అది దేశవ్యాప్తంగా అందించే సందేశం మరింత ప్రమాదకరమైనవని దానికి అనిపించివుండవచ్చు. నిస్సిగ్గుగా, నిర్లజ్జగా సాగిన ఈ వ్యవహారం ఒక చిన్న మునిసిపల్ కార్పొరేషన్‌కు పరిమితం కాదనీ, అది ప్రజాస్వామ్యం మనుగడనే ప్రశ్నిస్తోందని సుప్రీంకోర్టుకు సైతం అనిపించింది. సార్వత్రిక ఎన్నికల్లో నెగ్గి మూడోసారి అధికారంలోకి రావాలని, రాగలనని అనుకుంటున్న ఒక పెద్దపార్టీ, ఒక చిన్న ఎన్నిక విషయంలో ఈ విధంగా వ్యవహరించడం దానికి తీవ్ర అప్రదిష్ట తెస్తుంది. మేయర్ ఎన్నికలోనే ఇంత కుట్రచేసినవారు పెద్ద పెద్ద ఎన్నికల్లో పెద్దరికంతో వ్యవహరిస్తారా అని ప్రజలకు అనిపిస్తే అది ఓ పార్టీకే కాదు, యావత్ ఎన్నికల ప్రక్రియకు, ప్రజాస్వామ్యానికీ ప్రమాదకరం.

దేశ సమగ్రత కోసమే కులగణన

‘కుల గణన విదేశీశక్తుల ఎజెండా!?’ శీర్షికన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ డీజీపీ డా. కె. అరవింద రావు ఆంధ్రజ్యోతిలో రాసిన వ్యాసంలో (04.02.2024) కులగణన వల్ల భారతదేశంలో విదేశీ శక్తులు బలపడతాయన్న వాదన చేశారు. ఆయన కులగణనకు వ్యతిరేకంగా సైద్ధాంతిక, రాజకీయ అంశాలను ప్రస్తావించారు. ఈ అంశాలను లోతుగా ఆలోచిస్తే ఏది నిజం ఏది అబద్ధం అనే విషయం బయటకు వస్తుంది.

అరవింద రావు తన వ్యాసంలో ఇటలీ మార్క్సిస్ట్ స్కాలర్ ఆంటోనియో గ్రామ్సి కల్చరల్ హెజిమొని (Cultural Hegemony) అంశాన్ని ప్రస్తావిస్తూ అమెరికా దేశంలో ఉన్న నల్లజాతీయులు, యూదులు, ముస్లిం దేశాల వలసదారులు, స్వలింగ సంపర్కుల వల్ల అక్కడున్న సంస్కృతి దెబ్బతింటున్నదని, జర్మనీ నుంచి వలస వెళ్ళిన మార్క్సిస్ట్ విద్యార్థులు, ప్రొఫెసర్లు అమెరికన్ విశ్వవిద్యాలయాల్లో పాతుకుపోయి అక్కడి సంస్కృతిని నాశనం చేశారని వాపోయారు. బహుశా అమెరికా చరిత్ర తెలియక ఆయన ఇలా రాశారు. అక్కడి నేటివ్ రెడ్ ఇండియన్స్‌ని ఊచకోత కోసి అమెరికా ఎదిగింది. తర్వాతి కాలంలో అమెరికాలో అమల్లోకి వచ్చిన ఉదార విధానాల వల్ల అక్కడకు వివిధ దేశాల నుంచి ప్రజలు వచ్చి స్థిరపడటం, అందువల్ల అక్కడ వైవిధ్యం పెరగడం, ఆర్థికంగా పురోగతి సాధించడం అందరికీ తెలిసిన విషయమే. అమెరికాకు ఒక నల్ల జాతీయుడు అధ్యక్షుడు అయ్యాడు, భవిష్యత్తులో భారతీయ మూలాలు ఉన్న వ్యక్తి కూడా అధ్యక్షుడు కావచ్చు. ఇవన్నీ సాధ్యమయ్యేది అక్కడ నల్లజాతివారి మీద జరిగే వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన మార్టిన్ లూథర్ కింగ్ లాంటి వారి వల్లనే. అమెరికాలో కేవలం అమెరికా వాళ్ళే ఉండాలి అని, వాళ్ల సంస్కృతిని మాత్రమే పాటించాలని అంటే అక్కడికి ఎవరు వెళ్లేవారు కారు, అక్కడ అంత అభివృద్ధి కూడా జరిగేది కాదు.

అప్పటివరకు సమాజంలోని అసమానతలను ఆర్థిక, రాజకీయ కోణాల్లోంచి మాత్రమే చూసిన మార్క్సిస్ట్ సిద్ధాంతం ప్రజల్లోకి ఎందుకు వెళ్లలేదని విశ్లేషించే తరుణంలో ఆంటోనియో గ్రామ్సి సంస్కృతి అనే అంశం ప్రాముఖ్యతను నొక్కి చెప్పాడు. ఆధిపత్య వర్గాలు తమ ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు ఏ ప్రాధాన్యతలు పనికి వస్తాయో వాటినే అందరి ప్రాధాన్యతలుగా సంస్కృతి ద్వారా చిత్రీకరించే ప్రయత్నం చేస్తాయని గ్రామ్సీ చెప్పారు. ఈ విషయాన్ని తదుపరి సామాజికవేత్తలు శాస్త్రీయ పద్ధతిలో చేసిన అధ్యయనాల ద్వారా ఆధారాలతో సహా ధ్రువీకరించారు.

ఆంటోనియో గ్రామ్సీ చేసిన సామాజిక విశ్లేషణలో ఇంకొక ముఖ్య అంశం ఆర్గానిక్ ఇంటలెక్చువల్ అనే కాన్సెప్ట్. ఇది ఏం చెప్తుందంటే– ప్రతి వర్గమూ తమ ప్రాధాన్యతలను పెంపొందించుకొనే క్రమంలో తమ వర్గపు మేధావులతో ప్రజలను జయించే ప్రయత్నం చేస్తుంది. కులాన్ని రూపుమాపేందుకు పీడిత వర్గాల మేధావులు కృషి చేస్తుంటే కుల వ్యవస్థ వల్ల బాగుపడుతున్న అగ్రవర్ణాల మేధావులు కొందరు కులం లేదన్న అబద్ధం తరఫున వాదిస్తున్నారు.

డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ‘శూద్రులు ఎవరు’ అనే రచనలో దేశవ్యాప్తంగా చేస్తున్న సెన్సెస్‌లో శూద్రులు ఎందరో తెలియాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అంబేడ్కర్ తన మంత్రి పదవికి రాజీనామా చేయడంలో ప్రధానంగా బీసీలకు రిజర్వేషన్ కల్పించకపోవడమనే అంశాన్ని పేర్కొన్నారు. ఆ తర్వాత బీపీ మండల్ అధ్యక్షతన రెండో వెనుకబడిన తరగతుల కమిషన్ శాస్త్రీయంగా దేశవ్యాప్తంగా పర్యటించి ఆధారాలతో 1931 కుల గణన లెక్కల ఆధారంగా సామాజికంగా, విద్యాపరంగా వెనకబడిన ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని సిఫారసులు చేసింది. కానీ సిఫారసులను పదేళ్లపాటు అమలు చేయలేదు. వి.పి.సింగ్ ప్రభుత్వం అమలు చేసింది. ఇది సామాజిక న్యాయం కోసమే కానీ అద్వానీ చేసే రథయాత్రకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం కాదు.

కుల వ్యవస్థలోని అసమానతల రూపురేఖలను, మూల కారణాలను తెలుసుకొనే పలు శాస్త్రీయ ప్రయత్నాలలో కులగణన ఒకటి. శాస్త్రీయ పద్ధతులను అనుసరించి సమాజాన్ని చదువుతున్న సామాజిక వ్యక్తులను కల్చరల్ మార్క్సిస్టులని, ఆటంకవాదులనీ, భారతదేశాన్ని ముక్కలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని నిరాధారాలతో అపవాదులు అంటగట్టి వాదించడం మనువాద శక్తులకు మామూలైపోయింది. ఎందుకంటే కుల వ్యవస్థ నుంచి అత్యధికంగా లాభపడుతున్నది అగ్రవర్ణాలేనని అందులోని మనువాద శక్తులకు బాగా తెలుసు. అందుకనే వాళ్లు కుల వ్యవస్థను, కులగణనను తోసిపుచ్చే యత్నాలు చేస్తున్నారు. ఈ పోస్ట్ ట్రూత్ (Post–Truth) యుగంలో అబద్ధాన్ని పదేపదే చెప్పి నిజం చేసే ప్రయత్నాలు ట్రంప్‌ని మొదలుకొని చాలామంది ఫాసిస్టులు చేశారు. ఈ డాక్టర్ కరణం అరవింద్ కూడా ఆ కోవకు చెందిన వారే. ఒకవేళ వారు చేసేది నిజమని వారు నమ్మితే



శాస్త్రీయ పద్ధతులను అనుసరించి సమాజాన్ని చదువుతున్న సామాజిక వ్యక్తులను కల్చరల్ మార్క్సిస్టులని, ఆటంకవాదులనీ, భారతదేశాన్ని ముక్కలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని నిరాధారాలతో అపవాదులు అంటగట్టి వాదించడం మనువాద శక్తులకు మామూలైపోయింది. ఎందుకంటే కుల వ్యవస్థ నుంచి అత్యధికంగా లాభపడుతున్నది అగ్రవర్ణాలేనని అందులోని మనువాద శక్తులకు బాగా తెలుసు.

ఫీల్డ్ వర్క్ ఆధారంగా, సర్వే డేటా ఆధారంగా నిరూపించాలని సవాలు చేస్తున్నాం.

కుల గణన వల్ల దేశంలో ఏయే కులాలు ఎంత శాతం ఉన్నాయో, ఆయా కులాల్లో పేదరికం ఎంతో, సంపద ఎంతో తెలుస్తుంది. దీని వలన ఏ కులాన్ని ఏ విధంగా అభివృద్ధి చెయ్యాలో చట్టాలు చేసుకునే వీలు కలుగుతుంది. కుల గణన వలన దేశం ముక్కలవుతుంది అంటున్నారు. అసలు కులం వలనే దేశం ముక్కలు అవుతుంది. కులం ఉన్నంత కాలం కుల కుంపట్లు రాజుకుంటూనే ఉంటాయి. కులం ఉన్నంత వరకు భారతదేశం ఎప్పటికీ ఒక జాతి కాలేదు. కులనిర్మూలన అనేది కేవలం సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాలతోనే సాధ్యం. అందులో మొదటి మెట్టు ఈ కుల గణన. ‘కుల గణన వద్దు’ అనే వారు అమాయకత్వంతో ఆ మాట అనటం లేదు. సబ్బండ వర్ణాల వారికి తమ జనాభా ఎంతో, తమకి దేశ సంపదలో రావల్సిన వాటా ఎంతో తెలియకుండా ఉండడానికే, అగ్ర కుల ఆధిపత్యాన్ని కొనసాగేలా చెయ్యటానికే వారు ఈ వాదన చేస్తున్నారు.


■ జి. కిరణ్ కుమార్
జాతీయ అధ్యక్షుడు,
ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్

అత్యున్నత గౌరవం వెనుక అంతరార్థం ఏమిటి?

సాక్షాత్తూ ప్రధానమంత్రే పార్లమెంటులో అసత్యాలూ అర్ధసత్యాలూ పాపుసత్యాలూ చెప్పకూడదు కదా? బుధవారం నాడు రాజ్యసభలో అరివీరభయంకరంగా మాట్లాడుతూ, తమ ప్రభుత్వం వస్తే కానీ బాబాసాహెబ్ అంబేడ్కర్‌కు భారతరత్న గౌరవం దక్కలేదని నరేంద్రమోదీ అన్నారు. కాంగ్రెస్ వాళ్లు ఎప్పుడూ తమ కుటుంబం వారికే భారతరత్నలు ఇచ్చారన్నారు. కాంగ్రెస్ ప్రాధాన్యాల గురించి చర్చించవచ్చు, తప్పులేదు. కానీ, అంబేడ్కర్‌కు అత్యున్నత పౌరగౌరవ ప్రదానాన్ని తమ ఖాతాలో వేసుకోవడమే విచిత్రం. 1990 మార్చి 31 నాడు అంబేడ్కర్‌కు మరణానంతరం భారతరత్న ప్రకటించారు. అప్పుడు కేంద్రంలో విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ నాయకత్వంలోని నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఆ ప్రభుత్వానికి బీజేపీ వెలుపలినుంచి మద్దతు ఇచ్చిన మాట నిజమే కానీ, ప్రభుత్వ నిర్ణయంలో వారి పాత్ర ఉందని ఎట్లా చెప్పగలం? ప్రధానిగా విపిసింగ్ సామాజిక న్యాయం గురించి పట్టింపుగా ఉన్నారు. భారతరత్నతో పాటు, పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో అంబేడ్కర్ చిత్రపటావిష్కరణ కూడా ఆ వెనువెంటనే జరిగింది. ఇందుకు దేశంలో ఆనాడు వస్తూ ఉండిన మార్పులే కారణం. దేశవ్యాప్తంగా దళిత చైతన్యం పెరుగుతున్నది, కాన్షీరామ్ ప్రభావం విస్తరిస్తున్నది. ఈ నేపథ్య కారణాలు కాదని, అప్పటికే రామజన్మభూమిలో తలమునకలై ఉన్న బీజేపీ, అంబేడ్కర్ పేరును ప్రతిపాదించిదని ఎట్లా చెప్పగలం? కాకపోతే, మండల్ నిర్ణయాన్ని వ్యతిరేకించినట్టు, అంబేడ్కర్‌కు భారతరత్నను బీజేపీ వ్యతిరేకించలేదు, అంతవరకు ఆ కీర్తిలో వాటా ఇవ్వవచ్చు.

నిజంగా విపిసింగ్ భారతరత్న నిర్ణయాలలో తన ప్రమేయం ఉంటే, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌కు ఇమ్మని బీజేపీ చెప్పి ఉండేది. అప్పటికే లాల్ కృష్ణ అద్వానీ అభినవ సర్దార్ పటేల్‌గా రూపొందుతూ ఉన్నారు. సర్దార్ పటేల్‌కు భారతరత్న ఆ మరుసటి సంవత్సరం, పి.వి. నరసింహారావు ప్రధానిగా ఉండగా ప్రకటితమైంది. రాజీవ్ గాంధీకి, జనతారాజకీయాల కురువృద్ధుడు మొరార్జీ దేశాయ్‌కు కూడా పీవీ హయాంలోనే భారతరత్నలు వచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వాలు తమ నాయకపరివారానికి లేదా అస్మదీయులకు మాత్రమే అత్యున్నత పురస్కారాలు ఇచ్చాయని మోదీ అన్నమాట కూడా వాస్తవం కాదు. జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీలకు వారు పదవుల్లో ఉండగానే భారతరత్న ఇవ్వడం ఈ రోజు అనుచితంగా అనిపించవచ్చు కానీ, స్వాతంత్ర్యానంతర కాలపు తొలిసంవత్సరాలలో నెహ్రూకు ఉండిన జనాదరణ, బంగ్లాదేశ్ యుద్ధం నేపథ్యంలో ఇందిర ప్రాచుర్యం నేపథ్యంలో ఆ గౌరవాలను చూడాలి. పౌరపురస్కారాల ప్రారంభం తరువాత, మొట్టమొదటి భారతరత్న గౌరవం నోబెల్ పొందిన శాస్త్రవేత్త సి.వి. రామన్‌కు 1954లో దక్కింది. ఆ తరువాత, జాతీయోద్యమకాలానికి చెందిన అనేకమంది ప్రముఖులకు, వివిధరంగాల మేధావులకు భారతరత్నలు ఇచ్చారు. 1970 దశకం నుంచి ప్రమాణాలు పలచబడడం మొదలయింది. భారతరత్నల ప్రకటనే అరుదు అయింది. 1990 దశకం మలుపులో జరిగిన ప్రకటనలు, దేశరాజకీయాలలో వస్తున్న మార్పులకు సూచనలుగా చెప్పుకోవచ్చు.

మొదటి ఎన్‌డీఏ ప్రభుత్వంలో ఆశ్చర్యకరంగా ఒక్క మితవాద రాజకీయవాదికీ భారతరత్నలు ఇవ్వలేదు. వాజపేయి ప్రధానిగా ఉన్న కాలంలో సంగీతకళాకారులు పండిట్ రవిశంకర్, బిస్మిల్లా ఖాన్, భీమ్‌సేన్ జోషి, అస్సాం ప్రజానాయకుడు గోపినాథ్ బోర్డోలోయి, నోబెల్ గ్రహీత అమర్త్య సేన్, సంపూర్ణ విప్లవ వాది జయప్రకాశ్ నారాయణ్. వీరూ భారతరత్నలు. మొదటి, రెండో ఎన్‌డీఏ ప్రభుత్వాల మధ్య, వాజపేయికి, నరేంద్రమోదీకి మధ్య ఉన్న తేడాను భారతరత్నల ప్రదానంలో కూడా చూడవచ్చు. రావడం రావడమే వాజపేయి, మదన్ మోహన్ మాలవీయకు భారతరత్నలు ఇచ్చారు. మాలవీయ జాతీయోద్యమకాలపు మత, మితవాది. నానాజీ దేశ్‌ముఖ్‌కు ఇవ్వడం ద్వారా జనసంఘ్ కోవలోని ప్రభుత్వమే అధికారంలో ఉన్నదని, ఇది నెహ్రూ, గాంధీయేతర పరంపర అని బీజేపీ ప్రభుత్వం చాటి చెప్పింది. ఇతరులకు కూడా మోదీ హయాంలో రత్నాలు దొరకలేదని కాదు. ప్రణబ్ ముఖర్జీ, తాజాగా కర్పూరీ ఠాకూర్ బీజేపీ మార్గీయులు కారు కానీ, వారికి గౌరవం ఇచ్చిన సందర్భాలకు రాజకీయ సందర్భం ఉన్నది.



అయోధ్య వ్యాజ్యాన్ని తేల్చివేస్తూ సుప్రీంకోర్టు, సివిల్ పరిష్కారంగా భూమిని హిందువుల పక్షానికి అప్పగించింది. అదే సమయంలో, 1992 డిసెంబర్ నాటి బాబ్రీమసీదు కూల్చివేతను దారుణచర్య అని తప్పు పట్టింది. ఆ చర్యకు బాధ్యులైనవారిపై ఇంకా నేరవిచారణ జరుగుతున్నది. రామజన్మభూమి వ్యవహారంలో ఆ ఒక్క అభియోగాన్ని కూడా పూర్వపక్షం చేయడానికి, కూల్చివేత కేసులో నిందితుడుగా ఉన్న వ్యక్తికి భారతరత్న ఇచ్చి, తమ సర్వంసహా ఆధిపత్యాన్ని బీజేపీ ప్రకటించిందా? అది ఉద్దేశ్యం అయినా కాకపోయినా, ఆ ప్రయోజనం అయితే ఈ ప్రకటన ద్వారా సిద్ధించింది. రాజ్యాంగాలూ న్యాయస్థానాల కంటె అతీతమైన అధికారం దేశంలో ఉనికిలో ఉన్నదని స్పష్టమైంది.



■ కె. శ్రీనివాస్

సందర్భం

ఇక లాల్ కృష్ణ అద్వానీ. ఆయన భారతరత్నకు అర్హుడా కాదా? ఆయనకు ఎందుకు ఇచ్చినట్టు? వంటి చర్చలేవో మీడియాలో జరుగుతున్నాయి. సర్వసాధారణ అర్హతల గురించిన చర్చల వల్ల ఉపయోగం లేదు. బీజేపీ ప్రమాణాల ప్రకారమే అయినా, అద్వానీని గౌరవించాలని మోదీ ప్రభుత్వం ఎందుకు అనుకున్నది అన్న ప్రశ్న రావడం అకారణం కాదు. రామమందిర ప్రతిష్ఠ కార్యక్రమానికి అద్వానీ ఎందుకు వెళ్లలేదు అన్న కుతూహలం దేశమంతా ఉన్నది. ఆయనను రావద్దన్నారని, లేదు, ఆయనే రాలేనన్నారని అనుకున్నారు. ఆయన వస్తున్నారని విశ్వహిందూపరిషత్ నేతలు చెప్పినట్టు మళ్లీ వార్తలు వచ్చాయి. రామాలయ ఉద్యమంలో ముఖ్యపాత్ర వహించిన అద్వానీ, మురళీమనోహర్ జోషీ ఇద్దరూ అయోధ్య కార్యక్రమంలో కనిపించలేదు. రామాలయ సాధన మోదీ విజయంగా మాత్రమే ప్రదర్శించుకోవడానికి అలనాటి నేతలను ఎడం పెట్టారని కొందరు అర్థం చేసుకున్నారు. నిజానికి, నరేంద్రమోదీకి, రామాలయ అవతరణకూ అంత పెద్ద సంబంధం ఏమీ లేదు. ప్రభుత్వం నిర్మించింది కాదు కాబట్టి, ప్రధానిగా కూడా ఆయనకు ప్రత్యక్ష ప్రమేయం ఏమీ లేదు. కానీ, మోదీ లేకపోతే రామాలయం సాధ్యమయ్యేది కాదన్న అభిప్రాయాన్ని ప్రజలందరిలోనూ కలిగించడానికి గట్టి ప్రచారమే జరిగింది. ఆ ప్రచారానికి అడ్డంకి అవుతుందని అద్వానీని శ్రమతీసుకోవద్దని ‘మర్యాదగా’ చెప్పి ఉంటారు. తప్పేమీ లేదు. రాముడికే రాజకీయాల బెడద తప్పలేదు. మానవమాత్రులెంత?

నిరాడంబరత, నిజాయితీ, సిద్ధాంతనిబద్ధత కలిగిన కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ఇవ్వడంలో ఓబీసీల మీద దృష్టి పెట్టిన వ్యూహం తప్ప మరేమీ లేకపోవచ్చు. కానీ, అద్వానీకి ఇవ్వడంలో అసలు అర్థమేమిటి? అయోధ్యకు రాకుండా ఉండి, సహకరించినందుకు భారతరత్న ఇచ్చి ఉంటారని కొందరు అనుకుంటున్నారు. కాదు, మూడు దశాబ్దాల కిందట రథయాత్ర నిర్వహించినందుకు ఇచ్చి ఉంటారని కొందరంటున్నారు. సగౌరవంగా సాగనంపడంలో మోదీ బృందం ప్రసిద్ధమయినది. క్రియాశీల రాజకీయాలలో ఇంకా కొనసాగాలన్న ఉత్సాహం, అందుకు తగ్గ శక్తి ఉన్న వెంకయ్యనాయుడిని ఉపరాష్ట్రపతిని చేసినప్పుడు ఆయన అభిమానులు నిరుత్సాహపడ్డారు. తాజాగా ఆయనకు పద్మవిభూషణ గౌరవం దక్కడం, అందుకు పరిహారమేమో అని అనిపిస్తే అది సకారణమే. ఎంతటి వెంకయ్య, ఈ మాత్రపు గౌరవానికి సంతోషించి ఊరుకోవలసి వస్తున్నదే అన్న విచారం కలిగితే కూడా తప్పేమీ లేదు. మరి ప్రధాని కావలసిన అద్వానీ, బీజేపీని అధికారపీఠాలకు చేరువ చేసిన సాధకుడు, వృద్ధ సింహంగా, గౌరవరత్నంగా మిగులుతున్నందుకు బాధపడేవారు బీజేపీ శ్రేణులలో కూడా తగినంతమంది ఉన్నారు. 2019లో తిరిగి టికెట్ ఇవ్వనప్పుడే ఆయన రాజకీయ జీవితం ముగిసిపోయింది. రాజకీయాలు నిర్దాక్షిణ్యమైనవని అందుకే అంటారు. ఒకే భావజాలం వారి మధ్య, గురుశిష్య బాంధవ్యం ఉన్నవారి మధ్య కూడా అధికారక్రీడ అనేక చమత్కారాలు చేస్తుంది.

బీజేపీ వ్యూహకర్తల మనసులో మరేదైనా ప్రయోజనం ఉన్నదా? అయోధ్య వ్యాజ్యాన్ని తేల్చివేస్తూ సుప్రీంకోర్టు, సివిల్ పరిష్కారంగా భూమిని హిందువుల పక్షానికి అప్పగించింది. అదే సమయంలో, 1992 డిసెంబర్ నాటి బాబ్రీమసీదు కూల్చివేతను దారుణచర్య అని తప్పు పట్టింది. ఆ చర్యకు బాధ్యులైనవారిపై ఇంకా నేరవిచారణ జరుగుతున్నది. రామజన్మభూమి వ్యవహారంలో ఆ ఒక్క అభియోగాన్ని కూడా పూర్వపక్షం చేయడానికి, కూల్చివేత కేసులో నిందితుడుగా ఉన్న వ్యక్తికి భారతరత్న ఇచ్చి, తమ సర్వంసహా ఆధిపత్యాన్ని బీజేపీ ప్రకటించిందా? అది ఉద్దేశ్యం అయినా కాకపోయినా, ఆ ప్రయోజనం అయితే ఈ ప్రకటన ద్వారా సిద్ధించింది. రాజ్యాంగాలూ న్యాయస్థానాల కంటె అతీతమైన అధికారం దేశంలో ఉనికిలో ఉన్నదని స్పష్టమైంది.

ప్రపంచానికి మన ప్రతినిధులుగా ప్రదర్శించే మహామానవులు కదా, భారతరత్నలు! వారు మన జాతి ఔన్నత్యానికి గుర్తులుగా ఉండాలి!

ఈ దేశ సమాజంలో, ప్రజాజీవితంలో రత్నాలు ఎన్నో! గుర్తింపు మాత్రం కొందరికే దొరకవచ్చు! కానీ, తమ జీవితాచరణ ద్వారా జనజీవితాన్ని, చైతన్యాన్ని మెరుగుపరచడానికి, మొత్తంగా సమాజగమనాన్ని ముందుకు నడపడానికి తోడ్పడినవారే నిజమైన భారతరత్నాలు. సమష్టి, సహకార జీవితాన్ని, శాంతి సామరస్యాలను, ఉదాత్తమైన విలువలను స్ఫురింపజేసేవారు స్ఫూర్తిదాతలు. అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ, వ్యక్తిత్వంలో, చిత్తశుద్ధిలో అందరికీ ఆమోదయోగ్యులుగా ఉండేవారు జాతి ఇచ్చే ఉన్నత గౌరవానికి అర్హులు. గౌరవప్రతిష్ఠల కొలువుకూటంలో బారులు తీరిన భారతరత్నాలను చూసినప్పుడు, కొందరు మాత్రమే వినమ్ర వందనాలకు అర్హులుగా కనిపించడం విచారం కలిగిస్తుంది. ప్రపంచానికి మన ప్రతినిధులుగా ప్రదర్శించే మహామానవులు కదా, భారతరత్నలు! వారు మన జాతి ఔన్నత్యానికి గుర్తులుగా ఉండాలి!

కుల గణన వ్యతిరేకులు ఆర్య మనువాదులే!

లెనిన్ మహాశయుడు అన్నట్టుగా ఏ నినాదం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయో తెలియనంత కాలం ప్రజలు మోసపోతూనే ఉంటారు. పేద, మధ్యతరగతి, అభివృద్ధి చెందుతున్న దేశాల అటవీ ఖనిజ సంపదపై కన్నేసిన సామ్రాజ్యవాద దేశాలు ఆయా దేశ ఆదివాసీ తెగలను అంతం చేసే కుట్రలో ఉన్నాయి. ఉద్యమాలను అణచి వేయడానికి బలప్రయోగం ఒక్కటే సరిపోదని గ్రహించిన సామ్రాజ్యవాద అనుకూల మేధావులు ఇప్పుడు అణచివేతకు కుటిల పద్ధతుల్ని ఎంచుకుంటున్నారు. దేశంలో అద్దె మేధావులు, పత్రికలు, ఉన్నత సర్వీస్‌లో ఉన్న అధికారులు, విశ్వవిద్యాలయాల ఆచార్యులతో సహా, అమ్మకానికి అంగట్లో ఉన్న ఎన్జీఓల దాకా... వీరంతా విదేశీ డాలర్ల కక్కుర్తిలో సిసలైన ఉద్యమాలను నీరుగార్చే కుట్రలో భాగస్వాములే. మండల్ కమండల్ ఉద్యమాలతో దేశం మొత్తం అట్టుడికిన పరిస్థితి ఎంతటి మేధో విధ్వంసాన్ని సృష్టించిందో చూశాం. ఆ సందర్భంలో బీసీలు అనబడే మూలవాసుల ఏకీకరణ ఒకసారి మొదలైతే అది అంతటితో ఆగదు కాబట్టే దాన్ని సిద్ధాంతాలకు అతీతంగా ఈ దేశంలోని ఆర్య తెగలు అడ్డుకునే ప్రయత్నం చేసాయి. ఇప్పుడు మళ్లీ అదే శక్తులు కులగణనను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయి.

భారతదేశం అంటేనే కులాల జాతుల సమూహం. ఈ దేశంలో జాతులకు అస్తిత్వం ఉన్నట్టే కులాలకు అస్తిత్వం ఉన్నది. సాంస్కృతికంగా ఎలాంటి సారూప్యత లేని వర్గాలకు ఈ దేశం ఎప్పటికీ అర్థం కాదు. కుక్కలను, పక్షులను, క్రూర మృగాలను గణన చేసే చోట ఈ దేశ మూలవాసులను, వారి సాంస్కృతిక వైవిధ్యాలను లెక్కబెడితే అభ్యంతరం ఏమిటో ఈ మేధావులే సెలవివ్వాలి. ఈ దేశంలో పేదరికం కులానికి అతీతంగా లేదు. కొన్ని కులాల పేరు చెబితే వారి స్థితి ఏమిటో ఇట్టే తెలిసే పరిస్థితి మన చుట్టూ ఉన్నా మనకి అర్థం కాకపోవడం భావదారిద్ర్యమే! కులగణన వ్యతిరేకించేది కేవలం ఆర్య మనువాదులు మాత్రమే!

– దొమ్మాట వెంకటేష్
సామాజిక కార్యకర్త

బీఆర్ఎస్ దారెటు?

తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పాటై రెండు నెలలయ్యింది. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును ప్రజలు నిశితంగా గమనిస్తూనే ఉన్నారు. ముఖ్యమంత్రి మాట, పనితీరు, వ్యవహార శైలి అంచనా వేసుకుంటున్నారు. యాభైయ్యవ పడిలో ఉన్న రేవంత్‌లో దూకుడు ఎక్కువ. తన పనితీరును వ్యక్తీకరించడంలో వెనుకాడని మనస్తత్వం. ‘ఈంట్ కా జవాబ్ పత్తర్ సే’ అన్నట్లు ఉంటుంది రేవంత్ శైలి. అందుకే, కేసీఆర్‌కు సరైన పోటీ తానేనన్న భావన ప్రజల్లో కల్పించగలిగారు.

ప్రజాస్వామ్య విలువలను గౌరవించని వ్యక్తిగా 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కేసీఆర్ చెడ్డపేరు మూటగట్టుకున్నారు. తొమ్మిదిన్నర ఏళ్ల కాలంలో దానికి ఎన్నో ఉదాహరణలు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసి, ఫలితాలు వెలువడగానే ఆయన వ్యవహరించిన తీరు దానికి కొనసాగింపు మాత్రమే. కేసీఆర్ రేవంత్‌ల మధ్య వైరం రాజకీయ స్థాయికి మాత్రమే పరిమితమైంది కాదని అందరికీ తెలుసు. కేసీఆర్, ఆయన పార్టీ భవిష్యత్ ఏమిటి అనే విషయంపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. మిగతా ప్రాంతీయ పార్టీలకు లేని ప్రత్యేకత ఒకటి కేసీఆర్ పార్టీకి ఉంది. మొదట ఉద్యమ పార్టీగా విశేష ఆదరణ పొంది, అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యక్తిస్వామ్య పార్టీగా, నియంతృత్వ పోకడలు పోయింది. ఉద్యమ ధోరణిని కొనసాగించి ఉంటే ఆమ్ ఆద్మీ పార్టీకి లభిస్తున్న ఆదరణ ఇప్పుడు బీఆర్ఎస్‌కు లభించేది. పార్టీ వ్యవస్థాపిత లక్ష్యాలు, ఆదర్శాల నుంచి ఏ మాత్రం సంకోచం లేకుండా వైదొలగడం, నగదు పంపిణీ స్కీములను నమ్ముకుంటే చాలు ఓట్లు గుద్దుతారు అనే భ్రమలో కేసీఆర్ ఉండటం వల్ల ఆ పార్టీ సిద్ధాంత పునాదుల్లో పగుళ్లు మొదలయ్యాయి. మూడోసారి అధికారంలోకి వస్తే ప్రజలను ఆత్మలేని ఓటు బ్యాంకుగా మార్చేయొచ్చు అని కేసీఆర్ భావించారు. కానీ, ఓటమి పాలయి, తెలంగాణలో ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో మంచి ఆదరణ ఉన్న పార్టీ నేడు ఒక పట్టణ పార్టీ స్థాయికి దిగజారిపోయింది. కేసీఆర్ తాను ఏ సెంటిమెంట్ నమ్ముకొని రాష్ట్ర రాజకీయాలు చేశారో ఆ సెంటిమెంట్‌నే విసిరికొట్టారు, ఏరు దాటాక తెప్ప తగలేశారు.

చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు ప్రస్తుతం జరుగుతున్న మాటల యుద్ధంలో తన అవినీతి తాబేదార్లుగా ఉన్న కొందరిని కేసీఆర్ షీల్డ్‌గా వాడుకుంటున్నారు. ఎస్సీ నాయకులను అస్త్రంగా ప్రయోగిస్తున్నారు. అయితే అది బహుముఖ నాయకత్వం ఉన్న కాంగ్రెస్‌ను ఏకతాటి మీదకు తెస్తుందనే విషయాన్ని మరచిపోతున్నారు. గతంలో ఇతర పార్టీల నుంచి వలసలను ప్రోత్సహించడం, వచ్చినవారిని గౌరవించకపోవడం లాంటి చర్యల ఫలితాలను అధికారం లేని ప్రస్తుతకాలంలో ఆయన అనుభవించక తప్పదు. ఒక ప్రాంతీయ పార్టీగా కేసీఆర్ ప్రోత్సహించిన ఫిరాయింపులను ఒక జాతీయ పార్టీ చేయలేదని అనుకోవడం అవివేకం. కేసీఆర్‌తో అసెంబ్లీలో అమీతుమీ తేల్చుకున్నాకే ఆ ఆపరేషన్ మొదలుకావచ్చు. కేసీఆర్ పరిస్థితి ఇప్పుడు రెంటికీ చెడ్డ రేవడి. గతంలో పనిగట్టుకొని బీజేపీని జాకీలు వేసి లేపి, ముక్కోణపు పోటీలో జాక్ పాట్ కొట్టొచ్చు అని ఆశించిన కేసీఆర్‌ను ఇప్పుడు బీజేపీ దూరం పెడుతున్నట్లు కనిపిస్తోంది. జాతీయస్థాయిలో బలంగా ఉన్న బీజేపీకి తెలంగాణ రాజకీయాల్లో స్వతహాగా ఎదగడం ముఖ్యం. పార్లమెంట్ ఎన్నికలకు, అసెంబ్లీ ఎన్నికలకు తేడా తెలిసిన తెలంగాణ ఓటరు బీఆర్ఎస్‌కు ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు వేస్తారనుకోవడం అవివేకం.

– శ్రీమన్ తులసి, జర్నలిస్ట్

‘ఓయూ’ ఫీజుల అన్యాయాన్ని సరిదిద్దండి

యూజీసీ నిబంధనలను బట్టి న్యాక్ ‘ఏ’ గ్రేడ్ ఉన్న విశ్వవిద్యాలయాలు స్వతంత్రంగా ప్రతి విద్యా సంవత్సరంలో పీహెచ్‌డీ అడ్మిషన్లను జరుపుకోవచ్చు. ఉస్మానియా యూనివర్సిటీకి న్యాక్ ‘ఏ’ గ్రేడ్ ఉన్నప్పటికీ 2018 నుంచి 2022 వరకు పీహెచ్‌డీ అడ్మిషన్ల భర్తీ చేపట్టలేదు. ఐదేళ్ల నిరీక్షణ తర్వాత దేశంలో ఏ యూనివర్సిటీకీ లేనన్ని కఠిన నియమాలు పెట్టి పారదర్శకంగా పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టామని గొప్పలు చెప్పుకున్నారు. ఈ ప్రక్రియ 2022 ఆగస్టులో మొదలై 2023 మార్చిలో ముగిసింది. చివరకు ఇన్ని కఠిన నియమాలూ దాటి అడ్మిషన్లు తెచ్చుకున్న విద్యార్థులకు నిరాశే మిగిలింది. ఎందుకంటే ఎటువంటి కమిటీ ప్రతిపాదనలూ లేకుండా యూనివర్సిటీ అధికారులు గత ప్రభుత్వ అండదండలతో రూ.2000 ఉన్న పీహెచ్‌డీ ఫీజును ఆర్ట్స్, సోషల్ సైన్స్, కామర్స్, మేనేజ్‌మెంట్, లా, ఓరియంటల్ లాంగ్వేజెస్, ఎడ్యుకేషన్ విభాగాలకు రూ.1,00,000కు; సైన్స్, ఇంజనీరింగ్, టెక్నాలజీ ఫార్మసీ, ఇన్ఫర్మేటిక్స్ విభాగాలకు రూ.1,25,000కు పెంచారు. ఈ ఫీజుల పెంపు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పరిశోధక విద్యార్థులు ఐదు నెలలు పోరాటం చేశారు. అయినా తగ్గించకుండా యూనివర్సిటీ అధికారులు మొండి వైఖరి ప్రదర్శించారు.

ఈ ఫీజుల పెంపు నిర్ణయానికి వ్యతిరేకంగా పరిశోధక విద్యార్థులు మార్చి 2023 నుంచి వివిధ నిరసన కార్యక్రమాలు చేశారు. ఈ నిరసనల క్రమంలో అప్పుడు కాంగ్రెస్ పార్టీ శాసనసభ పక్ష నేతగా ఉన్న మల్లు భట్టి విక్రమార్క దృష్టికి ఈ అంశాన్ని తీసుకు వెళ్లినప్పుడు ఆయన అసెంబ్లీలో గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని పీహెచ్‌డీ ఫీజులు తగ్గించాలని నిలదీశారు. అయినా కూడా ప్రభుత్వం నుంచి ఫీజుల తగ్గింపుపై ఎటువంటి నిర్ణయం రాలేదు. దీనితో పరిశోధక విద్యార్థులు అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్, దాని అనుబంధ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేశారు. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. భట్టి విక్రమార్క ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి పీహెచ్‌డీ ఫీజుల తగ్గింపునకు చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా విద్యార్థులు మెరుగైన పరిశోధనలు కొనసాగించడానికి ప్రభుత్వమే ఫెలోషిప్‌లు ఇచ్చి తోడ్పాటు అందించాలి. తెలంగాణలో 93 శాతం మంది ప్రజలు మార్జినలైజ్డ్ సెక్షన్‌కి చెందినవారు. ఉస్మానియాలో కూడా వారి సంఖ్య ఎక్కువ. యూజీసీ నుంచి ఏ ఇతర ఫెలోషిప్ పొందని, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రతి పరిశోధక విద్యార్థికి రూ.25వేల ఫెలోషిప్ ఇవ్వాలి. తద్వారా ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి కావలసిన నైపుణ్యాలను సామర్థ్యాలను పెంచుకొని స్వయం ఉపాధి కల్పించుకుంటారు.

– నెల్లి సత్య, ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి

అదానీ పరమైన హస్దేవ్ అడవి!

హస్దేవ్ అడవిని రక్షించుకోడానికి ఆదివాసీలు పోరాడుతూనే ఉన్నారు. బొగ్గు నిక్షేపాలు వారి హక్కులను హరిస్తున్నాయి. దేశంలోని ఛత్తీస్‌గఢ్‌లోని అతిపెద్ద హస్దేవ్ అరణ్యం గౌతమ్ అదానీ పరం అయ్యింది. దాని కింద నేలలో ఉన్న రాక్షసి బొగ్గును తవ్వుకుని సంపాదించుకునే అవకాశం కేంద్రం, రాష్ట్రం వారికి ఇచ్చేశాయి. మనిషి ఆరోగ్యకరమైన గాలి పీల్చుకోడానికి, మన ఊపిరి రక్షణకు కారణమైన పర్యావరణాన్ని సోకాల్డ్ అభివృద్ధి పేరిట, మనుషుల విలాసవంత జీవితాల కోసం నాశనం చేస్తున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో హస్దేవ్ అడవి కింద 5000 మిలియన్ టన్నుల బొగ్గు ఉందని గుర్తించారు. మొత్తం 23 బొగ్గు బ్లాకుల కింద ఈ నిక్షేపాలను విడదీశారు. ఇక్కడ హస్దేవ్ నది ఒడ్డు కింద వచ్చే పర్సా బొగ్గు బ్లాక్‌ను 2008లో గౌతమ్ అదానీకి కేటాయించారు. ఎండీఓ కాంట్రాక్టు పేరిట ఈ బ్లాక్ ఇచ్చారు. దేశంలో ఇలా ఏటా వంద మిలియన్ టన్నుల బొగ్గును తొమ్మిది ఎండీఓల ద్వారా అదానీ బొగ్గు ఉత్పత్తి చేస్తున్నారు. మొత్తం ఇందులో 2800 మిలియన్ టన్నుల బొగ్గు ఉంది. కాంగ్రెస్ హయాంలో ఇలా మొత్తం 204 బొగ్గు బ్లాకులు వివిధ కంపెనీలకు ఇచ్చారు. ఇందులో చాలా అవకతవకలు జరిగాయని, ప్రభుత్వానికి రూ.1,86,000 కోట్ల నష్టం వాటిల్లిందని ఆరోపణలు రావడంతో 204 బ్లాకులను సుప్రీంకోర్టు రద్దు చేసింది. దీనిని అతి పెద్ద స్కాంగా బీజేపీ ప్రచారం చేసింది.

2014లో అధికారంలోకి బీజేపీ వచ్చిన తదుపరి మొత్తం 504 బొగ్గు బ్లాకులను కొన్ని మార్పులు, చేర్పులు చేసి అటు ప్రభుత్వ రంగంలో ఉన్న కోల్ ఇండియా అయినా, సింగరేణి అయినా బొగ్గు బ్లాకుల కోసం ఫీజులు చెల్లించి వేలంలో పాల్గొనాల్సిందే అన్నది. ఇలా కేంద్రం ఆరు లక్షల కోట్ల రూపాయలు రెవెన్యూ సాధించాలని ప్రణాళికలు రూపొందించుకున్నది. ఈ నిబంధన ఇలా ఉండగా, అదానికి కాంగ్రెస్ కాలంలో ఇచ్చిన గనిని రద్దు చేయలేదు. 142 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాల నుంచి 42 మిలియన్ టన్నుల బొగ్గు తీసారు. మిగతా బొగ్గు సంగతి ఏమైందో తెలియదు! బీజేపీ ఛత్తీస్‌గఢ్‌లో అధికారంలో ఉన్నపుడు ఇదంతా జరిగింది. అయితే కాంగ్రెస్ సీఎం భూపేష్ బాఘేల్ వచ్చినాక కూడా ఎలాంటి మార్పు లేదు. గత పదేండ్లలో ఆదివాసీలు బొగ్గు తవ్వకాలకు, కేటాయింపులకు వ్యతిరేకంగా పోరాడుతూనే ఉన్నారు. బీజేపీ, కాంగ్రెస్, మళ్ళీ ఇప్పుడు బీజేపీ అధికారంలోకి వచ్చింది. అయినా న్యాయం జరుగలేదు.

తాజాగా అదానీ కంపెనీకి 781 ఎకరాలు స్వాధీనం చేశారు. హస్దేవ్ అరణ్యం మొత్తం 1,876 చదరపు కి.మీ. ఉంటుంది. మధ్యప్రదేశ్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను తాకుతూ వెళ్లే మహానది నుంచి హస్దేవ్ నది కలిసే ప్రాంతం అంతా కోల్ బేరింగ్ ఉంది. మరోవైపు హస్దేవ్ నది చుట్టూ సుమారు నాలుగు లక్షల ఎకరాలలో రైతులు వివిధ పంటలు పండిస్తుండగా, ఇప్పుడు ఆ పంటలకు నష్టం వాటిల్లే పరిస్థితి వచ్చింది. దేశంలోని ఏనుగులలో ఒక్క శాతం ఏనుగులు ఛత్తీస్‌గఢ్ లోనే ఉన్నాయి. అరణ్యాన్ని విచ్చలవిడిగా నరుకుతున్న కారణంగా 15 శాతం మనుషులతో జనంలోకి వచ్చి ఏనుగులు ఘర్షణ పడుతున్న పరిస్థితి ఉన్నది. ఇంకా రాష్ట్ర ప్రభుత్వం వద్ద నాలుగున్నర లక్షల చెట్లను నరికే ప్రణాళిక ఉన్నదని ఆదివాసుల తరుపున పోరాడుతున్న అలోక్ శుక్ల అంటున్నారు.

ఇప్పుడు ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ప్రభుత్వం మరోసారి ఏర్పాటు కావడం వల్ల అదానికి పట్టపగ్గాలు లేకుండాపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నపుడు ఆదివాసీల ఆందోళనకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మద్దతు ఇచ్చినా, అప్పటి సీఎం భూపేష్ బాఘేల్ చూసీ చూడనట్లు వ్యవహరించారు. ఇప్పుడు బీజేపీ ఉంది. ఇంకెవరు పట్టించుకుంటారు? అయితే న్యాయం కోసం ఆదివాసుల పోరు మాత్రం కొనసాగుతూనే ఉన్నది.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
గురువారం 8 ఫిబ్రవరి 2024





సమ్మక్కగుడిలో గద్దెను అలంకరిస్తున్న పూజారుల కుటుంబసభ్యులు

మేడారం ట్రస్టు బోర్డు లేనట్టేనా?



- ఇప్పటివరకు ప్రకటన ఇవ్వని దేవాదాయశాఖ
- తాత్కాలిక పునరుద్ధరణ కమిటీకే అధికారుల మొగ్గు
- 2014, 2016, 2020, 2022 నాటి పరిస్థితులే పునరావృతం
- ట్రస్ట్ బోర్డు లేకుంటే రూ.105కోట్ల పనులపై పర్యవేక్షణ లేనట్టే..

వరంగల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడారం మహాజాతర పనులను పర్యవేక్షించే ట్రస్ట్ బోర్డు ఏర్పాటుపై దేవాదాయశాఖ దృష్టి సారించటం లేదు. ఇప్పటికే ప్రభుత్వం మేడారం జాతరలో భక్తులు సౌకర్యాలు కల్పించేందుకు రెండు విడతల్లో రూ.105కోట్లు కేటాయించింది. ఈ నిధులతో జాతరలో చేపట్టే పనులను, ఆదివాసీ గిరిజన సంప్రదాయంలో జాతర జరిగేలా పర్యవేక్షించే ట్రస్టు బోర్డు ఏర్పాటు నియామకంలోనూ తాత్సారం చేస్తోంది. 14మంది సభ్యులతో ఏర్పాటు చేసే కమిటీ కోసం దేవాదాయశాఖ నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంది. కానీ, ఇప్పటివరకు ట్రస్ట్ బోర్డు ఏర్పాటుపై అధికారుల్లో కదిలిక లేకపోవటంతో 2014, 2016, 2020,2022 నాటి జాతర ఘటనలే పునారావృతం అవుతాయా అనే చర్చ సాగుతోంది. అయితే స్వయంగా మంత్రి సీతక్క ప్రాతినిత్యం వహిస్తున్న ములుగులోనే మేడారం జాతరకు ట్రస్ట్ బోర్డు ఏర్పాటులో జాప్యంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

మహాజాతరకు ట్రస్ట్ బోర్డు

మేడారం మహా జాతరకు ఆరు నెలల ముందే ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేయటం ఆనవాయితీ. మహాజాతర అభివృద్ధి, ప్రభుత్వం మంజూరు చేసే నిధుల వినియోగం, అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు, జాతర సమయంలో బెల్లం, కొబ్బరికాయలు, భక్తుల క్యూలైన్లు తదితర వాటిని పరిశీలించి.. జాతర సాఫీగా సాగేందుకు ట్రస్ట్ బోర్డు సభ్యులు కృషి చేస్తారు. గతంలో 9మందితో ఉండే ఈ ట్రస్ట్ బోర్డులో సభ్యుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. 2018 మహాజాతరలో ట్రస్ట్ బోర్డు అధ్యక్షుడితోపాటు 14మంది సభ్యులు, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు ఎక్స్ ఆఫీషియో సభ్యుడిగా నియమించారు. దీంతో కమిటీ సభ్యుల సంఖ్య 15కు చేరింది. ఆ తరువాత 2020, 2022 జాతరలకు ట్రస్ట్ బోర్డుకు బదులుగా పునరుద్ధరణ కమిటీని నియమించారు. ఈ కమిటీలో కూడా 15మందికి చోటు కల్పించారు. అధికార పార్టీ నేతల ప్రతిపాదనలకే దేవాదాయశాఖ ఆమోదం తెలపడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ ట్రస్ట్ బోర్డు కోసం దేవాదాయశాఖ జాతరకు ఆరు నెలల ముందే నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంది. ఈ నోటిఫికేషన్ వెలువడిన తరువాత 20రోజుల్లో ట్రస్ట్ బోర్డు ప్రకటించాలి. కానీ, ఇప్పటివరకు ట్రస్ట్ బోర్డు ఏర్పాటులో కదిలిక లేదు. మహాజాతర సమీపిస్తుండటంతో ట్రస్ట్‌బోర్డు ఏర్పాటుపై అధికారులు చొరవ చూపకపోవటం విమర్శలకు దారితీస్తోంది.

ట్రస్ట్ బోర్డు లేకుండానే..

పదేళ్లకాలంలో ఐదు జాతరలు రాగా, వీటిలో నాలుగు జాతరలకు ట్రస్ట్ బోర్డు కమిటీ లేకుండానే నిర్వహించారు. గతంలో అధికారపార్టీ నేతల్లో కమిటీపై ఆధిపత్యం కోసం కొట్లాడి.. కమిటీనే లేకుండానే జాతర నిర్వహించి విమర్శలు ఎదుర్కొన్నారు.

2014లో మహా జాతరకు ట్రస్ట్ బోర్డు కమిటీ ఎంపికలో అప్పటి అధికార కాంగ్రెస్ పార్టీలో విభేదాల ఏర్పడ్డాయి. దీంతో కమిటీ నియామకం జరగలేదు. దీంతో గద్దెల వద్ద సమ్మక్క-సారలమ్మల ప్రసాదం (బెల్లం) పంపిణీలో, తలనీలాల సేకరణ, క్యూలైన్‌ల ఏర్పాటు, కొబ్బరికాయల అమ్మకం, గద్దెల వద్ద బెల్లం తొలగింపు తదితర అంశాల్లో ఇబ్బందులు ఎదురయ్యాయి. 2016లో అయితే బీఆర్ఎస్ పార్టీలో నెలకొన్న విభేదాల వల్ల ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేయలేదు. మూడు నెలల ముందు జాతర పునరుద్ధరణ పేరుతో ఓ కమిటీ వేసి చేతులు దులుపుకున్నారు. దీంతో జాతర పనులపై పర్యవేక్షణ, భక్తుల సౌకర్యాల కల్పనలో ఇబ్బందులు తలెత్తాయి. అయితే 2018లోమాత్రం కాక లింగయ్య చైర్మన్‌గా ట్రస్ట్ బోర్డును మూడు నెలల ముందే నియమించారు. ఆ తరువాత మళ్లీ అదే కథ పునారావృతం అయింది. 2020, 2022 మహజాతరలకు రాజకీయాల అడ్డు రావటంతో పునరుద్దరణ కమిటీలతో జాతరను మమ అనిపించారు. ప్రస్తుత మహాజాతరకు కూడా పునరుద్ధరణ కమిటీతో మమ అనిపించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం జరుగుతోంది.

కమిటీ ఏర్పాటయ్యేనా..?

ఈసారి కూడా ట్రస్ట్ బోర్డు నియమించే పరిస్థితులు కనిపించటం లేదనే టాక్ వినిపిస్తోంది. మహాజాతరకు మరో 14రోజుల సమయమే ఉంది. ఈ నేపథ్యంలో కమిటీ నియామకం ఎప్పుడు జరుగుతుందనే చర్చ సాగుతోంది. ఇప్పటివరకు దేవాదాయశాఖ నుంచి ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్ కూడా జారీ చేయలేదు. కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేసి.. ఆసక్తి ఉన్న సభ్యుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. ఆనంతరం 20 రోజుల్లో కమిటి ప్రకటించాల్సి ఉంది. కానీ, మహాజాతరకు 14 రోజుల సమయమే ఉండటం.. దేవాదాయశాఖ నుంచి కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్ వెలువడకపోవటం పలు అనుమానాలకు దారితీస్తోంది. ఈసారి కూడా 2014, 2016, 2020, 2022 తరహాలోనే మేడారం మహాజాతరకు కమిటీ లేకుండానే అభివృద్ధి కమిటీనో..

మిగతా 7వ పేజీలో..

ఏటా.. అదే తీరు..

- మేడారం భక్తులకు తప్పని పాట్లు
- ప్రతీ జాతరలోనూ అవే సమస్యలు
- మౌలిక వసతులపై చిన్నచూపు

7

మహా జాతరకు తొలిపూజ

- గుడిమెలిగే పండుగతో గిరిజన కుంభమేళాకు అంకురార్పణ
- మేడారానికి భారీగా తరలొస్తున్న భక్తులు

మేడారం, ఫిబ్రవరి 7: తెలంగాణ గిరిజన కుంభమేళ.. మేడారం మహాజాతరకు అంకురార్పణ జరిగింది. గుండెమెలిగే పండుగతో వడ్డెలు (పూజారులు) తొలిపూజ చేశారు. ఈనెల 21 నుంచి 24 వరకు జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మల జాతరకు ప్రారంభ సూచికగా జరిగే ఈ వేడుకను బుధవారం ఘనంగా నిర్వహించారు. సనాతన ఆచారం ప్రకారంగా తొలి పూజగా భావించే ఈ కార్యక్రమంలో సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల పూజా మందిరాలను శుద్ధి చేసి.. పైకప్పును గుట్టగడ్డితో కప్పారు. దీనినే గుడిమెలిగే పండుగా పేర్కొంటారు. ములుగు జిల్లా తాడ్వాయి మండల పరిధిలోని మేడారంలో సమ్మక్క, కన్నెపల్లిలో సారలమ్మ గుడులు, ఏటూరునాగారం మండలం కొండాయిలో గోవిందరాజులు, మహబూబాబాద్ జిల్లా గంగారం మండలంలోని పూనుగొండ్లలో పగిడిద్దరాజుల గుడుల్లో ఈ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. తలపతుల ఆధ్వర్యంలో వడ్డెలు సంప్రదాయ పూజలు చేసి దీపధూప నైవేద్యాలు సమర్పించారు. దీనికి ముందు వేకువజామున పూజారులు, కుటుంబ సభ్యులు ఇళ్లను శుద్ధి చేశారు. జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించారు. కఠోర ఉపవాసాన్ని పాటించిన వడ్డెలు కాళ్లకు చెప్పులు లేకుండానే గుట్ట గడ్డిని సేకరించి డోలు వాయిద్యాల నడుమ గుడుల వద్దకు చేర్చారు. గుడులపై పాత కప్పును తొలగించి కొత్త గడ్డితో కప్పారు. మహిళలు అటవీ ప్రాంతం నుంచి పుట్ట మట్టిని సేకరించి పూజా మందిరాల్లో ఉన్న తల్లి గద్దెను అలికి ముగ్గులతో అలంకరించారు. మహాజాతరకు తొలిపూజగా ఈ కార్యక్రమాలు జరగ్గా ఈనెల 14న (బుధవారం) మండమెలిగే పండగ జరగనుంది. ఆ రోజు మేడారానికి నలువైపులా ద్వారబంధనాలు, రక్షా తోరణాలు కట్టి మహాజాతర నిర్విఘ్నంగా జరగాలని, వనదేవతల దర్శనానికి వచ్చిన భక్తులు క్షేమంగా గమ్యస్థానాలు చేరాలని వడ్డెలు వేడుకుంటారు. ఇక జాతరకు సమయం సమీపిస్తున్న నేపథ్యంలో మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు బుధవారం భారీ సంఖ్యలో తరలొచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి.. కల్యాణకట్టల వద్ద తలనీలాలు సమర్పించారు. వనదేవతలకు ఎత్తు బంగారం (బెల్లం), పూలు, పండ్లు, చీర, సారె, కొబ్బరికాయలు, పసుపు, కుంకుమ సమర్పించారు. బుధవారం సుమారు 2లక్షల మంది తల్లులను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో మేడారం పరిసరాలు భక్తజనంతో కిటకిటలాడాయి.



బీఆర్ఎస్‌కు అభినవ్ భాస్కర్ రాజీనామా

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 7: 60వ డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను ఆ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు ఈమెయిల్ ద్వారా పంపించారు. బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన అభినవ్ భాస్కర్ త్వరలో బీజేపీలో చేరనున్నట్లు ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ సోదరుడు మాజీ మంత్రి దాస్యం ప్రణయ్ భాస్కర్ తనయుడైన అభినవ్‌భాస్కర్.. తాను బీఆర్ఎస్ పార్టీ వీడనున్నట్లు సోమవారమే ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనకు వచ్చిన అవకాశాలను పక్కనపెట్టి బాబాయి గెలుపుకోసం శ్రమిస్తే ఫలితంలేకుండా పోయిందన్నారు. బాబాయి సైతం తనను తప్పుపట్టడం బాధించిందన్నారు. విలువలేని చోట ఉండటం సరి కాదని భావించి పార్టీని వీడుతున్నట్లు లేఖలో పేర్కొన్నారు. కాగా, అభినవ్‌భాస్కర్ మంగళవారం ఢిల్లీ వెళ్లి బీజేపీ అగ్రనేతలను కలిసివచ్చినట్లు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో తన అనుచరులతో బీజేపీలో చేరనున్నట్లు తెలిసింది.



సీపీకి ఆహ్వాన పత్రికను అందిస్తున్న పూజారులు

అగ్రంపహాడ్ జాతరకు రండి..

- సీపీని ఆహ్వానించిన ఆలయ పూజారులు, అధికారులు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 7: ఈ నెల 21 నుంచి 24 వరకు హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్‌లో ప్రతిష్మాత్మకంగా జరిగే శ్రీ సమ్మక్క- సారలమ్మ జాతరకు కుటుంబ సభ్యులతో కలిసి రావాలని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝాను ఆలయ పూజారులు, అధికారులు ఆహ్వానించారు. సీపీ కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా జాతర ఏర్పాట్లతో పాటు జాతరకు సంబంధించిన పోలీసు బందోబస్తుపై సీపీకి ఆలయ అధికారులు వెల్లడించారు. అమ్మవార్లను సందర్శించే రోజుల్లో పోలీసు బందోబస్తు అధికంగా ఉండాలని, ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా ఉండాలని వారు సీపీకి విజ్ఞప్తి చేశారు. జాతర సమయంలో దొంగతనాలు జరిగే అవకాశాలు ఉంటాయని, ప్రత్యేక బృందాలు, సీసీఎస్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని వారు కోరారు. సీపీని కలిసిన వారిలో ఆత్మకూరు ఇన్‌స్పెక్టర్ దండు రవిరాజు, ఆలయ అదికారి శేశగిరి, పూజారులు సాంబశివరావు, వెంకన్న, సారంగపాణి, భాస్కర్, విశ్వనాథ్, రమేష్, స్వామి ఉన్నారు.

కాంగ్రెస్ అంటేనే ప్రజల పార్టీ..

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- నయీంనగర్ నాలా, బ్రిడ్జి పనులకు ప్రారంభం
- పాల్గొన్న మేయర్, కలెక్టర్, కార్పొరేటర్లు



నాలా, బ్రిడ్జి పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

నయీంనగర్, ఫిబ్రవరి 7: కాంగ్రెస్ పార్టీ అంటేనే.. ప్రజల పార్టీ అని, ప్రజా సంక్షేమం కోసం పని చేస్తోందని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ - కరీంనగర్ ప్రధాన రహదారిలోని నయీంనగర్ పెద్దమోరీ వద్ద గల నాలా, బ్రిడ్జి పనులను బుధవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కలెక్టర్ సిక్తా పట్నాయక్, నగర మేయర్ గుండు సుధారాణిలతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఏ రోజు కూడా ప్రజల కష్టనష్టాలను పట్టించుకోలేదని, వారి అభివృద్ధిపై దృష్టి సారించలేదని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులకు పర్సంటేజీలపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదని ఆయన తెలిపారు. నాలాలు ఆక్రమణకు గురికావడంతో వర్షాకాలంలో వరద బీభత్సంతో రెండు పర్యాయాలు హనుమకొండ నగరం మునిగిపోయిందని ఆయన తెలిపారు. దీనివల్ల ప్రజలు ఆర్థికంగా దెబ్బతిని మానసికంగా కుంగిపోయారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు పర్యాయాలు అధికారంలో ఉండి కూడా నయీంనగర్ నాలా, బ్రిడ్జిలకు శాశ్వత పరిష్కారం చూపలేదని ఆయన తెలిపారు. ఎన్నికల హామీలో భాగంగా నయీంనగర్ నాలా సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నాలా అభివృద్ధికి రూ.70లక్షల 58వేలు, నయీంనగర్ బ్రిడ్జికు రూ.15 కోట్ల నిధులు తీసుకువచ్చి శాశ్వత పరిష్కారం చేస్తున్నట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్, వరంగల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణలతో కలిసి నాలా, బ్రిడ్జి మ్యాప్‌లను పరిశీలించారు. కార్పొరేటర్లు చాడ స్వాతి-శ్రీనివాస్‌రెడ్డి, చెన్నం మధు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ.అజీజ్‌ఖాన్, మునిసిపల్ డీఈలు, ఏఈలు, స్థానికులు పాల్గొన్నారు.

9న బీఆర్ఎస్ పశ్చిమ విస్తృత స్థాయి సమావేశం

- హాజరు కానున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 7: వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఈనెల 9న హనుమకొండలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఉంటుందని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ భాస్కర్ తెలిపారు. బుధవారం హనుమ కొండలోని జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయభాస్కర్ మాట్లాడుతూ.. 9న ఉదయం 10గంటలకు జరిగే సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలని వినయబాస్కర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో



మాట్లాడుతున్న వినయభాస్కర్

కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, నేతలు తాళ్లపల్లి జనార్ధన్‌గౌడ్, పులి రజనీకాంత్, చెన్నం మధు తదితరులు పాల్గొన్నారు.

కోమటిపల్లి బైపాస్‌లో రైల్వే సొరంగ మార్గం



నిర్మాణం దశలో ఉన్న సొరంగ మార్గం

హసన్‌పర్తి - కాజీపేట మధ్య కిలోమీటర్ మేర నిర్మాణం


- బైపాస్ రైళ్ల మళ్లింపునకు చర్యలు
- మరో రెండు నెలల్లో అందుబాటులోకి..
- దక్షిణ మధ్య రైల్వేలోనే ప్రథమం

కాజీపేట, ఫిబ్రవరి 3: కాజీపేట - హసన్‌పర్తి రైల్వే మార్గంలోని రైల్వే బైపాస్ లెవల్ క్రాసింగ్ గేట్ -1 వద్ద రైల్వేశాఖ కిలోమీటర్ పొడవునా భూగర్భ రైలు మార్గం నిర్మిస్తోంది. ఈ సొరంగ మార్గం గుండా ఓ రైల్ ట్రాక్, దాని పైనుంచి మరో నాలుగు ట్రాక్‌లను నిర్మిస్తుంది. అంటే పైనుంచి వెళ్లే రైళ్లకు, దాని కింద సొరంగ మార్గం నుంచి మరో రైలు ఏకకాలంగా పరిగెత్తుతాయి. రూ.25 నుంచి 30 కోట్ల బడ్జెట్‌తో ఈ ట్రాక్ నిర్మాణం చేపట్టింది. 350 మీటర్ల మేర సొరంగ మార్గం స్లాబ్, సుమారు కిలో మీటర్‌ల దూరం వరకు భూమిని తవ్వి ట్రాక్‌ను నిర్మిస్తున్నారు. అయితే సొరంగ మార్గం నుంచి నిర్మించిన రైల్వే ట్రాక్‌లు రైల్వేలో చాలా ఉన్నప్పటికీ రేల్ అండర్ రేల్ (ఆర్‌యూ ఆర్) మాత్రం దక్షిణ మధ్య రైల్వేలోనే ప్రథమంగా ఇక్కడ నిర్మాణం చేపట్టింది. రైల్వేశాఖ ఓ చాలెంజ్‌గా ట్రయల్ రన్‌తో చేపట్టే ఈ ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో సక్సెస్ అయితే ఇండియన్ రైల్వేలో మరిన్ని ప్రాంతాల్లో ఆర్‌యూఆర్ నిర్మాణానికి పెద్దఎత్తున చర్యలు చేపడుతుంది.

రేల్ అండర్ రేల్ నిర్మాణం ఎందుకంటే..

నిత్యం రైళ్ల ట్రాఫిక్ ఉండే హసన్‌పర్తి - కాజీపేట మధ్య ఉండే గ్రాండ్ ట్రంక్ రైల్వే మార్గంలో రేల్ అండర్ రేల్ (ఆర్‌యూఆర్) నిర్మాణంతో ట్రాఫిక్‌ను అరికట్టవచ్చు. సొరంగ మార్గం నుంచి ఓ రైలు, దాని పైనుంచి మరో కొన్ని రైళ్లను పంపించవచ్చు. అంటే ఒక రైలు వెళ్లే వరకు మరో రైలును ఆపాల్సిన

మిగతా 8వ పేజీలో..



పింక్ కలర్‌లో ఉన్న అండర్ ట్రాక్ నమూనా

భారీగా సీఐల బదిలీలు

- కమిషనరేట్ పరిధిలో 29 మంది ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 7: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న 29 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత పెద్దఎత్తున ఇన్‌స్పెక్టర్ల బదిలీ కావడం ఇదే ప్రథమం. ఒకే చోట ఎక్కువ కాలం పని చేయడంతో కొందరిని బదిలీ చేయగా, మరికొందరికి బదిలీ అయిన వారి స్థానాల్లో పోస్టింగ్ ఇచ్చారు. పోస్టింగ్ పొందిన వారు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాలు జారీ చేశారు.

మల్టీ జోన్ ఐజీకి పలువురి అటాచ్

వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో పరిధిలోని మూడు జిల్లాలు వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలో పనిచేస్తున్న 13 మంది ఇన్‌స్పెక్టర్లను హైదరాబాద్ మల్టీ జోన్-1 ఐజీకి అటాచ్ చేస్తూ సీపీ ఆదేశాలు జారీ చేశారు. పి.వెంకన్న- వరంగల్ ట్రాఫిక్, ఎస్. శ్రీనివాస్- వర్ధన్నపేట, బి. హతిరాం- నెక్కొండ, సార్ల రవికుమార్- నర్సంపేట, సార్ల రాజు- కాజీపేట,

మిగతా 8వ పేజీలో..

గుండెపోటుతో ఆర్టీసీ బస్సులో వ్యక్తి మృతి

సుబేదారి, ఫిబ్రవరి 7: గుండెపోటుతో వరంగల్-2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులోనే వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి హనుమకొండ బస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఆర్టీసీ అధికారుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం సోమదేవరపల్లి గ్రామానికి చెందిన గడ్డం దామోదర్(50) గీత కార్మికుడు. దామోదర్ ఏటూరునాగారంలో బంధువులకు సంబంధించిన ఓ ఫంక్షన్ ఉంటే బుధవారం ఉదయం వెళ్లాడు. తిరిగి ఏటూరునాగారం నుంచి హనుమకొండ బస్‌స్టేషన్‌కు రావడానికి రాత్రి 7గంటల సమయంలో బస్సు ఎక్కాడు. రాత్రి 10గంటల సమయంలో బస్సు హనుమకొండ బస్‌స్టేషన్‌కు చేరుకుంది. ప్రయాణికులందరూ బస్సు దిగి వెళ్లిపోగా దామోదర్ బస్సులోనే కూర్చుని ఉండడంతో బస్సు కండక్టర్ వెళ్లి పరిశీలించగా దామోదర్ ఎటూ కదలలేని స్థితిలో ఉన్నాడు. వెంటనే ఆర్టీసీ అధికారులు అంబులెన్స్‌కు ఫోన్ చేయగా అంబులెన్స్‌లో ఉన్న డాక్టర్ దామోదర్‌ను పరిశీలించి గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపాడు. విషయం తెలుసుకున్న దామోదర్ భార్య మహాలక్ష్మి, కుమారుడు, కూతురు అల్లుడు వచ్చి బోరున విలపిస్తూ దామోదర్ మృతదేహాన్ని తీసుకెళ్లారు.



బస్సులో మృతి చెందిన దామోదర్

290 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

హసన్‌పర్తి, ఫిబ్రవరి 7: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యంను బుధవారం రాత్రి హసన్‌పర్తి, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. హసన్‌పర్తి ఇన్స్‌పెక్టర్ తుమ్మ గోపి తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌పర్తి, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా బుధవారం రాత్రి ఎర్రగట్టుగుట్ట ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అనుమానం వచ్చిన లారీని తనిఖీ చేయగా అందులో అక్రమంగా తరలిస్తున్న 290 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం బస్తాలు ఉన్నాయి. వెంటనే లారీని అదుపులోకి తీసుకున్నారు. లారీ వెంట ఉన్న చినిగిరి సమ్మయ్య, మౌటం వీరయ్య, మౌటం మధుకర్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద ఉన్న లారి, టూ వీలర్, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుచనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సీఐలు దేవేందర్, రమేశ్, ఎస్సైలు రియాజ్, అశోక్, కానిస్టేబుల్ ప్రకాశ్ సిబ్బంది ఉన్నారు.

టిప్పర్‌ను ఢీకొన్న కారు - ఇద్దరి మృతి

శంకరపట్నం, ఫిబ్రవరి 7: కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గ్రామంలో కరీంనగర్-వరంగల్ హైవేపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కరీం నగర్ నుంచి హనుమకొండవైపు వెళ్తున్న కారు కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్రస్వామి ఆలయ సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కన నిలిపి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న హనుమకొండకు చెందిన తాళ్లపల్లి కొంరమ్మ(68), కరీంనగర్‌కు చెందిన నీర్ల ప్రభాకర్ (58) అక్కడికక్కడే మృతి చెందారు. తాళ్లపల్లి సదానందం, తాళ్లపల్లి గీతలకు తీవ్ర గాయాలయ్యాయి. గీత పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మృతుడు ప్రభాకర్ భార్య సబిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు. ఆగి ఉన్న టిప్పర్‌కు పార్కింగ్ లైట్లు వేయకపోవడంతోనే ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు.



మేడారంలోని సమ్మక్క-సారలమ్మల గద్దెల ప్రాంగణంలో మొక్కులు సమర్పించుకుంటున్న భక్తులు

రెండు లక్షలకుపైగా తరలొచ్చిన భక్తులు

భక్తులతో కిటకిటలాడిన వనదేవతల సన్నిధి



ఎత్తు బంగారం సమర్పిస్తున్న చిన్నారి



జంపన్నకు దండం పెడుతున్న భక్తురాలు

మేడారం, ఫిబ్రవరి 7 : మేడారం సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు బుధవారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. మహాజాతర ఈనెల 21నుంచి నాలుగు రోజుల పాటు జరగనుండగా ముందస్తుగా తల్లులను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణకట్టల వద్ద తలనీనాలు సమర్పించారు. శివసత్తుల పూనకాలు, డోలు వాయిద్యాల నడుమ గద్దెల వద్దకు చేరుకొని వనదేవతలకు ఎత్తుబంగారం (బెల్లం), పూలు, పండ్లు, చీరె, సారె, కొబ్బరికాయలు, పసుపు, కుంకుమలు సమర్పించారు. సుమారు రెండు లక్షల మంది భక్తులు తల్లులను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. దీంతో మేడారం పరిసరాలు కిటకిటలాడాయి.



జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ఏటా అదే తీరు..

● మేడారంలో భక్తులకు తప్పని పాట్లు ● ప్రతీ జాతరకు అవే సమస్యలు..
● నిర్వహణ పరంగానే ఏర్పాట్లు ● మౌలిక వసతులపై అధికారుల చిన్నచూపు

హనుమకొండ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లకోసారి జరిగే మేడారం సమ్మక్క - సారలమ్మ జాతరలో భక్తులకు పాట్లు తప్పడం లేదు. ప్రతీసారి కోట్లాది రూపాయల వ్యయంతో విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నా.. భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారులు జాతర నిర్వహణపై పెడుతున్న దృష్టి.. వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో మాత్రం పెట్టడం లేదు. దీనితో ఎంత భారీగా ఏర్పాట్లు చేసినా.. జాతర జరిగే ఆ నాలుగు రోజులు భక్తులు జాతర ప్రాంగణంలో ఎదుర్కొనే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ముఖ్యంగా దర్శనం సందర్భంగా తల్లుల గద్దెల వద్ద విపరీతమైన రద్దీలో భక్తులు పడే యాతన నరకాన్ని తలపిస్తుంది. ఒక పక్క పోలీసుల ఆంక్షలు, మరో పక్క క్యూలైన్లో విపరీతమైన ఒత్తిళ్ల మధ్య గద్దెల వద్దకు చేరుకొని అమ్మవార్లను దర్శనం చేసుకోవడం ఎంతో ప్రయాసతో కూడుకొని ఉంటుంది. ఈ పరిస్థితి చక్కదిద్దడంలో అధికారులు విఫలమవుతున్నారు.

సెంటిమెంట్‌తో ఆటలు

మేడారంలో అధికారులు భక్తుల సెంటిమెంట్‌తో ఆటలు ఆడుకోవడం పరిపాటిగా మారింది. గద్దెల వద్ద భక్తుల రద్దీని తగ్గించే పేరుతో ప్రతీ జాతరకు కొత్త ప్రతిపాదనలు తెరమీదికి తీసుకువస్తున్నారు. ఇవి భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉంటున్నాయి. వారి నుంచి తీవ్ర స్థాయిలో వ్యతిరేకత రావడంతో చివరి నిమిషంలో విరమించుకుంటున్నారు. ఈ సారి కూడా అధికారులు ఓ కొత్త ఆలోచన చేశారు. భక్తుల బంగారాన్ని (బెల్లం) కన్వేయన్ బెల్టుద్వారా గద్దెల మీదికి చేర్చడం. కొన్ని రోజుల కిందట రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మేడారం ఏర్పాట్లపై జరిపిన సమీక్షా సమావేశంలో అధికారులు ప్రతిపాదనను ప్రవేశపెట్టారు. ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి జాతరకు వచ్చిన భక్తులు తల్లులకు మొక్కులె చెల్లించుకునే క్రమంలో తమ వెంట తెచ్చుకున్న బంగారాన్ని గద్దెలపై స్వయంగా సమర్పించాలనుకుంటారు. అలా చేయడంలోనే వారు ఎంతో సంతృప్తి చెందుతారు. సాధారణ సమయాల్లో గెద్దల వద్దకు వచ్చి చీరె, సారె పసుపు, కుంకుమ, గాజులతో పాటు బెల్లం (బంగారం) స్వయంగా సమర్పిస్తారు. జాతర సమయంలో అది సాధ్యం కాదు కనుక.. గెద్దలపైకి బెల్లం ముద్దలను విసిరేస్తారు. ఇలా భక్తులు విసిరిన బెల్లంతో వనదేవతల గద్దెలు పూర్తిగా నిండిపోయి నిండుగా కనిపిస్తాయి. ఈ సందర్భంగా బెల్లం ముద్దలు తగిలి భక్తులు గాయపడడం కూడా జరుగుతుంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని భక్తులు గద్దెల వద్ద నేరుగా బంగారం సమర్పించే వీలు లేకుండా బయటి నుంచి గద్దెల వరకు ఒక కన్వేయర్ బెల్టును ఏర్పాటుచేసి దానిపై బంగారాన్ని ఉంచితే అది గెద్దల వద్దకే చేరేలా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన చేశారు. దీనివల్ల జాతరలో గెద్దలపైనే భక్తులు నేరుగా బంగారాన్ని సమర్పించుకునే భాగ్యాన్ని కోల్పోతారు. ఇది ఒక రకంగా భక్తుల సెంటిమెంట్‌ను దెబ్బతీయడమే. పూజారులు సహజంగానే దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇలాంటి పిచ్చి ఏర్పాట్లు చేయడానికి వీలులేదని తెగేసి చెప్పారు. దీనితో ఈ ప్రతిపాదను వాయిదా వేశారు.

కౌంటర్లు ఏమయ్యాయి?

వనదేవతలకు మొక్కులు సమర్పించుకున్న తర్వాత భక్తులకు బంగారం దొరకడమే గగనమవుతుంది. గద్దెలపై ఉన్న బంగారాన్ని తీసుకోవడానికి వీలు లేకుండా చుట్టూ బారికేడ్లు ఉంటాయి. అయినా వాటిని చేధించుకొని వెళ్లి చేతికి అందినంత తీసుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. ఈ క్రమంలో తొక్కిసలాట జరగడం, కొంత మంది భక్తులు గాయపడడం తరుచూ జరుగుతూ ఉంటుంది. గద్దెల వద్ద ఉన్న వలంటీర్లను భక్తులు ఎంత బతిమిలాడినా బంగారాన్ని ఇవ్వడానికి నిరాకరిస్తారు. భక్తులు గద్దెలపై విసిరిన వెండి, బంగారం, నగదును ఏరుకోవడానికి పోటీ పడే వలంటీర్లు వారికి కాసింత బంగారాన్ని ఇవ్వడానికి మాత్రం నిరాకరిస్తారు. దీనితో చాలా మంది భక్తులు అమ్మవార్ల గద్దెల మీది బంగారం దొరక్క నిరాశగా వెనుదిరుగుతారు. తల్లులకు సమర్పించిన బంగారాన్ని పంచిపెట్టే వ్యవస్థ జాతరలో ఇప్పటి వరకు లేదు. ఈ అంశం ప్రతీసారి అధికారుల సమీక్షా సమావేశంలో చర్చకు వచ్చినా పట్టించుకోవడం లేదు. అయితే గతంలో భక్తులకు బంగారం పంచిపెట్టడానికి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కానీ ఇది ఇప్పటివరకు ఆచరణలోకి రాలేదు. కోట్లాది రూపాయలు వెచ్చించి జాతరలో ఎన్నో పనులు చేసే అధికారులు బంగారం పంపిణీకి ఏర్పాట్లు ఎందుకు చేయరన్న భక్తులు ప్రశ్నిస్తున్నారు. ప్రసాద కౌంటర్లను ఏర్పాటు చేసినట్లయితే గద్దెల వద్ద బంగారం కోసం భక్తులు ఎగబడే పరిస్థితి తొలగిపోతుంది. రద్దీకూడా తగ్గుతుంది.



క్యూలైన్లలో నరకం

తల్లుల దర్శనానికి క్యూలైన్లలో నిలబడే భక్తులు ప్రతీసారి నరకాన్ని చవిచూడాల్సి వస్తోంది. చాంతాడంతటి క్యూలో గంటల తరబడి వేచిచూసే భక్తులకు అక్కడ తాగడానికి కనీసం మంచినీరు కూడా దొరకదు. అనేక మెలికలు తిరిగి ఉండే ఈ క్యూలో ఒక్కసారి చిక్కుకుంటే మధ్యలో వెనక్కి తిరిగి రావడం ఏ మాత్రం కుదరదు. గద్దెల వద్దకు చేరుకునే వరకు వేచి ఉండాల్సిందే. మధ్యలో బయటకు వచ్చేందుకు దారిలేక భక్తులు అనేక అవస్థలు పడుతుంటారు. తాగడానికి మంచినీరు దొరక్క దప్పికతో గొంతు ఎండిపోయి విలవిలలాడుతూ ఉంటారు. తాగునీటిని అందించేందు క్యూలైన్ల వద్ద ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాల్సి ఉన్నా అధికారులు దానిని పట్టించుకోరు. క్యూ మధ్యలో ఉన్నవారికి బయటి నుంచి తాగునీటిని అందించడం కష్టమే. ఈ దృష్ట్యా క్యూలైన్ల మధ్య పలు చోట్ల తాగునీటి నల్లాలను, లేదా నీటి డ్రమ్ములను గానీ ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ప్రాథమిక చికిత్స

క్యూలైన్లలో నిల్చున్నవారు అస్వస్థతకు గురైతే తక్షణం వైద్య సదుపాయం అందించే ఏర్పాట్లు కూడా చేయడం లేదు. జాతర ప్రాంగణంలో ప్రత్యేకంగా ఆస్పత్రిని, అక్కడక్కడ ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసినా క్యూలైన్ల మధ్య ఇలాంటి సౌకర్యం కల్పించడం లేదు. క్యూలైన్లలో విపరీతమైన ఒత్తిడి ఉంటుంది. గాలి సరిగా ఆడదు. పైగా ఉక్కపోత. గంటల తరబడి వేచి ఉండడం వల్ల శారీరక అలసట. దీనితో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు. వృద్ధులు, మహిళలు, పిల్లలు అస్వస్థతకు గురికావడం తరుచూ జరుగుతుంటుంది. వారిని పద్మవ్యూహం లాంటి క్యూలైన్ నుంచి బయటకు తీసుకురావడం అంటే.. కురుక్షేత్రంలో యుద్ధం చేసినట్టే. కష్టపడి బయటకు తీసుకువచ్చేలోగా వారి ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించి మృత్యువాత పడ్డ సంఘటనలు కూడా ఉన్నాయి. అందువల్ల క్యూ మధ్యలోనే అక్కడక్కడ ప్రాథమిక చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

మార్గమధ్యలో దాహం.. దాహం

మేడారం జాతరకు అటవీ గ్రామాల మీదుగా వచ్చే భక్తులు మార్గమధ్యలో తాగునీటి ఇబ్బందులను తప్పడం లేదు. కమలాపూర్ క్రాస్‌రోడ్డు మీదుగా రాంపూర్, చికినెపల్లి, గొల్లబుద్దారం, దూదేకులపల్లి, బయ్యక్కపేట, మీదుగా నార్లాపూర్ నుంచి మేడారం చేరుకునే భక్తులు తాగునీటి సదుపాయం లేక మార్గ మధ్యలో దాహంతో అల్లాడిపోతుంటారు. పది నుంచి పదిహేను కిలోమీటర్ల దూరం వరకు మార్గ మధ్యలో ఎక్కడా ఆగునీటి వసతిలేక ఇబ్బందులు పడుతుంటారు. ఈ మార్గంలో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చిపోతుంటారు. చేతిపంపులను ఏర్పాటు చేసినా మరమ్మతులు లేక అవి సరిగా పని చేయవు. జాతర సమీపిస్తున్నందు వల్ల ఈ రహదారిలో తాగునీటి వసతి కల్పించడంతోపాటు తిరుగు ప్రయాణంలో భక్తులు సేద తీరేందుకు వీలుగా తాత్కాలికంగా షెడ్లు వేయాలని భక్తులు కోరుతున్నారు.

ఎత్తుబంగారానికి ఆధార్ తప్పనిసరి

మేడారం జాతరలో ఎత్తు బంగారం సమర్పించుకునే భక్తులకు కొత్తగా ఆధార్ తిప్పలు వచ్చి పడ్డాయి. మేడారం సమక్క-సారలమ్మ జాతరలో ఎక్కువగా భక్తులు చెల్లించే మొక్కు ఎత్తు బంగారాన్ని తల్లులకు సమర్పించుకోవడం. ఇప్పుడు ఈ మొక్కు చెల్లింపునకు ఎక్సైజ్ అధికారులు ఆధార్ లంకె పెట్టారు. ఎత్తు బంగారం కొనేవారు ఆధార్‌కార్డును తప్పని సరి చూపించాల్సిందే. లేదంటే ఎత్తుబంగారం కొనుగోనడానికి వీలు కాదు. బెల్లం అమ్మే దుకాణాల్లో ఎత్తుబంగారం కొనుగోలు చేసే భక్తులు ఆధార్‌కార్డును విధిగా చూపించాలి. ఆ కార్డులోని వివరాలను రాసుకున్న తర్వాతే వ్యాపారులు వారికి ఎత్తు బంగారం తూకం వేస్తారు. గుడుంబా తయారీని అడ్డుకునేందుకే ఈ నిబంధన పెట్టామని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు.

బస్సుల సంఖ్య పెంచాలి

మహాలక్ష్మీ పథకం పుణ్యమా అని ఆర్టీసీ బస్సులో మహిళలు ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు లభించినందువల్ల ఈ సారి మేడారానికి వచ్చే మహిళల సంఖ్య పెరగవచ్చునని భావిస్తున్నారు. ఒక వేళ అదే జరిగితే ఆ మేరకు బస్సుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఏర్పడుతుంది. ప్రతీసారి జాతరకు ఆర్టీసీ మూడు వేల బస్సులను నడుపుతుంది. బస్సుల ద్వారా సుమారు 20 లక్షల మందికిపైగా భక్తులు జాతరకు వస్తుంటారు. ఈ సారి వీరి సంఖ్య 30 లక్షలకు చేరవచ్చునని ఆర్టీసీ అంచనా వేస్తోంది. దీనితో బస్సుల సంఖ్యను మరింత పెంచే విషయమై ఆలోచిస్తోంది. అయితే ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఉన్నందువల్ల గతంలో జాతరకు రావడానికి పెద్దగా ఆసక్తి చూపని మహిళలు సైతం ఈ ఉచిత వెసులుబాటు వినియోగించుకొని జాతర బాట పట్టవచ్చునని భావిస్తున్నారు. ఈ దృష్ట్యా రద్దీ పెరిగే అవకాశం ఉన్నందువల్ల మహిళల కోసం ప్రత్యేకంగా మరికొన్ని బస్సులను వేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.



జాతరలో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న భక్తులు (ఫైల్)



మేడారం బస్‌స్టేషన్ నుంచి బస్సు దిగి వస్తున్న ప్రయాణికులు

సమన్వయంతో జాతరను విజయవంతం చేద్దాం..

జాతర నిర్వహణకు పటిష్ట పోలీసు బందోబస్తు : ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్



సమావేశంలో మాట్లాడుతున్న ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్

దామెర, ఫిబ్రవరి 7: ఆసియా ఖండంలోనే అతి పెద్ద మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరను పోలీసు శాఖ, మీడియా సమన్వయంతో విజయవంతం చేద్దామని ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్ ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం హనుమకొండ జిల్లా దామెర మండలం దుర్గంపేట శివారులోని ఎస్ఎస్ఆర్ హోటల్‌లో పోలీసు శాఖ, మీడియా ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్ హాజరై, మేడారం జాతర నిర్వహణపై పలు అంశాలపై చర్చించారు. మహాజాతర సజావుగా సాగేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటే బాగుంటుందనే అంశంపై ఇష్టాగోష్ఠి నిర్వహించారు. ఇందులో భాగంగా గత జాతరలో ఏవైనా ఇబ్బందులు, తలెత్తిన సమస్యలపై ఆయా దినపత్రికలు, మీడియా ఛానళ్ల ప్రతినిధులతో కాసేపు చర్చించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. మేడారం మహా జాతరలో మీడియా ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని స్పష్టం చేశారు. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఎక్కడా కూడా ఇబ్బందులు కలుగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రతీ నాలుగు కిలోమీటర్ల దూరంలో ఓ పార్కింగ్ సెక్టార్, ప్రతీ సెక్టార్ ఓ డీఎస్పీ స్థాయి అధికారి ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తారని వివరించారు. ప్రత్యేక నిఘా చర్యల్లో భాగంగా సీసీ కెమెరాలు, హెల్ప్ డెస్క్‌లు, డ్రోన్లను వినియోగిస్తూ.. కమాండ్ కంట్రోల్ రూమ్‌ల ద్వారా పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అలాగే గత జాతరలో 1200 ఎకరాల పార్కింగ్ స్థలానికి అదనంగా మరో 500ల ఎకరాల పార్కింగ్ స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. పటిష్ఠమైన పోలీసు బందోబస్తు చర్యల్లో భాగంగా 14వేల మంది పోలీసులకు తోడు మరో 500 మంది సీసీఎస్ పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని వివరించారు. అలాగే జాతరకు వచ్చే వారు మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని సూచించారు. పోలీసు శాఖ మార్గదర్శకాలను విధిగా పాటించాలని కోరారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో వన దేవతలను దర్శించుకునేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

కాగా, మేడారం జాతరలో విధి నిర్వహణలో మీడియా ప్రతినిధులు పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఎస్పీ శబరీష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందిస్తూ.. మీడియా ప్రతినిధులకు ప్రత్యేక పాసులు కేటాయించడం కోసం ఏర్పాట్లు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో డీపీఆర్‌వో లక్ష్మణ్ రావు, మేడారం జాతర లైజనింగ్ ఆఫీసర్ (దుగ్గొండి సీఐ) పి.కిషన్, స్పెషల్ బ్రాంచి సీఐ కిరణ్‌కుమార్, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

మేడారం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి..

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి



మేడారం, ఫిబ్రవరి 7: మహాజాతరను నిర్వహిస్తున్న నేపథ్యంలో మేడారం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మేడారంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ఆమె బుధవారం ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం బుధవారం శ్రీకారం చుట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం ఈనెల 15 వరకు కొనసాగనుంది. ములుగు జిల్లాకు సంబంధించిన కార్యక్రమాన్ని కలెక్టర్ మేడారం నుంచి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలని ఆదేశించారు. అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి చెత్తా చెదారాన్ని, పిచ్చి మొక్కలను తొలగింపజేయాలని అన్నారు. తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా కృషి చేయాలన్నారు. మేడారంలో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని మరింత పకడ్బందీగా చేపట్టాలన్నారు. అలాగే మహాజాతరలో ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, డీపీవో వెంకయ్య, డీఎల్‌పీవో స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు.

దొంగలున్నారు.. జర భద్రం



మేడారం, ఫిబ్రవరి 7: మహాజాతరకు ముందే మేడారంలో రద్దీ పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి వనదేవతలను దర్శించుకుంటున్నారు. ఇదే అదునుగా భావించి దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. దీంతో భక్తులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. 'దొంగలున్నారు జాగ్రత్త' అంటూ భక్తులను అలర్ట్ చేస్తున్నారు. గత జాతరల్లో దొంగతనాలకు పాల్పడిన పోలీసులకు చిక్కిన వారి ఫొటోలతో ఫ్లెక్సీలను రూపొందించి మేడారంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. అలాగే దేవాదాయ శాఖ అధికారులు సైతం దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ మైకుల ద్వారా భక్తులను అప్రమత్తం చేస్తున్నారు.

మేడారం ట్రస్ట్ బోర్డు లేనట్టేనా?

(5వ పేజీ తరువాయి)

పునరుద్ధరణ కమిటీనో నియమించి చేతులు దులుపుకుంటారనే చర్చ సాగుతోంది.

ట్రబులే..

మేడారం మహాజాతర ట్రస్ట్‌బోర్డుకు ఉన్న అధికారాలు పునరుద్ధరణ కమిటీకి ఉండవు. ట్రస్ట్ బోర్డు జాతరకు వచ్చే అభివృద్ధి నిధులపై సమీక్షించే అధికారం ఉంది. పనుల నాణ్యతను పరిశీలించటమే కాకుండా.. కొత్త పనులు చేపట్టేలా సమీక్ష సమావేశంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తుంది. అధికారులు నిర్వహించే ప్రతీ రివ్యూలోనూ అభివృద్ధి, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపైన ప్రశ్నించటం, సలహాలు, సూచనలు ఇస్తుంది. కానీ, పునరుద్ధరణ కమిటీకి ఇవేం లేవు. కేవలం జాతరను ఎలా సక్సెస్ చేయాలో మాత్రం చూస్తుంది. అభివృద్ధి పనులకు ఈ పునరుద్ధరణ కమిటీకి సంబంధం ఉండదని సమాచారం. అధికారులపై ఒత్తిడి తెచ్చి భక్తులకు సౌకర్యాలు కల్పించాలని కోరే పరిస్థితి కూడా లేదని సమాచారం. ఓ రకంగా ఈ పునరుద్ధరణ కమిటీని ఉత్సవ కమిటీగా భావిస్తారని తెలిసింది. దీంతో మహాజాతరలో పాలకమండలి పర్యవేక్షణ లేకపోతే అభివృద్ధి నాణ్యతకు తూట్లు పడే అవకాశం ఉంది. ప్రస్తుతం మేడారం మహాజాతరలో రూ.105కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వీటి పర్యవేక్షణపై పునరుద్ధరణ కమిటీకి ఎలాంటి అధికారం లేకపోవటంతో నాణ్యతలోపంతో పాటు ఇతర సమస్యలపై ప్రశ్నించేది ఎవరనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఆన్‌లైన్ ద్వారా నిలువెత్తు బంగారం

మేడారం జాతరలో భక్తులకు వెసులుబాటు

బెల్లం డబ్బులు చెల్లిస్తే తల్లులకు సమర్పణ

పోస్టల్ ద్వారా భక్తులకు ప్రసాదం

హనుమకొండ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతరలో వనదేవతలకు ఆన్‌లైన్ ద్వారా బంగారం (బెల్లం) సమర్పించే వీలును ప్రభుత్వం కల్పించింది. పోస్టుద్వారా ప్రసాదాన్ని స్వీకరించే అవకాశాన్ని కూడా అందుబాటులోకి తెచ్చింది. ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు లక్షలాదిమంది భక్తులు తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఒరిస్సా జార్ఖండ్ తదితర రాష్ట్రాల నుంచి కూడా తరలివస్తారు. జాతరకు వచ్చే భక్తులు తమ ఎత్తు బంగారం (బెల్లం)తల్లులకు సమర్పించాలని మొక్కుకోవడం ఆనవాయితీ. ఎత్తుబెల్లంతో వనదేవతలకు సందర్శించుకొని మొక్కు చెల్లించుకోవడం వీలుకాని భక్తుల సౌకర్యార్థం దేవాదాయ శాఖ వెసులుబాటు కల్పించింది. వీరి కోసం ఐటీశాఖ సహాయంతో టీ మీసేవా మొబైల్ యాప్ (టీఏపీపీ)ను రూపొందించింది. ఈయాప్ ద్వారా బెల్లాన్ని బుక్‌చేసి దేవతలకు సమర్పించవచ్చు. ఎత్తు బెల్లం ఇవ్వాలనుకునే ఒక వ్యక్తి 50 కిలోల బరువు ఉన్నాడనుకుంటే కిలోకు రూ.60 చొప్పున మొత్తం రూ.3000ను అలాగే మీసేవా చార్జీ కింద రూ.35, పోస్టల్ చార్జీల కింద రూ.100 కలిపి మొత్తం రూ.3,135 చెల్లిస్తే పోస్టల్ కొరియర్ ద్వారా బంగారం భక్తులకు అందుతుంది. మీ సేవా సెంటర్‌కు వెళ్లి మీసేవా-సిటిజన్ వెబ్‌సైట్‌ను తెరిచి లేదా మీ సేవా వెబ్‌సైట్‌లో http://tsmeesevatelangana.gov.inలో లాగిన్ అయి కూడా ఈ సేవలను పొందవచ్చు. లేదా గూగుల్ ప్లే స్టోర్ నుంచి టీఏపీపీ పోలియోను యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని కూడా ఈ సేవలను పొందవచ్చు.

నాణ్యత లేని చలువ పందిళ్లు



గద్దెల వద్ద వెదురు బొంగులతో ఏర్పాటు చేస్తున్న చలువ పందిళ్లు

మేడారం, ఫిబ్రవరి 7: మేడారంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లల్లో నాణ్యత లోపించిందని తెలుస్తోంది. నాసిరకమైన వెదురు బొంగులతో ఏర్పాటు చేయడంతో ఇవి ప్రమాదకరంగా మారాయని భక్తులు భయాందోళన చెందుతున్నారు. సుబాబుల్, జామాయిల్ కర్రలను ఉపయోగించకుండా అటవీ ప్రాంతంలో ఉచితంగా లభ్యమైన వెదురు బొంగును కాంట్రాక్టర్ వాడటం సరికాదని, ఇవి విరిగిపోయే ప్రమాదం ఉందని భక్తులు అంటున్నారు.

సోషల్ మీడియాకు విద్యార్థులు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఏసీపీ విజయ్‌కుమార్

సుబేదారి, ఫిబ్రవరి 7: విద్యార్థులు ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సైబర్ క్రైం ఏసీపీ కె. విజయ్‌కుమార్ సూచించారు. వరంగల్ ములుగు రోడ్‌లోని ఎల్బీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు ఆధ్వర్యంలో బుధవారం సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. సైబర్ క్రైమ్‌పై ప్రతీ ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని, అపరిచిత వ్యక్తులతో వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లలో చాటింగ్ చేయకూడదన్నారు. ఈ అవగాహన సదస్సులో సీఐలు రవికుమార్, వెంకటేశ్వర్లు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్‌రెడ్డి, కళాశాల పీడీ బి.ప్రభాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

హనుమకొండ అర్బన్, ఫిబ్రవరి 7: కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేశ్ డిమాండ్ చేశారు. బుధవారం ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలో 8వ తేదీన ఆల్ ట్రేడ్ యూనియన్ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో డిసెంట్ ఫంక్షన్‌హాలులో జరిగే సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సదర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. 20 యేళ్లుగా చాలీచాలని వేతనాలు తీసుకుంటూ పేద, బడుగు, బలహీన వర్గాలకు సేవ చేస్తున్నారని తెలిపారు. కనీసం వేతనం అందజేసి న్యాయం చేయాలని కోరారు. ఈ నెల 16న జరిగే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చా రు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సాంబరాజు శివానందం, మంద సంజీవ, ఎండి.యాకూబ్, వీరగోని రంజిత్, రాజు, యుగంధర్, శ్రీనివాస్, జయప్రకాశ్, శివ, మల్లేశ్, రమేశ్ పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిన సెలవు ప్రకటించాలి

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 7: సేవాలాల్ మహారాజ్ జయంతి రోజున ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని లంబాడ హక్కుల పోరాట సమితి నాయకులు జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోరిక ఈశ్వర్‌సింగ్ నాయక్ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 15వ తేదీన సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా సెలవు దినంగా ప్రకటించాలన్నారు. హనుమకొండలోని గిరిజన భవన్‌లో జరిగే సేవాలాల్ జయంతి ఉత్సవాలకు కలెక్టర్‌ను ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బానోత్ నవీన్‌నాయక్, ఈశ్వర్‌సింగ్ నాయక్ పాల్గొన్నారు.

రైతులందరికీ ఒకేసారి రుణమాఫీ చేయాలి

వడ్డెపల్లి, ఫిబ్రవరి 7: పేద, మధ్యతరగతి రైతులందరికి ఒకేసారి రుణమాఫీ చేయాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల వెంకటయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం రైతులు పెట్టిన పెట్టుబడికి 50శాతం కలిపి మద్దతు ధర గ్యారంటీ చేసే చట్టం చేయాలని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని రైతాంగానికి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతాంగ సమితి నాయకులు ఇంద్రసేనం, కోడెపాక బాబు, మేకల గణేష్, బొమ్మకంటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బల్దియాలో రెవెన్యూ మేళా

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 7: జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన రెవెన్యూ మేళాలో ప్రజలు వివిధ అంశాలపై ఫిర్యాదులు చేశారు. బుధవారం హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో జరిగిన మేళాలో ఆస్తి పన్ను, ఇంటి నెంబరు, పేరు మార్పిడి, ఖాళీ స్థలానికి పన్ను మదింపు తదితర అంశాలకు సంబంధించి ప్రజలు ఫిర్యాదులు అందచేశారు. ప్రజలు ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు అదనపు కమిషనర్ అనిసూర్ రషీద్ వెల్లడించారు. అ కార్యక్రమంలో పర్యవేక్షకులు అనిల్, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

ఫంక్షన్ హాల్ సీజ్

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 7: మడికొండలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌ను జీడబ్ల్యూఎంసీ అధికారులు బుధవారం సీజ్ చేశారు. ఆస్తి పన్నులు చెల్లించని క్రమంలో సీజ్ చేసినట్లు అదనపు కమిషనర్ రవీందర్ తెలిపారు. ఫంక్షన్ హాల్స్ యజమానులు ఆస్తి పన్ను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

కఠోర సాధనతో క్రీడల్లో లక్ష్యాన్ని చేరుకోవచ్చు

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు



అండర్-15 బాలికల రెజ్లింగ్ విభాగంలో తలపడుతున్న క్రీడాకారులు

హనుమకొండ స్పోర్ట్స్, ఫిబ్రవరి 7: క్రీడాకారులు క్రీడల్లో కఠోరసాధన చేయడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చునని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలను బుధవారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనగా ప్రారంభించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారతదేశ సంస్కృతి సంప్రదాయానికి ప్రతీకైన రెజ్లింగ్ క్రీడలో జాతీయస్థాయిలో రాణించి తెలంగాణకు కీర్తి ప్రతిష్టలు తీసుకరావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడలతో స్నేహపూర్వక సంబంధాలు పెంపొందుతాయని, క్రీడల్లో ప్రతిభ కనబర్చిన యువత అన్ని రంగాలలో రాణించే అవకాశం ఉంటుందన్నారు. తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. అడహక్ కమిటీ రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు రాష్ట్రస్థాయి రెజ్లింగ్ క్రీడాపోటీలను హనుమకొండలో నిర్వహించామన్నారు. క్రీడా పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పించడమే కాకుండా ఎటువంటి ప్రవేశ రుసుము తీసుకోవడం లేదని స్పష్టం చేశారు.

రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. కరీం మాట్లాడుతూ.. రెండురోజులు పాటుగా నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్-15, 20 బాలబాలికల రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో తొలి రోజు అండర్-15 బాలబాలికలకు పోటీలు నిర్వహించామన్నారు. అండర్-15 బాలుర ఫ్రీస్టైల్, గ్రీకోరోమన్, బాలికలకు ఫ్రీస్టైల్‌లో నాకౌట్ పద్ధతిన నిర్వహించిన పోటీలలో రాష్ట్రంలోని 33జిల్లాల నుంచి 250మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఇక్కడ రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఈ నెల 11 నుంచి 17వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

ఈ సందర్భంగా అతిథులను అసోసియేషన్ బాధ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా క్రీడల అధికారి అశోక్‌కుమార్, రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అజీజ్‌ఖాన్, బైరబోయిన కైలాస్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు వీరగంటి రవీందర్, చీకటి ఆనంద్, విద్యాసాగర్, సతీష్, వివిధ జిల్లాలకు చెందిన రెజ్లింగ్ అసోసియేషన్ బాధ్యులు, కోచ్‌లు పాల్గొన్నారు.

అమృత్ ప్రతిపాదనలు సిద్ధం చేయండి : మేయర్



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 7: అమృత్ 2.3 పథకం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జీడబ్ల్యూఎంసీ అధికారులను మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. బుధవారం హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో ఆమె సమావేశమయ్యారు. తాగు నీటి సరఫరా వ్యవస్థ పటిష్టానికి కేంద్రం తొలి దశలో నిధులు కేటాయించనున్న క్రమంలో ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. నీటి ఎద్దడి ప్రాంతాలను పరిగణనలోకి తీసుకొని ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈలు శ్రీనివాసరావు, రాజయ్యతో పాటు పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థుల సమస్యలను పరిష్కారించాలి



పరిపాలన భవనంలో నిరసన చేస్తున్న ఫార్మసీ విద్యార్థులు

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 7: కేయూ పరిధిలో ఫార్మసీ విద్యార్థులకు వెంటనే డిటెన్షన్ విధానాన్ని ఎత్తివేసి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని బుధవారం కేయూ పరిపాలన భవనంలో ఏబీవీపీ నేతృత్వంలో ఫార్మసీ విద్యార్థులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచర్ల రాంబాబు మాట్లాడుతూ.. డిటెన్షన్ విధానం వల్ల నష్టపోయిన విద్యార్థులను వెంటనే ప్రమోట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) నిబంధనల మేరకు విద్యార్థులకు సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించాలని అన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను కాపాడాలని కోరారు. విద్యార్థుల నిరసన ఆందోళన నేపథ్యంలో కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి విద్యార్థుల వద్దకు వచ్చి శాంతింపచేశారు. వారం రోజుల్లో సమస్యలను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల సమస్యలపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ వర్సిటీ కార్యదర్శి బొండ్ల శ్రావణ్ కుమార్, విభాగ్ కన్వీనర్ నిఖిల్, ప్రశాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రణయ్, వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, విష్ణు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ టికెట్ కేటాయించండి..

- హరీశ్‌రావుకు జోరిక రమేష్ వినతి



హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 7: మాజీ మంత్రి టి.హరీశ్‌రావును మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్ బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. తనకు బీఆర్ఎస్ నుంచి వరంగల్ ఎంపీ టికెట్ కేటాయించాలని వినతి పత్రం ఇచ్చారు. తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యార్థి నాయకుడిగా పాల్గొన్న తనకు వరంగల్ ఎంపీ నియోజకవర్గ పరిధిలో మంచి సంబంధాలున్నాయని, తన అవకాశం కల్పించాలని కోరారు. అధిష్టానం దృష్టికి విషయాన్ని తీసుకెళతానని హరీశ్‌రావు తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ బోజరాజు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 7: విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ బోజరాజు విద్యార్థులకు సూచించారు. రోడ్డు సేఫ్టీ అవేర్నెస్ ఉత్సవాల్లో భాగంగా హనుమకొండ ప్రభుత్వ మర్కజీ హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కగిలించారు. ఈ కార్యక్రమానికి ఏసీపీ హాజరై మాట్లాడారు. విద్యార్థులు మద్యం సేవించి వాహనాలు నడపడం, లైసెన్స్ లేకుండా వాహనం నడపడం, మైనర్ డ్రైవింగ్, త్రిపుల్ రైడింగ్, స్పీడ్ డ్రైవింగ్, జీబ్రా క్రాసింగ్, రోడ్డుపై స్టంట్స్ వేయడం, పరిమితికి మించి ఆటోలలో ప్రయాణం నేరమని అన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా విస్మరిస్తే కేసుల్లో చిక్కడం వల్ల ఉన్నత చదువులు, ఉద్యోగాలు రావని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ రామారావు, ఆర్ఎస్ఐలు అర్జం వేణు. మనోజ్‌రెడ్డిలతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాల తొలగింపు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 7: వరంగల్ మహానగర పాలక సంస్థ అధికారులు బుధవారం హనుమకొండలోని గుండ్లసింగారంలో అనధికార నిర్మాణాలను తొలగించారు. ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు ఉన్నట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు గుర్తించారు. అక్రమ నిర్మాణాలు జరిపితే కూల్చివేయడంతో పాటు క్రిమినల్ కేసులు పెడతామని సిటీ ప్లానర్ వెంకన్న పేర్కొన్నారు.

ముగిసిన సదరం క్యాంప్

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 7: హనుమకొండలోని ఇండోర్ స్టేడియంలో మూడు రోజులపాటు నిర్వహించిన సదరం క్యాంపులో సుమారు 1,056 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డీఆర్‌డీవో శ్రీనివాస్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంజీఎం, నేత్ర వైద్యశాల, ప్రభుత్వ మెటర్నిటీ హాస్పిటల్ వైద్యులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. శారీరక, మానసిక, వినికిడి, అంధత్వలోపం ఉన్న దివ్యాంగులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. సదరం క్యాంపులో డీఆర్‌డీఏ అధికారులు ఆండాలు, శ్రీనివాస్, పూర్ణచందర్, గురుప్రసాద్, అబ్దుల్ బారి, మెహర్‌వాణి తదితరులు పాల్గొన్నారు.

కిట్స్‌లో రక్తదాన శిబిరం

హసన్‌పర్తి, ఫిబ్రవరి 7: ఎర్రగట్టుగుట్ట వద్ద గల కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి.విజయ్‌చందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రక్తదానం ద్వారా ప్రతీ ఒక్కరు తమ సామాజిక బాధ్యతను నిరూపించుకోవాలన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజసేవ ద్వారా విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందన్నారు. ఈ సందర్భంగా 530 యూనిట్లను సేకరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యుడు ఈవీవీ శ్రీనివాస్, హనుమకొండ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ రాజనర్సయ్య, లయన్స్‌క్లబ్ సభ్యులు కె.వెంకటరెడ్డి, పి.వెంకటనారాయణగౌడ్, వద్దిరాజు శ్రీకాంత్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సీహెచ్ సతీష్‌చంద్ర, ఎన్‌సీసీ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

11న సూపర్ సింగర్స్ సెలక్షన్స్

వడ్డెపల్లి, ఫిబ్రవరి 7: అమర గాయకులు ఘంటసాల వెంకటేశ్వర్‌రావు గౌరవార్థం ఆయన 50వ వర్థంతి సందర్భంగా ఈ నెల 11న హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి కాలేజీ ఆడిటోరియంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కాకతీయ మ్యూజికల్ క్లబ్- వరంగల్, శ్రీసాయి మీరా కల్చరల్ సొసైటీ హనుమకొండ సంయుక్త ఆధ్వర్యంలో సూపర్ సింగర్స్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు కాకతీయ మ్యూజికల్ క్లబ్ అధ్యక్షుడు వెనకపల్లి తిరుపతయ్య, గౌరవ అధ్యక్షుడు మహ్మద్ సిరాజొద్దీన్ తెలిపారు. బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రవేశ రుసు ము లేదని చెప్పారు. విజేతలకు గాన కళాప్రపూర్ణ డాక్టర్ శరత్‌చంద్ర చేతుల మీదుగా బహుమతుల ప్రదానోత్సవం చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్ నంబర్ 99494 39268లో సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. సమావేశంలో రంగు రఘుపతి, శ్రీమన్నారాయణ, లక్ష్మీనారాయణ, పోతనాచారి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

ధర్మసాగర్, ఫిబ్రవరి 7: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల పోస్టర్‌ను సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ కన్వీనర్ అరూరి సుమలత బుధవారం ఆవిష్కరించారు. హనుమకొండ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 9వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర విభాగం సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలు ధర్మసాగర్ బాలుర పాఠశాలలో ఈ నెల 9, 10, 11 మూడు రోజుల పాటు జరుగుతున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధర్మప్రకాష్, ఉపాధ్యాయులు స్వర్ణలత, పద్మజ, కిరణ్మయి పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖలో డిప్యూటేషన్ల రద్దు

హనుమకొండ అర్బన్, ఫిబ్రవరి 7: వైద్య, ఆరోగ్యశాఖలోని వివిధ విభాగాల్లో జారీచేసిన వర్క్ ఆర్డర్లు అన్నీ రద్దయ్యాయి. ఈ మేరకు వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి మెమో నెంబరు 1500/ ఎఫ్ 1/ 2004ను బుధవారం జారీ చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతో వర్క్ ఆర్డర్లు డిప్యూటేషన్లు అన్నింటినీ రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనెల 8న సాయంత్రం 5 గంటలలోగా ఉద్యోగులందరూ తమ యథాస్థానాల్లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. హనుమకొండ, వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలోని వివిధ జిల్లాల నుంచి అనేక మంది ఉద్యోగులు వర్క్‌ఆర్డర్‌తో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరంతా తమ రెగ్యులర్ పోస్టుల్లో చేరాల్సి ఉంటుంది.

ఈవీఎంలపై అవగాహన కలిగి ఉండాలి

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 7: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఈవీఎంపై)పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఈవీఎం ప్రదర్శన కేంద్రాన్ని ఏర్పాటు చేయగా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈవీఎంలు, బ్యాలెట్ కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌ల పనితీరును పరిశీలించారు. ఓటు వేసే సమయంలో ఈవీఎంల పనిచేసే విధానాన్ని అధికారులకు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రదర్శనలో కేంద్రంలో ఎన్నికల విభాగం, అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీఆర్ఓ వైవి.గణేష్, సామాజికవేత్త ఇవి.శ్రీనివాసరావు, తహసీల్దార్ విజయ్ కుమార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రసాద్‌రావు, అధికారులు సురేశ్ కుమార్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో టెండర్లు

మడికొండ, పిబ్రవరి 7: మహాశివరాత్రి పురస్కరించుకుని మడికొండ మెట్టు రామలింగేశ్వరస్వామి, సీతారామంజనేయస్వామి క్షేత్రంలో ఈనెల 8న నిర్వహించాల్సి సీల్డ్ కం, బహిరంగ వేళం ఈ నెల 16న ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణ అధికారి కెశేషుభారతి తెలిపారు. లడ్డు, పులిహోర, కొబ్బరికాయలు వాహన పార్కింగ్, నడుపడానికి టెండర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కేయూ పరీక్షల నియంత్రణాధికారిగా నరసింహాచారి



మల్లారెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న నరసింహాచారి

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 7: కేయూ నూతన పరీక్షల నియంత్రణాధికారిగా కేయూకామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ ఎస్.నరసింహాచారి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి కార్యాలయంలో ఇప్పటి వరకు పరీక్షల నియంత్రణాధికారిగా విధుల్లో ఉన్న ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నరసింహచారిని కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారులు ప్రొఫెసర్ ఎస్.జ్యోతి, డాక్టర్ ఎం.తిరుమలదేవి, డాక్టర్ నరేందర్, డాక్టర్ చాడ రాధికారెడ్డి, ఓ.సారయ్యతో పాటు పలువురు అధ్యాపకులు, ఎన్జీవోస్ నేతలు, స్కాలర్స్, విద్యార్థి సంఘాల నేతలు పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. కాగా నరసింహచారి ఇటీవల టీఎస్ఐసెట్-24 కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించిన విషయం విదితమే.

కేయూ ఇంజనీరింగ్ కో-ఎడ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సదానందం

కేయూ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ మంచాల సదానందం నియమితులయ్యారు. ఈ మేరకు ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి నుంచి బుధవారం బాధ్యతలు చేపట్టారు. మంచాల సదానందం మహిళ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గానూ విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా వ్యవరించిన మల్లారెడ్డికి కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు.

వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఏటీబీటీ ప్రసాద్

కేయూ నూతన వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఇప్పటివరకు వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ భాస్కర్ నుంచి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏటీబీటీ ప్రసాద్‌ను కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ నేతృత్వంలో పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం జనరల్ సెక్రటరీ ఆర్‌డీ ప్రసాద్, డాక్టర్ దామెర భిక్షపతి, డాక్టర్ కుండ్లే మధుకర్‌రావు, డాక్టర్ చీకటి శ్రీనివాస్, డాక్టర్ జేత్య, డాక్టర్ భాస్కర్, కుమార్, రవీందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశనుంచే క్రమశిక్షణ అలవాటు చేయాలి

కాజీపేట, ఫిబ్రవరి 7 : క్రమశిక్షణ అనేది విద్యార్థి దశనుంచే పిల్లలకు టీచర్లు, తల్లిదండ్రులు అలవాటు చేయాలని దక్షిణ మధ్య రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.శ్రీలత అన్నారు. కాజీపేట రైల్వే రామకృష్ణ ప్రీ ప్రైమరీ, డీజిల్ కాలనీ శిషు విద్యా విహార్ వార్షిక దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు హాజరైన అర్. శ్రీలత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. 60 ఏళ్లుగా ఈ పాఠశాల నడపడం సంతోషంగా వుందన్నారు. అనంతరం చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులు క్యాష్ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి మంజులక మిశ్రా, డివిజన్ ప్రెసిడెంట్ మాలినీ జేన్, ట్రెజరర్ సుధ, జాయి ంట్ సెక్రటరీ తనూజ, ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌లు భారతి, రష్మి గంగేల్, సునీత, సుధాతోపాటు రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, ట్రెజరర్ ఇ.రాజేశ్వర్‌రావు, పేరెంట్స్, రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

కోమటిపల్లి బైపాస్‌లో రైల్వే సొరంగ మార్గం

(5వ పేజీ తరువాయి)

పనిలేకుండా రైళ్ల రాకపోకలు సాగుతాయి. ఉదాహరణకు కాజీపేట - హసన్‌పర్తి కోమటిపల్లి బైపాస్ మధ్య నిర్మించే ఈ టన్నల్ ఢిల్లీ నుంచి కాజీపేట మీదుగా సికింద్రాబాద్ వచ్చే రైలు నేరుగా సొరంగమార్గం మీదుగా మాత్రమే అప్ అండ్ డౌన్ రైలు రాకపోకలు సాగించవచ్చు. పై రైల్వే ట్రాక్‌లనుంచి వరంగల్ నుంచి, కాజీపేట నుంచి ఢిల్లీ వెళ్లే రైళ్లు ఎలాంటి ఆటంకం లేకుండా రాకపోకలు సాగించవచ్చు. రేల్ అండర్ రేల్ నిర్మాణంతో రైల్వేకు గంటలకొద్ది సమయం ఆదా అవుతుంది. సికింద్రాబాద్ నుంచి ఢిల్లీ, చెన్నై నుంచి ఢిల్లీ అప్ అండ్ డౌన్ ప్రతీరోజు సుమారు 100 వరకు రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి.. ఆర్‌యూఆర్ నిర్మాణంతో బైపాస్ రైళ్ల మళ్లింపు చర్యలు సులభంగా వుంటుందని అధికారులు అంటున్నారు. మరో రెండునెలల్లో ఈ సొరంగ మార్గం ట్రాక్ అందుబాటులోకి తేవడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

ఐనవోలు, ఫిబ్రవరి 7: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని టీపీటీఎఫ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నస్నెబోయిన తిరుపతి అన్నారు. టీపీటీఎఫ్ విద్యా మహాసభల ప్రచారంలో భాగంగా బుధవారం ఐనవోలులో రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సమీక్షలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ బడులు బలోపేతం కావాలంటే అంతరాలు లేని విద్యా ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకురావాలని అందుకోసం విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11, 12 తేదీలలో ఖమ్మంలో జరిగే రాష్ట్ర విద్యామహాసభలను విజయవంతం చేయాలని టీచర్లకు పిలుపునిచ్చారు. ఈ విద్యామహాసభల్లో సామాజిక, ఆర్థిక, విద్యారంగ, రాజకీయ అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో టీపీటీఎఫ్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి భీమళ్ల సారయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, కుమారస్వామి, హెచ్‌ఎం రామకృష్ణ, రవికుమార్, శ్రీనివాస్‌రాజు, వెంకటయ్య, రవీందర్, ఆనందం, కుమారస్వామి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

భారీగా సీఐల బదిలీలు

5వ పేజీ తరువాయి

టి.సురేష్- మిల్స్‌కాలనీ, కంప రవీందర్- వీఆర్ వరంగల్, ఎ.శ్రీనివాస్- పర్వతగిరి, కె.రామకృష్ణ- గీసుగొండ, కె.సూర్యప్రసాద్- మహిళా పీఎస్-1, జె. వెంకటరత్నం-పరకాల, సట్ల రాజు- స్టేషన్‌ఘన్‌పూర్, పి.దేవేందర్- వరంగల్ టాస్క్‌ఫోర్స్‌లను హైదరాబాద్‌లో రిపోర్టు చేయాలని సీపీ ఆదేశించారు.

బదిలీ అయిన సీఐల వివరాలు

పేరు	ప్రస్తుతం	బదిలీ ఐన ప్రదేశం
పి. మల్లయ్య	పీసీఆర్ వరంగల్	మిల్స్‌కాలనీ
టి. గోపి	హసన్‌పర్తి	మట్టెవాడ
ఎన్. వెంకటేశ్వర్లు	మట్టెవాడ	ఎస్‌బీ వరంగల్
వై. సతీష్	మహబూబాబాద్	హనుమకొండ
ఎన్. కరుణాకర్	హనుమకొండ	టాస్క్‌ఫోర్స్ వరంగల్
ఎన్. చంద్రమోహన్	సీసీఆర్‌బీ	నెక్కొండ సర్కిల్
ఇ. శ్రీనివాస్	మహబూబాబాద్	నర్సంపేట రూరల్
పి. కిషన్	నర్సంపేట రూరల్	ఏనుమాముల
ఎ. మహేందర్	ఏనుమాముల	ఎస్‌బీ వరంగల్
డి. రమణమూర్తి	మల్టీజోన్	నర్సంపేట టౌన్
జె. సురేష్	వీఆర్ వరంగల్	హసన్‌పర్తి
జి. సూర్యప్రకాశ్	భూపాలపల్లి	వర్ధన్నపేట
డి. ప్రతాప్	నిజామాబాద్	మడికొండ
జి. వేణు	మడికొండ	టాస్క్‌ఫోర్స్
ఎం. రవికుమార్	మల్టీజోన్	మామునూరు
వి. క్రాంతికుమార్	మామునూరు	ఎస్‌బీ వరంగల్
ముస్క రాజు	రామగుండం	స్టేషన్ ఘన్‌పూర్
డి. విశ్వేశ్వర్	పాలకుర్తి	ధర్మసాగర్
కె. శ్రీధర్‌రావు	దర్మసాగర్	మహిళా పీఎస్-1
ఎల్. రఘు	మల్టీ జోన్	జనగామ
ఇ. శ్రీనివాస్	జనగామ	రఘునాథ్‌పల్లి
ఎ. శ్రీనివాస్‌రెడ్డి	రఘునాథ్‌పల్లి	ఐటీ సెల్ వరంగల్
ఆర్. సంతోష్	ఐటీ సెల్ వరంగల్	ఆత్మకూరు
డి. రవిరాజు	ఆత్మకూరు	వీఆర్ వరంగల్
ఎం. అబ్బయ్య	కేయూ	పరకాల
జి. బాబులాల్	టాస్క్‌ఫోర్స్	గీసుగొండ
కె. శ్రీధర్	ఎస్‌బీ వరంగల్	వరంగల్ ట్రాఫిక్
వి. చేరాలు	సిద్దిపేట	వీఆర్ వరంగల్
జి. మహేందర్‌రెడ్డి	మల్టీజోన్	వీఆర్ వరంగల్

కౌన్సెలింగ్

పిల్లాడిలో ఆ అల్లరెందుకు?

డాక్టర్! మా అబ్బాయికి ఏడేళ్లు. కుదురుగా కూర్చోకుండా ఎప్పుడూ అల్లరి చేస్తూ ఉంటాడు. పిల్లలు అల్లరి చేయటం సహజమేలే! అని మొదట్లో సర్దుకుపోయాం. కానీ చూడబోతే వాడికేదో ఆరోగ్య సమస్య ఉన్నట్టు అనిపిస్తోంది. ఇలా హద్దుల్లేకుండా అల్లరి చేసే పిల్లల సమస్యను ఎలా అర్థం చేసుకోవాలి?

- ఓ సోదరి, విజయవాడ



మీరు చెప్తున్న లక్షణాలను బట్టి చూస్తుంటే మీ బాబు 'అటెన్షన్ డెఫిసిట్ డిజార్డర్‌'తో బాధ పడుతున్నట్టు అనిపిస్తోంది. కుదురుగా కూర్చోకోవటం, గట్టిగా అరుస్తూ పరిగెత్తుతూ ఉండటం, ఏ పని మీదా ఏకాగ్రత పెట్టలేకపోవటం... ఈ రుగ్మత లక్షణాలు. దీన్ని సరిదిద్దే చికిత్సలున్నా తల్లిగా మీరు బాబుతో మెలిగేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే బాబు పరిస్థితి త్వరగా మెరుగవుతుంది.

- డైలీ రొటీన్ తయారు చేసి దాన్ని అనుసరించేలా బాబుకు తర్ఫీదునివ్వండి.
- ఆరోగ్యకరమైన అలవాట్లు, పనులు నేర్పండి. ఉదాహరణకు మొక్కలు నాటించటం, తన గది తాను శుభ్రంగా పెట్టుకోవటం మొదలైనవి.
- వ్యాయామం, నిద్ర ఈ పిల్లలకు తగినంత అవసరం. బాగా నిద్ర పట్టేలా చేయాలంటే శరీరం అలసిపోయేలా వ్యాయామం చేయించాలి. బాగా నిద్ర పడితే చికాకు, విసుగు తగ్గుతాయి.
- జంక్, తీపి పదార్థాలను తగ్గించి తాజా ఆకుకూరలు, కూరగాయలు, ఇంట్లో వండిన పదార్థాలనే బాబుకు అలవాటు చేయండి.
- తోటి పిల్లలతో స్నేహంగా మెలగటంలో మెలకువలు, కలిసి ఆడుకోవటం, పంచుకోవటం మొదలైన విషయాలను నేర్పండి.

డాక్టర్ కిషోర్,
సైకియాట్రిస్ట్, హైదరాబాద్.

మొహం ఉబ్బిందా?

కొందరి మొహం చూడగానే లావు ఎక్కారని తెలిసిపోతూ ఉంటుంది. ఎప్పుడైనా అలాగ అనిపిస్తే ఏం చేయాలో పోష్టికాహార నిపుణులు సూచిస్తున్నారు.

క్యాలరీలు లెక్కించండి...
ప్రతి వ్యక్తికి అవసరమైన క్యాలరీల విలువ వేరుగా ఉంటుంది. అయితే ఎప్పుడైనా క్యాలరీలను తగ్గిస్తే అదనపు కొవ్వు కూడా తగ్గుతుంది. అందువల్ల లావు ఎక్కినట్లు అనిపిస్తే వెంటనే క్యాలరీలు లెక్కించుకోండి.

మందులూ కారణమే!
కొన్ని రకాల మందులు వాడితే మొహం ఉబ్బిపోతుంది. అందువల్ల మొహం ఉబ్బినట్లు అనిపిస్తే- మందులు కూడా కారణం కావచ్చు.



ఫైబర్ లేమి
జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేయటంలో ఫైబర్ చాలా కీలకమైన పాత్ర పోషిస్తుంది. అందువల్ల ఆహారంలో తగినంత ఫైబర్‌ను తీసుకోవాలి. ఒక వేళ తగినంత ఫైబర్ లేకపోయినా- మొహం ఉబ్బే అవకాశముంది.

ఉప్పుతో జాగ్రత్త
శరీరంలో ఉప్పు పెరిగిపోతే నీరు ఎక్కువగా బయటకు పోదు. నీరు ఎక్కువగా చేరితే మొహం ఉబ్బుతుంది. అందువల్ల ఎప్పుడైన మొహం ఉబ్బినట్లు అనిపిస్తే- ఆహారంలో ఉప్పును తగ్గించాలి.

ఎక్కువ నీరు తాగండి..
తక్కువ నీరు తాగటం మొదలెడితే శరీరంలో రకరకాల మార్పులు ఏర్పడతాయి. మన శరీరం నీటిని నిల్వ చేసుకోవటం మొదలుపెడుతుంది. దీని వల్ల మొహం ఉబ్బుతుంది.

నిద్ర తప్పనిసరి..
ప్రతి రోజు ఏడు గంటలు తప్పనిసరిగా నిద్రపోవాలి. లేకపోతే శరీరానికి తగినంత విశ్రాంతి దొరకదు. దీని ప్రభావం శరీరంలోని అవయవాలపై పడుతుంది. దీని వల్ల కూడా మొహం ఉబ్బే అవకాశముంది. అందువల్ల రోజుకు ఏడు గంటల నిద్ర తప్పనిసరి అని పోష్టికాహార నిపుణులు పేర్కొంటున్నారు.

ఆల్కాహాల్ ప్రభావం
ఆల్కాహాల్ తాగితే - దాని ప్రభావం వల్ల మొహం ఉబ్బుతుంది. అందువల్ల వీలైనంత వరకు ఆల్కాహాల్‌కు దూరంగా ఉండటం మంచిది.

అభిరుచి

'ఆధునిక సమాజంలో పనుల ఒత్తిళ్లతో మనం ఆహారం తినే తీరుతెన్నుల్లో అనేక మార్పులు వచ్చాయి. ఈ మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అందరికీ ఆరోగ్యకరమైన, రుచికరమైన వంటలను అందించటానికి ప్రయత్నిస్తున్నా' అంటారు వంటల పుస్తకాల రచయిత కరేన్ ఆనంద్. దేశంలోని వంటలపై సుమారు ఇరవై పుస్తకాలు రాసిన ఆమె... తాజాగా 'మసాలా మేమ్‌సాబ్' పుస్తకాన్ని విడుదల చేశారు. జైపూర్‌లో జరిగిన 'జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్' (జేఎల్‌ఎఫ్)కు ప్రత్యేక అతిథిగా వచ్చిన ఆమెను 'నవ్య' పలుకరించింది.

మసాలా మేమ్‌సాబ్!



మన దేశంలో వంటలను మనం ఎలా చూడవచ్చు?
మన దగ్గర ఉన్నన్ని వంటలు మరే ఇతర ప్రాంతంలోనూ దొరకవు. ప్రతి ప్రాంతానికీ ఒక ప్రత్యేకత ఉంటుంది. అత్యంత సులభమైన వంటల నుంచి అత్యంత క్లిష్టమైన వంటల దాకా రకరకాల వంటలు మన వాళ్లు చేస్తూ ఉంటారు. అయితే ఇక్కడ మనకొక వైరుధ్యం కూడా కనిపిస్తుంది. కొంకణి, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో కేవలం రెండు, మూడు పదార్థాలతో వంటలు చేసేస్తారు. అల్లం, వెల్లుల్లి, జీలకర్ర, బంగాళదుంపలతో రుచికరమైన కూర వండుతారు. కొన్ని ప్రాంతాల్లో కూర చేయాలంటే కనీసం 12 నుంచి 15 రకాల దినుసులు వాడతారు. అందుకే మన భారతీయ వంటలు సంక్లిష్టంగానూ ఉంటాయి.



యూరప్ వంటలతో మనవాటిని పోల్చవచ్చా?
లేదు. ఎందుకంటే వారి వంటలు వన్ డైమన్షన్‌లో ఉంటాయి. అంటే ఒక ప్రధానమైన విషయంపైనే మొత్తం ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు చేపతో చేసే వంట అనుకుందాం. అది చేప రుచే ఉంటుంది. మసాలా దినుసులు, గ్రేవీ ఉండవు. ఎందుకంటే వారు పోషకాల కోసం కొన్ని పదార్థాలపై ఆధారపడతారు. ఉదాహరణకు వైన్‌తో పాటు చీజ్ తింటారు. ఒకవేళ చేప సరైంది కాకపోతే మొత్తం వంట చెడిపోతుంది. మన దగ్గర అలా కాదు. ఒక కూరలో రకరకాల రుచులు ఉండాలి. అప్పుడే మనకు నచ్చుతుంది. అందుకే మనం మసాలాలు ఎక్కువ వాడతాం. దీనివల్ల ఎక్కువ సందర్భాలలో కాయగూరల రుచి కన్నా మసాలా రుచే ఎక్కువగా తెలుస్తుంటుంది.

మీ ఉద్దేశంలో మంచి వంటకు కావల్సిన పదార్థాలేంటి?
అన్నింటి కన్నా ముఖ్యం సమయం. ఎక్కువ సమయాన్ని వెచ్చించగలిగితే మంచి రుచి వస్తుంది. కానీ ప్రస్తుతం ఎవ్వరికీ అంత సమయం ఉండటంలేదు. ముఖ్యంగా ఒక కుటుంబంలో భార్య, భర్త... ఇద్దరూ ఉద్యోగాలు చేస్తుంటే, వారిద్దరికీ వంట చేయటానికి అతి తక్కువ సమయం ఉంటోంది. అందువల్ల వంటకన్నా వారు ఇతర అంశాలపై దృష్టి పెడతారు. అవసరమైతే బయట నుంచి ఆర్డర్ చేసుకొని తింటారు. అంతేకాకుండా వంటలు రుచిగా ఉండాలంటే... ఆహార పదార్థాల నాణ్యత బాగుండాలి. లేదంటే వంట బాగుండదు. గతంలో అందరూ సేంద్రియ పంటలే పండించేవారు. అందువల్ల కూరగాయలు, ఆకుకూరలు, రకరకాల ధాన్యాలు రుచిగా ఉండేవి. ఇప్పుడు ఎక్కువ ఎరువులు వేయటంవల్ల రుచి తగ్గిపోయింది.

> చాలా వంటలు ఒక తరం నుంచి మరొక తరానికి వారసత్వంగా వస్తాయి. వాటిని ఎక్కడైనా రికార్డు చేసి పెడితే ఎంతో ప్రయోజనం ఉంటుంది. మీకో ఉదాహరణ చెబుతాను. మా అమ్మమ్మ కొన్ని వంటలు అద్భుతంగా చేసేది. కానీ అవి ఎలా చేయాలో ఎవరికీ చెప్పేది కాదు. మా అమ్మకు కూడా అవి ఎలా చేయాలో తెలియదు. నేను పెద్దయిన తర్వాత ఆ వంటలు సేకరించటానికి ప్రయత్నించా.

ఈ మధ్యకాలంలో వంటను కెరీర్‌గా తీసుకొనేవారి సంఖ్య పెరిగింది కదా..!
కెరీర్‌గా మాత్రమే తీసుకొంటున్నారు. కానీ ఇంట్లో ఎంతమంది వంట చేస్తున్నారు? ఇంకో విషయం కూడా చెబుతాను. వంట చేయటం కెరీర్‌గా తీసుకొనేవారు మహిళల కన్నా పురుషులే ఎక్కువ. ఎందుకంటే... చెఫ్‌లుగా పనిచేయాలంటే అనేక రకాల సమస్యలు ఎదురవుతాయి. ఉదాహరణకు అర్ధరాత్రి పెళ్లి ఉందనుకుందాం... ఆ పెళ్లి విందుకు వంట చేయాలంటే మహిళలు అర్ధరాత్రి దాకా ఉండలేరు కదా. పురుషులకు ఇలాంటి సమస్యలు ఉండవు కాబట్టి ఎక్కువమంది చెఫ్‌లు వారే కనిపిస్తారు.

భారతీయ ఆహారం చాలా సంక్లిష్టమైందని అన్నారు కదా. ఒక కిచెన్‌ను ఏర్పాటు చేసుకోవటం ఎంత కష్టమైన పని అని మీరు అనుకుంటున్నారు?
ఒక మసాలా డబ్బా. కొన్ని గిన్నెలు ఉంటే కిచెన్ అవుతుంది. అయితే వంట ఎలా చేయాలో కూడా తెలియాలి కదా. ఈ మధ్యకాలంలో ఎక్కువమంది వంట పుస్తకాలు చదువుతున్నారు. యూట్యూబ్‌లో వీడియోలు చూస్తున్నారు. కానీ వంట చేయటానికి ఇష్టపడరు. అంతేకాకుండా చాలా వంటలు ఒక తరం నుంచి మరొక తరానికి వారసత్వంగా వస్తాయి. వాటిని ఎక్కడైనా రికార్డు చేసి పెడితే ఎంతో ప్రయోజనం ఉంటుంది. మీకో ఉదాహరణ చెబుతాను. మా అమ్మమ్మ కొన్ని వంటలు అద్భుతంగా చేసేది. కానీ అవి ఎలా చేయాలో ఎవరికీ చెప్పేది కాదు. మా అమ్మకు కూడా అవి ఎలా చేయాలో తెలియదు. నేను పెద్దయిన తర్వాత ఆ వంటలు సేకరించటానికి ప్రయత్నించా. మా అమ్మమ్మ దగ్గర పనిచేసే ఒకామెను పట్టుకొని, ఆవిడ దగ్గర నుంచి వివరాలు తెలుసుకున్నా. కానీ మా అమ్మమ్మ వంట రుచి రావాలంటే ఎలా? ఒక్కో వంటను పదేసిసార్లు చేశా. అలా చేయగా చేయగా కొన్ని ప్రత్యేకమైన వంటల గురించి తెలిసింది. కానీ ఇంత సమయం ఎవరికి ఉంటుంది? అందువల్ల వంట చేసే ప్రతివారూ తమకు నచ్చిన వంటలను ఎలా చేయాలో ఒక పుస్తకంలో రాసి పెట్టుకుంటే భవిష్యత్ తరాల వారికి ఎంతో ఉపకరిస్తుంది.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

శ్రీ శక్తి

వెండితెరపై తనను తాను చూసుకోవాలన్నది చిన్ననాటి కోరిక. కానీ నటి అయ్యాక అంతటితోనే ఆగిపోలేదు. పెద్ద కల కన్నది. అదే ఆమెను విజయవంతమైన పారిశ్రామికవేత్తను చేసింది. అప్పుడెప్పుడో తెలుగులోనూ ఓ మెరుపు మెరిసిన నటి పారుల్ గులాటీ డబుల్ ధమాకా ఇది...

డబుల్ ధమాకా



"ఒకరికి వారసురాలిగా చెప్పుకోవడం కాదు... నాదైన వారసత్వాన్ని నిర్మించుకోవాలనే తపన నాది. ఇదే నేను కన్న అతిపెద్ద కల. ప్రస్తుతం ఆ కలను ఛేదించుకొంటూ వెళుతున్నాను. ఆ బాటలో ప్రయాణించాల్సింది చాలా ఉంది. అలాగని ఇప్పటివరకు సాధించింది తక్కువేంకాదు. నాలాంటి ఒక మధ్యతరగతి అమ్మాయి... ఎవరూ తెలియని వినోద పరిశ్రమలో అడుగుపెట్టడం... అవకాశాలు దక్కించుకోవడం అంటే సామాన్య విషయం కాదు. ఇది నేను ఇష్టపడి పడిన కష్టానికి దక్కిన ఫలితం. హరియాణా రోహతక్‌లో ఓ దిగువ మధ్యతరగతి కుటుంబం మాది. అంతా రొటీన్ ఉద్యోగాలు చేసేవారే నా చుట్టూ. నెలవారీ ఖర్చులుపోనూ అదనంగా ఏ వస్తువు కొనుక్కోవాలన్నా ఒకటికి పదిసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి. ఎందుకో నాకు ఆ జీవితం నచ్చలేదు. డబ్బు తక్కువ వస్తుందని కాదు... గుంపులో గోవిందంలా బతకడం ఇష్టంలేక. అందుకే ఒకరోజు ఇంట్లోవాళ్లకు చెప్పేశాను... 'నేను నటి కావాలని అనుకుంటున్నా' అని. అప్పటికి ఇంకా నా పాఠశాల విద్యాభ్యాసం పూర్తికాలేదు. నా మాటలు విని అమ్మానాన్న అవాక్కయ్యారు. వద్దంటే వద్దన్నారు. వాళ్లను ఒప్పించడం నాకు పెద్ద సవాలుగా మారింది. ఎంతచెప్పినా వాళ్ల మనసు మార్చుకోవడంలేదు. నేను పట్టు వదల్లేదు. దాంతో చేసేది లేక... చివరకు వాళ్లు ఓకే అన్నారు.

ఇంటి నుంచి ముంబయికి...
నటన మీద మక్కువ నాలో ఎప్పుడు కలిగిందో తెలియదు. కానీ చిన్నప్పటి నుంచి టీవీల్లో సినిమాలు, షోలు చూస్తూ బాగా ఆస్వాదించేదాన్ని. పన్నెండో తరగతిలో ఉండగా 'ఇక నటనే నా కెరీర్' అని బలంగా నిర్ణయించుకున్నాను. ఎలాగో అమ్మానాన్నలను ఒప్పించాను కదా... వెంటనే ముంబయికి వెళ్లిపోయాను. 'ముంబయి యూనివర్సిటీ'లో డిగ్రీ చదువుకొంటూనే నటనలో శిక్షణ తీసుకున్నాను. కొన్నాళ్లు మోడలింగ్ చేశా. అదే సమయంలో 'యే ప్యార్ న హోగా కామ్' సీరియల్‌లో అవకాశం లభించింది. ఆ ఏడాదే మరో టీవీ షో 'కితనీ మొహబత్ హై' కోసం పిలుపు వచ్చింది. తరువాత మరో రెండు షోలు చేశాను.

మెరుగులు కోసం లండన్‌కు...
మోడలింగ్, నటన, చదువు... క్షణం తీరిక దొరికేది కాదు. ఒక్కోసారి రాత్రిళ్లు నిద్ర కరువయ్యేది. అయినా ఏనాడూ కష్టమనిపించలేదు. ఎందుకంటే నటిగా ఎదగాలన్నది నా చిన్ననాటి కోరిక కదా. నాలోని ప్రతిభకు మరిన్ని మెరుగులు అద్దుకోవాలన్న లక్ష్యంతో డిగ్రీ అవ్వగానే ఏడాది విరామం తీసుకుని, లండన్‌కు వెళ్లాను. అక్కడి 'రాయల్ అకాడమీ ఆఫ్ డ్రమటిక్ ఆర్ట్స్' (ఆర్ఏడీఏ)లో యాక్టింగ్ కోర్సు చేశాను. తిరిగి వచ్చాక సినిమాల్లో నటించాలనేది నా కోరిక. ఆ ప్రయత్నాల్లో భాగంగా నా మాతృ భాష పంజాబీ చిత్రాల్లో అవకాశం వచ్చింది. మూడు చిత్రాల్లో హీరోయిన్‌గా చేశాను. అప్పుడే తెలుగు పరిశ్రమ నుంచి ఆహ్వానం అందింది... 'నీ జత లేక' చిత్రం కోసం! అందులో మంచి పాత్ర దక్కింది. అయితే ఆశించిన స్థాయిలో కెరీర్ దూసుకుపోలేదు. ఏం చేయాలి? ఆలోచనలో పడ్డా.

మళ్లీ బుల్లితెరకు...
మూడేళ్లలో నేను చేసింది నాలుగే సినిమాలు. అవి పెద్ద బ్రేక్ ఇవ్వలేదు. గమ్యం ఎటువైపు అని ఆలోచిస్తుంటే... ఓ టెలివిజన్ నుంచి ఫోన్ వచ్చింది. అలా 2017లో 'పీఓడబ్ల్యూ- బందీ యుద్ధ్ కే'తో మళ్లీ టీవీ రంగంలోకి అడుగుపెట్టాను. అదిమొదలు ఇక వెనక్కి తిరిగి చూసుకుంది లేదు. టీవీ షోలతో పాటు వెబ్‌సిరీస్‌లు వెతుక్కుంటూ వచ్చాయి. 'హక్ సే, గర్ల్స్ హాస్టల్, హే ప్రభూ, ఇల్లీగల్, యువర్ ఆనర్, మేడిన్ హెవెన్-2' తదితర వెబ్‌సిరీస్‌లు చేశాను.

వ్యాపార రంగంలోకి...
వెబ్‌సిరీస్‌లు, టీవీ షోలతో బిజీగానే ఉన్నాను. మంచిగా సంపాదిస్తున్నాను. కానీ అంతటితోనే ఆగిపోవాలని నేను అనుకోలేదు. నా పాపులారిటీని, నాకున్న పరిచయాలను ఉపయోగించుకొని మంచి బిజినెస్ ఒకటి ప్రారంభిస్తే? ఈ ఆలోచన వచ్చింది మొదలు... ఇక ఆలస్యం చేయలేదు. వ్యాపారం చేయాలనే నిర్ణయానికి వచ్చేశాను. మరి ఏ బిజినెస్ అయితే బాగుంటుంది? దానికోసం మార్కెట్‌ను అధ్యయనం చేశాను. హెయిర్ ఎక్స్‌టెన్షన్స్‌కు సంబంధించినదైతే లాభదాయకం అనిపించింది. ఎందుకంటే ఒక్క స్టైలింగ్ కోసమే కాదు... హెయిర్ లాస్, థిన్నింగ్, డ్యామేజ్ హెయిర్‌తో చాలామంది ఇబ్బందులు పడుతుంటారు. ఈ సమస్యలు కొందరిలో ఆత్మన్యూనతకు కూడా దారి తీస్తాయి. ముఖ్యంగా కొందరు మహిళలకు ఇది పెద్ద సమస్యగా పరిణమించింది. అలాంటి వారిలో ఆత్మవిశ్వాసం కలిగించేందుకు హెయిర్ ఎక్స్‌టెన్షన్స్ ఉపయోగపడతాయి. ఈ ఆలోచనతోనే 2017లో 'నిష్ హెయిర్‌ఇన్' ప్రారంభించాను.

మూడు నెలలు పట్టింది...
ప్రస్తుతం మా కంపెనీ నుంచి విగ్గులు, సవరాలు, హెయిర్ టాపర్స్, ఎక్స్‌టెన్షన్స్, హెయిర్ పెర్‌ఫ్యూమ్ వంటివి ఉత్పత్తి చేస్తున్నాం. మా ఇంట్లోని ఒక చిన్న గదిలో ప్రారంభమైన కంపెనీ ఇప్పుడు పెద్ద భవంతిలోకి మారింది. మొదట్లో నేను, మా అమ్మ కలసి ఒక్కో వెంట్రుక జతచేస్తూ విగ్గులు తయారు చేసేవాళ్లం. మూడు పీస్‌లు అమ్మడానికి మాకు మూడు నెలలు పట్టింది. ఇంటింటికీ వెళ్లి అమ్మేవాళ్లం. కొనేవాళ్లు లేక ఆరువేల రూపాయల ఉత్పత్తిని మూడు వేలకే అమ్మిన సందర్భాలు కూడా ఉన్నాయి. సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారంతో క్రమంగా ఆదరణ, అమ్మకాలు పెరిగాయి. ప్రస్తుతం మా దగ్గర 35 మంది మహిళలు పని చేస్తున్నారు. ముంబయిలో ఒక స్టూడియో కూడా నెలకొల్పాను. కొన్నేళ్ల కిందట నెలకు ఎనభై లక్షలు ఉన్న మా ఆదాయం ఇప్పుడు మూడు రెట్లు పెరిగింది. వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు నాకు ఎంతో సంతోషంగా, సంతృప్తిగా ఉంటుంది."

రోగనిరోధక శక్తి పెంచుకోవాలంటే?

వేసవికాలం వస్తోంది. చాలా మంది త్వరగా నీరసపడిపోతూ ఉంటారు. కొందరికి ఎక్కువ దాహం వేస్తూ ఉంటుంది. ఇలాంటి లక్షణాలకు ఉసిరి వైద్యం అద్భుతంగా పనిచేస్తోందంటున్నారు ఆయుర్వేద నిపుణులు.

ఎలా తయారుచేసుకోవాలి?
రెండు ఉసిరికాయలను తీసుకోవాలి. వాటిని ముక్కలుగా చేసి తేనె, మిరియాలపొడిలో 12 గంటలు నానబెట్టాలి. ఇలా నానబెట్టిన మిశ్రమాన్ని ఉదయాన్నే లేచిన వెంటనే తినాలి. ఇలా నాలుగు వారాలు తింటే- ఎటువంటి జబ్బులు దరి చేరవు.

ఎందుకు పనిచేస్తుంది?

- ఉసిరిలో సి విటమిన్ ఎక్కువగా ఉంటుంది. శరీరానికి అస్వస్థత ఏర్పడినప్పుడు- ఆ అనారోగ్యం నుంచి బయటపడటానికి ఈ విటమిన్ ఉపకరిస్తుంది.
- మిరియాల పొడిలో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి మన శరీరం అస్వస్థతకు గురికాకుండా కాపాడుతూ ఉంటాయి.
- తేనెకు అనేక ఆరోగ్య సమస్యలను పరిష్కరించే గుణముంది. శ్వాసకోశ సంబంధమైన వ్యాధులను పరిష్కరించటంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.
- ఉసిరిని తేనెలో నానబెట్టడం వల్ల వాటి లాభాలు మరింత పెరుగుతాయి.

ఎప్పుడు తినాలి?
ఉదయాన్నే లేచిన వెంటనే తినాలి. లేదా రాత్రి నిద్రపోయే ముందు తినాలి. మధుమేహం ఉన్న వారు రెండు రోజులు తిని- సుగర్ విలువల్లో వస్తున్న మార్పులను గమనించాలి. మార్పు రాకపోతే తినాలి. లేకపోతే తినే పరిమాణాన్ని తగ్గించాలి.



వినూత్నం

కన్న కలల మీద ఆశలు వదిలేసుకునే పరిస్థితి అందరి జీవితాల్లో ఏదో ఒక సందర్భంలో ఎదురవుతుంది. అయితే ఎంచుకున్న లక్ష్యం నుంచి పక్కకు తప్పుకోకుండా ముందుకు కొనసాగగలిగే ధైర్యం, పట్టుదలలు ఏ కొందరికో ఉంటాయి. బెల్లీ డ్యాన్సర్‌గా ఎదిగిన నూపుర్ కౌశిక్ షా కథ ఇందుకొక ఉదాహరణ.

బెల్లీ డ్యాన్స్ బ్రహ్మాండంగా...



వృత్తిపరంగా బెల్లీ డ్యాన్స్ అర్టిస్ట్ అయిన నూపుర్ తన ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్ ద్వారా ఏరియల్ ఆర్ట్, బెల్లీ డ్యాన్స్ బేసిక్స్ నేర్పించడం మొదలుపెట్టి క్రమేపీ ఆ కళల్లో నిపుణురాలిగా మారిపోయింది. ప్రస్తుతం నూపుర్ ప్రొఫెషనల్ బెల్లీ డ్యాన్స్ ఆర్టిస్ట్‌గా, ఏరియల్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా హెడ్ సెక్రటరీల్లో ఒకరిగా బాధ్యతలు నిర్వహిస్తోంది. నూపుర్ బెల్లీ డ్యాన్స్ గురించి మాట్లాడుతూ..."ఎవరైనా బెల్లీ డ్యాన్స్ నేర్చుకోవచ్చు. ఈ కళకు రంగు, ఆకారం, వయసు, జెండర్‌లతో పని లేదు. డ్యాన్స్ చేయలేని వాళ్లు కూడా ఈ కళను నేర్చుకోవచ్చు. నేను మొదట్లో ఫిట్‌నెస్ ట్రైనర్, న్యూట్రిషనిస్ట్‌గా మారాలనుకున్నాను. అథ్లెట్‌ని కాబట్టి నాకు జిమ్నాస్టిక్స్ వచ్చు. బెల్లీ డాన్సింగ్ ఇంట్రెస్టింగ్‌గా కనిపించడంతో, నేను దాన్నొక అభిరుచిగా మలుచుకున్నాను" అంటూ చెప్తోంది నూపుర్. ఆవిడ అభిరుచి కాస్తా కొద్ది కాలంలోనే ప్యాషన్‌గా మారింది. పైగా తాను నివసించే అహ్మదాబాద్‌లో బెల్లీ డ్యాన్స్ స్కూల్స్ లేకపోవడంతో, పూణేకు వెళ్లిపోవాలని నిర్ణయించుకుంది. ఆ నిర్ణయం తీసుకోవడం వెనకున్న కారణం గురించి వివరిస్తూ... "బెల్లీ డ్యాన్స్ చేసేటప్పుడు, శరీరంతో అనుసంధానమై, శరీరంలోని ప్రతి కండరం మీదా నియంత్రణ సాధించిన అనుభూతికి లోనవుతూ ఉంటాను. అలాంటి కళను నలుగురికీ పరిచయం చేయాలనే తపన నాలో ఉంది. కాబట్టే పూణేకు వెళ్లిపోవాలని నేను తీసుకున్నది పెద్ద నిర్ణయమే అయినా, నా అభిరుచిని మరింత ముందుకు తీసుకువెళ్లడం కోసం ఆ నిర్ణయానికి కట్టుబడక తప్పదం లేదు" అని చెప్పుకొచ్చింది నూపుర్.



ప్రమాదం అడ్డంకి కాలేదు
ఏరియల్ డ్యాన్స్ అనేది ఆధునిక నృత్యంలో భాగం. తాడును ఆధారంగా చేసుకొని, గాలిలో చేసే విన్యాసాలివి. ఇందులో పరిణతి సాధించాలనే తపనతో ముంబయికి వెళ్లాలని నిర్ణయించుకున్న నూపుర్ ఓ పక్క పూణేలో విద్యార్థులకు బెల్లీ డ్యాన్స్ నేర్పిస్తూనే మరో పక్క వారంలో మూడు సార్లు ముంబయికి వెళ్లి రావడం మొదలుపెట్టింది. "అలా ఒత్తిడితో కూడిన జీవితాన్ని గడపడం తేలిక కాదు. అలా ఆరు నెలలు రెండు నగరాల మధ్యా పరుగులు పెట్టడం మొదలుపెట్టిన తర్వాత, నా శరీరం సహకరించడం మానేసింది. దాంతో ఆరు నెలల పాటు బ్రేక్ తీసుకుని, ముంబయిలో జరిగిన ఏరియల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్నాను. నా ఆర్ట్‌ఫామ్‌ను మెచ్చిన జడ్జిలు తొలి మూడు స్థానాల్లో నాకు చోటు కల్పించారు. అది మర్చిపోలేని అనుభవం. అయితే ఆ తర్వాత కొంత కాలానికే ఊహించని ప్రమాదం జరిగింది. ఒక ప్రదర్శనలో నేను ఎత్తు నుంచి పడిపోయి గాయపడ్డాను. నా కాలర్‌బోన్ విరిగిపోయింది. దాంతో ఇక ముందు నేను ఏరియల్ డ్యాన్స్ చేయలేనని డాక్టర్లు చెప్పేశారు. కానీ రెండేళ్ల రిహ్యాబిలిటేషన్ తర్వాత, తిరిగి నాకెంతో ఇష్టమైన ఏరియల్ డ్యాన్స్ సాధన చేయడం మొదలుపెట్టాను. అలాగే జీ టివిలో డ్యాన్స్ విత్ మిలో కూడా పాల్గొన్నాను. నాకు ఈ కళంటే ఇష్టం. దీన్నుంచి తప్పుకోవాలని నేనెప్పుడూ అనుకోను. ఏరియల్ డ్యాన్స్ పరంగా నాకు రెండో ఆలోచన అంటూ ఉండదు. నాకు ప్లాన్ ఎ, ప్లాన్ బి కూడా ఇదే!" అంటూ చెప్పుకొచ్చింది నూపుర్. అంతిమంగా నూపుర్ తాను ఆశించిన గుర్తింపును దక్కించుకోగలిగింది. ప్రస్తుతం ఆవిడ ఎన్నో టివి షోల ద్వారా ప్రపంచవ్యాప్త విద్యార్థులకు బెల్లీ డ్యాన్స్, ఏరియల్ డ్యాన్స్ నేర్పిస్తోంది.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
గురువారం • 8 ఫిబ్రవరి 2024
cinema@andhrajyothy.com

మార్చిలో గామి ఆగమనం



విష్వక్‌సేన్ కథానాయకుడిగా రూపొందుతున్న అడ్వంచర్ డ్రామా 'గామి'. విద్యాధర్ కాగిత దర్శకత్వంలో కార్తీక్ శబరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. 'గామి' చిత్రాన్ని మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విష్వక్‌సేన్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'విద్యాధర్ 'గామి' సినిమా కోసం చాలా పరిశోధన చేశాడు. సినిమా పూర్తి చేయడానికి దాదాపు నాలుగున్నరేళ్లు పట్టింది. వారాణసిలో షూటింగ్ చేస్తున్నప్పుడు చాలామంది నన్ను చూసి నిజమైన అఘోరా అనుకున్నారు. నాకు ధర్మం చేశారు. ఓ ముసలామె ఆప్యాయంగా భోజనం పెట్టారు. ఈ సినిమా కోసం చాలా కష్టాలు పడ్డాం. ట్రైలర్ మైండ్ బ్లోయింగ్‌గా ఉంది. సినిమా అందరినీ అలరిస్తుంది' అన్నారు. విద్యాధర్ మాట్లాడుతూ 'అఘోర శంకర్ హిమాలయాల్లో చేసే సాహసోపేత ప్రయాణమే 'గామి' కథాంశం. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వడానికి ప్రయత్నించాం. విష్వక్ ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. ఏదడిగితే అది చేశారు. గడ్డకట్టించే చలిలో సైతం నటించాడు. ఈ సినిమా కోసం కుంభమేళాని చిత్రీకరించాం' అని చెప్పారు. కార్తీక్ శబరీష్ మాట్లాడుతూ '2018లో ఈ సినిమాను మొదలుపెట్టాం. చాలా ఎగ్జయిటింగ్ కంటెంట్ ఉన్న సినిమా ఇద'ని తెలిపారు. ఈ చిత్రంలో చాందిని చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. ఎంజి అభినయ, హారిక, మహ్మద్ సమద్ ముఖ్య తారాగణం. సంగీతం: నరేశ్ కుమారన్.



విధ్వంసాల జాతర

రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. కావ్యాథాపర్, అనుపమా పరమేశ్వరన్ కథానాయికలు. ఈనెల 9న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ట్రైలర్ ఆద్యంతం రవితేజ్ యాక్షన్ హంగామా కనిపించింది. సరికొత్త మేకోవర్‌లో ఆయన కనిపించారు. 'వచ్చాడంటే మోతరా, విధ్వంసాల జాతర' అంటూ ఆయన పలికిన డైలాగ్‌లు మాస్ ప్రేక్షకులను ఉర్రూతలూగించేలా ఉన్నాయి. ఈ చిత్రంలో నవదీప్, అవసరాల శ్రీనివాస్, మధుబాల, అజయ్ ఘోష్, శ్రీనివాస్‌రెడ్డి కీలకపాత్రలు పోషించారు. సంగీతం: డేవ్ జాండ్

మానవత్వాన్ని పంచే మొయినుద్దీన్ భాయ్



'మతాన్ని నమ్మితే మనసులో ఉంచుకో...మానవత్వాన్ని అందరితో పంచుకో' అంటున్నారు రజనీకాంత్. 'లాల్ సలామ్' చిత్రంలో మొయినుద్దీన్ భాయ్ పాత్రలో రజనీకాంత్ పలికిన డైలాగ్ ఇది. ఈ నెల 9న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. గ్రామీణ వాతావరణం, రాజకీయాలు, మతవిద్వేషాల నేపథ్యంలో సాగే కథ అని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. రజనీకాంత్ చాలా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించారు. ఈ చిత్రానికి ఐశ్వర్య దర్శకత్వం వహించారు. విష్ణు విశాల్, విక్రాంత్, జీవితా రాజశేఖర్, క్రికెటర్ కపిల్ దేవ్ కీలకపాత్రలు పోషించారు. సుభాస్కరన్ నిర్మించారు.

ఫ్యామిలీస్టార్ ప్రేమగీతం



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఫ్యామిలీస్టార్'. ఆయనకు జోడీగా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. పరశురామ్ పెట్ల దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బేనర్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 5న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. బుధవారం చిత్రబృందం 'నందనందనా' అంటూ సాగే ప్రేమగీతాన్ని విడుదల చేసి మ్యూజిక్ ప్రమోషన్స్ మొదలుపెట్టింది. ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, గోపీ సుందర్ స్వరాలు సమకూర్చారు. సిద్ శ్రీరామ్ ఆలపించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కేయూ మోహనన్. ఎడిటర్: మార్తాండ్ కే వెంకటేశ్



రెండింతల వినోదం

సిద్దు జొన్నలగడ్డకు స్టార్ స్టేటస్‌ను తెచ్చిన చిత్రం 'డీజే టిల్లు'. 'అట్లుంటది మనతోని' అంటూ ఆ సినిమాలో ఆయన పంచిన వినోదం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు మరోసారి టిల్లూ బాయ్ ప్రేక్షకులను ఎంటర్టైన్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. 'డీజే టిల్లు'కు సీక్వెల్‌గా 'టిల్లూ స్క్వేర్' రూపొందుతోంది. మల్లిక్‌రామ్ దర్శకత్వంలో సితార ఎంటర్టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. మార్చి 29న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. బుధవారం సిద్దు పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం బర్త్‌డే గ్లింప్స్‌ను విడుదల చేసింది. కారులో హీరో హీరోయిన్ల రొమాన్స్, రాధికతో ప్రణయం గురించి టిల్లూ గుర్తు చేసుకొనే సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. సిద్దు తనదైన స్టైల్లో మరోసారి డైలాగ్‌లతో మ్యాజిక్ చేశాడు. ఈ సినిమా ట్రైలర్‌ను ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 14న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. రామ్ మిరియాల, అచ్చు రాజమణి సంగీతం అందిస్తున్నారు. ఎస్ఎస్ థమన్ నేపథ్య సంగీతం సమకూరుస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సాయిప్రకాశ్ ఉమ్మడి సింగు. ఎడిటర్: నవీన్ నూలి

నన్నే హీరోయిన్‌గా అనుకున్నారు

సందీప్ కిషన్, వర్ష బొల్లమ్మ జంటగా నటించిన ఫాంటసీ అడ్వెంచర్ 'ఊరుపేరు భైరవకోన'. వీఐ ఆనంద్ దర్శకత్వంలో రాజేశ్ దండా నిర్మించారు. ఈ నెల 16న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా వర్ష బొల్లమ్మ మీడియాతో మాట్లాడారు.



● ఈ కథ రాసుకున్నప్పుడే నన్ను హీరోయిన్‌గా అనుకున్నానని ఆనంద్ చెప్పారు. స్టోరీ చాలా కొత్తగా, అద్భుతంగా అనిపించింది. 'అసలు ఇలాంటి కథను ఎలా ఊహించగలిగారో' అనిపించింది. ఇలాంటి పాత్ర గతంలో ఎప్పుడూ చేయలేదు. అందుకే నిర్ణయం తీసుకోవడానికి కొంత సమయం అడిగాను. ఆనంద్ పాత్ర గురించి వివరంగా చెప్పాక నేను చేయగలననే నమ్మకం ఏర్పడింది.

● పూర్తిస్థాయి వినోదం పంచే చిత్రమిది. ప్రేక్షకులకు మంచి సందేశం, ఉత్కంఠభరితమైన ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. అద్భుతం అనిపించే అతీంద్రియ శక్తుల నేపథ్యం ఉంటుంది. సినిమా నిర్మాణం విషయంలో మేకర్స్ ఎక్కడా రాజీపడలేదు.


● 'స్వాతిముత్యం, మిడిల్ క్లాస్ మెలోడీస్' చిత్రాల్లో పక్కింటి అమ్మాయి తరహా పాత్రలో కనిపించాను. ఈ చిత్రంలో వాటికి భిన్నంగా 'భూమి' అనే గిరిజన యువతి పాత్రలో కనిపిస్తాను. ఊళ్లో తనొక్కతే చదువుకున్న అమ్మాయి. అందంగా, అమాయకంగా కనిపిస్తుంది. కానీ చాలా బలమైన పాత్ర. యాక్షన్ సీన్లు కూడా ఉన్నాయి.

● మాది కూర్గ్. మా జీవితంలో ప్రకృతి ఒక భాగం. చెట్లు, నదులు, కొండలు, జంతువులను ఆరాధించే సంస్కృతి మాది. భూమి పాత్రను అర్థం చేసుకోవడానికి ఆ అనుభవాలు ఉపయోగపడ్డాయి. సందీప్ కిషన్ అద్భుతమైన సహనటుడు. ప్రతి ఒక్కరినీ గౌరవిస్తారు. వీఐ ఆనంద్‌తో వర్క్ చేయడం చాలా ఎగ్జయిటింగ్‌గా అనిపించింది.

ఏం జరిగింది?



విజయ్ శంకర్, సావిత్రి కృష్ణ జంటగా నటిస్తున్న చిత్రం 'అంతే.. అలా జరిగిపోయింది'. శ్రీరామ్ అమృతపురి దర్శకత్వంలో కంచర్ల సత్యనారాయణరెడ్డి, సముద్రాల మహేశ్‌గౌడ్ నిర్మించారు. బుధవారం టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను నిర్మాత ప్రసన్నకుమార్ చేతుల మీదుగా విడుదల చేశారు. యువతను ఆకట్టుకునే కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం, ఆద్యంతం ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తుందని యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి జయసూర్య బొప్పెం సంగీతాన్ని అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: మురళీమోహన్.



ఆర్ఆర్ఆర్ ఓ అద్భుతం

రాజమౌళిపై కామెరూన్ ప్రశంసలు



హాలీవుడ్ దిగ్గజ దర్శకుడు జేమ్స్ కామెరూన్ మరోమారు రాజమౌళిని అభినందనలతో ముంచెత్తారు. 'ఆర్ఆర్ఆర్' సినిమా ఓ అద్భుతం అని ప్రశంసించారు. సాటర్న్ అవార్డ్స్ కార్యక్రమం ఇందుకు వేదికైంది. ఓ రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు కామెరూన్ బదులిస్తూ "ఆర్ఆర్ఆర్' చాలా అద్భుతమైన సినిమా అనిపించింది. ఆ అనుభూతినే రాజమౌళితో పంచుకున్నాను. ప్రపంచం మొత్తం ఆ సినిమాను ఇష్టపడింది. భారతీయ సినిమా ప్రపంచవ్యాప్తంగా సత్తా చాటడం మంచి పరిణామమని' పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై స్పందించిన 'ఆర్ఆర్ఆర్' చిత్రబృందం కామెరూన్‌కు ధన్యవాదాలు తెలిపింది. గతేడాది జరిగిన క్రిటిక్స్ ఛాయిస్ అవార్డుల కార్యక్రమంలో రాజమౌళి, కామెరూన్ కలిశారు. ఆ సందర్భంలో కామెరూన్ 'ఆర్ఆర్ఆర్' అద్భుతంగా ఉందని కొనియాడారు. ప్రస్తుతం మహేశ్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి ఓ చిత్రం రూపొందిస్తున్నారు.

బుమ్రా నెం. 1



టెస్ట్ ర్యాంకుల్లో అగ్రస్థానం

ఈ ఘనత అందుకున్న తొలి భారత పేసర్‌గా రికార్డు

దుబాయ్: ఇంగ్లండ్‌తో విశాఖపట్నంలో జరిగిన రెండో టెస్ట్‌లో అద్భుత ప్రదర్శన చేసిన టీమిండియా ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు తగిన రివార్డు లభించింది. బుధవారం ప్రకటించిన ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ బౌలర్ల జాబితాలో 30 ఏళ్ల బుమ్రా అగ్ర స్థానాన్ని దక్కించుకున్నాడు. తద్వారా టెస్ట్‌ల్లో నెం.1 ర్యాంక్ కైవసం చేసుకున్న తొలి భారత పేసర్‌గా రికార్డు సృష్టించాడు. ఈక్రమంలో కమిన్స్, రబాడ, అశ్విన్‌ను బుమ్రా వెనక్కు నెట్టాడు. అలాగే టాప్‌ర్యాంక్‌కు ఎగబాకిన నాలుగో భారత బౌలర్‌గా బుమ్రా నిలిచాడు. గతంలో అశ్విన్, జడేజా, బిషన్ సింగ్ బేడీకి నెం.1 ర్యాంక్ లభించింది. విశాఖ టెస్ట్‌లో మొత్తం 9 వికెట్లు పడగొట్టిన బుమ్రా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన విషయం విదితమే. ఇక..11 నెలలపాటు సుదీర్ఘంగా టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచిన అశ్విన్ (841 పాయింట్లు) ఆ హోదాను బుమ్రా (881 పాయింట్లు)కు కోల్పోయాడు. అశ్విన్ మూడో ర్యాంక్‌కు పడిపోయాడు. అశ్విన్, జడేజా 2017లో సంయుక్తంగా నెం.1 ర్యాంక్‌లో ఉన్న అరుదైన ఘనత దక్కించుకున్నారు.

జైస్వాల్.. 37 స్థానాలు పైకి..

బ్యాటింగ్ విభాగంలో..భారత యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ ఏకంగా 37 స్థానాలు ఎగబాకాడు. ఇంగ్లండ్‌తో విశాఖ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీతో దుమ్మురేపిన జైస్వాల్ 29వ ర్యాంక్‌లో నిలిచాడు. ఆ టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో శతకంతో తిరిగి ఫామ్‌లో కొచ్చిన శుభ్‌మన్ గిల్ 14 స్థానాలు మెరుగుపరుచుకొన్నాడు. కెరీర్‌లో అత్యుత్తమంగా 38వ ర్యాంక్‌ను అతడు చేజిక్కించుకున్నాడు.

మళ్లీ టాప్‌లోకి జైపూర్



న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో ఆతిథ్య దబాంగ్ ఢిల్లీపై విజయంతో జైపూర్ పింక్ పాంథర్స్ జట్టు తిరిగి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. ఈ ఇరు జట్ల మధ్య బుధవారం జరిగిన మ్యాచ్‌లో జైపూర్ 27-22తో ఢిల్లీపై నెగ్గింది. ఈ సీజన్ స్టార్ రైడర్ అర్జున్ దేశ్వాల్ మరోసారి 10 పాయింట్లు సాధించి జైపూర్ గెలుపులో కీలకపాత్ర పోషించాడు. ఢిల్లీ తురుపుముక్క అషు మాలిక్ 9 పాయింట్లతో సత్తా చాటినా ఫలితం లేకపోయింది. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 40-31తో బెంగళూరు బుల్స్‌పై విజయం సాధించింది.

ఐపీఎల్‌కు పంత్ రెడీ

మెల్‌బోర్న్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఏడాదికిపైగా క్రికెట్‌కు దూరంగా ఉన్న స్టార్ వికెట్ కీపర్ రిషబ్ పంత్ ఐపీఎల్‌తో పునరాగమనం చేయాలని భావిస్తున్నాడు. ఈ విషయాన్ని ఢిల్లీ క్యాపిటల్స్ హెడ్ కోచ్ రికీ పాంటింగ్ వెల్లడించాడు. 'రాబోయే ఐపీఎల్ ఆడగలననే దృఢ సంకల్పంతో పంత్ ఉన్నాడు. కానీ బ్యాటర్‌గానే బరిలో దిగుతాడా..లేదా కీపర్‌గానూ బాధ్యతలు నిర్వర్తిస్తాడా అనే విషయంలో స్పష్టత లేదు' అని పాంటింగ్ తెలిపాడు. పంత్ సారథ్య బాధ్యతలు వహించలేకపోతే..గత సీజన్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన వార్నర్ ఈసారీ జట్టును నడిపిస్తాడని పాంటింగ్ వెల్లడించాడు.



వాషింగ్టన్ ఫ్రీడమ్ చీఫ్‌కోచ్‌గా పాంటింగ్

అమెరికా ఫ్రాంచైజీ క్రికెట్..మేజర్ క్రికెట్ లీగ్ జట్టు వాషింగ్టన్ ఫ్రీడమ్ ప్రధాన కోచ్‌గా పాంటింగ్‌ను నియమితులయ్యాడు. ఈమేరకు అతడితో రెండేళ్ల ఒప్పందం కుదుర్చుకున్నట్టు ఆ ఫ్రాంచైజీ తెలిపింది. లీగ్ రెండో సీజన్ జూలై 4న మొదలవనుంది.

ఇద్దరూ.. ఇద్దరే!

ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం

అండర్-19 వరల్డ్‌కప్ ఫేవరెట్‌గా.. వరుస విజయాలతో జైత్రయాత్ర కొనసాగిస్తున్న యువ భారత్‌కు సెమీస్‌లో తొలిసారి సౌతాఫ్రికా రూపంలో అసలుసిసలు సవాల్ ఎదురైంది. 245 పరుగుల లక్ష్య ఛేదనలో టాపార్డర్ విఫలమవడంతో 32/4తో టీమిండియా పరాజయం ఖాయమని అనిపించింది. లీగ్ మ్యాచ్‌ల్లో పరుగుల వరదపారించిన ముషీర్ కూడా ఒత్తిడికి చిత్తయ్యాడు. ఇటువంటి క్లిష్టపరిస్థితుల్లో కెప్టెన్ ఉదయ్ సహరన్, డాషింగ్ బ్యాటర్ సచిన్ దాస్ పరిణతి చెందిన ఆటతో మ్యాచ్ ఫలితాన్ని తలకిందులు చేశారు. ఐదో వికెట్‌కు 171 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఓటమి కోరల్లోంచి రక్షించిన వీరు.. వరుసగా ఐదోసారి భారత్‌ను ఫైనల్‌కు చేర్చారు. సహరన్ ఎంతో కూల్‌గా ఇన్నింగ్స్‌ను నిర్మిస్తే.. దాస్ దూకుడుగా ఆడుతూ రన్‌రేట్ చేయిదాటకుండా చూశాడు. మ్యాచ్ ఫలితం కంటే.. తీవ్ర ఒత్తిడిలోనూ.. మొక్కవోని పట్టుదలతో వీరిద్దరూ పోరాడిన తీరు అద్భుతం.

కూల్ కెప్టెన్..



ఉదయ్ సహరన్

రాజస్థాన్‌కు చెందిన ఉదయ్ సహరన్ ఆట.. నిన్నటితరం క్రికెటర్లను గుర్తు చేస్తుంది. బంతి దొరికితే బాదేయడమే అన్నట్టుగా ఉంటుంది నేటి తరం ఆటగాళ్లది. కానీ, టెక్నిక్‌కు ఎంతో ప్రాధాన్యమిచ్చే 19 ఏళ్ల సహరన్.. ఎక్కువ సమయం క్రీజులో గడిపేందుకు వెచ్చిస్తాడు. గతితప్పిన బంతులను మాత్రం తప్పకుండా శిక్షిస్తాడు. ఎంతటి క్లిష్టపరిస్థితుల్లోనైనా తలొగ్గ కూడదనేది అతడి మనస్తత్వం. సెమీస్ మ్యాచ్‌లో అతడు తన భాగస్వామికి సహకరిస్తూనే.. ఒక్కో పరుగు కూడగడుతూ ఇన్నింగ్స్‌ను నిర్మించిన తీరు గొప్ప ఆటగాడిని తలపించింది. ప్రస్తుతం పంజాబ్‌కు ఆడుతున్న సహరన్.. బటిండా యూనివర్సిటీలో డిగ్రీ చదువుతున్నాడు. ఉదయ్ తండ్రి సంజీవ్ సహరన్ సర్టిఫైడ్ క్రికెట్ కోచ్. ఆటను ఎంత లోతుగా తీసుకెళ్లాలనేది తన తండ్రి వద్దనే నేర్చుకొన్నట్టు ఉదయ్ చెప్పాడు. ఆయుర్వేదిక్ డాక్టర్ కూడా అయిన సంజీవ్.. తన కొడుకు కెరీర్‌ను తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించాడు. 'మ్యాచ్ రోజు ఎంతో టెన్షన్‌కు గురయ్యాం. ఉదయ్ అమ్మ, అక్క అయితే గుడిలోంచి బయటకు రాలేద'ని సంజీవ్ చెప్పాడు.

భారీ షాట్ల సచిన్..



సచిన్ దాస్

భారత జట్టులో డేరింగ్.. డాషింగ్ బ్యాటర్ సచిన్ దాస్. భారీ షాట్లతో సూపర్ ఫినిషర్‌గా ముద్రవేసుకొన్నాడు. మహారాష్ట్రలోని బీడ్ జిల్లాకు చెందిన 19 ఏళ్ల సచిన్ దాస్ తండ్రి సంజయ్‌కు దిగ్గజం సచిన్ టెండూల్కర్ అంటే ఎంతో అభిమానం. అందుకే తన కుమారుడికి సచిన్ అని పేరు పెట్టుకొన్నాడు. సీనియర్ సచిన్ ధరించిన 10వ నెంబర్ జెర్సీనే యువ సచిన్ కూడా వేసుకుంటాడు. అక్కడ అందరూ దాస్‌ను ముద్దుగా బీడ్స్ సచిన్ అని పిలుస్తుంటారు. తండ్రి సంజయ్ ఒకప్పుడు యూనివర్సిటీ స్థాయిలో క్రికెట్ ఆడాడు. అంతకంటే ముందుకు వెళ్లలేకపోయిన సంజయ్.. కుమారుడినైనా గొప్ప క్రికెటర్‌గా చూడాలనుకున్నాడు. తల్లి దాస్‌ను చదుకోవాలని ఒత్తిడి చేసినా.. కుమారుడిలోని ప్రతిభను గుర్తించిన సంజయ్ ఆ దిశగా ప్రోత్సహించాడు. ఆర్థికంగా భారమైనా కొడుకు కోసం అప్పుచేసి మరీ టర్ఫ్ పిచ్‌ను తయారు చేయించాడు. క్రికెట్‌పై నుంచి ధ్యాస మరలకుండా ఉండేందుకు.. తన కొడుకొను ఎక్కడికీ వెళ్లనిచ్చేవాడిని కాదని సంజయ్ చెప్పాడు. దాస్ రోజుకు 7 గంటలు ప్రాక్టీస్ చేస్తాడని తెలిపాడు. ప్రస్తుతం సచిన్ ఆడుతున్న తీరు చూస్తుంటే.. అతను త్వరలోనే టీమిండియాలోకి వచ్చినా ఆశ్చర్యం లేదు. భారీ షాట్లతో మ్యాచ్‌ను ఒంటిచేత్తో మార్చేయగల సత్తా ఉన్న ఆటగాడిగా అందరి నుంచి ప్రశంసలు అందుకొంటున్నాడు.

సిరీస్‌కు కోహ్లీ, జడేజా దూరం?



ఇంగ్లండ్‌తో చివరి మూడు టెస్ట్‌లకు జట్టు ఎంపిక నేడు!

న్యూఢిల్లీ: గాయపడిన ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, వ్యక్తిగత కారణాలతో జట్టుకు దూరమైన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఇంగ్లండ్‌తో చివరి మూడు టెస్ట్‌ల్లో పాల్గొనే అవకాశాలు దాదాపు లేనట్టే. మరోవైపు ఇంగ్లండ్‌తో హైదరాబాద్‌లో జరిగిన మొదటి టెస్ట్ సందర్భంగా జడేజాతోపాటు గాయపడిన మిడిలార్డర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ కోలుకున్నట్టు తెలిసింది. కండర గాయంతో వైజాగ్‌లో జరిగిన రెండో టెస్ట్‌కు దూరమైన జడ్డూ ప్రస్తుతం బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ లోపునరావాసంలో ఉన్నాడు. తన గాయానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పంచుకుంటున్నాడు. ఇందులో భాగంగా 'గాయం నుంచి కోలుకుంటున్నా. పరిస్థితి మెరుగైంది' అని తన ఫొటో సహా తాజాగా ట్వీట్ చేశాడు. అయితే ఇంగ్లండ్‌తో మిగిలిన మూడు టెస్ట్‌ల్లోనూ జడ్డూ ఆడే అవకాశాలు లేనట్టు తెలుస్తోంది. ఇక..వన్డే వరల్డ్ కప్ సందర్భంగా పాదానికి అయిన గాయం నుంచి పేసర్ షమి ఇప్పటికీ కోలుకోలేదట. 'పాదం గాయానికి యూకేలో చికిత్స పొందుతున్న షమితోపాటు జడేజా కూడా ఇంగ్లండ్‌తో మిగిలిన మూడు టెస్ట్‌లకు ఫిట్‌గా ఉండే అవకాశాలు దాదాపు లేవు. అయితే రాహుల్ కోలుకున్నాడు. రెండు, మూడు టెస్ట్‌లకు నడుమ సుదీర్ఘ సమయం ఉన్న దరిమిలా..రాజ్‌కోట్ మ్యాచ్‌కు అతడు సిద్ధమయ్యే చాన్సుంది' అని బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించాడు. మూడో టెస్ట్ ఈనెల 15న రాజ్‌కోట్‌లో మొద లవనుంది. ఇంగ్లండ్‌తో తొలి రెండు టెస్ట్‌లకు దూరమైన కోహ్లీ.. రాజ్‌కోట్, రాంచి టెస్ట్‌లతో పాటు మార్చి 7 నుంచి ధర్మశాలలో జరిగే చివరి మ్యాచ్‌కూ అందుబాటులో ఉండకపోవచ్చని తెలుస్తోంది. కాగా, ఇంగ్లండ్‌తో ఆఖరి మూడు టెస్ట్‌లకు భారత జట్టును గురువారం ఎంపిక చేసే అవకాశముంది.

తొలి టెస్ట్ న్యూజిలాండ్‌దే

మౌంట్ మాంగనుయ్: దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్‌లో ఆతిథ్య న్యూజిలాండ్ 281 పరుగుల భారీ తేడాతో గెలిచింది. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 179/4 వద్ద రెండో ఇన్నింగ్స్‌ను కివీస్ డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 349 పరుగులతో కలిపి మొత్తం 529 పరుగుల లక్ష్యాన్ని ప్రత్యర్థి ముందుంచింది. ఆటకు నాలుగో రోజు ఛేదనలో సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 247 పరుగులకు కుప్పకూలింది. డేవిడ్ బెడింగమ్ (87) పోరాటం వృథా అయింది. జేమిసన్ 4, శాంట్నర్ 3 వికెట్లు తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 511, సౌతాఫ్రికా 162 పరుగులు చేశాయి. ఈ విజయంతో వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో న్యూజిలాండ్ అగ్రస్థానానికి ఎగబాకగా.. భారత్ మూడో ర్యాంక్‌కు పడిపోయింది. ఆస్ట్రేలియా రెండో స్థానంలో నిలిచింది.

ఫైనల్లో సన్‌రైజర్స్

కేప్‌టౌన్: సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ వరుసగా రెండో ఏడాది సౌతాఫ్రికా (ఎస్ఏ) టీ20 లీగ్ ఫైనల్‌కు చేరింది. క్వాలిఫయర్-1లో ఆ జట్టు 51 పరుగులతో డర్బన్ సూపర్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. తొలుత సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 157/8 స్కోరు చేసింది. మలాన్ (63) హాఫ్ సెంచరీతో చెలరేగాడు. ఛేదనలో బార్ట్‌మన్ (4/10), మార్కో జాన్సెన్ (4/16) దెబ్బకు జెయింట్స్ 19.3 ఓవర్లలో 106 పరుగులకే కుప్పకూలింది.

క్వార్టర్స్‌లో అమిత్, ఆకాష్

సోఫియా (బల్గేరియా): స్ట్రాంజా మెమోరియల్ బాక్సింగ్ టోర్నీలో భారత్‌కు చెందిన అమిత్ పంగల్ (51 కి), ఆకాష్ (71 కి), అభిమన్యు లోరా (80 కి) క్వార్టర్స్ చేరుకొన్నారు. ప్రీ క్వార్టర్స్‌లో అమిత్ 5-0తో రుడిక్ మక్సమ్ (ఉక్రెయిన్)పై, ఆకాష్ 3-1తో ట్రవేర్ మకన్ (ఫ్రాన్స్)పై, అభిమన్యు 5-0తో మోనీ రఫెల్ (ఫ్రాన్స్)పై గెలుపొందారు.

ధోనీ లేని సీఎస్కేను ఊహించలేం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ధోనీ లేని చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) జట్టును ఊహించలేమని మాజీ చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ అన్నాడు. బుధవారం హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో స్టార్‌స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐపీఎల్ చర్చా కార్యక్రమంలో మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్, ఎమ్మెస్కే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెస్కే మాట్లాడుతూ.. ధోనీ తర్వాత సీఎస్కేను నడిపించే నాయకుడిని సంసిద్ధం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నాడు. ఇక.. ప్రస్తుతం సీఎస్కే జట్టులో ఉన్న గుంటూరు యువ క్రికెటర్ షేక్ రషీద్‌కు ఈ ఐపీఎల్ సీజన్ చాలా కీలకమన్న ఎమ్మెస్కే.. అవకాశాలను సద్వినియోగం చేసుకొని సత్తా చాటితే అతడు త్వరలోనే టీమిండియాకు ఆడతాడని జోస్యం చెప్పాడు.

బిజినెస్

2027 నాటికి చైనాను మించి...

భారత్‌లో చమురు డిమాండ్

అంతర్జాతీయ ఇంధన సంస్థ నివేదిక

బెతుల్ (గోవా): దేశం హరిత ఇంధనాలపై ఎంతగా దృష్టి సారిస్తున్నా సమాంతరంగా శిలాజ ఇంధనాల డిమాండు కూడా పెరిగిపోతూనే ఉంది. పెట్రోల్, డీజిల్ విక్రయాలు ఏ ఏటికాయేడు పెరిగిపోతూనే ఉన్నాయి. డిమాండ్‌లో వృద్ధి ఇలానే కొనసాగితే 2027 నాటికి మన దేశం ముడి చమురు డిమాండ్ వృద్ధిరేటులో చైనాను మించి పోతుందని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) ఒక నివేదికలో తెలిపింది. గోవాలో జరుగుతున్న ఇండియా ఎనర్జీ వీక్ సదస్సులో ఇందుకు సంబంధించి "ఇండియన్ ఆయిల్ మార్కెట్ ఔట్‌లుక్, 2030" పేరుతో ఐఈఏ ఒక నివేదిక విడుదల చేసింది.

రోజుకు 66.4 లక్షల బ్యారెళ్ల డిమాండ్ : గత ఏడాది మన దేశం రోజుకు సగటున 54.8 లక్షల బ్యారెళ్ల ముడి చమురుని పెట్రో ఉత్పత్తులుగా మార్చింది. ఇందులో 50 లక్షల బ్యారెళ్ల ఉత్పత్తులు దేశీయ వినియోగానికే సరిపోయాయి. 2030 నాటికి రోజువారీ ముడి చమురు డిమాండ్ 66.4 లక్షల బ్యారెళ్లకు చేరుకుంటుందని ఐఈఏ తెలిపింది. పెట్రో ఉత్పత్తుల వినియోగంలో ప్రస్తుతం మన దేశం అమెరికా, చైనా తర్వాత మూడో స్థానంలో ఉంది. దేశంలో వీటి వినియోగం వేగంగా పెరుగుతోంది. అయితే దేశంలో ముడి చమురు ఉత్పత్తి అందుకు తగ్గట్టు పెరగడం లేదు. 2030 నాటికి రోజువారీ దేశీయ చమురు ఉత్పత్తి 5.4 లక్షల బ్యారెళ్లకు పడిపోతుందని అంచనా. దీంతో మన దేశ అవసరాల్లో 85 శాతం చమురును దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. గత ఏడాది రోజుకు సగటున 46 లక్షల బ్యారెళ్లున్న చమురు దిగుమతులు 2030 నాటికి మరింత పెరిగి 58 లక్షల బ్యారెళ్లకు చేరుకుంటాయని ఐఈఏ అంచనా. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ వాహనాలు, పారిశ్రామిక వినియోగం ఇందుకు ప్రధాన కారణం.



ఈవీల ప్రభావం అంతంతే : విద్యుత్ వాహనాల గురించి ఎంతగా ప్రచారం జరుగుతున్నా, అవి ఇంకా మధ్య తరగతి జనానికి అందుబాటు ధరల్లో లభించడం లేదు. దీంతో ఈవీల అమ్మకాలు ఇంకా ఆశించిన స్థాయిలో లేవు. ప్రస్తుతం దేశంలో అమ్ముడవుతున్న టూ వీలర్లు, త్రీ వీలర్లలో ఒక శాతం కూడా ఈవీలు లేవు. ఫోర్ వీలర్ల అమ్మకాల్లో మాత్రమే ఐదు శాతం వరకు ఈవీలు ఉన్నాయి. అది కూడా హై ఎండ్ కొనుగోలుదారుల కోసమే. ఈవీలు, ఇంధన సామర్థ్యం పెంపు, బయో ఇంధనాలను విస్తృతంగా వినియోగించడం ద్వారా మన దేశం రోజుకు ఐదు లక్షల బ్యారెళ్ల చమురును ఆదా చేసే అవకాశం ఉందని ఐఈఏ అంచనా. ఇందులో రెండు లక్షల బ్యారెళ్ల ముడి చమురు ఒక్క ఈవీల వాడకం ద్వారానే పొదుపు చేయవచ్చని తెలిపింది.

ఎన్‌టీపీసీతో ఓఎన్‌జీసీ జాయింట్ వెంచర్

పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి కోసం ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీ, ఎన్‌టీపీసీ చేతులు కలిపాయి. ఇందుకోసం రెండు కంపెనీలు ఒక జాయింట్ వెంచర్ (జేవీ) కంపెనీని ఏర్పాటు చేయనున్నాయి. ఇండియా ఎనర్జీ వీక్ సదస్సు సందర్భంగా ఎన్‌టీపీసీ సీఎండీ గురుదీప్ సింగ్, ఓఎన్‌జీసీ చైర్మన్, సీఈఓ అరుణ్ కుమార్ సింగ్ సమక్షంలో ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ కంపెనీ సీఈఓ మోహిత్ భార్గవ, ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సతీశ్ కుమార్ ద్వివేది సంతకాలు చేశారు. ఈ జేవీ ద్వారా సముద్ర, నదీ జలాలపై పవన, సౌర విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని రెండు కంపెనీలు భావిస్తున్నాయి. అయితే ఈ జేవీ ఈక్విటీలో రెండు కంపెనీలకు ఎంతెంత వాటా ఉంటుందనే విషయాన్ని ఓఎన్‌జీసీ గానీ, ఎన్‌టీపీసీగానీ వెల్లడించలేదు.

వచ్చేసింది ఇ-లూనా



ధర రూ.69,990

న్యూఢిల్లీ: కైనెటిక్ గ్రీన్ కంపెనీ గతంలో బహుళ జనాదరణ పొందిన లూనాను ఇ-లూనాగా మార్కెట్లోకి తెచ్చింది. బుధవారం ఇ-లూనాను కేంద్రమంత్రి నితిన్ గడ్కరి ఆవిష్కరించారు. దీని ధర రూ.69,990 నుంచి ప్రారంభమవుతుందని కంపెనీ సీఈఓ సులజ్జా ఫిరోదియా మోత్వానీ చెప్పారు. ఒక సారి చార్జింగ్ చేస్తే 110 కిలోమీటర్లు నడిచే 2 కిలో వాట్ల లిథియం అయాన్ బ్యాటరీతో ఇది అందుబాటులోకి వస్తున్నట్టు ఆమె తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో లక్ష ఇ-లూనాలు విక్రయించడం, రూ.1200 కోట్ల టర్నోవర్ సాధించడం తమ లక్ష్యమని ఆమె అన్నారు.

నేడే ఆర్‌బీఐ పాలసీ

ముంబై: రెపోరేట్ల తగ్గింపు ఈ సారి కూడా ఉండదన్న స్పష్టమైన సంకేతాల నేపథ్యంలో ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ గురువారం ద్వైమాసిక ద్రవ్య పరపతి విధానం ప్రకటించనున్నారు. ప్రస్తుతం రెపోరేటు 6.5 శాతంగా ఉంది. గత ఏడాది ఫిబ్రవరిలో రెపోరేటును 0.25 శాతం పెంచి 6.5 శాతం చేసిన తర్వాత వరుసగా ఐదు విడతలుగా ఆర్‌బీఐ అదే స్థాయిలో స్థిరంగా కొనసాగిస్తూ వస్తోంది. ద్రవ్యోల్బణం ఇప్పటికీ ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన కట్టడి పరిధి (2 శాతం ఎగువకు లేదా దిగువకు సద్దుబాటు చేసుకునే వెసులుబాటుతో 4 శాతం వద్ద స్థిరీకరించడం) పై స్థాయికి చేరువలోనే కదలాడుతున్నందు వల్ల ఈ సారి కూడా ఆర్‌బీఐ వైఖరిలో మార్పు ఉండకపోవచ్చునంటున్నారు.

ఏఐలో 20 లక్షల మందికి శిక్షణ

- 2025 నాటికి జీడీపీలో 10 శాతం ఏఐ ద్వారానే..
- మైక్రోసాఫ్ట్ చైర్మన్, సీఈఓ సత్య నాదెళ్ల



ముంబై: కృత్రిమ మేధ (ఏఐ) నియంత్రణ ఇతర నియమావళి రూపకల్పనలో భారత్, అమెరికా సహకరించుకోవాల్సిన అవసరం ఉందని యూఎస్ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ చైర్మన్, సీఈఓ సత్య నాదెళ్ల అన్నారు. ఏఐ శరవేగ వ్యాప్తి ద్వారా ఆర్థికాభివృద్ధి ఫలాలను అన్ని వర్గాలకు సమానంగా అందించగలమని అన్నారు. మైక్రోసాఫ్ట్ 2025 నాటికి 20 లక్షల మంది భారతీయులకు ఏఐలో శిక్షణ అందించనుందని ఈ సందర్భంగా నాదెళ్ల తెలిపారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలతోపాటు గ్రామీణ వ్యక్తులకు ఏఐలో శిక్షణ ఇవ్వడంపై కంపెనీ దృష్టిసారించనుందన్నారు. భారత భవిష్యత్ కార్మిక శక్తిని మరింత శక్తిమంతం చేసేందుకు మైక్రోసాఫ్ట్ కట్టుబడి ఉందనడానికి ఈ కార్యక్రమమే నిదర్శనమన్నారు. అంతేకాదు, దేశంలో ఉద్యోగాల కల్పనను ఇది వేగవంతం చేయనుందన్నారు. తెలుగు వ్యక్తి అయిన సత్య నాదెళ్ల ఏడాది తర్వాత భారత్‌కు విచ్చేశారు. రెండ్రోజుల పర్యటనలో భాగంగా నాదెళ్ల బుధవారం ముంబైలో ఏర్పాటు చేసిన 'మైక్రోసాఫ్ట్ సీఈఓ కనెక్షన్' అనే కార్యక్రమంలో ఐటీ కంపెనీలు, కన్సల్టెన్సీలు, న్యాయ సంస్థల నాయకులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయనింకా ఏమన్నారంటే..

1తొలిసారిగా భారత్ మిగతా ప్రపంచంతో సమానంగా ఏఐలో అభివృద్ధిని సాధిస్తోంది. అలాగే, ఇక్కడి ఏఐ యూజ్ కేసులు కూడా ఎంతో వినూత్నమైనవి.

1భారత ఆర్థికాభివృద్ధిని మరింత పెంచడంలో ఏఐ తోడ్పడనుంది. ప్రపంచంలో అధిక వృద్ధిరేటు సాధిస్తున్న దేశాల్లో భారత్ ఒకటి. ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ అంచనాల ప్రకారం.. 2025 నాటికి భారత జీడీపీ 5 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోనుండగా.. అందులో ఏఐ ఆధారిత వృద్ధి వాటా 10 శాతంగా (50,000 కోట్ల డాలర్లు) ఉండనుంది.



బీన్యూలో రియల్‌మీ 12 ప్రో మొబైల్ విడుదల

బంజారాహిల్స్ (ఆంధ్రజ్యోతి): మొబైల్ రిటైలింగ్‌లోని బీన్యూ మాదాపూర్ స్టోర్‌లో రియల్‌మీ 12 ప్రో 5 జీ సిరీస్ మొబైల్ ఫోన్ అందుబాటులోకి వచ్చింది. సినీ నటి ప్రియాంక జవాల్కర్, బీన్యూ సంస్థ సీఎండీ వైడి బాలాజీ చౌదరి, సీఈఓ సాయి నిఖిలేష్‌లు ఈ ఫోన్‌ను బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. రియల్‌మీ 12 ప్రోలో యువతను ఆకట్టుకునే ఫీచర్స్ ఉన్నాయని ప్రియాంక అన్నారు. చూడగానే ఆకట్టుకునే వేగన్ లెదర్ డిజైన్, 50 మెగా పిక్సల్ కెమెరా దీని ఆకర్షణలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఈడీ సాయి నితేష్, ఇతరులు పాల్గొన్నారు.

సెల్ఫ్ లాండ్రీ విభాగంలోకి ఎల్‌జీ అడుగు

న్యూఢిల్లీ: కొరియాకు చెందిన హోమ్ అప్లయెన్సెస్ కంపెనీ ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ దేశంలో సెల్ఫ్ లాండ్రీ సర్వీసును ప్రారంభించింది. ఈ విభాగంలో రూ.33.2 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్టు ప్రకటించింది. ఈ సెల్ఫ్ లాండ్రీ సర్వీసు విశ్వవిద్యాలయ, కళాశాల విద్యార్థులకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఈ ఏడాది చివరి నాటికి దేశంలోని విద్యాసంస్థల హాస్టళ్లలో 200 సెల్ఫ్ లాండ్రీ కేంద్రాలు ప్రారంభించడం లక్ష్యమని కంపెనీ ప్రకటించింది. తొలి లాండ్రీ సర్వీసును గ్రేటర్ నోయిడాలోకి ఒక ప్రైవేటు విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేస్తున్నట్టు కంపెనీ ఎండీ హోంగ్ జు జియోన్ తెలిపారు.

ఆద్యంతం ఊగిసలాటలే..

మిశ్రమంగా ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

ముంబై: ఆద్యంతం తీవ్ర ఊగిసలాటలకు లోనైన ఈక్విటీ సూచీలు బుధవారం మిశ్రమంగా ముగిశాయి. సెన్సెక్స్ 34.09 పాయింట్ల నష్టంతో 72152 వద్ద ముగియగా నిఫ్టీ 1.10 పాయింట్ల నామమాత్రపు లాభంతో 21930.50 వద్ద ముగిసింది. ఆశాజనక పీఎంఐ డేటాతోపాటు గ్లోబల్ సంకేతాలు సానుకూలంగా ఉన్నప్పటికీ, ఆర్‌బీఐ ద్రవ్యపరపతి సమీక్ష నిర్ణయాలను గురువారం ప్రకటించనున్న నేపథ్యంలో మదుపరులు ముందుజాగ్రత్తగా వ్యవహరించారు.

జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఐపీఓకు 88 శాతం బిడ్లు: పబ్లిక్ ఆఫరింగ్ తొలిరోజు ముగిసేసరికి, జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఇష్యూ సైజులో 88 శాతానికి సమానమైన బిడ్లు రాగా.. క్యాపిటల్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌కు 50 శాతం సబ్‌స్క్రిప్షన్ లభించింది. రాశి పెరిఫెరల్స్ ఐపీఓకు మాత్రం 1.08 రెట్ల బిడ్లు లభించాయి. కాగా, గరుడ కన్‌స్ట్రక్షన్ అండ్ ఇంజనీరింగ్ ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఐపీఓకు దరఖాస్తు చేసుకున్న కంపెనీల సంఖ్య పదికి చేరుకుంది.

కెనరా బ్యాంక్ షేర్ల విభజన!: ప్రభుత్వ రంగానికి చెందిన కెనరా బ్యాంక్ షేర్లను విభజించాలనుకుంటున్నట్లు తెలిపింది. ఈనెల 26న సమావేశం కానున్న బ్యాంక్ బోర్డు షేర్ల విభజన ప్రతిపాదనపై నిర్ణయం తీసుకోనుంది. దాంతో కెనరా బ్యాంక్ షేరు 6.23 శాతం ఎగబాకి రూ.553.70 వద్ద ముగిసింది.

ఎన్‌టీపీసీ రూ.6,222 కోట్ల సమీకరణ: ప్రభుత్వ రంగానికి చెందిన ఎన్‌టీపీసీ.. విదేశీ ఇన్వెస్టర్ల నుంచి 75 కోట్ల డాలర్ల (సుమారు రూ.6,222 కోట్లు) రుణం సేకరించాలనుకుంటోంది. ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్ మార్గదర్శకాలకు లోబడి ఈ రుణాలను సమీకరించనుంది.

ఉద్యోగులకు టీసీఎస్ అల్టిమేటం

న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఇప్పటికీ వర్క్ ఫ్రం హోమ్ చేస్తూ ఇంట్లోనే ఉండిపోతున్న ఉద్యోగులకు తుది అల్టిమేటం జారీ చేసింది. మార్చి చివరి నాటికి కార్యాలయాలకు వచ్చి పని చేయడం ప్రారంభించాలని లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని హెచ్చరించింది. ఉద్యోగులకు కంపెనీ ఇస్తున్న చివరి అవకాశం ఇదేనని స్పష్టం చేసింది. తాము ఉద్యోగులకు అల్టిమేటం జారీ చేసిన మాట నిజమేనని టీసీఎస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎన్‌జీ సుబ్రమణియం ధ్రువీకరించారు.

ఆర్థిక మంత్రితో పేటీఎం బాస్ భేటీ

న్యూఢిల్లీ: పేటీఎం సీఈఓ విజయ్ శేఖర్ శర్మ మంగళవారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. వీరిద్దరి మధ్య పది నిమిషాలపాటు సంభాషణ జరిగిందని తెలిపారు. పీపీబీఎల్‌పై కఠిన చర్యలకు దారి తీసిన సమస్యలను నేరుగా ఆర్‌బీఐతోనే చర్చించి పరిష్కరించుకోవాలని మంత్రి సూచించినట్లు వారు తెలిపారు. అయితే, ఆర్‌బీఐ అధికారులతో భేటీ అయిన సందర్భంగా పీపీబీఎల్ సేవలపై విధించిన డెడ్‌లైన్(ఫిబ్రవరి 29)ను పొడిగించాలని శర్మ కోరినట్లు తెలిసింది.

మరో 10 శాతం పెరిగిన పేటీఎం షేరు: పేటీఎం బ్రాండ్ యాజమాన్య సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ షేరు బుధవారం బీఎస్ఈలో 10 శాతం పెరిగి రూ.496.75 వద్దకు చేరుకుంది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్(పీపీబీఎల్)పై ఆర్‌బీఐ నిషేధం నేపథ్యంలో వరుసగా మూడు రోజుల్లో 42 శాతం క్షీణించిన షేరు.. ఈ రెండ్రోజుల్లో కాస్త కోలుకుంది. మంగళవారం ట్రేడింగ్‌లో షేరు 3 శాతం పెరిగింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,230 ▲	58,000 ▲	76,000 ▲
ముంబై	62,650 ▲	57,380 ▲	69,870 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



7వ తేదీ		విజయవాడ	546
హైదరాబాద్	545	విశాఖపట్నం	555
8వ తేదీ		వరంగల్	547
చిత్తూరు	583	దజను గుడ్లు రూ.72	
గోదావరి	546		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	115	గోదావరి 120	
వరంగల్	115	విజయవాడ	120
కరీంనగర్	115	గుంటూరు	124
మహబూబ్‌నగర్	115	ఒంగోలు	124
కర్నూలు	115	చిత్తూరు	128
విశాఖపట్నం	115		

'గ్యారెంటీ'లపై రేవంత్ కొత్త డ్రామా

- 17ఎంపీ సీట్లు గెలిస్తేనే అమలంటూ మోసం
- రాహుల్ ప్రధాని కావడం అసాధ్యం: హరీశ్



జనగామ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్న రేవంత్‌రెడ్డి కొత్త డ్రామాకు తెర లేపారని, రాష్ట్రంలో 17 లోక్‌సభ సీట్లు గెలిస్తేనే గ్యారెంటీల అమలు సాధ్యమంటూ మాయమాటలు చెబుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. జనగామలో బుధవారం జరిగిన జనగామ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని రేవంత్ భావిస్తున్నారని, కానీ అది అసాధ్యమని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్‌కు ప్రస్తుతం 47 ఎంపీ సీట్లు మాత్రమే ఉన్నాయని, ఈ సారి ఆ సీట్లు రావడమూ కష్టమేనని పేర్కొన్నారు. రేవంత్ వ్యాఖ్యలు చూస్తుంటే రాహుల్ ప్రధాని అయ్యేది లేదు.. 6 గ్యారెంటీలు అమలు చేసేది లేదని చెప్పకనే చెబుతున్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలను అమలు చేస్తామంటూ రేవంత్‌రెడ్డి దబాయిస్తున్నారని, ఇప్పటికే 60 రోజులు పూర్తయ్యాయని మరో 40 రోజుల్లో ప్రజలే రేవంత్‌రెడ్డిని దబాయించే పరిస్థితి రానుందని చెప్పారు. కాంగ్రెస్‌కు వ్యంగ్యం తప్ప వ్యవహారం తెలియదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని ఒక్క బ్యారేజీ కొద్దిగా దెబ్బతింటే కాళేశ్వరమే మునిగిపోయిందని ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో దేవాదుల ప్రాజెక్టు పైప్‌లైన్లు గాలిలోకి ఎగరలేదా? అని ప్రశ్నించారు.

పొమ్మనలేక పొగ పెడుతున్నారు

- టికెట్ ఇస్తామంటేనే చేరా.. పార్టీలో ప్రాధాన్యం లేదు
- అందుకే రాజీనామా చేస్తున్నా: బాబూమోహన్



పంజాగుట్ట/జోగిపేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ సీటును తనకు ఇస్తామంటేనే బీజేపీలో చేరానని, అందోల్ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేశానని మాజీ మంత్రి, ప్రముఖ సినీ నటుడు బాబూమోహన్ తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాలలో జరిగిన ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం చేసి గెలిపించిన తనను ప్రస్తుతం కొంతమంది నాయకులు పొమ్మనలేక పొగ పెడుతున్నారని ఆరోపించారు. సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కంటతడి పెడుతూ తన ఆవేదనను పంచుకున్నారు. నియోజకవర్గంలో ప్రస్తుతం పార్టీ నాలుగు ముక్కలైందని, వారితోనే తనను తిట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత డిసెంబరు నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఎంపీ లక్ష్మణ్ తదితరులు తన ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని, పార్టీ కార్యక్రమాల గురించి సమాచారం ఇవ్వడంలేదని చెప్పారు. వార్డు సభ్యుడిగా, సర్పంచులుగా, ఎమ్మెల్యేలుగా గెలిపించుకోలేని వారికి మూడు పదవులు ఎందుకని ఆయన ప్రశ్నించారు. ఢిల్లీకి పంపిన లోక్‌సభ అభ్యర్థుల లిస్టులో కూడా తన పేరు లేదని, ఓ మాజీ ఐపీఎస్ అధికారి, మంద కృష్ణ మాదిగ పేర్లు వినిపిస్తున్నాయని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం వరంగల్ స్థానం నుంచే పోటీ చేసి, గెలుస్తానని స్పష్టం చేశారు. గురువారం తన రాజీనామా లేఖను అధిష్ఠానానికి పంపిస్తానని బాబూమోహన్ తెలిపారు.

ఆరు నూరైనా నల్లగొండలో సభ నిర్వహిస్తాం

- రేవంత్, కోమటిరెడ్డి మాకు లెక్క కాదు: జగదీశ్ రెడ్డి

నల్లగొండ, ఫిబ్రవరి 7: పోలీస్ యాక్టులు, నిర్బంధాలు, సంకెళ్లు తమకు కొత్తకాదని.. ఆరు నూరైనా ఈ నెల 13న నల్లగొండలో బహిరంగసభ నిర్వహించి తీరుతామని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి స్పష్టంచేశారు. నల్లగొండ సమీపంలోని చర్లపల్లి బైపాస్‌రోడ్డులో కేసీఆర్ పాల్గొనే బహిరంగ సభా స్థలిని బీఆర్ఎస్ నాయకులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, "తెలంగాణ రైతాంగ హక్కుల సాధనకు పేగులు తెగే దాకా పెద్ద పెద్ద రాకాసులతోనే కొట్లాడినోళ్లం.. చిన్న చిన్న రేవంత్, కోమటిరెడ్డి లాంటి వాళ్లు మాకు లెక్క కాదు" అని అన్నారు. కేంద్రం నుంచి ఏదో ఆశించే కాంగ్రెస్‌వాళ్లు కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పజెప్పారని ఆరోపించారు. మంత్రి ఉత్తమ్‌కు నీటి పారుదల శాఖపై అవగాహన లేదని ఎద్దేవా చేశారు. అనంతరం నల్లగొండలో 13న బీఆర్ఎస్ నిర్వహించ తలపెట్టిన సభకు అనుమతివ్వాలని నల్లగొండ జిల్లా ఎస్పీ చందనాదీప్తిని కలిసి వినతిపత్రం అందజేశారు.

ఎమ్మెల్యేగా ఓడాక బాల్క సుమన్‌కు పిచ్చెక్కింది

- మాజీ ఎమ్మెల్యే రేఖా శ్యామ్‌నాయక్

తలమడుగు, ఫిబ్రవరి 7: ఎమ్మెల్యే పదవి కోల్పోవడంతో బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ పిచ్చెక్కి మాట్లాడుతున్నారని ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ నాయకురాలు రేఖా శ్యాంనాయక్ మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి జోలికి వస్తే ఊరుకునేది లేదని ఆమె హెచ్చరించారు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం ఉండంలో రేఖా శ్యామ్‌నాయక్ విలేకరులతో మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డిపై బాల్క సుమన్ ఇటీవల చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బాల్కసుమన్ అధికారం అడ్డం పెట్టుకుని ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారని, వాటన్నింటినీ వెలుగులోకి తెస్తామనే ఆయన సీఎంపై ధ్వజమెత్తుతున్నారని రేఖా నాయక్ మండిపడ్డారు.

నదీ జలాలపై శాస్త్రీయ పరిష్కారం: తమ్మినేని

ఖమ్మం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నదీ జలాల విషయంలో శాస్త్రీయ పరిష్కారం అవసరమని, రాష్ట్రాల మధ్య లిటిగేషన్ పెట్టి కేంద్రం పెత్తనం సాగిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పరం విమర్శించుకోవడం మాని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఆరోగ్యం మెరుగపడిన తర్వాత తొలిసారి ఖమ్మం వచ్చిన తమ్మినేని జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలుగు ప్రజలు రాష్ట్రాలుగా విడిపోయినా సోదరభావంతో మెలగాల్సిన అవసరం ఉందని, కృష్ణా జలాల సమస్యతో వారి మధ్య విభేదాలు సృష్టించడం తగదన్నారు.

సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ల ఎంపికకు నోటిఫికేషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక(సీజీఆర్ఎఫ్) రెండు చైర్‌పర్సన్ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదలయింది. సీజీఆర్ఎఫ్-1(రూరల్), సీజీఆర్ఎఫ్-2(జీహెచ్ఎంసీ) చైర్‌పర్సన్‌ల కోసం దక్షిణ డిస్కమ్(టీఎస్ఎస్పీడీసీఎల్) ఈ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పోస్టులకు తెలంగాణలో 20 ఏళ్లపాటు జిల్లా జడ్జి లేదా జ్యుడీషియల్ ఆఫీసర్‌గా పనిచేసిన వారు లేదా మాజీ చీఫ్ ఇంజనీర్లు/చీఫ్ జనరల్ మేనేజర్(ఎలక్ట్రికల్)లు అర్హులు. చైర్‌పర్సన్‌గా పదవీ కాలం మూడేళ్లపాటు ఉంటుంది. ఆసక్తి ఉన్న అర్హులు దరఖాస్తులను పూర్తి చేసి ఈనెల 26వ తేదీలోగా పంపించాల్సి ఉంటుంది.

బీఆర్ఎస్ కథ ముగిసింది: ఎంపీ లక్ష్మణ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీఆర్ఎస్ కథ ముగిసిందని రాజ్యసభలో బీజేపీ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. ఇక నుంచి తెలంగాణలో బీజేపీదే భవిష్యత్తని ఆశాభావం వ్యక్తం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటిగా పనిచేశాయని ఇక ఆ పార్టీలు ఏం ప్రచారం చేసినా ప్రజలు నమ్మరని ఎద్దేవా చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అత్యధిక స్థానాల్లో గెలుస్తుందని, మోదీ మూడోసారి ప్రధాని అవుతారని ధీమా వ్యక్తం చేశారు. పదేళ్ల యూపీఏ పాలనలో జరిగిన అవినీతి కుంభకోణాలు బీజేపీ ప్రభుత్వ కాలంలో వెలుగులోకి వచ్చాయని, కుటుంబం కోసమే కాంగ్రెస్ పని చేస్తోందని ఆరోపించారు.

విజయ సాయిరెడ్డి పెద్ద అజ్ఞాని: టీపీసీసీ

హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, ఎంపీ విజయసాయిరెడ్డి పెద్ద అజ్ఞాని అని, ప్రధాని మోదీని జోకడమే ఆయన పనిగా పెట్టుకున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వంపై ఆయనకు అంత అక్కసు ఎందుకని ప్రశ్నించారు. రాష్ట్రం విడిపోక పోయి ఉంటే జగన్ సీఎం అయ్యుండేవారా? అని నిలదీశారు. షర్మిల రాకతో కాంగ్రెస్ బలం పెరుగుతుందనే విజయసాయిరెడ్డికి అంత అక్కసని అన్నారు. పిచ్చి సాయిరెడ్డికి తెలంగాణకు ఏం సంబంధమని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ ప్రశ్నించారు.

ట్రాన్స్‌జెండర్ల హక్కులు గుర్తించండి

- వారి పట్ల వివక్షను అరికట్టాలి: జస్టిస్ శ్యాం కోషీ

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్ల హక్కులను గుర్తించాలని, వారి సమస్యల పట్ల సానుభూతితో వ్యవహరించాలని రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ పీ శ్యాం కోషీ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వ అధికారులు, వివిధ వర్గాల ప్రతినిధులతో లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం హైకోర్టులో సమావేశమయ్యారు. ట్రాన్స్‌జెండర్ల పట్ల లింగ వివక్ష, హింసను అరికట్టాలని కోరారు. ఇందుకోసం పని ప్రదేశాలు, విద్యాసంస్థల్లో ట్రాన్స్‌జెండర్లపై తగిన అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ట్రాన్స్‌జెండర్లకు ఆస్పత్రుల్లో వసతులు కల్పించాలని, వసతి గృహాలు ఏర్పాటు చేయాలని, నైపుణ్య శిక్షణ ఇప్పించాలని సూచించారు.

పరకాల గురుకులంలో విజిలెన్స్ తనిఖీలు

దామెర, ఫిబ్రవరి 7: హనుమకొండ జిల్లా దామెర మండలం ఒగ్లాపూర్‌లో గల తెలంగాణ సాంఘిక గురుకుల పాఠశాల/కళాశాల (పరకాల-బాలుర)లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోదాలు నిర్వహించారు. బుధవారం అడిషనల్ ఎస్పీ బాలకోటీ ఆధ్వర్యంలో పలు రికార్డులను పరిశీలించారు. ఈ నేపథ్యంలో.. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు సరిగా చేరుతున్నాయా, లేదా అని ఆరా తీశారు. పాఠ్య పుస్తకాలు, యూనిఫారాలు, షూష్ వంటివి అందుతున్నాయా అని స్వయంగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తరగతిగదులు, వంటశాల, డార్మిటరీ వంటి వాటితో పాటు ఆహార పదార్థాల్లో నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేశారు.

బీఆర్ఎస్ సమావేశంలో బీజేపీతో చెలిమిపై చర్చ!

- అందుకే గులాబీ పార్టీకి గుడ్ బై: ఎంపీ వెంకటేష్ నేత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో బీజేపీతో చెలిమి గురించి చర్చ జరిగిందని, గులాబీ పార్టీ, బీజేపీ ఒక్కటేనని ఎంపీ వెంకటేష్ నేత ఆరోపించారు. అందుకే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరానని చెప్పారు. బుధవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇరుపార్టీల మధ్య నేరుగా పొత్తులు లేకున్నా.. లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య అంతర్గత ఒప్పందంపై చర్చ జరిగిందని ఆయన ఆరోపించారు. అంతర్గత ఒప్పందాలు నచ్చకే బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పానన్నారు. బీజేపీని వ్యతిరేకిస్తూ.. రాహుల్ గాంధీ చేస్తున్న భారత్ జోడో న్యాయ్ యాత్ర తనకు ప్రేరణగా నిలిచిందన్నారు. తనకు రాజకీయ జన్మనిచ్చిన కాంగ్రెస్‌లో తిరిగి చేరడం సంతోషంగా ఉందన్నారు.

బడ్జెట్ 2.70 లక్షల కోట్లు?

వాస్తవ రాబడులు, వ్యయాల ఆధారంగా రూపకల్పన.. బడ్జెట్ 100% వ్యయమయ్యేలా జాగ్రత్తలు



హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్ సిద్ధమైంది. ఈ బడ్జెట్ పద్దు దాదాపు రూ.2.60 లక్షల కోట్ల నుంచి రూ.2.70 కోట్ల వరకు ఉండొచ్చని సమాచారం. ప్రస్తుతం అమల్లో ఉన్న బడ్జెట్ కంటే ఇది 10 శాతం తక్కువగానే ఉంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఖజానాకు సమకూరుతున్న వాస్తవ రాబడులు, గత ప్రభుత్వం చేసిన వాస్తవ వ్యయాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఈ బడ్జెట్‌ను రూపొందించినట్లు సమాచారం. అనవసర పటాటోపాలకు పోకుండా, తన ప్రాధమ్యాలను పరిగణనలోకి తీసుకుంటూ సర్కారు చాలా జాగ్రత్తగా బడ్జెట్‌కు రూపమిచ్చినట్లు తెలిసింది. ఇది తాత్కాలిక బడ్జెటే అయినప్పటికీ.. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మొదటి సారి అధికారంలోకి వచ్చినందున.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆచితూచి బడ్జెట్‌ను రూపొందించినట్లు సమాచారం. విపక్షాల నుంచి విమర్శలు ఎదురుకాకుండా, సొంత పార్టీ నుంచి సంపూర్ణ మద్దతు లభించేలా జాగ్రత్తలు తీసుకున్నది. ఆర్థిక శాఖలో పాత అధికారులే ఉన్నప్పటికీ.. ప్రభుత్వం మాత్రం తన ఆరు గ్యారెంటీలతో పాటు, ప్రాధమ్యాలను వివరించి, ఆ దిశగా బడ్జెట్‌ను రూపొందించేలా శ్రద్ధ పెట్టింది. మొదటి సంవత్సరంలోనే అన్ని హామీలను అమలు చేయడం సాధ్యం కాదని, ఈసారి కొన్నింటిని అమలు చేస్తామంటూ ప్రజలకు భరోసా ఇవ్వబోతోంది. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీల్లో కొన్నింటికి చోటు కల్పించింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ శస్త్ర చికిత్స వ్యయ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందజేత వంటి గ్యారెంటీలను అమలు చేయడానికి వీలుగా బడ్జెట్‌లో నిధులను కేటాయించినట్లు తెలిసింది. ఉచిత బస్సు ప్రయాణానికి రూ.3000 కోట్ల వరకు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు. దీనిని ప్రభుత్వ ఖజానా నుంచి ఆర్టీసీకి చెల్లించాల్సి ఉంటుంది. ఇక 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును అందించాలంటే ప్రభుత్వానికి భారంగా పరిణమించనుంది. దీనికోసం రూ.4000 కోట్లకు పైగానే విద్యుత్తు పంపిణీ సంస్థలకు చెల్లించాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. కల్యాణమస్తు పథకం కింద రూ.1,00,116 నగదును అందిస్తూనే.. తులం బంగారాన్ని కూడా ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలే ప్రకటించారు. అంటే.. ఒక్కొక్క లబ్ధిదారుకు దాదాపు రూ.1.70లక్షలను వెచ్చించాల్సి ఉంటుంది. వివిధ శాఖలు అందజేసిన బడ్జెట్ ప్రతిపాదనలను కూడా పక్కాగా లెక్కించి, పరిగణనలోకి తీసుకున్నారు. ప్రతిపాదించే బడ్జెట్ 100 శాతం వ్యయమయ్యేలా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిసింది.

గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని..

2023-24లో బీఆర్ఎస్ సర్కార్ రూ.2,90,396 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఏపీ నుంచి విద్యుత్తు సంస్థల బకాయిల తాలూకు రూ.17,828కోట్లు, గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్ల కింద రూ.40వేలకోట్లు వస్తాయని అంచనా వేసింది. ఆ నిధులు అందేవి కావన్న విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకున్నది. 2022-23లో రూ.2.56లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన బీఆర్ఎస్.. రూ.2లక్షల కోట్లనే ఖర్చు చేయగలిగింది. ఈ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని, సర్కారు తన ప్రాధమ్యాలను పరిగణనలోకి తీసుకుని ఈసారి బడ్జెట్‌ను రూపొందించినట్లు తెలిసింది.

10న అసెంబ్లీలో బడ్జెట్?

(మొదటి పేజీ తరువాయి)

ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్తు శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. శాసన మండలిలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టవచ్చని తెలిసింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూడా శాసనసభా వ్యవహారాల మంత్రిగా వేముల ప్రశాంత్‌రెడ్డి మండలిలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టేవారు. దుద్దిళ్ల ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తారని సమాచారం. 11న ఆదివారం శాసన సభకు సెలవు ప్రకటించి, బడ్జెట్‌పై సభ్యులకు అధ్యయనం చేసే అవకాశమిస్తారని తెలిసింది. తిరిగి 12న అసెంబ్లీ ప్రారంభమయ్యాక బడ్జెట్‌పై చర్చ చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ చర్చ ఎన్ని రోజులపాటు జరిగేదీ శాసన సభా వ్యవహారాల కమిటీ(బీఏసీ) సమావేశంలో నిర్ణయించనున్నారు. ప్రభుత్వ వర్గాల నుంచి అందిన సమాచారం ప్రకారం ఈ సమావేశాలు 17వ తేదీ వరకూ కొనసాగుతాయని తెలిసింది. ప్రభుత్వం ఈ సెషన్స్‌లోనే సాగునీటి పారుదల శాఖపై శ్వేతపత్రాన్ని ప్రవేశపెట్టనుంది. దీనిపై ప్రభుత్వం తరఫున సీఎం రేవంత్‌రెడ్డి, సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడే అవకాశముంది. కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడంపై చర్చ జరిగే అవకాశముంది. ఇది కాకుండా... కుల గణనపైనా ప్రభుత్వం ఈ సమావేశాల్లోనే బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు తెలిసింది.

స్పీకర్, చైర్మన్ సమీక్ష

అసెంబ్లీ సమావేశాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై శాసన సభ మీటింగ్ హాల్‌లో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమీక్ష నిర్వహించారు. ఎలాంటి లోటుపాట్లూ లేకుండా సమావేశాలను నిర్వహించాలని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సభ్యుల ప్రశ్నలకు సాధ్యమైనంత త్వరగా సమాధానాలు ఇవ్వాలని సూచించారు. సమావేశాల సమయంలో సంబంధిత అధికారులు తప్పకుండా అందుబాటులో ఉండాలని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలోకి మండలి షిఫ్టింగ్ త్వరగా జరిగేలా చూడాలన్నారు. సమావేశాల సమయంలో ధర్నాలు, ర్యాలీలకు అనుమతులపై ఆచితూచి వ్యవహరించాలని సూచించారు. ఇక.. సమావేశాలు జరుగుతున్న సందర్భంలో మంత్రులు అందుబాటులో ఉండేలా చూడాలని, అసెంబ్లీ కమిటీల ఏర్పాటును త్వరగా పూర్తి చేయాలని డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ అన్నారు. మండలి, శాసన సభకు ఎన్నికైన నూతన సభ్యులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం పెట్టాలని అభిప్రాయపడ్డారు. కాగా.. సమావేశాల సమయంలో అన్ని విభాగాలనూ సమన్వయం చేసేందుకు, త్వరితగతిన సభ్యులకు సమాధానాలను అందించేందుకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించాల్సిందిగా సీఎస్‌ను మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశించారు. మంత్రులకు సబ్జెక్టులవారీగా బాధ్యతలు ఇస్తున్నామని.. సభ్యుల ప్రశ్నలకు వీలైనంత త్వరగా సమాధానాలు అందేలా చర్యలు తీసుకోవాలని సీఎస్‌కు సూచించారు. మండలిని అసెంబ్లీ ప్రాంగణంలోకి త్వరితగతిన షిఫ్ట్ చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొత్త సభ్యుల కోసం రెండు రోజుల ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

డ్రోన్ పైలటింగ్‌లో ఇస్రో శిక్షణ

(మొదటి పేజీ తరువాయి)

ఎరువులు, పురుగు మందులను చల్లేందుకు రైతులు డ్రోన్లను వినియోగిస్తున్నారని, కొన్ని చోట్ల స్వయం సహాయక సంఘాలు డ్రోన్లను ఉపాధి మార్గంగా ఎంచుకున్నాయని అధికారులు సీఎంకు వివరించారు. ఉన్నత స్థాయి నుంచి తహసీల్దార్ల స్థాయి వరకు ప్రభుత్వ అధికారులకు కూడా డ్రోన్లపై అవగాహన కల్పించేందుకు శిక్షణ ఇవ్వాలని సీఎం అధికారులకు సూచించారు. దేశంలోనే వినూత్నంగా తెలంగాణ ఈ శిక్షణ కోర్సు నిర్వహిస్తోందని ఇస్రో చైర్మన్ సోమనాథ్ తెలిపారు. ప్రస్తుతం ఎయిర్‌పోర్టులోనే డ్రోన్ పైలట్లకు శిక్షణనిస్తున్నామని, అక్కడున్న రద్దీ దృష్ట్యా హైదరాబాద్ పరిసరాల్లో ప్రత్యేకంగా డ్రోన్ పైలట్ల శిక్షణకు స్థలం కేటాయించాలని ఏవియేషన్ అకాడమీ అధికారులు సీఎంకు విజ్ఞప్తి చేశారు. స్పందించిన ముఖ్యమంత్రి డ్రోన్ పోర్టుకు అవసరమైన 20 ఎకరాల కోసం ఫార్మా సిటీ వైపు ఉన్న స్థలాలను అన్వేషించాలని అధికారులను ఆదేశించారు. కాగా, వరంగల్ ఎయిర్ పోర్ట్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని అధికారులను రేవంత్ ఆదేశించారు. పొడైన రన్‌వేలను కొత్తగా నిర్మించటంతో పాటు అక్కడి నుంచి కమర్షియల్ ఆపరేషన్స్ నిర్వహించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. కొత్తగూడెం, భద్రాచలం పరిసర ప్రాంతాల్లో ఎయిర్ పోర్టు ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు.

విదేశాల్లోని విద్యార్థుల కోసం హెల్ప్‌డెస్క్: సీఎం

అమెరికా సహా ఇతర దేశాల్లో చదువుకునే తెలుగు విద్యార్థులపై జరుగుతున్న దాడుల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన సయీద్ మజ్హర్ అలీపై చికాగోలో నలుగురు దుండగులు దాడి చేయడం, ఒహాయోలో శ్రేయాస్‌రెడ్డి మృతిచెందడం తీవ్రంగా కలిచివేసిందని ట్వీట్ చేశారు. తెలుగు విద్యార్థుల భద్రతపై తమ ఆందోళనను అమెరికా ప్రభుత్వానికి తెలపాలని కేంద్ర విదేశాంగ మంత్రి జై శంకర్‌కు 'ఎక్స్' ద్వారా విజ్ఞప్తి చేశారు. ఇతర దేశాల్లో విద్యనభ్యసిస్తున్న తెలంగాణ విద్యార్థుల కోసం ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని తెలిపారు.

15 రోజుల్లో 15వేల పోలీసు ఉద్యోగాలు

- త్వరలో గ్రూప్-1 నోటిఫికేషన్.. అదనంగా 60 ఖాళీలు
- నిరుద్యోగులు పరీక్షలకు సిద్ధం కావాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి
- అంబేడ్కర్ విగ్రహం వద్ద 441 మందికి సింగరేణి ఉద్యోగ నియామక పత్రాలు



సచివాలయంలో సీఎం రేవంత్‌తో నెదర్లాండ్స్ రాయబారి మెరిసాగెరార్ట్స్, చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రానున్న 15 రోజుల్లో 15 వేల పోలీసుల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. 60 కొత్త ఖాళీలతో గ్రూప్-1 నోటిఫికేషన్ కూడా జారీ చేస్తామని చెప్పారు. రాష్ట్రంలోని నిరుద్యోగులందరూ పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. తమ ప్రభుత్వం ఉద్యోగ నియామకాల కోసం అన్ని ప్రయత్నాలు చేస్తుందన్నారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో నిర్లక్ష్యానికి గురై విశ్వాసం కోల్పోయిన 32 లక్షల మంది నిరుద్యోగుల్లో విశ్వాసం నింపేందుకు కార్యక్రమాలు చేపడతామన్నారు. గత ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన సింగరేణి సంస్థను ఆదుకుంటామన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి 441 మందికి సింగరేణిలో ఉద్యోగాలు ఇస్తూ నియామక పత్రాలు అందజేశారు. వీరిలో 412 మంది కారుణ్య నియామకం కింద ఉద్యోగం పొందారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. సీఎం మాట్లాడుతూ ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనంగా అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా నియామక పత్రాలు అందజేస్తున్నామన్నారు. తెలంగాణ సాధనలో సింగరేణి కార్మికుల పాత్రను ఎవరూ తగ్గించలేరని ఆయన స్పష్టం చేశారు. పార్టీలు తెలంగాణ సాధనలో వైఫల్యం చెందినా కార్మికులు రాష్ట్రం కోసం అనేక పోరాటాలు చేశారని గుర్తుచేశారు. గత ప్రభుత్వం సింగరేణిని ఖాయిలా పడేలా చేసిందన్నారు. కేంద్రం కూడా సింగరేణి సంస్థకు అనేక అడ్డంకులు సృష్టించిందన్నారు. ఎన్నికల్లో సింగరేణి ప్రాంతం కాంగ్రెస్‌కు అండగా నిలిచి ప్రజా ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించిందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులకు వేలాది ఓట్ల మెజారిటీ రావడం వెనుక సింగరేణి కార్మికుల కృషి ఎంతో ఉందన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘానికి సింగరేణి ఎన్నికల్లో కేవలం 3 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయన్నారు. సింగరేణిలో 80 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని ఇటీవలే ఆదేశించినట్లు సీఎం తెలిపారు. సింగరేణి ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించే అంశంపై చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు. కారుణ్య నియామకాల వయస్సు సడలింపు అంశాన్ని పరిశీలిస్తామన్నారు. ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ప్రేమ్‌సాగర్ రావు, గడ్డం వివేక్, గడ్డం వినోద్, కోవా లక్ష్మీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సింగరేణి ఎండీ బలరాంనాయక్, ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ జనప్రసాద్ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన నెదర్లాండ్స్ రాయబారి

భారత్‌లో నెదర్లాండ్స్ కింగ్‌డమ్ రాయబారి మెరిసాగెరార్ట్స్ బుధవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్యనున్న సన్నిహిత సంబంధాలపై చర్చించుకున్నారు. భేటీలో తెలంగాణలో వ్యవసాయ రంగ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, అగ్రికల్చర్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఏర్పాటు, మూసీ రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగస్వామ్యం వంటి తదితర అంశాలు ప్రధానంగా ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది.



మేము అనుకుంటే.. 20 మంది

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వస్తరు

- ప్రభుత్వంపై కుట్రలు చేస్తే.. ప్రతి కుట్ర ఉంటది
- ఎమ్మెల్యేలు పోతారేమోనన్న భయంలో కేటీఆర్, హరీశ్
- కేసీఆర్, జగన్.. మోదీ డైరెక్షన్‌లో పనిచేస్తున్నారు
- విజయసాయిరెడ్డి బ్రోకర్ దుకాణం పెట్టుకున్నాడేమో: జగ్గారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేజారుతారేమోనన్న భయం కేటీఆర్, హరీశ్‌రావులకు పట్టుకుందని, వారిని కాపాడుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందంటూ వ్యాఖ్యలు చేస్తున్నారని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి అన్నారు. తాము అనుకుంటే 20 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వచ్చి చేరతారన్నారు. ఈ ఐదేళ్లే కాదు.. వచ్చే ఐదేళ్లూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే కొనసాగేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా సీఎం రేవంత్‌రెడ్డి అలర్ట్‌గానే ఉన్నారని, ప్రభుత్వానికి వచ్చే ముప్పేమీ లేదన్నారు. కుట్రలు చేస్తే.. ప్రతి కుట్రా ఉంటదంటూ హెచ్చరించారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంపు కార్యక్రమాలను అమలు చేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. త్వరలోనే రూ.500కి వంట గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పథకాలనూ ప్రారంభించనుందని చెప్పారు. రెండు నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషంగానే ఉన్నారని, సంతోషంగా లేనిది బీఆర్ఎస్ నేతలేనన్నారు. గడిచిన 9ఏళ్లలో సీఎం, మంత్రులు సచివాలయానికి రాకుండా ఇంట్లోనే కూర్చుని ప్రభుత్వాన్ని నడిపారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబం ఇప్పుడు రాజకీయ సందిగ్ధంలో ఉందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందంటూ రాజ్యసభలో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. తమ ప్రభుత్వాన్ని కూల్చే వకాలత్‌ను బీజేపీ దగ్గర ఆయన తీసుకున్నట్టుందన్నారు. కేసీఆర్, జగన్‌లు ఒక్కటేనని, వారిద్దరూ ప్రధాని మోదీ డైరెక్షన్‌లోనే పని చేస్తున్నారని ఆరోపించారు. "విజయసాయిరెడ్డీ.. బ్రోకర్, మీడియేటర్ దుకాణం ఏమైనా పెట్టుకున్నవా? నీకేమైనా విలువలు ఉన్నయా?" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయసాయిరెడ్డి వెళ్లి కేసీఆర్ కాళ్లు మొక్కినప్పుడు తనకు సిగ్గనిపించిందన్నారు. కేసీఆర్‌ను అదరగొట్టిన మొగోడు వైఎస్ఆర్ అని, అట్లాంటిది.. ఆయన కొడుకు వైఎస్ జగన్‌కు ఆత్మ అయినటువంటి విజయసాయిరెడ్డి కేసీఆర్ కాళ్లు మొక్కడం ఏంటీ అనిపించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విభజన చేయడం వల్లనే తెలంగాణతో పాటుగా ఏపీకీ స్వయం పాలన వచ్చిందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 12 నుంచి 14 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచేలా ప్లాన్ చేస్తున్నట్లు జగ్గారెడ్డి తెలిపారు.



సూర్యాపేట జిల్లా కోదాడలో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్, పక్కన మంత్రులు తుమ్మల, దామోదర, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

మేడిగడ్డ కూలిపోతుంది!

- విజిలెన్స్ విచారణలో ఈ విషయం తేలింది
- అన్నారం ప్రాజెక్టు ప్రమాదకర స్థితిలో ఉంది
- కృష్ణా జలాలపై కేసీఆర్, హరీశ్‌వి అబద్ధాలు: ఉత్తమ్

కోదాడ, ఫిబ్రవరి 7: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మేడిగడ్డ బ్యారేజీ కూలిపోతుందని విజిలెన్స్ విచారణలో తేలిందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అంతేకాకుండా.. అన్నారం ప్రాజెక్టు ప్రమాదకర స్థితిలో ఉన్నట్లు నివేదిక అందిందన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కోదాడలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఉత్తమ్ విలేకరులతో మాట్లాడారు. కృష్ణా జలాలు, ప్రాజెక్టుల అప్పగింతపై మాజీ సీఎం కేసీఆర్, హరీశ్‌రావు అసత్యాలు, అబద్ధాలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. నీటి పంపకాల్లో అన్యాయం జరుగుతుందనే 2014లో తెలంగాణను తెచ్చుకున్నామని గుర్తు చేశారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో 60 శాతం వాటాగా 551 టీఎంసీలు తెలంగాణకు రావాల్సి ఉందన్నారు. అప్పటి సీఎం కేసీఆర్ ఢిల్లీ వెళ్లి కేంద్రం, కృష్ణా బోర్డు ముందు తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 511 టీఎంసీ ఇవ్వాలని అడిగిన మాట నిజమో కాదో చెప్పాలన్నారు. ఏపీ సీఎం జగన్, కేసీఆర్ ఏకాంత చర్చలు జరిపిన ప్రతిసారీ కృష్ణానదిపై ఏపీ అక్రమ ప్రాజెక్టులు నిర్మించిందని, అయినా కేసీఆర్ ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో ప్రవహించే జలాల్లో గ్రావిటీ ద్వారా రోజుకు 8 టీఎంసీలు ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు రావాల్సి ఉందన్నారు. 2020 మేలో ఆ నీటిని రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా ఏపీకి తరలిస్తున్నా.. మౌనంగా ఉన్న కేసీఆర్.. కాంగ్రెస్ ఏమీ చేయకముందే పెద్ద మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 8 టీఎంసీలను ఉచితంగా తరలించినా మాట్లాడకుండా రెండు టీఎంసీల నీటి కోసం రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించడమేంటని ప్రశ్నించారు. అక్టోబరు 2021లో మేడిగడ్డ కుంగిపోతే.. నేటికీ కేసీఆర్ ఒక్కమాట మాట్లాడలేదని, దీనిపై ప్రజలు ఆలోచన చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుల అప్పగింతపై నిర్ణయం తీసుకోకపోయినా.. బీఆర్ఎస్ నాయకులు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

రాష్ట్రంలో 50 వేల కోట్ల పెండింగ్ బిల్లులు!

- జీహెచ్ఎంసీలోనే రూ.2 వేల కోట్లు:మంత్రి పొన్నం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో పనులు జరిగి పెండింగ్‌లో ఉన్న బిల్లులు రూ.40 వేల నుంచి రూ.50 వేల కోట్ల వరకు ఉన్నాయని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు రూ.1.90 లక్షల కోట్ల పనులకు ప్రొసీడింగ్స్ ఇచ్చిందని చెప్పారు. జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ సెక్షన్‌కే రూ.2 వేల కోట్లు బకాయి ఉందని వెల్లడించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో కలిసి జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డు ఉన్నతాధికారులతో పొన్నం సమీక్ష నిర్వహించారు. అనంతరం పొన్నం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులు, ఇతరత్రా అవసరాలకు ఎన్ని నిధులు అవసరం.. సంస్థ ఆర్థిక పరిస్థితి, జోన్ల వారీగా చేయాల్సిన పనులు, అందుకయ్యే వ్యయం తదితర వివరాలతో నివేదిక సిద్ధం చేసి సీఎంకు అందజేస్తామన్నారు. కాగా, టీఎస్ఆర్టీసీకి మరిన్ని కొత్త బస్సులను సమకూర్చడంతోపాటు నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నూతనంగా నియమించేందుకు చర్యలు చేపట్టినట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కొండాపూర్ 8వ బెటాలియన్‌లో టీఎస్ఆర్టీసీకి చెందిన 80 మంది కానిస్టేబుళ్ల పాసింగ్ ఔట్ పరేడ్‌లో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శిక్షణ పొందిన కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరించిన తర్వాత నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కారుణ్య నియామకాల ద్వారా 1700 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు.

ప్రజలను రెచ్చగొట్టేందుకు కేసీఆర్ నాటకం:జూపల్లి

హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కృష్ణా ప్రాజెక్టులకు సంబంధించి కేసీఆర్ చేస్తానంటున్న పోరాటం ఏదో.. కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినప్పుడే(2015లో) చేసి ఉంటే బాగుండేదని మంత్రి జూపల్లి కృష్ణారావు అభిప్రాయపడ్డారు. అధికారం కోల్పోయిన కేసీఆర్.. కొత్త నాటకాన్ని తెరపైకి తెచ్చారని విమర్శించారు. ప్రజలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటూ దక్కే పరిస్థితి లేదని అన్నారు. ఆ పార్టీలో ఉన్న ప్రజాప్రతినిధులందరూ వరుసకట్టి కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. ఎన్నికల్లో తన పరువు కాపాడుకునేందుకే ప్రాజెక్టుల పేరిట కేసీఆర్ డ్రామాకు తెరలేపారని విమర్శించారు.

ధాన్యం టెండర్ల దాఖలుకు గడువు పెంపు

గతేడాది యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యం టెండర్ల గడువును రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ రెండు రోజులు పొడిగించింది. ధాన్యం టెండర్ల తుది గడువు బుధవారం కాగా.. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు పొడిగిస్తూ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీచేశారు. బిడ్డింగ్ దాఖలు జనవరి 25 నుంచి ప్రారంభం కాగా ప్రీ బిడ్డింగ్ సమావేశాన్ని జనవరి 31న జరిగింది. ఎక్కువ మంది బిడ్డర్లను ఆకర్షించడానికి మరో రెండు రోజుల గడువు పొడిగించినట్లు సమాచారం.

ఇతర రాష్ట్రాల ఇసుకపై టన్నుకు రూ. 200 పన్ను

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ఇసుకపై టన్నుకు రూ. 200 పన్ను వసూలు చేయాలని గనులు, భూగర్భవనరుల శాఖ డైరెక్టర్ సుశీల్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులున్నప్పటికీ.. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ఇసుకపై పన్ను వసూలుచేయడం లేదని, ఇకనుంచి తప్పనిసరిగా వసూలుచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో రాగి లడ్డూల పంపిణీ


సిరిసిల్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో వారానికి ఒకసారి రాగి లడ్డూలు పంపిణీ చేసేందుకు చేపట్టిన సిరి పోషణ్ పైలట్ ప్రాజెక్టును స్త్రీ శిశు సంక్షేమశాఖ రాష్ట్ర కార్యదర్శి వాకాటి కరుణ ప్రారంభించారు. నెల రోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ముస్తాబాద్ మండలం పోత్గల్‌లో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు సిరిపోషణ్ కార్యక్రమం ఎంతో ఉపకరిస్తుందన్నారు.

2019లోనే దెబ్బతిన్న మేడిగడ్డ!

ఐదేళ్ల కిందటే బ్యారేజీలో బయటపడ్డ లోపాలు.. మరమ్మతులకు చర్యలు తీసుకోని అధికారులు

- డిజైన్లు ఇవ్వాలని ఎన్నిసార్లు కోరినా ఇవ్వలేదు
- ఇరిగేషన్ శాఖకు ఎల్అండ్‌టీ లేఖ

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మితమై.. మూణ్నాళ్లకే కుంగిపోయిన మేడిగడ్డ బ్యారేజీ వాస్తవానికి ఐదేళ్ల కిందటే దెబ్బతిన్నట్లు తేలింది. బ్యారేజీ నిర్మాణంలో లోపాలున్నట్లు 2019 నవంబరులోనే బయటపడ్డట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. దీని నిర్మాణ పనులు చేపట్టిన ఎల్అండ్‌టీ సంస్థ ఇటీవల నీటిపారుదల శాఖకు రాసిన లేఖలో ఈ విషయాన్ని వెల్లడించింది.





హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ బ్యారేజీ ఐదేళ్ల కిందటే దెబ్బతిన్నట్లు తేలింది. ఎల్అండ్‌టీ సంస్థ ఇటీవల నీటిపారుదల శాఖకు రాసిన లేఖలో ఈ విషయాన్ని వెల్లడించింది. 2023 అక్టోబరు 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం, దీనిపై కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించడం తెలిసిందే. అయితే డిఫెక్ట్ లయబుల్టీ పీరియడ్ (నిర్మాణంలో లోపాలు తలెత్తితే మరమ్మతులు చేసే బాధ్యతను నిర్దేశించే కాలం)లోనే బ్యారేజీ ఉందని, మరమ్మతులు చేయాల్సిన బాధ్యత ఎల్అండ్‌టీ సంస్థదేనని అధికారులు చెబుతుండగా, ఆ పీరియడ్ ముగిసిపోయిందని సంస్థ అంటోంది. తాము మరమ్మతులు చేయాలంటే అందుకు సంబంధించి మరోసారి ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుందని చెబుతోంది. ఈ మేరకు ఎల్అండ్‌టీ సంస్థ.. పది రోజుల కిందట నీటిపారుదల శాఖకు లేఖ రాసింది. 2019 నవంబరు నుంచి 2023 నవంబరు దాకా ప్రభుత్వంతో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ బయటపెట్టింది. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణాన్ని 2020 జూన్‌లో పూర్తి చేశామని, ఈ మేరకు ఆ ఏడాది జూన్ 29వ తేదీన అధికారులు సర్టిఫికెట్ ఇచ్చారని తెలిపింది. ఈ లెక్కన డిఫెక్ట్ లయబుల్టీ కాలం 2022 జూన్ 28వ తేదీన పూర్తయిందని స్పష్టం చేసింది. అయితే 2019 నవంబరు 20 తర్వాత బ్యారేజీ గేట్లు దించాలని ఆదేశాలు ఇవ్వగా... బ్యారేజీ దిగువ భాగంలో సిమెంట్ కాంక్రీట్ బ్లాకులు చెల్లాచెదురు అయ్యాయని, డౌన్‌స్ట్రీమ్ (దిగువభాగం) వెంట్‌లు, సీసీ అప్రాన్లు, స్టోన్ అప్రాన్లు, ఇతర నిర్మాణాలు దెబ్బతిన్నట్లు తేలింది. దీంతో మరమ్మతులు చేయడానికి తగిన డ్రాయింగ్, డిజైన్లు ఇవ్వాలని కోరామని ఎల్అండ్‌టీ తెలిపింది. టీఎస్ఈఆర్ఎల్ బృందంతో జరిగిన సమావేశంలోనూ తాము పాల్గొని డ్రాయింగ్/డిజైన్లు ఇవ్వాల్సిందిగా కోరామని, ఈ మేరకు 2020 మే 18న లేఖ రాశామని పేర్కొంది. కానీ.వాటిని అధికారులు ఇవ్వలేదని తెలిపింది. నిర్మాణానికి సంబంధించి తాము ఒప్పందం మేరకు నడుచుకున్నామని, డిఫెక్ట్ లయబుల్టీ కాలం కూడా పూర్తయినందున సర్టిఫికెట్ కూడా అందుకున్నామని వివరించింది.

విజిలెన్స్ విచారణలో పలు తేదీలు..

మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం పూర్తయినట్లుగా 2020 జూన్‌లో సర్టిఫికెట్ ఇచ్చినట్లు ఎల్అండ్‌టీ చెబుతుండగా.. విజిలెన్స్ విచారణలో మాత్రం పలు తేదీలు వెల్లడయ్యాయి. కొన్ని రికార్డుల్లో 2019 జూన్ 12న పూర్తయినట్లు నమోదు కాగా, మరో రికార్డులో 2019 సెప్టెంబరు 10న, ఇంకో రికార్డులో 2020 ఫిబ్రవరి 29న, ఇంకోచోట 2021 మార్చి 15వ తేదీన పూర్తయినట్లుగా అధికారులు సర్టిఫికెట్ ఇచ్చారని తేలింది. దీనికితోడు అధికారులు తాజాగా ఓ కొత్త కోణాన్ని వెలుగులోకి తెచ్చారు. ఎల్అండ్‌టీ సంస్థ మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణాన్ని సంపూర్ణంగా పూర్తిచేయలేదని, ఇంకా పనులు మిగిలే ఉన్నాయనే వాదనను తెరపైకి తెచ్చారు. ఆ లెక్కన డిఫెక్ట్ లయబుల్టీ కాలంలోనే బ్యారేజీ ఉందని, బ్యారేజీ పునరుద్ధరణ బాధ్యత నిర్మాణ సంస్థదేనని అంటున్నారు. కానీ, 2019లోనే బ్యారేజీ దెబ్బతిన్న విషయాన్ని ఎల్అండ్‌టీ చెప్పినా.. మరమ్మతులు చేపట్టలేదని, ఇది పూర్తిగా అధికారుల నిర్లక్ష్యమేనని తేలింది. అంతేకాదు.. తాజాగా తెరపైకి తెచ్చిన పనులకు, ఒరిజనల్‌గా మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం కోసం చేసుకున్న ఒప్పందాలకు సంబంధం లేదని ఎల్అండ్‌టీ స్పష్టం చేస్తోంది. 2016 ఆగస్టు 26న బ్యారేజీ నిర్మాణం కోసం చేసుకున్న ఒప్పందానికి, డిజైన్లకు లోబడే నిర్మాణం చేసినట్లు ప్రకటించింది. పదే పదే కోరినా డ్రాయింగ్‌లు ఇవ్వకపోవడం వల్లే మరమ్మతు పనులు చేయలేకపోయామని 2020 మే 18న లేఖ రాసింది. బ్యారేజీ కుంగిన తేదీకి ఐదు నెలల ముందు అంటే 2023 మే 17న కూడా మరో లేఖ రాసినట్లు తెలిపింది.

మేడిగడ్డ బ్యారేజీకి 2019లో భారీగా వరద రాగా, గేట్లన్నీ ఎత్తి.. వచ్చిన వరదను వచ్చినట్లే దిగువకు వదిలారు. అయితే 2019 నవంబరులోనే బ్యారేజీ గేట్లను దించగా.. వరద లేక బ్యారేజీ దిగువ భాగంలో సీసీ బ్లాకులు చెల్లాచెదురు అయినట్లు గుర్తించారు. దీంతో బ్యారేజీకి నష్టం జరిగిందని అప్పుడే గుర్తించారు. అయితే ఆర్నెల్ల తర్వాత తీరిగ్గా.. రుతుపవనాలు రావడానికి రెండు వారాల ముందు అంటే 2020 మే 18న కాళేశ్వరం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డివిజన్-1) మరమ్మతులపై లేఖ రాశారు. దాంతో బ్యారేజీకి జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి పుణేలోని సీడబ్ల్యూపీఆర్ఎస్‌తోపాటు సీడీవో అధికారులు కూడా బ్యారేజీని పరిశీలించారు. అంతేకాకుండా టీఎస్ఈఆర్ఎల్‌తో అధ్యయనాల అనంతరం వరద

ఆనాడే బయటపడ్డ లోపాలు

ప్రవాహ వేగాన్ని తగ్గించడానికి వీలుగా రీ డిజైన్లు చేసి.. వేరింగ్ కోట్స్, సీసీ అప్రాన్లు, స్టోన్ అప్రాన్‌లతో పాటు డౌన్ స్ట్రీమ్ అప్రామ్ స్ట్రక్చర్ల పనులు చేపట్టాల్సి ఉంటుందని మూడున్నరేళ్ల కిందటే గుర్తించారు. అయితే ఆ పనులు చేపట్టడానికి ఎల్అండ్‌టీ నిరాకరించింది. ప్రభుత్వం అందించిన నిర్దేశిత డిజైన్ల ప్రకారమే బ్యారేజీ నిర్మాణం చేసినందున.. పునరుద్ధరణ పనులు చేయాలంటే విధిగా మళ్లీ ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుందని 2020 మే 18న సదరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు లేఖ రాసింది. ఈ పనులన్నీ చేపట్టడానికి ఆర్నెల్ల సమయం కావాలని అప్పట్లోనే తేల్చింది. డీ వాటరింగ్ చేయడంతో పాటు దెబ్బతిన్న సీసీ బ్లాకులను తొలగించి.. వాటి స్థానంలో కొత్త నిర్మాణాలు, రాతి అప్రాన్లు ఏర్పాటు చేయడం వంటి పనులు చేపట్టడానికి, అది కూడా ప్రభుత్వం నిధులు ఇస్తే చేపట్టడానికి సుముఖత చూపింది. సవరించిన డిజైన్లు అందించాలని ఆర్నెల్లపాటు పదే పదే కోరింది. అయితే ఆ తర్వాత కొవిడ్ లాక్‌డౌన్ రావడంతోపాటు పదే పదే కోరినా ప్రభుత్వం రీ డిజైన్లు అందించలేదని తేలింది.

నిర్లక్ష్యాలు ఉన్నా నిర్ణీత వ్యవధిలోనే నిర్మాణం

పలు ప్రతిబంధకాలు ఉన్నప్పటికీ 24 నెలల రికార్డు సమయంలో మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం పూర్తి చేశామని ఎల్అండ్‌టీ గుర్తు చేసింది. భూమిని అప్పగించడంలో జాప్యం, ఆమోదించిన డ్రాయింగ్‌లు ఇవ్వడంలో జాప్యం, స్ట్రక్చరల్ డిజైన్ పారామీటర్లలో పలు మార్పులు, పరిసర గ్రామాల ప్రజల నిరసనలు, నిర్మాణ క్రమంలో రామగుండం ఈఎన్‌సీ చేసిన సూచనలనూ పరిగణనలోకి తీసుకున్నప్పటికీ.. నిర్ణీత వ్యవధిలోనే బ్యారేజీ నిర్మాణాన్ని పూర్తిచేశామని తెలిపింది. పైగా.. ప్రాజెక్టు నిర్మాణం పూర్తై నాలుగేళ్లు గడుస్తున్నా.. చేసిన పనులే చేయాలని నిర్దేశించడం సహేతుకం కాదని 2023 మే 17న రాసిన లేఖలో అభిప్రాయపడింది. బ్యారేజీని 2019 జూన్ 21వ తేదీన ప్రారంభించగా... వరుసగా నాలుగేళ్లపాటు బ్యారేజీ వరదలను తట్టుకుందని, 2022 జూలై 13 నుంచి 16వ తేదీ మధ్య భారీగా వరదల్లో కూడా తట్టుకొని నిలబడిందని గుర్తు చేసింది. 2025 జూన్ 28వ తేదీ దాకా బ్యారేజీ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కాలం ఉందని, అయితే ఈ మధ్యకాలంలో రూ.9.70 కోట్ల పనులను ఓఅండ్ఎం కాలంలో పూర్తిచేశామని తెలిపింది. బ్యారేజీ సివిల్/హెచ్ఎం పనులు 2019 జూన్ 21వ తేదీన పూర్తయ్యాయని వెల్లడించింది. గైడ్‌బండ్, ఫ్లడ్ బండ్స్, డైవర్షన్ ఛానెల్, అప్రోచ్‌రోడ్డు(కుదురుపల్లి నుంచి మేడిగడ్డ బ్యారేజీ) దాకా, లెఫ్ట్ బ్యాంకు, రైట్ బ్యాంకు, 3డీ నమూనా అధ్యయనాలు(లెఫ్ట్ బ్యాంకు, రైట్ బ్యాంకు) 2019 జూన్ 21వ తేదీన పూర్తిచేసినట్లు వివరించింది. పైగా.. కొన్ని పనులను ఒప్పందంలో లేకపోయినా చేశామని తెలిపింది. వీఐసీ గెస్ట్‌హౌస్ నిర్మాణం, ఏఈఈ అండ్ డీఈఈ క్వార్టర్ల నిర్మాణం, కంట్రోల్ రూమ్‌కు అప్రోచ్ రోడ్డు, గార్డ్ రూమ్ నిర్మాణం, బ్యారేజీ వైపు ఫ్యాబ్రికేషన్ అండ్ ఎరెక్షన్ ఆఫ్ గేట్స్‌లు వంటి కొత్త పనులు చేపట్టాలని కోరుతున్నా వాటికి సప్లిమెంటల్ అగ్రిమెంట్ చేయలేదని గుర్తు చేసింది. అయితే ఉన్నతాధికారుల ఆదేశాలతో వీటి నిర్మాణం చేపడుతున్నామని, దీనికి రూ.7.50 కోట్ల దాకా వ్యయం అయ్యే అవకాశం ఉందని, అయితే దీనికి ఎలాంటి చెల్లింపులు చేయకపోవడంతో నగదు కొరత ఏర్పడిందని గుర్తు చేసింది. ఒప్పందాలు చేసుకోకుండాకొత్త పనులు చేయించాలనుకోవడం సహేతుకం కాదని, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో అదనపు పనుల కోసం ఒప్పందాలు చేసుకోలేమని పేర్కొంది. దాంతో పనులన్నీ పూర్తయినందున, డిఫెక్ట్ లయబుల్టీ కాలం కూడా ముగిసినందున బిల్లులన్నీ విడుదల చేసి, ఒప్పందాన్ని క్లోజ్ చేయాలని 2023 మే 17న రాసిన లేఖలో గుర్తు చేసింది.

మేడిపండు చందమే!

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొంది. ఈ బ్యారేజీ పనులకు సంబంధించి చేసిన చెల్లింపులు, రికార్డులు పరిశీలించాకా మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయని తెలిపింది. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు, అవకతవకలపై విచారణ చేసిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం.. మధ్యంతర నివేదికను ప్రభుత్వానికి అందించింది. ఈ నివేదికను ప్రభుత్వం గురువారం నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టనుంది. కాగా.. మేడిగడ్డ నిర్మాణ అంచనాలను పెంచేయడం దగ్గరినుంచి.. నిర్మించిన తర్వాత కనీస నిర్వహణను కూడా చేపట్టలేదని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక తూర్పారబట్టింది. మేడిగడ్డ నిర్మాణం తొలుత రూ.1853.32 కోట్లతో చేపట్టాలని నిర్ణయించగా.. 2016 మార్చి 1వ తేదీన రూ.2591 కోట్లతో కట్టడానికి ప్రభుత్వం పరిపాలనపరమైన అనుమతినిచ్చిందని, మళ్లీ 2018 మే 19న అంచనాలను రూ.3260 కోట్లకు, 2021 సెప్టెంబరు 6న రూ.4613 కోట్లకు చేర్చిందని గుర్తుచేసింది. నిర్ణీత వ్యవధిలో బ్యారేజీ పూర్తయినప్పటికీ అంచనా వ్యయం మాత్రం 133.67 శాతం పెంచారని తేల్చింది. బ్యారేజీ నిర్మాణం పూర్తయినట్లు సర్టిఫికెట్లు ఇవ్వడంపైనా అనుమానాలను వ్యక్తం చేసింది. తొలుత 2019 సెప్టెంబరు 10న 'సబ్‌స్టాన్షియల్ కన్‌స్ట్రక్షన్ కంప్లీషన్ సర్టిఫికెట్'.. 2021 మార్చి 15న నిర్మాణం పూర్తిగా అయిపోయినట్లు 'కంప్లీషన్ సర్టిఫికెట్' ఇచ్చారని తేల్చింది. ఆ సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత అగ్రిమెంట్ టైమ్‌ను 2022 మార్చి 31 దాకా పొడిగిస్తూ ఇంజనీర్ ఇన్‌చీఫ్ ఆదేశాలిచ్చారని, రూ.280.61 కోట్లు విడుదల చేయాలంటూ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిఫారసు చేశారని గుర్తించింది. బ్యారేజీ కుంగిపోయాక జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి చెందిన ఆరుగురు సభ్యుల బృందం విచారణ నిమిత్తం వచ్చి.. 20 రకాల సమాచారాన్ని అడగ్గా, 11 రకాల సమాచారం మాత్రమే అందించారని పేర్కొంది.

ఎత్తిపోసింది తక్కువే

ఐదేళ్లకాలంలో మేడిగడ్డ(కన్నెపల్లి) పంప్‌హౌస్ నుంచి 900 టీఎంసీలను ఎత్తిపోయాల్సి ఉండగా.. 162 టీఎంసీల నీటిని మాత్రమే ఎత్తిపోశారని నివేదిక వెల్లడించింది. అలాగే.. బ్యారేజీ నిర్మాణంలో అనేక ఉల్లంఘనలు చోటుచేసుకున్నాయని.. అయినా వీటిని ఉన్నతాధికారులు గుడ్డిగా ఆమోదించేశారని.. ఈ ఉల్లంఘనలను ఎందుకు ఆమోదించాల్సి వచ్చిందన్న నోట్ కూడా ఏదీ రాయలేదని తన నివేదికలో పేర్కొంది. బ్యారేజీ నిర్వహణను గాలికొదిలేశారని తప్పుబట్టింది. 2019 జూన్ 19వ తేదీన బ్యారేజీని సీఎం కేసీఆర్ బ్యారేజీ ప్రారంభించినా.. అప్పటి నుంచి ఎలాంటి నిర్వహణ, మరమ్మతు (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) పనులు చేపట్టలేదని విజిలెన్స్ విచారణలో తేల్చింది. అటు ప్రభుత్వం కానీ, ఇటు నిర్వహణ సంస్థ(ఎల్ అండ్ టీ) కానీ అసలు నిర్వహణ పనులపైనే దృష్టి పెట్టలేదని పేర్కొంది.

పనుల్లో పద్ధతి లేదు..

విజిలెన్స్ నివేదిక ప్రకారం.. మేడిగడ్డలో కుంగిపోయిన బ్లాక్-7కు సంబంధించిన నిర్మాణ పనులు క్రమ పద్ధతిలో జరగలేదు. మెజర్‌మెంట్ బుక్(ఎంబుక్), ఇతర రికార్డుల పరిశీలనలో ఈ విషయం వెల్లడైంది. ఈ బ్లాకులోని రాఫ్ట్‌తో పాటు సీకెంట్ పైల్స్ నిర్మాణం సరిగ్గా జరగలేదు. అంటే నిర్మాణంలో అనుసరించాల్సిన పద్ధతులను అనుసరించలేదని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తేల్చింది. అంతేకాదు.. భారతీయ ప్రమాణాల కోడ్.. ఐఎస్ 7349:2012లోని క్లాజులు 5.3.1, 5.3.2 ప్రకారం వర్షాకాలానికి ముందు, తర్వాత బ్యారేజీని డ్యామ్ ఓనర్ (రామగుండం ఈఎన్‌సీ) పరిశీలించాలి. విచారణ జరపాలి. ఎక్కడైనా నిర్మాణ లోపాలు ఉంటే తెలియపర్చాలి. కానీ అవేవీ జరగలేదు. అంతకంటే చిత్రమైన మరో విషయాన్ని కూడా విజిలెన్స్ నివేదిక పొందుపరిచింది. బ్యారేజీ నిర్మాణం కోసం నీటిని మళ్లించడానికి కాఫర్‌డ్యామ్ నిర్మించారు. బ్యారేజీ నిర్మాణం అనంతరం ఈ కాఫర్ డ్యామ్‌ను, షీట్ పైల్స్‌ను తొలగించాలి. కానీ ఇప్పటికీ కాఫర్‌డ్యామ్, షీట్ పైల్స్ అలాగే ఉన్నాయి. నిర్మాణం పూర్తయి ఐదు సీజన్లు గడిచిపోతున్నా వాటిని తొలగించకపోవడం వల్ల నది సహజ ప్రవాహంపై ప్రభావం పడిందని ఆందోళన వ్యక్తం చేసింది.

నిపుణుల కమిటీ వేయాలి

బ్యారేజీ కుంగుబాటుకు కారణాలు తెలుసుకునేందుకు.. ప్రాజెక్ట్ డిజైన్స్ అండ్ డ్రాయింగ్స్ పరిశీలించాలని, వాటితోపాటు జియోలాజికల్ ఇన్వెస్టిగేషన్, బ్యారేజీలోని అన్ని కాంపొనెట్లు డిజైన్ ప్రకారమే ఉన్నాయా? ఒకదానికొకటి అనుసంధానమై, పటిష్ఠంగానే ఉన్నాయా? అన్న విషయాలను పరిశీలించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని విజిలెన్స్ నివేదిక సిఫారసు చేసింది.

ఒప్పందం ప్రకారం పూర్తిచేయలేదు

ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం(నెం.50) ప్రకారం కాంట్రాక్టు సంస్థ నిర్మాణ పనులేవీ సంపూర్ణంగా పూర్తిచేయలేదని విజిలెన్స్ నివేదిక స్పష్టం చేసింది. ఇతర ప్రధాన బ్యారేజీల నిర్మాణ పూర్తి సర్టిఫికెట్లను పరిశీలించగా ఈ విషయం తేలినట్టు వెల్లడించింది. 3 డీ నమూనాల అధ్యయనాల ప్రకారం బ్యారేజీ ఎగువ, దిగువన వరద ప్రవాహాన్ని తగ్గించే పనులు చేపట్టలేదని పేర్కొంది.

బ్యాంకు గ్యారంటీ ఇచ్చేస్తారా?

ప్రాజెక్టులో ఏవైనా లోపాలుంటే, నిర్మాణంలో అవకతవకలుంటే సరిచేయాల్సిన బాధ్యత నిర్మాణ సంస్థదే. రెండేళ్లపాటు ఎలాంటి నిర్మాణ లోపాలున్నా సంస్థదే బాధ్యత. దీన్నే డిఫెక్ట్ లయబిలిటీ కాలం అంటారు. కానీ, 2021లో కంప్లీషన్ సర్టిఫికెట్ ఇవ్వడానికి ముందే.. డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ 2020 ఫిబ్రవరి 29 నుంచి మొదలవుతుందంటూ ఇంజనీర్ ఇన్ చీఫ్ (రామగుండం) 2020 నవంబరు 11న ఒక లేఖ విడుదల చేశారని పేర్కొంది. ఈ పీరియడ్ రెండేళ్లపాటు అమల్లో ఉంటుంది. రెండేళ్లు పూర్తయ్యాక..అంతా బాగుందని అనుకున్నాకే సదరు సంస్థ సమర్పించిన బ్యాంకు గ్యారంటీలు తిరిగి చెల్లింపునకు అధికారులు అనుమతించాలి. కానీ.. పనులు పూర్తికాకున్నా నిర్మాణ సంస్థకు బ్యాంకు గ్యారెంటీలు విడుదల చేయాలంటూ ఇంజనీర్ ఇన్ చీఫ్ తన లేఖలో సిఫారసు చేశారని ఆక్షేపించింది. "ఇది తప్పుడు నిర్ణయం. దీనికి సంబంధించి ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందే" అని తేల్చిచెప్పింది.

లోపాలు ఎత్తిచూపేలా శ్వేతపత్రం!

ప్రాజెక్టుల నిర్మాణంలో లోపాలపై ఫోకస్

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాలన్నీ ఆయకట్టుకు నీరందించడానికి కాకుండా.. అనుచిత ప్రయోజనాల కోసమే జరిగాయని కాంగ్రెస్ సర్కారు ఆరోపిస్తోంది. ఈ మేరకు నిర్మాణంలో లోపాలు, వైఫల్యాలన్నింటినీ ఎత్తిచూపేలా శ్వేతపత్రాన్ని సిద్ధం చేసింది. దీనికి తుది మెరుగులు దిద్దే ప్రక్రియ పూర్తయింది. ఇప్పటికే నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా దీనిపై కీలకమైన సూచనలు, మార్పులు సూచించగా.. అధికారులు ఆ మేరకు మార్పు చేర్పులు చేశారు. 1956 నుంచి 2004 దాకా, ఆ తర్వాత 2004 నుంచి 2014 దాకా, 2014 నుంచి 2023 దాకా నీటిపారుదల రంగంపై వెచ్చించిన నిధులు, అందుబాటులోకి వచ్చిన ఆయకట్టు వివరాలతో శ్వేతపత్రాన్ని సిద్ధం చేస్తున్నారు. 1956 నుంచి 2014 దాకా నీటిపారుదల శాఖపై రూ.54,021 కోట్లను వెచ్చించగా.. 57.87 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందినట్లు ప్రభుత్వం గుర్తించింది. అదే 2014-23 దాకా రూ.1,82,607 కోట్లను వెచ్చిస్తే 17.24 లక్షల ఎకరాలకు మాత్రమే కొత్తగా సాగులోకి తెచ్చారని నిర్ధారించింది. ఇందులో కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కింద రూ.93,872 కోట్లు వెచ్చిస్తే.. 98 వేల ఎకరాలకే కొత్త ఆయకట్టుకు నీరిచ్చారని గుర్తించింది. దీంతో గత పదేళ్లలో ప్రాజెక్టుల నిర్మాణం భూములకు నీళ్లివ్వడానికి కాకుండా కేవలం పైసల కోసమే జరిగిందని ప్రభుత్వం ఆరోపిస్తోంది.

నీటిపారుదల ప్రాజెక్టుల చుట్టే అసెంబ్లీ..

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని అన్ని కాంపోనెంట్లపై దాదాపు ఏడాదిన్నరకు పైగా విచారణ జరిపిన కాగ్ తన నివేదికను గత జనవరి 29న ప్రభుత్వానికి సమర్పించింది. ఆ నివేదిక కూడా అసెంబ్లీ సమావేశాల్లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో.. శాసనసభ సమావేశాలు శ్వేతపత్రంతోపాటు కాగ్ రిపోర్టు, కృష్ణా ప్రాజెక్టుల వివాదం చుట్టే జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. శ్వేతపత్రంలోనే కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇచ్చిన మధ్యంతర నివేదిక వివరాలు కూడా పొందుపరచనున్నారు.

ఈఎన్‌సీ మురళీధర్‌రావుపై వేటు

రాజీనామా చేయాలని సర్కారు ఆదేశం.. రామగుండం ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లును తొలగిస్తూ ఉత్తర్వులు

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అవినీతిపై ప్రభుత్వం కన్నెర్రజేసింది. నీటిపారుదల శాఖలో భారీ ప్రక్షాళనకు నడుం బిగించింది. కాళేశ్వరం అవినీతి వ్యవహారంలో ప్రభుత్వ యంత్రాంగంపరంగా కీలక సూత్రధారిగా భావిస్తున్న రామగుండం ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లుకు ఉద్వాసన పలికింది. అలాగే.. 2013లోనే రిటైరైనా సాగునీటి శాఖలో కీలకపాత్ర పోషిస్తున్న ఈఎన్‌సీ (జనరల్) మురళీధర్‌రావును కృష్ణా ప్రాజెక్టుల వివాదం జటిలం కావడానికి కారకుడిగా భావించి రాజీనామా చేయాలని ఆదేశించింది. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగుబాటుపై విజిలెన్స్ విచారణకు సంబంధించి ప్రాథమిక నివేదిక ప్రభుత్వానికి అందింది. బడ్జెట్ సమావేశాల్లో నీటిపారుదల శాఖకు సంబంధించి శ్వేతపత్రం విడుదల చేయడానికి ప్రభుత్వం సిద్ధమైన నేపథ్యంలో ఆ శాఖలో ఎన్నో ఏళ్లుగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఉన్నతాధికారులపై వేటు వేసింది. అందులో భాగంగా.. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అత్యంత కీలకంగా వ్యవహరించిన నల్లా వెంకటేశ్వర్లును తొలగిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. ఆ ప్రాజెక్టులో ప్రధాన హెడ్‌వర్క్‌లన్నీ ఆయన పరిధిలోనే ఉన్నాయి. అత్యంత కీలకమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలతోపాటు మూడు పంప్‌హౌస్‌ల నిర్మాణం ఈయన నేతృత్వంలోనే జరిగింది. అనంతరం 2022 జూలైలో వచ్చిన వరదలకు కన్నెపల్లి (మేడిగడ్డ) పంప్‌హౌస్ దెబ్బతింది. అన్నారం పంప్‌హౌస్ కూడా నీట మునిగింది. ఇందులో మూడు పంప్‌హౌస్‌లు కూడా ఎఫ్ఆర్ఎల్ దిగువన కట్టారని తేలింది. తొలుత ఆమోదించిన ప్రకారం కాకుండా డిజైన్లను మార్చేసి, ఎఫ్ఆర్ఎల్ దిగువన పంప్‌హౌస్‌లు కట్టడం వెనుక వెంకటేశ్వర్లు కూడా కారణమని ఆరోపణలు వచ్చాయి. గత డిసెంబరులో మంత్రులు మేడిగడ్డ సందర్శనకు వెళ్లినప్పుడు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో వాస్తవాలను ఆయన కప్పిపుచ్చినట్టుగా గుర్తించారు. అంతేకాదు.. మేడిగడ్డ బ్యారేజీ ఎప్పుడు పూర్తయిందనే అంశంపై స్పష్టత లేకుండా పోవడానికి కూడా నల్లా వెంకటేశ్వర్లు కారణమని.. ఆ తేదీపై వాస్తవాలను కప్పిపుచ్చారని విజిలెన్స్ విచారణలో గుర్తించారు. ఈ నేపథ్యంలో.. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అవినీతికి సంబంధించి వాస్తవాలు వెలుగులోకి రావాలంటే అందులో కీలక పాత్రధారిగా ఉన్న నల్లా వెంకటేశ్వర్లును తొలగించాలని నిర్ణయించుకున్న ప్రభుత్వం ఆ మేరకు ఉత్తర్వులు విడుదల చేసింది. వాస్తవానికి ఆయన నాలుగేళ్ల కిందటే పదవీ విరమణ చేయగా.. ప్రభుత్వం ఏటా ఆయన పదవీకాలాన్ని పొడిగిస్తూ ఉత్తర్వులు ఇస్తూ వచ్చింది. మార్చిలో ఆయన పొడిగింపు పదవీకాలం పూర్తికానుండగా.. రేవంత్ సర్కారు ఈలోపే ఆయనకు ఉద్వాసన పలుకుతూ నిర్ణయం తీసుకుంది. అయితే, వెంకటేశ్వర్లుపై విజిలెన్స్ విచారణను కొనసాగించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

కృష్ణా ప్రాజెక్టుల వివాదంలో మురళీధర్

కృష్ణా ప్రాజెక్టుల వివాదం జటిలం కావడానికి కారకుడిగా భావిస్తున్న ఈఎన్‌సీ (జనరల్) మురళీధర్‌రావును.. రాజీనామా చేయాల్సిందిగా ప్రభుత్వం కోరింది. నీటి వాటాలు తేలే దాకా, శ్రీశైలం, సాగర్‌ల ఆపరేషనల్ ప్రొటోకాల్ ఖరారు అయ్యేదాకా కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు (కేఆర్ఎంబీకి) ప్రాజెక్టులు అప్పగించలేమని తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా తేల్చిచెప్పగా.. దానికి విరుద్ధంగా ప్రాజెక్టుల అప్పగింతకు అభ్యంతరాల్లేవని మురళీధర్‌రావు చెప్పిన సంగతి తెలిసిందే. ఈ వివాదాన్ని సొమ్ము చేసుకునేందుకు.. బీఆర్ఎస్ ఉద్యమానికి శ్రీకారం చుట్టడం ప్రభుత్వానికి ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలోనే రాజీనామా చేయాలని మురళీధర్‌రావును కోరింది. వాస్తవానికి ఆయన మూడేళ్లుగా తనను తప్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత.. తనకు విశ్రాంతినివ్వాలని సీఎంను కోరగా.. మరికొంతకాలం కొనసాగాలని ఆయన ఆదేశించినట్లు తెలిసింది. మురళీధర్‌రావు 2011 ఆగస్టు 1 నుంచి ఈఎన్‌సీ (జనరల్)గా పనిచేస్తున్నారు. 2013లోనే ఆయన రిటైరయ్యారు. అయితే, అప్పటి కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం ఆయన్ను కొనసాగించింది.

రాజీవ్ రహదారి రికార్డులు ఇవ్వండి

- ఆర్ అండ్ బీకి లేఖ రాసిన గజ్వేల్ తహసీల్దార్
- 'రాజీవ్ రహదారికి రైతుబంధు' కథనంపై కదలిక

గజ్వేల్, ఫిబ్రవరి 7: భూ రికార్డులను భద్రపరచాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులది. కానీ వారి దగ్గర ఆ రికార్డులు లేవు. వాటి కోసం రెవెన్యూ అధికారులు ఆర్ అండ్ బీని కోరారు. రాజీవ్ రహదారికి సంబంధించిన భూ రికార్డులు ఇవ్వాలంటూ సిద్దిపేట జిల్లా గజ్వేల్ తహసీల్దార్ ఆర్ అండ్ బీ అధికారులకు లేఖ రాశారు. తమ వద్ద ఆ రికార్డులు ఉండవని, పబ్లిక్ అండ్ ప్రైవేటు పార్టనర్‌షిప్ (పీపీపీ) విభాగం చీఫ్ ఇంజనీరు వద్ద ఉంటాయని ఆర్ అండ్ బీ అధికారులు బదులిచ్చారు. దాంతో తహసీల్దార్ పీపీపీ చీఫ్ ఇంజనీర్‌కు లేఖ రాశారు. 'రాజీవ్ రహదారికి రైతుబంధు' అనే శీర్షికన జనవరి 27న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంతో అధికారుల్లో కదలిక మొదలైంది. దీంతో రాజీవ్ రహదారి రికార్డులు సేకరించే పనిలో పడ్డారు. గజ్వేల్ మండలంలో దాదాపు 50 ఎకరాల భూమి రాజీవ్ రహదారి నిర్మాణంలో పోయినప్పటికీ ఇంకా వ్యవసాయ భూమిగానే రికార్డుల్లోనే ఉంది. దాంతో 2018 నుంచి సదరు రైతులకు రైతుబంధు సాయం ఇస్తుండడంతో ప్రజా సొమ్ము దుర్వినియోగమవుతోంది. రీసర్వే చేపడితే ఇలాంటి భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

నాలుగు పెళ్లిళ్లు.. నలుగురు భర్తలపై కేసులు

- మహిళా నిర్మాతపై జూబ్లీహిల్స్‌లో కేసు నమోదు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఆమె ఓ సినీ నిర్మాత. ఆమెకు అప్పటికే మూడు వివాహాలు అయ్యాయి. ఆ ముగ్గురు భర్తలపై వేర్వేరు పోలీస్‌స్టేషన్లలో కేసులు పెట్టింది. తనకు ఒకటే పెళ్లి జరిగిందని, భర్తతో విడాకులు తీసుకున్నానని చెప్పి మరో వ్యక్తిని మోసం చేసి నాలుగో పెళ్లి చేసుకుంది. విషయం తెలిసిన బాధితుడు ఆమెపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషనులో కేసు పెట్టాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటగిరికి చెందిన పులంశెట్టి నాగార్జున బాబు.. సినీ పరిశ్రమలో కెమెరా అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. భైరవపురం అనే సినిమాకు పనిచేస్తుండగా అతడికి ఆశా మల్లిక అనే నిర్మాత పరిచయం అయ్యింది. తనకు ఇదివరకు వివాహం అయిందని, విడాకులు తీసుకుంటున్నట్టు చెప్పడంతో నాగార్జున ఆమెను పెళ్లి చేసుకున్నాడు. ఈ తర్వాత మల్లిక ఆర్థిక అవసరాల నిమిత్తం అతడి నుంచి రూ.18.50 లక్షలు లిక్విడ్ క్యాష్, మరో రూ.10 లక్షలు బ్యాంకు ద్వారా తీసుకుంది. క్రమంగా ఆమె ప్రవర్తనలో మార్పు గమనించి నాగార్జున ఆరా తీయగా మల్లికకు అప్పటికే మూడు పెళ్లిళ్లు జరిగినట్లు, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు తెలిసింది. ఆ ముగ్గురు భర్తలపై వైజాగ్‌లోని గాజువాక, హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి, నార్సింగి పీఎస్‌లలో మల్లిక కేసులు పెట్టినట్టూ తెలిసింది. ఇదే విషయమై మల్లికను నాగార్జున నిలదీయగా అతడిపై కూకట్‌పల్లి పోలీస్‌స్టేషనులో వరకట్న వేధింపులు, గృహహింస చట్టం కింద కేసు పెట్టింది. ఇదిలా ఉండగా ఆస్తిలో సగం వాటా కావాలని, తాను గర్భవతిని అంటూ మల్లిక బెదిరింపులకు పాల్పడుతుండడంతో నాగార్జున పోలీసులను ఆశ్రయించాడు. మల్లికపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

- మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆటో నడవడం లేదని ఆవేదన

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 7: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు కల్పిస్తున్న ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో నడవక అప్పుల బాధ ఎక్కువైందని మనస్తాపం చెందిన ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం కల్లెపల్లి గ్రామానికి చెందిన బుర్ర కరుణాకర్ చాలా కాలంగా ఆటో నడుపుకుంటూ కుటుంబంతో సహా కరీంనగర్‌లో ఉంటున్నాడు. ఆటోకు గిరాకీ తగ్గిందని తన భార్యకు చెప్పి బాధపడేవాడు. రెండు నెలలుగా లోన్ ఈఎంఐలు చెల్లించలేకపోయాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన అతడు బుధవారం కరీంనగర్ మార్క్‌ఫెడ్ వద్ద పురుగుల మందు తాగాడు. ఈ విషయం ఫోన్ ద్వారా తన భార్యకు తెలిపాడు. ఆమె హుటాహుటిన విషయాన్ని ఆటో సంఘం నాయకులకు చెప్పి అక్కడకు చేరుకునేసరికి అపస్మారక స్థితిలోకి జారుకున్నాడు. అతడిని జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు.

పశువుల కంటైనర్ బోల్తా.. ఇద్దరు కూలీల దుర్మరణం

- 40 ఆవులు, ఎద్దులు మృతి.. మరో 20 పశువులకు గాయాలు

తాడిపత్రి, ఫిబ్రవరి 7: డ్రైవర్ నిద్రమత్తు కారణంగా పశువులను తరలిస్తున్న కంటైనర్ అదుపుతప్పి.. రోడ్డు పక్కనున్న సిమెంట్ దిమ్మెను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కంటైనర్‌లో ఉన్న ఇద్దరు కూలీలు దుర్మరణం పాలయ్యారు. సుమారు 40 ఆవులు, ఎద్దులు మృత్యువాతపడ్డాయి. మరో 20 పశువులు కూడా గాయపడ్డాయి. బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఏపీలోని అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండల పరిధిలోని కాశేపల్లి టోల్ ప్లాజా వద్ద బుధవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. తెలంగాణలోని వనపర్తి జిల్లా పెబ్బేరు నుంచి కంటైనర్‌లో 60కిపైగా ఆవులు, ఎద్దులను అక్రమంగా బెంగళూరు వైపు తరలిస్తుండగా.. డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసులు తెలిపారు. మృతులను విశాఖపట్నం జిల్లా దేవవరం గ్రామానికి చెందిన ఈశ్వరరావు (45), శ్రీకాకుళం జిల్లా పంగవానిపేట గ్రామానికి చెందిన శ్రీనివాసులు (46)గా గుర్తించారు. వీరిద్దరూ పశువులతోపాటు కంటైనర్‌లో ఉండటంతో వాటి కిందపడి నలిగిపోయి మృతిచెందారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్‌తోపాటు క్యాబిన్‌లో ఉన్న ముగ్గురు పారిపోయారు.

విమలా గద్దర్‌కు మాతా రమాబాయి మెమోరియల్ అవార్డు

కవాడిగూడ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో బుధవారం అంబేడ్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మాతా రమాబాయి అంబేడ్కర్ 126వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి జయరాజ్, గద్దర్ కుమార్తె వెన్నెల ప్రసంగిస్తూ.. మాతా రమాబాయి జీవితం నేటి తరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ సభ్యులు గద్దర్ సతీమణి విమలా గద్దర్‌కు మాతా రమాబాయి మెమోరియల్ అవార్డును ప్రదానం చేశారు.



రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులను పరిశీలిస్తున్న కిషన్‌రెడ్డి

శరవేగంగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు

- పరిశీలించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్/హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బుధవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను రూ.750 కోట్లతో ఎయిర్‌పోర్టు తరహాలో అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. సికింద్రాబాద్ స్టేషన్ అభివృద్ధి పనులకు గత ఏడాది ఏప్రిల్ 8న ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారని, తక్కువ వ్యవధిలోనే దాదాపు 25శాతం మేర పనులు పూర్తి చేశామని తెలిపారు. 2025 నాటికి పనులను పూర్తి చేస్తామని వెల్లడించారు. స్టేషన్ల పునరాభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా జంటనగరాల్లోని నాంపల్లి, కాచిగూడ, లింగంపల్లి, బేగంపేట స్టేషన్లను కూడా ఆధునికీకరించనున్నట్లు తెలిపారు. ఎంఎంటీఎస్ రెండోదశను యాదాద్రివరకు పొడిగించేందుకు కేంద్రప్రభుత్వం సన్నద్ధంగా ఉందన్నారు. కొమురవెల్లి మల్లన్న స్వామి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం కొత్తగా రైల్వేస్టేషన్‌ను నిర్మిస్తామని, ఈ నెలలోనే శంకుస్థాపన చేస్తామని ఆయన పేర్కొన్నారు.

● నకిలీ



ఢిల్లీ మెట్రో రైలులో ప్రధాని ముందు చంద్రబాబు చేతులు కట్టుకుని నిలబడినట్లుగా సృష్టించిన నకిలీ ఫొటో.

● అసలు



మెట్రో రైలులో యువతతో ప్రధాని మోదీ ముచ్చటిస్తున్న దృశ్యమిది. ఒరిజనల్ ఫొటోలో లేని చంద్రబాబును గ్రాఫిక్స్‌తో తెచ్చి నిలబెట్టారు.

● నకిలీ



చంద్రబాబు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కాళ్లు మొక్కుతున్నట్లుగా పేటీఎం బ్యాచ్ సృష్టించిన ఫేక్ ఫొటో.

● అసలు



2018 జూన్ 21న... అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సీఎం హోదాలో చంద్రబాబు యోగా చేస్తున్న దృశ్యం. దీనినే అమిత్ షా ముందు వంగినట్లుగా మార్ఫింగ్ చేశారు.

అధికార వైసీపీ ఫేక్ బతుకులు, ఫేక్ ఫేసులు మరోసారి బయటపడ్డాయి. తప్పుడు వార్తలను సృష్టించడం... వాటికి ఏబీఎన్-ఆంధ్రజ్యోతి, వే2న్యూస్, ఇతర ప్రముఖ మీడియా సంస్థల లోగోలు వాడుకోవడం! ఇదే నీచపు ఆలోచనలు! తాజాగా... టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఢిల్లీ పర్యటన సందర్భంగా ఫేక్ బ్యాచ్ మరింత బరితెగించింది.

ఫేక్ బతుకులు!

మళ్లీ రెచ్చిపోయిన వైసీపీ పేటీఎం బ్యాచ్... మార్ఫింగ్ ఫొటోలు, లోగోలతో తప్పుడు వార్తల సృష్టి

- చంద్రబాబు ఢిల్లీలో అమిత్‌షా కాళ్లు మొక్కినట్లు ఫొటో
- మోదీ ముందు నిల్చున్నట్లు మరో ఫొటో
- బాబుపై అధికార వైసీపీ విష ప్రచారం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అధికార వైసీపీ ఫేక్ బతుకులు, ఫేక్ ఫేసులు మరోసారి బయటపడ్డాయి. తప్పుడు వార్తలను సృష్టించడం.. వాటికి ఏబీఎన్-ఆంధ్రజ్యోతి, వే2న్యూస్, ఇతర ప్రముఖ మీడియా సంస్థల లోగోలు వాడుకోవడం! ఇదే నీచపు ఆలోచనలు! తాజాగా.. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఢిల్లీ పర్యటన సందర్భంగా ఫేక్ బ్యాచ్ మరింత బరితెగించింది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పిలుపు మేరకు చంద్రబాబు బుధవారం ఢిల్లీ వెళ్లారు. రాత్రి 7.30 గంటలకు భేటీ ఉంటుందని తొలుత వార్తలు వచ్చాయి. అంతే! రాత్రి 7.30 కాగానే ఫేక్ ప్రచారం మొదలైంది. చంద్రబాబు ఢిల్లీలో అమిత్ షా పాదాలకు వంగి నమస్కరిస్తున్నట్లు ఒక ఫేక్ ఫొటో సృష్టించి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. మెట్రో రైలులో ప్రధాని మోదీ ముందు చంద్రబాబు నిల్చున్నట్లుగా మరో ఫొటో కూడా సృష్టించారు.

ఢిల్లీలో అడుగు పెట్టకముందే..

చంద్రబాబు ఢిల్లీలో అడుగు పెట్టకముందే ఈ ఫేక్ ప్రచారం మొదలైంది. క్లుప్తంగా సమాచారాన్ని అందించే 'వే2న్యూస్' లోగోను దీనికి వాడుకున్నారు. "చర్చలకోసం ఢిల్లీవెళ్లిన చంద్రబాబు.. అమిత్‌షా కాళ్లు మొక్కడం చర్చనీయాంశంగా మారింది. బీజేపీకి 4 పార్లమెంటు, 22 అసెంబ్లీ స్థానాలు ఇచ్చేందుకు చంద్రబాబు అంగీకరించినట్లు సమాచారం" అంటూ ఒక తప్పుడు కథ అల్లేశారు. అసలు విషయం ఏమిటంటే.. బుధవారం రాత్రి పొద్దుపోయే దాకా చంద్రబాబు-అమిత్‌షా భేటీ మొదలే కాలేదు. పొత్తు సంగతీ తేలలేదు. కానీ... ఏకంగా సీట్లు, అభ్యర్థులను కూడా పేటీఎం బ్యాచ్ ప్రకటించేసింది. ఇది ఫేక్ అని, తాము ప్రచురించిన కథనం కాదని 'వే2న్యూస్' సంస్థ అధికారికంగా స్పష్టం చేసింది. "ఇది మా వార్త కాదు. కొన్ని సంఘ వ్యతిరేక శక్తులు మా లోగోను వాడుకొంటూ దుష్ప్రచారం చేస్తున్నాయి" అని ఆ సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. గతంలోనూ ఇదే మాదిరిగా ఈ సంస్థ లోగోతో టీడీపీ వ్యతిరేక వార్తలు పుట్టించి ప్రచారంలో పెట్టారు. అప్పుడు కూడా 'వే2న్యూస్' స్పందించి వివరణ ఇచ్చింది.

లేనిది ఉన్నట్లు...

'అమిత్‌షా కాళ్లు మొక్కుతున్న చంద్రబాబు'.. ఒక ఫేక్ ఫొటో, ఒక ఫేక్ వార్త. రెండు ఫొటోలను కలిపి మిక్సింగ్ చేసేశారు. 2018లో అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు యోగాసనాలు వేశారు. ఇందులో భాగంగా నడుము వంచి యోగా చేశారు. ఇక.. అమిత్‌షా బీజేపీ అగ్రనేత మురళీ మనోహర్ జోషికి నమస్కరిస్తున్న (కొద్దిగా వంగి, ఒక చేత్తో మోకాలిని తాకడం) ఫొటోను నెట్‌లో పట్టుకున్నారు. అక్కడి చంద్రబాబు, ఇక్కడి షాను కలిపేసి.. తప్పుడు ఫొటో సృష్టించారు. ఇక.. మోదీ-బాబు ఫొటో కూడా ఇలాంటిదే. అప్పుడెప్పుడో మెట్రో రైలులో మోదీ యువతతో ముచ్చటిస్తున్న దృశ్యమది. అక్కడ.. చంద్రబాబు చేతులు కట్టుకుని నిల్చున్న ఫొటోను యాడ్ చేశారు. ఉత్తర భారతదేశంలో ఏ మెట్రో రైలులోనూ నాలుగున్నరేళ్లలో మోదీతోపాటు చంద్రబాబు ప్రయాణం చేయలేదు.

సహకరించండి!

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకునే తాము నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఐదేళ్లలో రాష్ట్రం ఎంతో వెనక్కుపోయిందని, రాష్ట్రాన్ని పునర్నిర్మించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కొద్ది నెలల క్రితం అమిత్ షా తనతో మాట్లాడారని, ఇప్పుడు మళ్లీ కబురు పంపారని చంద్రబాబు తెలిపారు. తెలుగుదేశం ఎంపీలు గల్లా జయదేవ్, రామ్మోహన్ నాయుడు, మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్ రావు, ఎన్నికల వ్యూహకర్త రాబిన్ శర్మ తదితరులు చంద్రబాబుతో చర్చలు జరిపారు. వైసీపీ ఎంపీలు లావు కృష్ణదేవరాయలు, రఘురామకృష్ణం రాజు కూడా చంద్రబాబుతో చర్చించారు. చంద్రబాబు ఢిల్లీ వచ్చిన సంగతి తెలుసుకుని రాష్ట్రంలో టిక్కెట్లు ఆశిస్తున్న పలువురు పెద్ద సంఖ్యలో ఢిల్లీకి వచ్చి ఆయనను కలుసుకునేందుకు ప్రయత్నించారు.

క్యాన్సర్ మందుల నకిలీల తయారీ

- జీనోమిక్స్ సంస్థపై దాడులు
- నకిలీ ఔషధాలతో తీవ్ర దుష్ప్రభావాలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ చికిత్సకు వినియోగించే ఔషధాలకు నకిలీలను తయారు చేస్తున్న సంస్థపై రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలి అధికారులు దాడులు నిర్వహించారు. మంగళ, బుధవారాల్లో జరిగిన ఈ దాడుల్లో ఖరీదైన ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం.. చర్లపల్లిలోని ఇండియన్ జీనోమిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఎలాంటి లైసెన్సు, అనుమతుల్లేకుండా యాంటీ క్యాన్సర్ డ్రగ్ సైక్లోఫాస్ఫమైడ్‌కు నకిలీ ఇంజెక్షన్‌లను తయారు చేస్తున్నారు. ఉప్పందుకున్న ఔషధ నియంత్రణ మండలి అధికారులు దాడులు నిర్వహించి, అక్రమంగా తయారు చేసిన మందులను స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన సైటోటాక్సిక్ యాంటీ-క్యాన్సర్ మందులు ప్రజల ఆరోగ్యానికి చేటు చేస్తాయని అధికారులు గుర్తించారు. సైక్లోఫాస్ఫమైడ్ అనేది క్యాన్సర్ కీమోథెరపీ ఔషధంగా వినియోగించేదని గుర్తించారు. రక్త క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్, లింఫోమా తదితర క్యాన్సర్‌ల చికిత్సకు ఈ ఔషధాన్ని వినియోగిస్తారు. సైటోటాక్సిక్ జీవ కణాలను దెబ్బతీస్తుందని, సైటోటాక్సిక్ యాంటీ-క్యాన్సర్ డ్రగ్ సైక్లోఫాస్ఫమైడ్ ఇంజెక్షన్ కణాలలోని జన్యు పదార్థాన్ని నాశనం చేసి, తద్వారా క్యాన్సర్ కణాల పెరుగుదలను ఆపుతుందని కమలాసన్‌రెడ్డి తెలిపారు. జీనోమిక్స్‌లో తయారవుతున్న నకిలీ క్యాన్సర్ మందులతో కలిపి.. యాంటీబయాటిక్ ఇంజెక్షన్లను, ఔషధాలను తయారు చేస్తున్నారని, ఇలాంటి ఔషధాలతో తీవ్రమైన దుష్ప్రభావాలను ఉంటాయన్నారు. నకిలీ ఔషధాల వల్ల రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుందని ఆయన పేర్కొన్నారు.

శివబాలకృష్ణ ఆస్తులు.. రూ.1000 కోట్లకు పైనే..!

(మొదటి పేజీ తరువాయి)

కొడకండ్లలో 48 ఎకరాలు, పాలకుర్తిలో 27 ఎకరాలు, రఘునాథపల్లిలో 2.2 ఎకరాలు, జాఫర్‌గఢ్‌లో 20 ఎకరాలు ఉన్నట్లు నిగ్గుతేల్చింది. నాగర్‌కర్నూలు జిల్లాలో 39 ఎకరాలు, సిద్దిపేటలో 7 ఎకరాలు, యాదాద్రి-భువనగిరి జిల్లాలో 66 ఎకరాల మేర భూములను గుర్తించారు. ఇక ప్లాట్ల విషయంలో.. అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 12 ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు తేల్చారు. సంగారెడ్డిలో 3, యాదాద్రి-భువనగిరిలో 8, విజయనగరం, విశాఖపట్నంలోనూ ప్లాట్లు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. వేర్వేరు విలాసవంతమైన అపార్ట్‌మెంట్లలో శివబాలకృష్ణకు ఏడు ప్లాట్లు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. శివబాలకృష్ణ అక్రమాల వెనక మరి కొందరు అధికారులు ఉన్నట్లు ఏసీబీ అనుమానిస్తోంది. ఆ అనుమానాలను బలపర్చేలా పోలీసు కస్టడీలో శివబాలకృష్ణ పలువురి పేర్లు చెప్పినట్లు సమాచారం. వారిని కూడా విచారించి, అవసరమైతే అరెస్టు చేయడానికి ఏసీబీ సిద్ధమవుతోంది.



చిట్టీల పేరుతో 500 మందికి 100 కోట్ల టోకరా!

- మూణ్నెల్లలో చిట్టీ మీదే అంటూ భరోసా
- బిచాణా ఎత్తేసిన సమతామూర్తి చిట్‌ఫండ్స్
- ఇద్దరు నిందితుల అరెస్టు

హైదరాబాద్ సిటీ/రాయదుర్గం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ముగ్గురు కేటుగాళ్లు చిట్టీల పేరుతో సుమారు 500 మందికి రూ.100 కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టిన ఉదంతమిది. ఈ సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బుధవారం విలేకరుల సమావేశంలో డీసీపీ వినీత్ వివరాలను వెల్లడించారు. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన ఏల్పుల శ్రీనివాస్, అతని బంధువు ఏల్పుల రాకేశ్, ఎల్బీనగర్‌లో నివసించే వరంగల్‌కు చెందిన గణేశ్ కలిసి.. సమతామూర్తి చిట్ ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ప్రారంభించారు. మాదాపూర్‌తోపాటు.. ఎల్బీనగర్, కూకట్‌పల్లి ప్రాంతాల్లో బ్రాంచ్‌లను ఏర్పాటు చేశారు. మార్కెటింగ్ కోసం పెద్ద ఎత్తున ఉద్యోగులను నియమించుకుని, త్వరగా చిట్టీలు ఇస్తామంటే బుట్టలో పడే వర్గాల్లో ప్రచారం చేయించారు. ముఖ్యంగా.. ప్రైవేటు, ప్రభుత్వోద్యోగులు, చిరువ్యాపారులను ఆకట్టుకునేలా కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు. రూ.5 లక్షలు, రూ.10 లక్షలు, రూ.25 లక్షలు, రూ.50 లక్షలు, రూ.కోటి విలువ చేసే చిట్టీలను పరిచయం చేశారు. "చిట్టీ పాట రాకుంటే.. ఆర్నెల్లలో పక్కాగా మీకే ఇస్తాం" అంటూ నమ్మబలికారు. అలా.. గత ఏడాది జూన్ నుంచి తమ వ్యూహాన్ని అమలు చేశారు. గత ఏడాది సెప్టెంబరు వరకు సుమారు 500 మంది ఈ కంపెనీ చిట్టీల్లో చేరినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం డిసెంబరులో చిట్టీ డబ్బులు తిరిగి ఇవ్వాల్సి రావడంతో.. కేటుగాళ్లు జనవరిలో ఇస్తామంటూ వినియోగదారులను నమ్మించారు. వారిని నమ్మించేందుకు ష్యూరిటీలు, పోస్ట్-డెటెడ్ చెక్కులను అడిగి, తీసుకున్నారు. అటవీశాఖలో పనిచేసే ఓ మహిళా ఉద్యోగి.. తనకు చిట్టీ డబ్బులు ఇవ్వకపోవడంతో ఏజెంట్లు, చిట్‌ఫండ్ యజమానులను నిలదీసేందుకు యత్నించగా.. వారి ఫోన్లు స్విచాఫ్ చేసి ఉన్నట్లు గుర్తించారు. కేటుగాళ్లు ఈలోగా సమతామూర్తి చిట్‌ఫండ్ బోర్డును తిప్పేశారు. దాంతో ఆమె మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. ఇప్పటి వరకు 120 మంది బాధితులను గుర్తించామని, వారు సుమారు రూ.5 కోట్ల మేర మోసపోయి ఉంటారని చెప్పారు. ఈ చిట్‌ఫండ్‌లో 500 మందికి పైగా సభ్యులున్నట్లు.. కేటుగాళ్లు వారి నుంచి రూ.100 కోట్లకు పైగా వసూలు చేసినట్లు అనుమానిస్తున్నారు. ఏల్పుల శ్రీనివాస్, ఏల్పుల రాకేశ్‌ను అరెస్టు చేశామని, గణేశ్ పరారీలో ఉన్నాడని డీసీపీ వివరించారు.

మూసీ నది సుందరీకరణకు 'మైన్‌హార్ట్'!

- గల్ఫ్ దేశాల్లో అనేక కీలక ప్రాజెక్టులు పూర్తి చేసిన దిగ్గజ సంస్థ
- అర్బన్ డిజైనింగ్ అండ్ ప్లానింగ్‌లో అంతర్జాతీయ గుర్తింపు

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి

తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన హైదరాబాద్ మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును చేపట్టేందుకు అనేక అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఇందులో సింగపూర్‌కు చెందిన మైన్‌హార్ట్ సంస్థ కూడా ఒకటి. అర్బన్ డిజైనింగ్ మరియు ప్లానింగ్‌లో అంతర్జాతీయ దిగ్గజ సంస్థల్లో మైన్‌హార్ట్ ఒకటి. ఖతర్‌లో ఫిఫా వరల్డ్‌కప్ స్టేడియంలు, సౌదీలో నియోం ప్రాజెక్టు, యూఏఈలోని దుబాయి, అబుధాబిలో అత్యాధునిక భవనాలు, కువైత్‌లో ఒలింపిక్ విలేజ్, ఒమాన్‌లో మస్కట్ విమానాశ్రయం నుంచి గుజరాత్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వరకు అనేక ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల్లో భాగమైనచరిత్ర మైన్‌హార్ట్ సొంతం. ఇంతటి చరిత్ర కలిగిన ప్రఖ్యాత ఇంజనీరింగ్ సంస్థ అయిన మైన్‌హార్ట్ ఇప్పుడు తెలంగాణ అభివృద్ధిలో భాగం కానుంది. గల్ఫ్ దేశాల్లో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల్లో పాల్గొన్న మైన్‌హార్ట్.. అమెరికా, యూరప్ సహా భారత్‌కు చెందిన దిగ్గజ సంస్థలు పోటీపడిన సౌదీ అరేబియాలోని నియోం ప్రాజెక్టులో కూడా కొన్ని పనులను దక్కించుకుంది. గల్ఫ్ దేశాలతోపాటు బ్రిటన్, సింగపూర్, హాంగ్‌కాంగ్, టర్కీ దేశాల్లోనూ అభివృద్ధి పనుల్లో భాగస్వామిగా ఉంది. గల్ఫ్ దేశాల్లో విశ్వవిద్యాలయాలు, డేటా సెంటర్లు, సముద్ర తీర హోటళ్లు, ఆకాశహర్మ్యా లు మొదలగు భారీ ప్రాజెక్టులను సమర్థంగా పూర్తి చేసింది. ప్రపంచ దిగ్గజ కన్సల్టెన్సీ సంస్థ ఎర్నాస్ట్ అండ్ యంగ్ ఈ సంస్థకు ఉత్తమ కంపెనీ అవార్డు కూడా ఇచ్చింది. ఇక, భారతదేశానికి వస్తే గుజరాత్, యూపీ రాష్ట్రాల్లో అనేక ప్రాజెక్టులు చేసింది. కర్ణాటకలో బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా కొన్ని పనులు చేసింది. ముంబై, న్యూఢిల్లీ విమానాశ్రయ విస్తరణ పనుల్లోనూ మైన్‌హార్ట్ భాగస్వామ్యం ఉంది. బ్రిటన్‌లోని కెంట్‌లో ఉన్న మెడ్‌వే నది తీర ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టులోనూ మైన్‌హార్ట్ కీలక పనులు నిర్వహించింది. ఇంతటి చరిత్ర కలిగిన మైన్‌హార్ట్ ఇప్పుడు మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టుపై ఆసక్తి చూపెడుతోంది. 50 ఏళ్ల క్రితం ఆస్ట్రేలియాలో మొదలైన మైన్‌హార్ట్ ప్రస్థానం 55 దేశాలకు విస్తరించింది. ఈ సంస్థ ప్రధాన కార్యాలయం సింగపూర్‌లో ఉంది. దుబాయిలోని మైన్‌హార్ట్ ప్రాంతీయ కార్యాలయంలో దక్షిణాసియా దేశీయులు కంటే పాశ్చాత్య దేశస్థులు అధికంగా పని చేస్తుంటారు.

అవన్నీ నిరాధార ఆరోపణలు

- అనేక అంతర్జాతీయ ప్రాజెక్టులు దిగ్విజయంగా పూర్తి చేశాం
- ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని ఖండించిన మైన్‌హార్ట్

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తమ కంపెనీపై బుధవారం ఓ పత్రికలో(ఆంధ్రజ్యోతి కాదు) వచ్చిన కథనాన్ని సింగపూర్‌కు చెందిన మైన్‌హార్ట్ సంస్థ తీవ్రంగా ఖండించింది. ఆ వార్తా కథనంలో ఉన్నవన్నీ నిరాధార ఆరోపణలని స్పష్టం చేసింది. తమ సంస్థ ప్రతిష్ఠను దిగజార్చేందుకు అవాస్తవ కథనాలను ప్రచురించారని పేర్కొంది. హైదరాబాద్‌లోని మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు నిర్వహణకు సింగపూర్‌కు చెందిన మైన్‌హార్ట్ కంపెనీ ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ఆ కంపెనీపై ఓ పత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన మైన్‌హార్ట్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా తాము ఇప్పటికే అనేక దిగ్గజ ప్రాజెక్టులు చేపట్టామని పేర్కొంది. గుజరాత్‌లోని స్టాట్యూ ఆఫ్ యూనిటీ, మధ్యప్రదేశ్‌లో స్టాట్యూ ఆఫ్ వన్‌నెస్‌ను తామే నిర్మించామని తెలిపింది. గుజరాత్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ బోర్డుతో కలిసి పలు ప్రాజెక్టులు నిర్వహించామని పేర్కొంది. అదే విధంగా 2017లో రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయ విస్తరణ పనులను దిగ్విజయంగా నిర్వర్తించామని చెప్పింది. జీ-20 భారత్ మండప్, రక్షణ మంత్రిత్వ శాఖ కోసం డిజిమాప్ సహా అనేక ఇతర నిర్వహణల్లోనూ ఉన్నామని తెలిపింది. వీటితోపాటు పలు అంతర్జాతీయ ప్రాజెక్టులను కూడా విజయవంతంగా పూర్తి చేశామని వెల్లడించింది.

123 ఏళ్లు కలిగిన ఓటర్లు 16 వేల మంది

- సాంకేతిక సమస్యతో గద్వాల జిల్లా ఓటరు జాబితాలో వింత

గద్వాల, ఫిబ్రవరి 7: వందేళ్ల వయస్సు కలిగిన వారు ఇటీవల కాలంలో ఎక్కడో ఒకరిద్దరు చాలా అరుదుగా కనిపిస్తుంటారు. అలాంటిది జోగుళాంబ గద్వాల జిల్లాలో 123 ఏళ్ల వయస్సు ఉన్న వారు ఏకంగా 16వేల మంది దాకా ఉన్నారు. అవునా!! అని ఆశ్చర్యపోకండి. ఎందుకంటే అది నిజం కాదు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం విడుదల చేసిన ఓటరు ముసాయిదా జాబితాలో మాత్రమే వారు ఉన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా జిల్లా ఓటరు జాబితాలో ఈ తప్పు దొర్లింది. దాదాపు 16 వేల మంది ఓటర్ల వయస్సు 123 ఏళ్లుగా నమోదైంది. ఈ తప్పును గుర్తించిన అధికారులు ప్రస్తుతం దానిని సరిదిద్దే పనిలో పడ్డారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో గద్వాల నియోజకవర్గంలో 303 బూత్‌ల్లో కలిపి దాదాపు 9 వేల మంది ఓటర్ల వయస్సులో తేడాలు ఉన్నాయి. అలాగే, అలంపూర్ నియోజకవర్గంలో 290 బూత్‌ల్లో కలిపి 7 వేల ఓటర్ల వరకు వయస్సులో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. ఓటరు పుట్టిన సంవత్సరం దగ్గర అందరికీ 1900 అని పడటంతో ఇలా జరిగిందని తేల్చారు. ప్రతీ బూత్‌కు 30 నుంచి 70 మంది ఓటర్ల వివరాల్లో ఈ తేడా జరిగింది. అయితే, ఓటరు ధ్రువీకరణ లేకుండా తప్పును సరిచేసే అవకాశం లేకపోవడంతో అధికారులు బీఎల్‌ఓలను రంగంలోకి దించారు. బీఎల్‌ఓలు స్వయంగా ఓటరు ఇంటికి వెళ్లి ఫారమ్-8 ద్వారా సవరణ చేస్తున్నారు. కాగా, బీఎల్‌ఓల సాయంతో 10 తేదీ నాటికి లోపాలను సరి చేస్తామని ఎన్నికల విధుల్లో ఉన్న గద్వాల డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్ వెల్లడించారు.

నాస్తిక ఉద్యమకారుడు జయగోపాల్ మృతి



డాబాగార్డెన్స్ (విశాఖపట్నం), ఫిబ్రవరి 7: ఆధునిక ఆంధ్ర పెరియార్, నాస్తిక ఉద్యమకారుడు జయగోపాల్ (82) బుధవారం సాయంత్రం కన్నుమూశారు. 1972 ఫిబ్రవరి 13న భారత నాస్తిక సమాజం ఏర్పాటుకు కృషి చేసిన వారిలో ఒకరైన జయగోపాల్.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా దేశంలోని ఎనిమిది రాష్ట్రాల్లో నాస్తిక ఉద్యమ వ్యాప్తికి విశేష కృషి చేశారు. అంతర్జాతీయ స్థాయిలో మానవ హక్కుల కార్యకర్తలకు అండగా నిలిచారు. సాంస్కృతిక ఉద్యమాల నిర్మాణం ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని ఆయన భావించేవారు. 52 ఏళ్లుగా భారత నాస్తిక సమాజం ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కుల, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా, మూఢ నమ్మకాల నిర్మూలనకు కృషి చేశారు. దళితులపైన దాడులకు వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలను నిర్మించారు. అంతర్జాతీయ బ్రేవ్ మైండ్ అవార్డును అందుకున్న జయగోపాల్... సాంస్కృతిక ఉద్యమ నిర్మాణం కోసం, భౌతికవాద భావజాలాన్ని వ్యాప్తి చేయడం కోసం ఎన్నో రచనలు చేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న జయగోపాల్ బుధవారం కన్నుమూశారు. ఆయన మృతి పట్ల భారత నాస్తిక సమాజం సభ్యులు, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.*

ఆంధ్రజ్యోతి దిక్సూచి

diksuchi@andhrajyothy.com

హైదరాబాద్ ● గురువారం 8 ఫిబ్రవరి 2024



నల్సార్‌లో మేనేజ్‌మెంట్ కోర్సులు

హైదరాబాద్‌లోని 'నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా'కి చెందిన మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం- ఇంటిగ్రేటెడ్ బీబీఏ-ఎంబీఏ, ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశానికి విడివిడిగా నోటిఫికేషన్లు విడుదల చేసింది.

● వెబ్‌సైట్: doms.nalsar.ac.in

బీబీఏ-ఎంబీఏ ప్రోగ్రామ్(ఐపీఎం)

ఇది ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్. యూజీసీ నిబంధనల మేరకు చాయిస్ బేస్డ్ క్రెడిట్ పాలసీతో ప్రోగ్రామ్‌ను రూపొందించారు. ఇందులో మొత్తం 15 టర్మ్‌లు ఉంటాయి. రెండో ఏడాది తరవాత అభ్యర్థులు స్టార్టప్ కంపెనీల్లో ఆరు నుంచి ఎనిమిది వారాలు ఇంటర్న్‌షిప్; మూడు, నాలుగు సంవత్సరాల కోర్సు పూర్తయ్యాక స్పెషలైజేషన్‌కు సంబంధించిన ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది.

ఎంబీఏ లెవెల్ స్పెషలైజేషన్‌లు: బిజినెస్ రెగ్యులేషన్స్, కార్పొరేట్ గవర్నెన్స్, కోర్టు మేనేజ్‌మెంట్, ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్సెస్, ఇన్నోవేషన్ అండ్ సస్టెయినబిలిటీ, మార్కెటింగ్, ఆపరేషన్స్ అండ్ సిస్టమ్స్.

సీట్లు: మొత్తం 66 సీట్లున్నాయి. జనరల్ అభ్యర్థులకు 33; ఎస్సీలకు 9; ఎస్టీలకు 4; ఓబీసీ/బీసీ(ఎన్‌సీఎల్)లకు 14; ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 06 సీట్లు రిజర్వ్ చేశారు. 25 శాతం సీట్లను తెలంగాణ అభ్యర్థులకు ప్రత్యేకించారు.

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో ఇంటర్మీడియట్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు. ఇంటర్ స్థాయి చివరి సంవత్సర పరీక్షలు రాస్తున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్‌మెట్(యూజీ)/ఇండోర్ ఐఐఎం నిర్వహించే ఐపీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

ఎంపిక: జాతీయ పరీక్ష స్కోరుకు 75 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూ స్కోర్‌కు 25 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఎన్‌మెట్(యూజీ) 2024 వివరాలు: దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో క్వాంటిటేటివ్ ఎబిలిటీ, వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ విభాగాల నుంచి ఒక్కోదానిలో 50 ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం రెండు గంటలు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 31

ఎంబీఏ ప్రోగ్రామ్

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏడాదికి మూడు చొప్పున మొత్తం ఆరు టర్మ్‌లు ఉంటాయి. వీటిలో కోర్ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు చదవాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్ మొత్తానికి 130 క్రెడిట్లు నిర్దేశించారు. ప్రోగ్రామ్‌లో భాగంగా మూడు ఇంటర్న్‌షిప్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది.

స్పెషలైజేషన్‌లు: కార్పొరేట్ గవర్నెన్స్, ఇన్నోవేషన్ అండ్ సస్టయినబిలిటీ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ క్యాపిటల్ మార్కెట్స్, ఆపరేషన్స్ అండ్ సిస్టమ్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, బిజినెస్ రెగ్యులేషన్స్, కోర్ట్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అనలిటిక్స్.

సీట్లు: మొత్తం 66 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 33; ఎస్సీలకు 9; ఎస్టీలకు 4; ఓబీసీ/బీసీ(ఎన్‌సీఎల్)లకు 14; ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 06 సీట్లు రిజర్వ్ చేశారు. 25 శాతం సీట్లను తెలంగాణ అభ్యర్థులకు ప్రత్యేకించారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అర్హులే. నల్సార్ మేనేజ్‌మెంట్ ఎంట్రెన్స్ టెస్ట్(ఎన్‌మెట్ పీజీ)2024/క్యాట్ 2023 అర్హత పొంది ఉండాలి.

ఎంపిక: జాతీయ పరీక్ష స్కోర్‌కు 50 శాతం, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్‌కు 10 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకి 20 శాతం, గ్రూప్ డిస్కషన్‌కి 20 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఎన్‌మెట్ (పీజీ) 2024 వివరాలు: ఇందులో లాజికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 30 శాతం ప్రశ్నలు, డేటా ఇంటర్‌ప్రిటేషన్& క్వాంటిటేటివ్ ఎబిలిటీ నుంచి 40 శాతం ప్రశ్నలు, బిజినెస్ ఆప్టిట్యూడ్ నుంచి 30 శాతం ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సిలబస్, మోడల్ పేపర్ల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 18



మారని బుద్ధి

ఒక ఊరిలో జోగయ్య అనే వ్యక్తి ఉండేవాడు. పరమ పిసినారి. ఇంట్లో పిల్లలకు కూడా మంచి తిండి తినిపించని పిసినారి. అంత సంపాదించి.. ఏమి మూటగట్టుకుంటావు? అనేవారు ఊరిలో కొందరు. 'ఆ డబ్బుంటేనే కదా..మీరు నన్ను పట్టించుకునేది. మీరంతే మారరు' అంటూ వారిమీద పరిహాసం చేసేవాడు జోగయ్య.

ఎందుకో జోగయ్యకు వ్యాపారాలంటే ఇష్టం. పైగా ఆ వ్యాపారానికి పెట్టుబడి పెట్టడానికి మనసొచ్చేది కాదు. అందుకే కిరాణ కొట్టు పెట్టినా అతనికి కలిసిరాలేదు. తనలోని తప్పు తెలిసేది కాదు. తక్కువ డబ్బులు పెట్టుబడి పెట్టి... ఎక్కువ సంపాదించాలనే ఆలోచన తనది. అలా వ్యవసాయం చేశాడు. నష్టాలను చవిచూశాడు. చివరికి తన మిత్రుడు సలహా మేరకు పాల వ్యాపారంలోకి వచ్చాడు. పాలల్లో నీళ్లు కలుపుతూ మంచి ధనాన్ని సంపాదించాడు.



అలా వ్యాపారం చేస్తూ సొంతంగా గేదెలు, ఆవులు కొన్నాడు. పాలు తన ఇంటిలో పుష్కలం. అయినా పాలల్లో నీళ్లను మాత్రం కలిపేవాడు. పోనుపోను పాలకంటే నీళ్లు ఎక్కువ తేలేవి. అయినా పట్టించుకునేవాడు కాదు. తన దగ్గర పాలు కొనమని భీష్మించుకున్నా పోటీలేక ప్రజలు జోగయ్య దగ్గరే కొనేవారు. నీళ్ల శాతం పాలల్లో ఎక్కువ అవటంతో ఆ ఊరిలోని పెద్దలంతా కలసి జోగయ్యను ఊరినుంచి తరిమేశారు. జోగయ్య తన తప్పే లేదన్నాడు. పాలల్లో నీళ్లు కలపడం లేదనేమాట మాత్రం మాట్లాడలేదు.

జోగయ్య కట్టుబట్టలతో ఊరి చివర తాచ్చాడుతుండగా చెట్టు కింద ఓ యోగి కనపడ్డాడు. ఆయన దగ్గరకు వెళ్లి తన బాధను వెళ్లగక్కాడు. బాధపడకు జోగయ్య.. అంటూ ఓదార్చాడు. 'నీకేమి కావాలో కోరుకో. మంత్రశక్తితో నీకు ఇస్తాను' అన్నాడు. 'నాకు పాల వ్యాపారం మళ్లీ చేయాలనుంది.. అది కూడా వేరే ఊరిలో' అన్నాడు. 'ఆ చెరువంతా పాలే.. ఇక సంపాదించుకో' అన్నాడు యోగి. 'నిజమా.. అయితే అదే పనిగా ఇంకో చెరువులో మంచి నీళ్లు వచ్చేట్లు చేయండి' అన్నాడు జోగయ్య. 'ఇక నీ బుద్ధి మారదా?' అంటూ 'ఇక్కడినుంచి తక్షణమే వెళ్లిపో' అన్నాడు. 'నిజంగా పాలున్నాయా స్వామి.. ఆ చెరువులో' అన్నాడు జోగయ్య. 'దూరంగా కనపడేది చెరువు కాదు.. పాల రాళ్లు. నీ కంటికి అలా కనిపిస్తోంది' అన్నాడు యోగి.

గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ(ఏఎన్‌యూ)- బీటెక్+ఎంటెక్ డ్యూయెల్ డిగ్రీ సెల్ఫ్ సపోర్ట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిని డా.వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో నిర్వహిస్తున్నారు. మొత్తం 510 సీట్లు ఉన్నాయి. ఏఎన్‌యూ నిర్వహించే ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏఎన్‌యూఈఈటీ) 2024 ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఈ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు పొందిన అభ్యర్థులకు ఫీ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు లభించవు. జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలు కూడా వర్తించవు. ఈ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. ప్రోగ్రామ్ వ్యవధి ఆరేళ్లు. నాలుగేళ్ల కోర్సు పూర్తిచేసిన తరవాత బీటెక్ డిగ్రీతో ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది.

నాగార్జున వర్సిటీలో డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు

విభాగాలు-సీట్లు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 120, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ 120, మెకానికల్ ఇంజనీరింగ్ 30, సివిల్ ఇంజనీరింగ్ 30, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ 30, డేటా సైన్స్ 60, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ 60, సైబర్ సెక్యూరిటీ 60 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు.

ఏఎన్‌యూఈఈటీ 2024 వివరాలు: పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఇందులో మేథమెటిక్స్ నుంచి 40, ఫిజిక్స్ నుంచి 30, కెమిస్ట్రీ నుంచి 30 చొప్పున మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం గంటన్నర. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సిలబస్, మోడల్ పేపర్ల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 10
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 1 నుంచి
- **ఏఎన్‌యూఈఈటీ 2024 తేదీ:** ఏప్రిల్ 7
- **ఫలితాలు విడుదల:** ఏప్రిల్ 10
- **వెబ్‌సైట్:** www.anucet.in



ఎఫ్‌ఆర్‌ఐలో ఎమ్మెస్సీ

డెహ్రాడూన్‌లోని ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌ఆర్‌ఐ)- ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఫారెస్ట్రీ, ఉడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్, సెల్యూలోజ్ అండ్ పేపర్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్ రిమోట్ ప్రోక్టోర్డ్ అడ్మిషన్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

ఫారెస్ట్రీ: ఇందులో 43 సీట్లు ఉన్నాయి. బోటనీ, కెమిస్ట్రీ, జియాలజీ, మేథమెటిక్స్, ఫిజిక్స్, జువాలజీల్లో ఏదైన ఒకటి ప్రధాన సబ్జెక్ట్‌గా బీఎస్సీ ఉత్తీర్ణులు అర్హులు. బీఎస్సీ(అగ్రికల్చర్/ఫారెస్ట్రీ) పూర్తిచేసినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఉడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ: ఇందులో కూడా 43 సీట్లు ఉన్నాయి. బీఎస్సీ(మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ - ఎంపీసీ)/బీఎస్సీ (ఫారెస్ట్రీ) ఉత్తీర్ణులు అర్హులు.

ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్: ఈ స్పెషలైజేషన్‌లో 43 సీట్లు ఉన్నాయి. బీఎస్సీ(బేసిక్ సైన్సెస్/అప్లయిడ్ సైన్సెస్)/బీఎస్సీ(ఫారెస్ట్రీ/అగ్రికల్చర్) ఉత్తీర్ణులు అర్హులు. ఎన్విరాన్‌మెంట్ సైన్స్‌లో బీఈ/బీటెక్ చేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

సెల్యూలోజ్ అండ్ పేపర్ టెక్నాలజీ: ఇందులో 26 సీట్లు ఉన్నాయి. కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్ట్‌గా బీఎస్సీ లేదా బీఈ/బీటెక్(కెమికల్ ఇంజనీరింగ్/మెకానికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు అర్హులు. ఈ స్పెషలైజేషన్‌ను ఎంచుకొన్నవారు రెండో ఏడాది కోర్సుని సెంట్రల్ పల్ప్ అండ్ పేపర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీపీపీఆర్ఐ)లో చదవాల్సి ఉంటుంది.

అడ్మిషన్ టెస్ట్ వివరాలు: పరీక్షని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. బేసిక్ సైన్సెస్,




సోషల్ సైన్సెస్, అర్థమెటిక్ అండ్ క్వాంటిటేటివ్ ఎబిలిటీస్, కంప్యూటేషనల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ రీజనింగ్, ఇంటర్‌ప్రిటేషన్ ఆఫ్ టేబుల్స్ గ్రాఫ్స్, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్, కాంప్రహెన్షన్, ఒకాబులరీ, గ్రామర్, ఇడియమ్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు వంతు మార్కు కోత విధిస్తారు. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 15 శాతం మార్కులు రావాలి.

ముఖ్య సమాచారం

- ★ డిగ్రీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం చాలు.
- ★ **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- ★ **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఏప్రిల్ 8
- ★ **ఆన్‌లైన్ రిమోట్ ప్రాక్టోర్డ్ అడ్మిషన్ టెస్ట్ తేదీ:** మే 19
- ★ **చిరునామా:** రిజిస్ట్రార్, ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌ఆర్‌ఐ), ఐపీఈ కౌలాగర్ రోడ్, డెహ్రాడూన్-248195
- ★ **వెబ్‌సైట్:** www.fridu.edu.in

సరైన నీడ ఏది?



చుక్కలు కలిపి రంగులు వేయండి




10 తేడాలు గుర్తించండి



ఎన్ని శునకాలు ఉన్నాయి?



యూనియన్ బ్యాంక్‌లో స్పెషలిస్ట్ ఆఫీసర్లు



మొత్తం ఖాళీలు: 606

ముంబయిలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మానవ వనరుల శాఖ, సెంట్రల్ ఆఫీస్...కింద పేర్కొన్న స్పెషలిస్ట్ ఆఫీసర్ల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. చీఫ్ మేనేజర్- ఐటీ(సొల్యూషన్స్ ఆర్కిటెక్ట్) ఎస్ఎంజీఎస్-4: **2 పోస్టులు**
2. చీఫ్ మేనేజర్- ఐటీ(క్వాలిటీ అస్యూరెన్స్ లీడ్) ఎస్ఎంజీఎస్-4: **1 పోస్టు**
3. చీఫ్ మేనేజర్- ఐటీ(ఐటీ సర్వీస్ మేనేజ్‌మెంట్ ఎక్స్‌పర్ట్) ఎస్ఎంజీఎస్-4: **1 పోస్టు**
4. చీఫ్ మేనేజర్- ఐటీ(ఎజైల్ మెథడాలజీస్ స్పెషలిస్ట్) ఎస్ఎంజీఎస్-4: **1 పోస్టు**
5. సీనియర్ మేనేజర్-ఐటీ(అప్లికేషన్ డెవలపర్) ఎంఎంజీఎస్-3: **4 పోస్టులు**
6. సీనియర్ మేనేజర్-ఐటీ(డీఎస్ఓ ఇంజనీర్) ఎంఎంజీఎస్-3: **2 పోస్టులు**
7. సీనియర్ మేనేజర్- ఐటీ(రిపోర్టింగ్ అండ్ ఈటీఎల్ స్పెషలిస్ట్, మానిటరింగ్, లాగింగ్) ఎంఎంజీఎస్-3: **2 పోస్టులు**
8. సీనియర్ మేనేజర్(రిస్క్) ఎంఎంజీఎస్-3: **20 పోస్టులు**
9. సీనియర్ మేనేజర్(చార్టర్డ్ అకౌంటెంట్) ఎంఎంజీఎస్-3: **14 పోస్టులు**
10. మేనేజర్-ఐటీ(ఫ్రంట్ ఎండ్)/మొబైల్ యాప్ డెవలపర్) ఎంఎంజీఎస్-2: **2 పోస్టులు**
11. మేనేజర్-ఐటీ(ఏపీఐ ప్లాట్‌ఫాం ఇంజనీర్/ఇంటిగ్రేషన్ స్పెషలిస్ట్) ఎంఎంజీఎస్-2: **2 పోస్టులు**
12. మేనేజర్(రిస్క్) ఎంఎంజీఎస్-2: **27 పోస్టులు**
13. మేనేజర్(క్రెడిట్) ఎంఎంజీఎస్-2: **371 పోస్టులు**
14. మేనేజర్(లా) ఎంఎంజీఎస్-2: **25 పోస్టులు**
15. మేనేజర్(ఇంటిగ్రేటెడ్ ట్రెజరీ ఆఫీసర్) ఎంఎంజీఎస్-2: **5 పోస్టులు**
16. మేనేజర్(టెక్నికల్ ఆఫీసర్) ఎంఎంజీఎస్-2: **19 పోస్టులు**
17. అసిస్టెంట్ మేనేజర్(ఎలక్ట్రికల్ ఇంజనీర్) జేఎంజీఎస్-1: **2 పోస్టులు**
18. అసిస్టెంట్ మేనేజర్(సివిల్ ఇంజనీర్) జేఎంజీఎస్-1: **2 పోస్టులు**
19. అసిస్టెంట్ మేనేజర్(ఆర్కిటెక్ట్) జేఎంజీఎస్-1: **1 పోస్టు**
20. అసిస్టెంట్ మేనేజర్(టెక్నికల్ ఆఫీసర్) జేఎంజీఎస్-1: **30 పోస్టులు**
21. అసిస్టెంట్ మేనేజర్(ఫారెక్స్) జేఎంజీఎస్-1: **73 పోస్టులు**

అర్హతలు: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ/బీఈ, బీటెక్/ఎంఈ, ఎంటెక్/ఎంబీఏ, పీజీడీఎం, ఎంసీఏ, ఎమ్మెస్సీ, సీఏ/ఐసీడబ్ల్యూఏఐ/సీఎంఏ/సీఎఫ్ఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ పరీక్ష/గ్రూప్ డిస్కషన్/అప్లికేషన్స్ స్క్రీనింగ్/పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తు రుసుము: జనరల్/ఈడబ్ల్యూఎస్/ఓబీసీ అభ్యర్థులకు రూ.850. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు రూ.175.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 23

వెబ్‌సైట్: www.unionbankofindia.co.in/

జాబ్ కార్నర్

కోస్ట్ గార్డ్‌లో నేవిక్ పోస్టులు

మొత్తం ఖాళీలు: 260

భారత రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ కోస్ట్ గార్డ్ నేవిక్ పోస్టుల భర్తీకి ఉద్దేశించిన కోస్ట్ గార్డ్ ఎన్‌రోల్డ్ పర్సనల్ టెస్ట్(సీజీఈపీటీ)-02/2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అర్హులైన పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

పోస్టు: నేవిక్(జనరల్ డ్యూటీ)

రీజియన్/జోన్ వారీ ఖాళీలు: నార్త్-79; వెస్ట్-66; నార్త్ ఈస్ట్-68; ఈస్ట్-33; నార్త్ వెస్ట్-12; అండమాన్ అండ్ నికోబార్-03.

అర్హత: 10+2(మేథ్స్, ఫిజిక్స్) ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

వయోపరిమితి: 18 నుంచి 22 సంవత్సరాలు అంటే అభ్యర్థులు 2002 సెప్టెంబరు 1 నుంచి 2006 ఆగస్టు 31 మధ్య జన్మించిన వారై ఉండాలి.

ప్రారంభ వేతనం: నెలకు రూ.21,700.

ఎంపిక విధానం: స్టేజ్-1, స్టేజ్-2, స్టేజ్-3, స్టేజ్-4 పరీక్షలు, వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపిక చేస్తారు.

పరీక్ష రుసుము: రూ.300. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలి.

ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: ఫిబ్రవరి 13

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 27

వెబ్‌సైట్: joinindiancoastguard.cdac.in/

ముంబయి వర్సిటీలో జేఆర్‌ఎఫ్

యూనివర్సిటీ ఆఫ్ ముంబయి, అటామిక్ ఎనర్జీ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ డిపార్ట్‌మెంట్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: జూనియర్ రీసెర్చ్ ఫెలో: 1

విద్యార్హతలు: ఎమ్మెస్సీ(ఫిజిక్స్) ఉత్తీర్ణతతో పాటు యూజీసీ-సీఎస్ఐఆర్ నెట్/గేట్ స్కోరు కలిగి ఉండాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 14

వెబ్‌సైట్: https://mu.ac.in/carees

బెల్‌లో ఇంజనీర్లు

మొత్తం ఖాళీలు: 22

ఉత్తరాఖండ్‌లోని కోట్‌ద్వారాలో ఉన్న భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్...తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. ట్రైనీ ఇంజనీర్-1: **8 పోస్టులు**
2. ప్రాజెక్ట్ ఇంజనీర్-1: **14 పోస్టులు**

విభాగాలు: ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్

విద్యార్హతలు: సంబంధిత విభాగంలో బీఎస్సీ(ఇంజనీరింగ్)/బీఈ/బీటెక్ ఇంజనీరింగ్(ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: ట్రెయినీ ఇంజనీర్ పోస్టుకు 28 ఏళ్లు; ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టుకు 32 ఏళ్లు మించకూడదు.

జీతభత్యాలు: నెలకు ప్రాజెక్ట్ ఇంజనీర్‌కు రూ.40,000- రూ.55,000. ట్రెయినీ ఇంజనీర్‌కు రూ.30,000- రూ.40,000

ఎంపిక : రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 12

వెబ్‌సైట్: https://bel-india.in/

డైలీ సుడోకు - 224

		3	5		4		7	
9				2				
	8		9					2
			1			2		8
	9						4	
6		5			2			
5					7		9	
				1				3
	3		2		6	7		

సుడోకు - 223 సమాధానం

8	7	9	6	3	4	2	1	5
4	1	5	7	2	9	6	8	3
3	6	2	1	5	8	4	7	9
5	8	6	9	4	3	7	2	1
1	3	4	2	7	5	9	6	8
9	2	7	8	1	6	5	3	4
6	4	1	5	8	7	3	9	2
2	9	3	4	6	1	8	5	7
7	5	8	3	9	2	1	4	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.